# సుమతి


అంతర్జాల సమగ్ర కుటుంబ మాసపత్రిక

01-02-2024 సంపుటి -1 రథ సప్తమి (ఫిబ్రవరి ) సంచిక -12 రూ.25/-






ఎడిటర్
శ్రీమతి ఎ. శ్రీవిద్య




అసోసియేట్ ఎడిటర్


# సుమతి

## (సమగ్ర సకుటుంబ మాసపత్రిక)

**తెలుగు సాహితీ జగత్తులో**

**అనతి కాలంలోనే ధ్రువతారగా సుమతి ని నిలిపినందుకు**

**ధన్యవాదాలు తెలుపుతూ**

- ఎడిటోరియల్ బోర్డ్


## సుమతిలో ప్రకటనలు ఇవ్వండి

అనతి కాలంలోనే అశేష పాఠకలోకానికి చేరువైన

సుమతి సకుటంబ మాసపత్రికలో ప్రకటనలు ఇవ్వండి

కవర్ పేజి కలర్ :రూ.5000/-

కవర్ పేజి బ్లాక్ అండ్ వైట్ :రూ. 3000/-

లోపలి పేజీల్లో కలర్ :రూ2000 /-


లోపలి పేజీల్లో బ్లాక్ అండ్ వైట్ :రూ.1000 /-


ఆరోగ్యకరమైన సాహిత్యాన్ని కుటుంబం మొత్తానికి అందించాలని తెలుగు భాషకు

మరింత ఉన్నత స్థానాన్ని కల్పించాలని మీ ముందుకు ప్రతి నెల ఒకటవ తారికునే వస్తుంది.

ఇప్పుడు సుమతి పత్రికను ఆన్లైన్లో కూడా చదవ వచ్చు






# సుమతి

## మాసపత్రిక

సంపుటి :1 సంచిక:12

ఫిబ్రవరి 2024

### సంపాదకురాలు

అవుతు శ్రీవిద్య

సహ సంపాదకురాలు

కె .వీణ

### ముఖచిత్రం

సంక్రాంతి

### చందా వివరాలు

సంవత్సర చందా రూ 250

ఐదేళ్ళ చందా రూ 1200

ప్రకటనలు , చందాలకు మరియు

రచనలు ,అభిప్రాయాలు

పంపవలసిన చిరునామా

SUMATHI.POTILU@GMAIL.COM

### ప్రచురణ

సుమతి పబ్లికేషన్స్
(RC NO.:538/2006)

హౌస్ నం :26 -46 -79

వేణుగోపాల నగర్ ,గుంటూరు




# సంపాదకీయం

చాలామంది మనుషులు జీవితం అంటే ఏమిటో తెలుసుకోకుండానే జీవిత చరమాంకానికి చేరుకుంటారు. ఇలా కాకుండా మరొకలా జీవిస్తే బాగుండేదని యవ్వనం, నడిప్రాయం తరువాత చింతపడతారు. కానీ మనిషి అభిప్రాయాలతో సంబంధం లేకుండానే అనుభవాలతో జీవితం గడిచిపోతుంటుంది.

ఈ విషయం తెలియకనే కొందరు ఎక్కడ మొదలవుతారో చివరకు అక్కడకే చేరుకుంటారు. జీవన గమనానికి సంబంధించిన స్పృహ లేని ఫలితమే ఈ స్థితి. కేవలం తమ జీవితం గురించే కాకుండా, లోకం పోకడల్ని సైతం గమనిస్తే మనుషులుగా ఎలా మెలగాలో తెలుస్తుంది.

బాల్యం తెలియకుండానే గడచిపోతుంది. యవ్వనం, నడిప్రాయం, ముసలితనం మాత్రం స్పృహలోనే ఉంటాయి. కనుక ఈ కాలాన తమ నడత, జీవనరీతి సవ్యంగా ఉండాలి. తమ వల్ల ఇతరులకు మేలు జరగక పోయినా పర్వాలేదు కానీ, కీడు మాత్రం జరగకూడదన్న తలంపు అవసరం. వీలయితే తమ మాటలు, చేతలు పరులకు ఉపయోగపడేలా ఉంటేనే మంచిది. ఈ దిశగా ఆలోచించినపుడే జీవితానికి అర్థం ఉంటుంది

సుమతి.

.

## సుమతి –సుభాషితం

ప్రయత్నం, సాహసం, ధైర్యం, జ్ఞానం శక్తి,
శ్రమకి వెనుకాడని శౌర్యం ఈ ఆరు గుణాలు
ఎవరి దగ్గర ఉంటాయో వారికి
దేవతలు సైతం సహాయ పడతారు.

లోపలి
పేజీలలో....

# ఈ నెల 62కుసుమాలు...


## 35 ఫీచర్స్ అందరి కోసం

5 ముఖచిత్ర కథ
6 స్పందన
7 ఈ నెల కవిత
8 నడుస్తున్న చరిత్ర
12 అంతర్నేత్రం
20 వైరల్
65 వార్తల్లో వ్యక్తి
73 నాలుగో కోతి
77 సెటైర్
80 కార్టూన్స్ పేజి
81 యాత్ర
86 విహారి
89 పదమపద సోపానం
107 నమ్మకాలూ –నిజాలు
110 కరెంట్ అఫైర్స్
113 మన భాష
114 ఫోటోగ్రఫి పాఠాలు
117 యువతా తెలుసుకో
119 భేతాళ భారతం
122 మన కథానాయకులు
125 టెక్నాలజీ
126 కార్టూన్స్ పేజి
127 జీవన చిత్రాలు
134 మిస్టరీ
143 వినాల్సిన పాట
146 చదవాల్సిన పుస్తకం
149 చూడాల్సిన సినిమా
151 క్రాస్ రోడ్స్ కబుర్లు
16 3 కార్టూన్స్ పేజి
181 మన పురాణాలు
197 ధర్మసందేహాలు
198 పిల్లల కథ
199 పిల్లలు పిడుగులు
200 సాహితీ పద సుమతి
201 రాశి ఫలాలు

## 9 సీరియల్స్

15 పంచవటి( కామెడి సీరియల్ )
41 మమతల తరంగాలు (ఫ్యామిలీ సీరియల్ )
46 నా మొగుడు నాకే సొంతం
51 బాంధవ్యం (ఫ్యామిలీ సీరియల్ )
58 రాణ ప్రతాప్ (చరిత్రాత్మక సీరియల్ )
69 గర్భ శ్లోకం (క్రైం సీరియల్)
138 డెత్ మెసేజ్ (క్రైం సీరియల్ )
155 పరుగులు తీసే నీ వయసునకు (సీరియల్)
185 విధి విన్యాసం ( సీరియల్ )

## 11 కథలు

22 నాకు నిద్రవస్తోంది
27 దృష్టి
36 ఆత్మ స్థర్యం
90 దాహం
99 యజ్ఞం
103 చీకటి విజయం
129 వెన్నలకి ఆవల
164 క్లీన్ షేవ్
168 తూనాబొడ్డు
172 పారాహుషార్
190 అభిరతి

## 7 కవితలు

19 తూకం
57 ఏది సత్యం ..ఏది నిత్యం
64 పొడిచే పొద్దు
75 ఆగండి ఆలోచించండి
76 అక్షరానికి ఆయువు పోయాలి
88 చిద్రం
184 ఒకే జెండా ఎజెండా




# రథ సప్తమి



భూమిపై జీవరాశులు సుభిక్షంగా మనగలుగుతున్నారంటే అందుకు కారణం సూర్యుడే. ఈ కారణంగానే భానుడిని కనిపించే దేవుడు అని అంటారు. హిందూ సంప్రదాయం ప్రకారం సూర్యారాధనకు ఎంతో విశిష్టత ఉంది. ముఖ్యంగా భక్తులు సూర్య జయంతి రోజు ఎక్కువగా పూజిస్తారు. మాఘ మాస శుక్ల పక్షం సప్తమి తిథి నాడు ఈ పర్వదినం వస్తుంది. దీన్నే రథ సప్తమి అని కూడా అంటారు. సూర్యుడు ఏడు గుర్రాలపై రథంపై దక్షిణాయనం ముగించి పూర్వోత్తర దిశగా ప్రయాణం సాగిస్తుందని భక్తులు విశ్వసిస్తారు. అది ఈ రోజు నుంచే ప్రారంభమవుతుంది. మాఘ సప్తమి నుంచి రానున్న ఆరు మాసాలు ఉత్తరాయణ పుణ్యకాలంగా పరిగణిస్తారు.

సూర్యుడు ఏడు గుర్రాలు ఏడు వారాలకు సంకేతాలు. ఈ ఏడు గుర్రాలను వేదఛందస్సులు అని అంటారు. గాయత్రి, త్రిష్టుప్, జగతి అనుష్టుప్, పంక్తి, బృహతి, ఉష్ణిక్ అనే ఏడు గుర్రాల రథంపై భానుడు స్వారీ చేస్తాడు. మేషం నుంచి మీనం వరకు ఉన్న పన్నెండు రాశుల్లో ప్రయాణిస్తారు. ఈ 12 రాశులను పూర్తి చేయడానికి సూర్యరథానికి ఏడాది సమయం పడుతుంది. సూర్యజయంతి అంటే సూర్యుడి పుట్టినరోజు కాదు.. రథాన్నెక్కి సూర్యుడు సాగించే ప్రయాణం ఈ రోజు నుంచి మొదలవుతుంది.

విశ్వం ఒక వృత్తంలా భావిస్తే.. దానికి 360 డిగ్రీలు ఉంటాయని గణితశాస్త్రం చెబుతోంది. సూర్యుడు రోజుకు ఒక డిగ్రీ చొప్పున సంచరిస్తూ 360 రోజులలో ఈ వృత్తాన్ని పూర్తిచేస్తాడు. అంటే ఒక సంవత్సరం. అందుకే జ్యోతిష్కులు ఈ సృష్టి చక్రాన్ని 12 రాశులుగా విభజించి, ఒక్కొక్క రాశిని 30 డిగ్రీలుగా విభజించారు. సూర్యుడు ఒక్కొక్క రాశిలో సంచరించే కాలాన్ని ఒక మాసంగా పరిగణించారు. మనకు కనిపించే సూర్యుడు ఒక్కడే అయినా, విశ్వంలో ఇంకా 11 మంది సూర్యులు ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. కానీ మన భారతీయులు వేదకాలంలోనే ఈ ద్వాదశ ఆదిత్యులను కనుగొన్నారు. వారే మిత్ర, రవి, సూర్య, భగ, పూష, హిరణ్యగర్భ, మరీచి, ఆదిత్య, సవిత, అర్క, భాస్కరులు. వీరే ద్వాదశామాసాలకూ ఆధిదేవతలు. వీటి కారణంగానే 12 రాశులు ఏర్పడ్డాయి. సూర్యుడు ఒక్కొక్క మాసంలో ఒక్కొక్క రాశిలో సంచరిస్తాడు. మాఘమాసంలో "అర్క" నామంతో సంచరిస్తాడు. మాఘ అంటే పాపం లేనిది అని అర్థం. పుణ్యాన్ని ప్రసాదించే మాసం కాబట్టి ఈ మాసాన్ని మాఘమాసం అన్నారు. నిజానికి ఉత్తరాయణం మకర సంక్రాంతితో ఆరంభమైనా, రథసప్తమి నుంచే ఉత్తరాయణస్ఫూర్తి పూర్తిగా గోచరిస్తుంది. దక్షిణాయణం నుంచి విముక్తుడైన భాస్కరుడు ఈ రోజు నుంచే ఉత్తర దిక్కుగా ప్రకాశిస్తాడు. కాబట్టి రథసప్తమిని సూర్యగ్రహణతుల్యంగా భావించి, పితృ, దేవరుషి తర్పణాలను ఇవ్వాలనే నియమాన్ని నిర్ణయించారు.సౌర కుటుంబంలో అన్ని ప్రాణులకు సూర్యుడే ఆత్మ. కాబట్టి సూర్యోపాసన చేస్తే రుణ, రోగ, శత్రుబాధలు నశిస్తాయి. మన మంత్రపుష్పాలలో ఒకటిగా పేర్కొనే 'యోపం పుష్పం వేదా, పుష్పవాన్ ప్రజావాన్, పశుమాన్ భవతి' అనే వాక్యాలు దీనికి సంబంధించినవే. సూర్యారాధన చేసేవాడు పుష్పవంతుడు, సంతానవంతుడు, పశుసంపద సమృద్ధివంతుడు అవుతాడు. సూర్యకాంతిలోని కిరణాల ప్రభావం వల్లే శరీరానికి సహజసిద్ధంగా విటమిన్ 'డి' లభిస్తుంది. సూర్యకిరణాలు శరీరంపై తప్పక ప్రసరించాలి. అందుకే వైదిక వాఙ్మయం.. సంధ్యావందనం, సూర్యనమస్కారాలు, అర్ఘ్యప్రధానం మొదలైన ప్రక్రియల్ని ప్రవేశపెట్టింది.

★★★

# స్పందన

## పాఠకుల అభిప్రాయ మాలికలు

పత్రిక డిజైన్  చాల బాగుంది. తెలుగు సాహితి వనం లో అందమైనా పూమాల సుమతి
--రాధికా రాణి, కర్నూల్



పత్రిక 200 పేజీలతో నెల మొత్తం చదవటానికి సరిపడా కథలు , నవలలు అందిస్తున్న ఏకైక పత్రిక సుమతి
-- శారద , గుంటూరు







రాబోయే సంచికతో సుమతి ఏడాదిని పూర్తి చేసుకోబోతోంది , ముందుగా ముసు ముందుగా హార్దిక శుభాభినందనలు
--ఉషా రాణి , తెనాలి

మార్చి నెల సంచికతో సుమతి మీ ఆశిస్సులతో దిగ్విజయంగా మొదటి సంవత్సరం పూర్తి చేసుకుని రెండో సంవత్సరం లోకి అడుగిడబోతోంది. సుమతికి మీ అభినందనలు తెలియచెయ్యండి, ఫోటోతో సహా ప్రచురిస్తాం

అభినందనలు పంపాల్సిన చిరునామా

sumathi.salahaalu@gmail.com

ఈ నెల కవిత

# సుషుప్తి నుంచీ...



## సుషుప్తి నుంచీ...

శిధిల గతం
నా మనోగతం
ఏవో రహస్యాల్ని ఉన్మేషిస్తునే ఉంటుంది

మృత ధ్రుతుల విస్ఫులింగాల్ని
శరద్రాత్రుల ప్రస్ఫుట విస్ఫోటనాల్ని
విరిసౌరభాల భయ విహాలల్ని
ఇంకా ఎన్నో ఎన్నెన్నో తమోద్భవాల్ని

నేటి మనో నేత్రపు అరుణకాంతులు
మొన మొన్నటివి కావా ?
కాచి వడ బోసిన కాలపు సుషుమ్నవి కాదా ?

నా గతం నాకవగతమే
క్షుదాగ్నుల రణభేరిలను
శుక్త సుషుప్తి శ్రావ్యాలను
రాలే ఘర్స్యపు తపనల సవ్వడులను
ఆలపిస్తుంటుంది అభిసంశనిస్తూంటుంది
అంతరంగ రంగ తరంగమై విరుచుకుపడుతుంటుంది

అసిలేరు

**నడుస్తున్న చరిత్ర**

# భారత్-చైనా, మధ్యలో మాల్దీవులు



భారత్ –చైనాకు మాల్దీవులు వ్యూహాత్మకంగా కీలకం. మాల్దీవులు చుట్టూ ఉన్న సముద్రం వ్యూహాత్మకంగా చాలా ముఖ్యమైంది. ఇక్కడి హిందూ మహాసముద్రం చైనా ఉనికికి ఎంతో అవసరం . 2016లో మాల్దీవులు ఒక ద్వీపాన్ని ఓ చైనా కంపెనీకి 50 సంవత్సరాల లీజుకు ఇచ్చింది. ఆ ఒప్పందం ఖరీదు కేవలం 4 మిలియన్ డాలర్లు (రూ.30 కోట్లు). మరోవైపు, భారతదేశానికి మాల్దీవులు ఇచ్చే ప్రాధాన్యం కూడా తక్కువేమీ కాదు. ఈ రెండు దేశాలు ఎక్కువ సన్నిహితంగా ఉండటంతో, అక్కడ చైనా అడుగుపెడితే భారత్ ఆందోళనకు గురికావడం సహజమే. మాల్దీవులు భారతదేశంలోని లక్షద్వీప్ నుండి 700 కి.మీ.లు. మెయిన్ ల్యాండ్‌కు సుమారు 1200 కి.మీ. దూరంలో ఉంటుంది. భారత్‌తో కయ్యానికి దిగినప్పుడు, భారత దేశం మీద కన్నేసి ఉంచడానికి మాల్దీవులు చైనాకు బాగా ఉపయోగపడుతుంది.

# భారత్-చైనా, మధ్యలో మాల్దీవులు

హిందూ మహాసముద్రంలోని ద్వీపాల సమూహమైన మాల్దీవులు భారత్‌లోని కొచ్చి నగరానికి 820 కి.మీ. దూరంలో ఉంటుంది. అందమైన బీచ్‌లతో పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తోన్న మాల్దీవులు.. ఎప్పటి నుంచో అన్ని రకాలుగా భారత్‌పై ఆధారపడుతోంది. ఆహారం మొదలు వైద్యం, ఇతర అవసరాలకు భారత్ నుంచి దిగుమతులే ఆ దేశానికి ప్రధాన వనరు. అలాంటి మాల్దీవులు గత కొంత కాలంగా చైనాకు అనుకూలంగా వ్యవహరిస్తూ.. భారత్‌కు దూరం అవుతోంది. చైనాతో మాల్దీవులు స్వేచ్ఛా వాణిజ్యం ఒప్పందం చేసుకుంది. అప్పట్లో ఇది భారత్‌ను ఆశ్చర్యపరిచింది. అంటే, మాల్దీవులకు భారత్ ఎంత దగ్గరో, చైనా కూడా అంతే దగ్గర అన్నది స్పష్టమవుతోంది. నిన్న మొన్నటి దాకా మనం ఏం చెబితే అదే వేదం అన్నట్టున్న మాల్దీవులు స్వరం మారుతోంది. చైనా పెట్టుబడుల ఆశతో మనకు మెల్లగా దూరం అవుతోంది. ఈ విషయాన్ని గ్రహించిన భారత ప్రభుత్వం ఎప్పటి నుంచో లక్షద్వీప్‌ను అభివృద్ధి చేయాలని డిసైడైపోయింది. యాక్షన్ ప్లాన్‌ను కూడా ఏడాది కిందటే మొదలుపెట్టింది.

ప్రధాని మోదీ లక్షద్వీప్ పర్యటన తర్వాత మాల్దీవుల మంత్రులు మాట్లాడిన వెకిలి మాటలు భారతీయులకు ఆగ్రహం తెప్పించాయి. ఇరు దేశాల మధ్య సంబంధాలను ప్రభావితం చేసే వరకూ ఇది వెళ్లింది. అన్ని విధాలుగా చేదోడు వాదోడుగా ఉండే భారత్ దూరమైతే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకున్న మాల్దీవులు నాయకత్వం.. మళ్లీ మన దేశాన్ని పొగడటం మొదలుపెట్టింది. ఇటీవల మాల్దీవుల్లో చైనా అనుకూల ప్రభుత్వం అధికారంలోకి రావడమే భారత్‌తో సంబంధాలు దెబ్బతినడానికి ప్రధాన కారణం.



డ్రాగన్ ఎంట్రీతో అన్నదమ్ముల్లా ఉన్న భారత్, మాల్దీవులు మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. శ్రీలంక, నేపాల్, మాల్దీవులు.. ఇలా భారత్ పొరుగున ఉన్న దేశం ఏదైనా సరే.. దాన్ని తమవైపు తిప్పుకోవడానికి చైనా అనుసరించింది దాదాపుగా ఒకే వ్యూహం. దేశం ఏదైనా.. ఓ పార్టీని, అందులోని ప్రధాన నాయకులను తమవైపు తిప్పుకోవడం.. ఆ తర్వాత వాళ్లు అధికారంలోకి రావడానికి అన్ని విధాలుగా సహకరించడం. అదే సమయంలో పెట్టుబడుల ఆశజూపి.. మెల్లగా భారత్‌కు దూరమయ్యేలా చేయడం. ఇదే చైనా చేస్తున్న పని.

హిందు మహాసముద్రంలో ఉండే ద్వీపాల సముదాయమైన మాల్దీవులకు ఇండియా పెద్దన్న లాంటిది. మొదటి నుంచి ఆ దేశంతో మనకు సన్నిహిత సంబంధాలున్నాయి. అసలు ఆ దేశ స్వాతంత్ర్యాన్ని గుర్తించిన తొలి దేశాల్లో భారత్ ఒకటి. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి మాల్దీవులు మన దేశంతో వ్యూహాత్మక, ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేసుకుంది. చేరువగా ఉండే శ్రీలంక తర్వాత భారతే ఆ దేశానికి అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. సార్క్ కూటమిలో మాల్దీవులు సభ్య దేశం కూడా 1988లో మాల్దీవుల అధ్యక్షుడిపై శ్రీలంక ఉగ్రవాదుల సాయంతో

# భారత్-చైనా, మధ్యలో మాల్దీవులు

తిరుగుబాటు ప్రయత్నాలు జరగ్గా.. భారత సైన్యం వెంటనే రంగంలోకి దిగి 'ఆపరేషన్ కాక్టస్' పేరిట ఆ తిరుగుబాటును అణచివేసింది. భారత్, మాల్దీవులు మధ్య దశాబ్దాలుగా ఉన్న సన్నిహిత సంబంధాలు చైనా ఎంట్రీతో దెబ్బతిన్నాయి. భారత్‌ను దెబ్బతీయడమే లక్ష్యంగా.. చైనా మన పొరుగు దేశాలను తన వైపు తిప్పుకోవడం మొదలుపెట్టింది. ముత్యాల హారంలా.. భారత్ చుట్టూ తన ప్రాబల్యాన్ని పెంచుకోవడం మొదలుపెట్టింది. ముందుగా పాకిస్థాన్‌తో మొదలుపెట్టి.. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్.. ఇలా ఒక్కో దేశానికి ఆర్థికంగా ఆశచూపి తనవైపు తిప్పేసుకుంది. ఈక్రమంలోనే మాల్దీవులు చైనా వలలో చిక్కింది.

గత ఏడాది నవంబర్లో మాల్దీవుల్లో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. చైనాకు అనుకూలుడైన మహ్మద్ ముయిజ్జు ఆ దేశ అధ్యక్షుడయ్యాడు. ఇండియా ఔట్ నినాదంతో ఎన్నికల ప్రచారం నిర్వహించి మరీ ఆయన మాల్దీవులు ఎన్నికల్లో గెలిచాడు. భారత్ అనుకూలుడైన ఇబ్రహీం మహ్మద్ సోలిహ్ ఓటమితో.. మాల్దీవుల్లో చైనా ప్రాబల్యం పెరగడం మొదలైంది. ముయిజ్జు గెలవగానే.. సైన్యాన్ని తమ దేశం నుంచి ఉపసంహరించుకోవాలని భారత్‌ను కోరాడు. ఇంతా చేస్తే అక్కడుంది కేవలం 77 మంది భారత సైనికులే. తాజాగా ముయిజ్జు చైనా పర్యటనకు బయల్దేరి వెళ్లాడు. ఈ పర్యటన సందర్భంగా చైనా-మాల్దీవులు మధ్య అనేక ఒప్పందాలు జరిగే అవకాశం ఉంది. అయితే కేవలం 5 లక్షల జనాభా ఉన్న మాల్దీవులు అన్ని రకాలుగా భారత్‌పై ఆధారపడుతోంది. మన పర్యాటకులు మానేస్తే వాటిల్లే నష్టం కంటే.. ఇండియా నుంచి దిగుమతులు ఆగిపోతే వాటిల్లే నష్టం ఎక్కువ. ఈ విషయం బాగా తెలుసు కాబట్టే.. భారత్ అనుకూల ముద్ర పడిన మాల్దీవుల నేతలు తమ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు. మన పొరుగున ఉన్న మిత్రదేశమైన భారత్‌ను దూరం చేసుకోవద్దని హితవు పలుకుతున్నారు.



'భారత్‌పై మనం ఎంతో ఆధారపడి ఉన్నాం. మనకు అవసరమొచ్చినప్పుడు ముందుగా స్పందించేది ఇండియానే. ఆర్థికంగా, సామాజికంగా, ఆరోగ్యం, విద్య, వాణిజ్యం, పర్యాటకం.. ఇలా ఎన్నో రకాలు మనం భారత్‌పై ఆధారపడి ఉన్నాం. మన అభివృద్ధిలో భారత్ పాత్ర ఎంతో ఉంది. అలాంటి దేశాన్ని దూరం చేసుకోవద్దు. భారత ప్రజలకు ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలి' అని మాల్దీవులు మాజీ డిప్యూటీ స్పీకర్ ఇవా అబ్దుల్లా తెలిపారు.

ఇటీవల మన దగ్గర ఉల్లిపాయల ధరలు పెరిగి ఎగుమతులపై నిషేధం విధిస్తే.. మన పొరుగున ఉన్న ఇతర దేశాలతోపాటు మాల్దీవులకు సైతం ఉల్లి ఘాటు తెలిసొచ్చింది. బియ్యం, గోధుమ పిండి, పంచదార, బంగాళదుంపలు, ఉల్లిపాయలు, పప్పు, కోడిగుడ్లు.. ఇలా నిత్యావసరాలన్నింటిని మాల్దీవులు పెద్ద మొత్తంలో భారత్ నుంచి దిగుమతి చేసుకుంటోంది. కోవిడ్ టైంలోనూ ఆ దేశానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా నిత్యావసరాలను ఇండియా సరఫరా చేసింది. భారత్ ఒక్క ఆరు నెలలపాటు ఎగుమతులను తగ్గిస్తే చాలు మాల్దీవులు ఉక్కిరిబిక్కిరి అవడం ఖాయం. ఇక విద్య, వైద్యం విషయంలో మాల్దీవులు భారత్‌పైనే ఆధారపడుతోంది. ఇండియా ఎగుమతులు ఆపేస్తే.. చైనా నుంచి దిగుమతులతో మాల్దీవులు బండి లాగించొచ్చు. కానీ రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతాయి. దీంతో వాటి ఖర్చు కూడా అమాంతం పెరిగిపోతుంది. ఇప్పటికే మాల్దీవులు కాస్ట్లీ.. చైనా మీద ఆధారపడాల్సి వస్తే ఖర్చు మరింత పెరుగుతుంది. చైనాను నమ్ముకున్న పాకిస్థాన్, శ్రీలంక లాంటి దేశాల ఆర్థిక పరిస్థితి ఎలా తలకిందులైందో మనం చూస్తూనే ఉన్నాం. భారత్‌ను కాదని.. చైనాను అంటకాగేందుకు ప్రయత్నిస్తున్న మాల్దీవులకు కూడా ఇవాళ కాకపోతే రేపైనా సరే తత్వం బోధపడకపోదు.

మాల్దీవుల్లో ఇటీవలె కొత్త ప్రభుత్వం కొలువు దీరింది. అయితే గతంలో ఉన్న అధ్యక్షుడు భారత్‌కు అనుకూలంగా వ్యవహరించగా.. తాజాగా అధికారంలోకి వచ్చిన పార్టీ మన దేశానికి వ్యతిరేకంగా.. చైనాకు అనుకూలంగా వ్యవహరిస్తోంది.

# భారత్-చైనా, మధ్యలో మాల్దీవులు

అయితే అక్కడి వరకు బాగానే ఉన్నా.. తాజాగా భారత్‌పై, భారత ప్రధాని నరేంద్ర మోదీపై ఆ దేశ ఎంపీ హీనమైన వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల లక్షద్వీప్‌లో పర్యటించిన సందర్భంగా షేర్ చేసిన వీడియోపై మాల్దీవుల ఎంపీ కామెంట్ చేశారు.

లక్షద్వీప్‌లో ప్రధాని మోదీ పర్యటనపై మాల్దీవులు ఎంపీ జహీద్ రమీజ్ తన అక్కసును వెళ్లగక్కారు. పర్యాటకంగా తమతో పోటీపడటం భ్రమే అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పర్యాటక రంగంలో మాల్దీవులతో పోలిస్తే.. లక్షద్వీప్ ఎన్నో సమస్యలను ఎదుర్కొంటోందని ట్వీట్ చేశారు. పర్యాటకంలో మాల్దీవులతో పోటీ పడాలన్న ఆలోచన భ్రమే అంటూ ఇటీవల లక్షద్వీప్‌లో ప్రధాని పర్యటించిన వీడియోను ట్యాగ్ చేస్తూ జహీద్ రమీజ్ చెప్పడం ట్వీట్ చేశారు. మాల్దీవులు అందించే సేవలను అక్కడ ఎలా అందించగలరని ప్రశ్నించారు. అంతటితో ఆగకుండా అక్కడ పరిశుభ్రంగా ఎలా ఉంచగలరని.. అక్కడి గదుల్లో వచ్చే వాసన అతి పెద్ద సమస్య అని జహీద్ రమీజ్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.


అయితే మాల్దీవులు ఎంపీ జహీద్ రమీజ్ చేసిన ట్వీట్‌పై భారతీయులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. పర్యాటకంగా మాల్దీవులను బహిష్కరించాలని కామెంట్లు పెడుతున్నారు. భారత్ నుంచి ఏటా చాలా మంది మాల్దీవుల్లో పర్యటిస్తుంటారు.. భారత్‌ను మాల్దీవులు ఎంపీ అవమానించినందుకు గానూ వారు మాల్దీవుల్లో పర్యటించడం ఆపేసి ప్రత్యామ్నాయ ప్రాంతాలకు వెళ్లాలని నెటిజన్లు సూచిస్తున్నారు. అయితే జహీద్ రమీద్ చేసిన వ్యాఖ్యలు అక్కడి పర్యాటక రంగంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం



ఉందని పర్యాటక రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు.

భారత ప్రభుత్వం కూడా మాల్దీవుల్లో మారుతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తోంది. పర్యాటకంగా మాల్దీవులకు చెక్ పెట్టాలనే ఆలోచన ఉందో లేదో గానీ.. లక్షద్వీప్‌ను మాత్రం డెవలప్ చేయాలని కొంత కాలం క్రితమే మోదీ సర్కారు నిర్ణయించింది. ఏడాది క్రితమే ఇందుకు సంబంధించిన కార్యచరణ మొదలైంది. లక్షద్వీప్ చుట్టూ సముద్రమే. పర్యాటకంగా అభివృద్ధి చేయాలంటే టూరిస్టులు, స్థానికుల అవసరాలు తీర్చేంతగా నీటి లభ్యతను పెంచడం ఎంతో అవసరం. అందుకే భారత ప్రభుత్వం ఇజ్రాయెల్‌ను సంప్రదించింది. ఇజ్రాయెల్‌లో నీటి వనరులు ఎంత తక్కువగా ఉంటాయో.. డిశాలినేషన్ ద్వారా ఆ దేశం సముద్రపు జలాలను లవణాలు లేకుండా చేసి.. తద్వారా పంట సాగు, ఇతర అవసరాలకు అనువుగా మార్చుకుంటుందో మనకు తెలిసిందే. భారత్ రిక్వెస్ట్ చేయగానే.. ఇజ్రాయెల్ లక్షద్వీప్ డిశాలినేషన్ ప్రోగ్రాం కోసం రంగంలోకి దిగింది. అది కూడా ఇప్పుడు కాదు.. ఏడాది కిందటే. ఈ విషయాన్ని భారత్‌లోని ఇజ్రాయెల్ రాయబార కార్యాలయం వెల్లడించింది అంతే కాదు.. టాటా గ్రూప్ కూడా లక్షద్వీప్‌లోని సుహేలి, కాడ్మాట్ దీవుల్లో రెండు రిసార్టులను నిర్మిస్తోంది. దీనికి సంబంధించి 2023 జనవరిలోనే ఒప్పందాలు కుదిరాయి. 2026 నాటికి ఈ ప్రాజెక్ట్ పూర్తి కానుంది. లక్షద్వీప్‌కు వెళ్లే పర్యాటకుల సంఖ్య పెరగాలంటే అక్కడో ఎయిర్‌పోర్ట్ అవసరం. దీంతో పౌర అవసరాలతోపాటు.. సైనికంగానూ పనికొచ్చేలా.. లక్షద్వీప్‌లోని మినికాయ్ దీవిలో ఓ ఎయిర్‌పోర్ట్‌ను భారత ప్రభుత్వం నిర్మిస్తోంది. ఈ ఎయిర్‌పోర్ట్ ద్వారా పర్యాటకులు త్వరగా అక్కడికి వెళ్లడంతోపాటు.. అరేబియా సముద్రంలో మన నిఘా వ్యవస్థను కూడా పటిష్టం చేయొచ్చు..

పరిణితి



# అంతర్నేత్రం



## మూర్ఖునిగానే ఉండు

ఆనందమైనా, దుఃఖమైనా మన భావనలోనే ఉంటుంది. భావన మంచిదైతే మనకు మనతోటి వారికి మంచే జరుగుతుంది. ఎవరిలో పవిత్ర భావనలు ఉంటాయో అట్టివారు చేసేపనులు సఫలమౌతాయి. జీవితాన్ని మనం ఏ భావనతో స్వీకరిస్తామో అనేది ముఖ్యం. మనం దాన్ని స్వీకరించే దృక్పధాన్ని బట్టి దుఃఖం కాని, సుఖం కాని ఉంటాయి. ఎవరి జీవితంలో అయినా పది శాతమే భగవత్రపసాదితం, అంటే వారు కోరుకున్నది జరిగేది. మిగిలిన తొంభై శాతం జీవితాన్ని ఎలా స్వీకరిస్తాం అనే దానిపై ఆధారపడి ఉంటుంది. ప్రతి పరిణామాన్ని, ప్రతి నిత్యం మనముందు జరుగుతున్న సంఘటనలు, విభిన్నమైన మనస్తత్వాలు గల మనుషులను ఎదుర్కోవాల్సి వస్తుంది.

# పరిణితి

ప్రతిదానిలో ఓర్పుతో, మంచిని మాత్రమే స్వీకరించి చెడును విస్మరించగలిగే విచక్షణా జ్ఞానాన్ని అలవరుచుకోవాలి. పాలలో నీళ్ళను వేరుచేసి పాలనే స్వీకరించే శక్తి హంసకు, ఇసుక నుంచి పంచదారను వేరుచేసి పంచదారను మాత్రమే స్వీకరించే గుణం చీమలకు ఉంది. ఏ భాష, భావం తెలియని మూగ జీవులే మంచి చెడుల మధ్య తారతమ్యం గ్రహించి వ్యవహరించగలిగినప్పుడు, మనిషి ప్రత్యేకంగా భగవంతుడు ఇచ్చిన బుద్ధితో, వివేకంతో జీవన పరిణామాల్ని, వాటి ఫలితాల్ని స్వీకరించలేకపోతే దానికి బాధ్యులెవరు?

ఇద్దరు మిత్రులు దేశాటన చేస్తూ, రాత్రిపూట గుడారం వేసుకుని అందులో విశ్రమించేవారు. ఒకనాడు ఒక గ్రామం పొలిమేరల్లో బసచేసి ఉదయం ప్రయాణిద్దాం అనుకుని గుడారం వేసుకొని అందులో విశ్రమించారు. ఒకరాత్రి మెలుకువ రావటంతో, వారిలో ఒకడు 'మిత్రమా! పైకి చూడు ఆకాశం ఎంత నిర్మలంగా ఉందో చల్లని చంద్రుడు, చుట్టూ నక్షత్రాలు ఎంతో అందంగా కంటికి కనువిందు చేస్తున్నాయి!' అన్నాడు. రెండు మిత్రుడు వెంటనే 'మన గుడారాన్ని ఎవరో ఎత్తుకుపోయారన్నాడు. ఈ ఇద్దరిలో ఎవరు తెలివిగలవారు అంటే మొదటివాడినే

జీవితంలో ప్రతి అంశాన్ని సానుకూల దోరణితో స్వీకరించే శక్తి లేకపోతే ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. కనుక జీవితం సాఫీగా సాగాలంటే ప్రతి అంశాన్ని పాజిటివ్ దృక్పథంతో స్వీకరించగలిగితే అంతా ఆనందమే.

సమర్థించాల్సిందే. మొదటి వ్యక్తి గుడారం పోయిందని తెలిసికూడా బాధపడటం వల్ల ప్రయోజనం లేదని తెలిసి ఆకాశంలోని అందాలను ఆస్వాదించి మరల హాయిగా నిద్రకుపక్రమించాడు. రెండోవాడు గుడారం పోయిన విషయాన్ని మాత్రమే గ్రహించి ఆందోళనచెంది నిద్రపాడు చేసుకున్నాడు.

జీవితంలో ప్రతి అంశాన్ని సానుకూల దోరణితో స్వీకరించే శక్తి లేకపోతే ఎన్నో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. కనుక జీవితం సాఫీగా సాగాలంటే ప్రతి అంశాన్ని పాజిటివ్ దృక్పథంతో స్వీకరించగలిగితే అంతా ఆనందమే.

ఒక గ్రామంలో ఒక గురువు గారుండేవారు. ఒకరోజు ఆ ఊరిలో భాగవత ప్రవచనం జరుగుతుందని తెలిసి, తన నలుగురు శిష్యులను విని రమ్మని పంపాడు. శిష్యులు శ్రద్ధగా విని, ఉపన్యాసం అయిపోయిన తర్వాత గురుకులానికి వచ్చారు.

గురువుగారు శిష్యులతో నాయనలారా మీరు ఉపన్యాసం నుంచి నేర్చుకున్నదేదో చెప్పండి, విని సంతోషిస్తాను అన్నాడు. మొదటి శిష్యుడు, గురుదేవా నాకు దేవుడు ఉన్నాడా లేదా అని ఈనాటి వరకూ సందేహమే. భాగవతం వినడం వల్ల అది నిజమని తేలింది. అందులో పోతనగారె 'కలడు, కలండెనెటువాడు కలడోలేడో" అని సందేహం వెలిబుచ్చాడు. ఆయనంతటి వానికే సందేహమొచ్చిందంటే నిజంగా దేవుడు ఉన్నాడంటారా అని బదులిచ్చాడు.

రెండవ శిష్యుడు నేను ఎప్పుడైన కార్యసాధన కోసం అబద్ధాలు చెపితే మీరు కోప్పడేవారు, కాని బాగవతంలో ప్రాణ, విత్త, మానభంగ మందు అబద్ధాలాడవచ్చని చెప్పారు, కాబట్టి అబద్ధాలాడటంలో తప్పులేదండి అని సెలవిచ్చాడు. ఇక మూడవవాడు గురువర్యా ఈ ప్రపంచం మొత్తం ఆ భగవంతుని జగన్నాటకమే అని సర్వ విజ్ఞాన సారాన్ని పోతన గారు ఒక ముక్కలో చెప్పారన్నాడు. ముగ్గురు శిష్యులు ఎవరి సంస్కారాన్ని బట్టి, ఆలోచనలను బట్టి ఉపన్యాస సారాన్ని అర్థం చేసుకున్నారు. కాబట్టి మనసులో ఎటువంటి భావనలతో అయితే మనం వుంటామో అవే ప్రతిబింబిస్తాయి. దోషాలకోసం



# పరిణితి

మనసు ఆరాటంగా వెతికితే
అవే తొందరగా కనిపిస్తాయి.
గుణాలకోసం వెతికితే అవే
కనిపిస్తాయి.

మనిషి ఆలోచించడానికి, మరొకరి మంచి గురించి తలచుకోవటానికి, ఆఖరికి వారిని అభినందించటానికి ఆ మనిషికి అడ్డొచ్చేది – అహమే. ప్రేమతో మనుషుల్ని మానసికంగా దగ్గరకి తీసుకోవాల్సి ఉంటుంది కానీ, అహంకారమనే గోడను అడ్డంగా పెట్టుకుని ఎవరినీ దగ్గర చేసుకోలేం. ఏ కారణంగానైనా అహంకారి ఒకరిని దగ్గరకు తీసుకున్నా అది అభిమానంతో మాత్రం కాదు. తనను తాను రక్షించు కోవటానికి మాత్రమే తాపత్రయపడతాడు.
ఎందుకీ భయం! ఎక్కడ తన తప్పులు బయపడతాయోనని, అయితే ఇతరులు తనకన్నా ఎక్కువ తప్పులు చేస్తే తప్ప తను క్షేమంగా ఉండలేడు.
ఎన్నాళ్ళు ఇలా? తన తప్పులు ఒప్పుకోకుండా, ఇతరుల ప్రేమ పొందకుండా అహంకారి జీవితం అర్ధరహితంగా మారుతుంది.
సముద్రంలో అలలు – సముద్రం వేరు, తాము వేరు అనుకోవు. ఎగసిపడే అలలు అస్తిత్వమూ లేదు. అలా లేచి మళ్ళీ సముద్రంలోకలిసిపోతాయి.. మనమూ అంతే, ఎంత ఎత్తుకేగినా, అలలులాగా సమాజం అనే సముద్రంలో కలవాల్సిందే. నీముందు, నీ తరువాత ఈ సమాజం వుంటుంది. సమాజంలో నీకు గుర్తింపు రావాలంటే అవన్నీ వీడి తప్పులు తెలుసుకొని నీ చుట్టూ వున్న వారితో మమేకం అవ్వడం ఒక్కటే మార్గం.
ఒక పొరపాటు జరిగితే దాన్ని ఓ దీవెనగా మార్చుకోండి.

ప్రతి దీవెనలోను అద్భుతమైన శక్తి ఉంటుంది. మనిషి ఎంత ఎదిగినా, ఏ స్థాయిలో ఉన్నా, ఆ స్థాయికి తగ్గ పొరపాట్లు జరుగుతుంటాయి. తప్పులు చేయకుండా మనిషి ఎదగలేడు. తప్పులు బాధిస్తాయి. అయితే ఆ తప్పు నుండి పాఠం నేర్చుకోకపోతే అనుభవించిన బాధకు అర్థం ఉండదు. పొరపాట్ల నుంచి నేర్చుకోవడం అంటే, ముందు ఆ తప్పును స్వీకరించగలగాలి. కాని చాలామంది అనేక సందర్భాల్లో తప్పుచేసి బాధ్యత వహించకుండా మరొకరి నెత్తిన రుద్దడానికి ప్రయత్నిస్తారు. తప్పును అంగీకరించటం గొప్ప సంస్కారం. మన పొరపాటుకు మరొకరిని కారకుల్ని చేయడం అంటే, ఆ తప్పు నుంచి బయట పడకుండా దాని బాధను, దాని కారణంగా ఎదురయ్యే పరిస్థితుల్ని కొనసాగించడమే అవుతుంది. తప్పులు మరిన్ని తప్పుల్ని. దీవెనలు మరిన్ని దీవెనలను ఆకర్షిస్తాయి.

★★★

సరికొత్త
సీరియల్

గిలిగింతలు పెట్టె హాస్య వల్లరి
కడుపుబ్బా నవ్వించే
కామెడి సీరియల్

# పంచవటి

## ఓ పదిళ్ళ లోగిలి



ఉమకు వీడ్కోలు పలికి లోపలికి దారి తీస్తుంటే

"ఏమోయ్ శంకరం వంట అయ్యిందా ..' అనే మాటలు చెవిని తాకటంతో వెనుతిరిగి మాశాడు శంకరం.

"ఎదురుగా తాతారావుగారు కనపడటంతో

"ఏమిటి అంకుల్. "అంటూ పలకరించాడు.

"అదే నోయ్ ఈ వేళ వంట ఏం చేసావని

"వంట మొత్తం మా ఆవిడే చేసి వెళ్తుంది అంకుల్, నేను మాత్రం కుక్కర్లో అన్నం పెడతా, ఆటైముకి చల్లారి పోతుందని... మరి మీ వంట అయ్యిందా?"

## సరికొత్త సీరియల్

**జరిగిన కథ**

ఉమా ,శంకరం భార్య భర్తలు. ఉమా ఉళ్ళోని పోలీస్ స్టేషన్ లో ఎస్ ఐ గా పనిచేస్తూ ఉంటె , శంకరం చెట్టు కింద ప్లీడరు గా పేరుపడి వాదించటానికి కేసులు లేక ఇంటిదగ్గరే ఉంది ఇంటిపనులు చుసు కుంటూ ఉంటాడు

**ఇక చదవండి**

శంకరం మాటలకు ఏ మాత్రం ఉడుక్కోకుండా

" దాదాపు అయినట్టే నోయ్ పచ్చట్లలొ తాలింపు వెయ్యాలి అంతే, వేధవది నోటికి వక్రగా ఏదన్నా తగలక పోతే ఆరోజు ము
దిగదనుకో.

వాళ్ళ మాటలు వింటుంటే ఆడవాళ్ళు నీళ్ళ పంపు దగ్గర ముచ్చట్లులా అనిపిస్తాయి వినేవాళ్ళ ఎవరికైనా

"ఏమిట్రా, మా వాడికి కూడా నీ విద్య నంతా నేర్పిస్తున్నావా? " అంటు వాళ్ళను చూసిన వర్లుగారు గుమ్మం దగ్గర నుండి వాకిట్లోకి వచ్చారు.

'అలాంటిదేమిలేదు లేరా. నువ్వు కంగారు పడకు, ఊరికే పలకరింపులు అంతే"



వాళ్ళ మాటలు విన్నారో ఏమో, వర్లుగారు " ఆ అదేలే విన్నాను, అయినా ఎవరినన్నా పలక రించాలి అంటే, నాన్నగారు బాగున్నారా? అమ్మ గారు ఎలావున్నారు ? ఆఫీసులేదా ఈరోజు? అని పలకరించ వచ్చుగా? వంటయ్యిందా అని పలకరించటం ఏమిట్రో బొత్తిగా మరీ డడ వాళ్ళలో? నీబుద్ధి పోనిచ్చుకున్నావు కాదు'

"ఏదో లేరా? అలవాటు అయిన ప్రాణ, ఇప్పుడు మారమంటే మారుతుందా చెప్పు"

'అవునవును 30 సంవత్సరాల నుండి అలవాతయిన ప్రాణమాయే , సరేలే ఇప్పుడు నువ్వు మారా వద్దు, మమ్మల్ని మార్చా వద్దు, రాలోపలికెళ్ళి మాట్లాడుకుందాము, వాకిట్లో ఎందుకు మీ వంటల గోల" అంటు వాళ్ళిద్దరితో పాటు ఇంట్లోకి దారి తీశాడు వర్లు గారు

తాతారావు కూడా వర్లు గారితో పాటే ప్రొఫెసర్ గా చేసి రిటైరయ్యారు. వయసులో వున్నప్పుడు భారీగా కట్నకానుకలు ముట్ట చెప్పుతున్నారని మంగతాయారుతో పెళ్ళి చేసారు తాతారావు తల్లి తండ్రులు. అదే తాతారావు చావు కొచ్చింది. మంగతాయారు బాగా గారాబంగా పెరేగటం వల్ల చదు సంధ్యలే కాదు వంటా వార్పులు కూడా ఏవి అబ్బ

సరికొత్త సీరియల్

# గిలిగింతలు పెట్టె హాస్య వల్లరి కడుపుబ్బా నవ్వించే కామెడి సీరియల్

లేదు.

పెళ్ళైన మొదట్లో వంట చేత కాదు అంటే ఏదో చిన్న పిల్ల తెలియదులే, నిదానంగా తనే చిన్నగా నేర్చుకుంటుందిలే అనుకుని, తనే చెయ్యి కాల్చుకునే వాడు. కాని పోనుపోను మంగ తాయారు వంట నేర్చుకోవటానికి ఏమాత్రం ఇష్ట పడక పోవటంతో తాతారావే రోజు చెయ్యి కాల్చుకోక తప్పలేదు..

ఇంట్లోకొస్తున్న తాతారావుని చూసిన పద్మావతమ్మ

"ఏం అన్నయ్యగారు ఎలావున్నారు. ఒదిన గారేం చేస్తున్నారు. "అంటూ పలకరించింది. అప్పటికే దగ్గరుండి మనవరాలి కి టిఫిన్ తినిపిస్తున్న పద్మావతమ్మ

'ఆ, మీ ఒదిన గారికేమమ్మ బాగానే వుంది గుండ్రాయిలా, మూడు సినిమాలు, ఆరు సీరియల్స్ లా గడచిపోతోంది అవిడకు, ఎటోచ్చి ఈ వయసులో నాకే తప్పట్లేదు తిప్పలు"

'ఎంతైనా ఒదినగారు అదృష్టవంతులు, మీలాంటి అనుకులమైన భర్త దొరకటం అవిడ ఏజన్మలోనో చేస్తుకున్న పుణ్యమో.... అంటు సాగదీస్తుంటే

తండ్రి కొడుకు లిద్దరూ నోరెళ్ళ బెట్టి గుట్టున్నారు చూడటం వాళ్ళ వంతయ్యింది .

తాతారావు మాత్రం సంతోషంగా నవ్వుతూ 'ఏదో నీ అభిమానం తల్లి ... " అంటూ గోణిగాడు.

కాపురం అన్న తరు వాత తప్పుతుంగా చెప్పు

"నిజమే అన్నయ్యగారు, ఇదిగో వీళ్ళువున్నారు, ఇటు గ్లాసు ఇటు అటు పెట్టురు, ఈ సంసారం మొత్తం నేనొక్కదాన్ని లాకొస్తున్నా..." అంటూ చీర చెంగుతో మొఖం తుడుచుకోసాగింది అప్పటి దాకా ఏదో కష్ట పడ్డట్టు

'అదేమీటమ్మ కోడలు పిల్ల వుందిగా.." తాతారావు మాట పూర్తయే లోపే

> ఆ, మీ ఒదిన గారికేమమ్మ బాగానే వుంది గుండ్రాయిలా, మూడు సినిమాలు, ఆరు సీరియల్స్ లా గడచిపోతోంది అవిడకు, ఎటోచ్చి ఈ వయసులో నాకే తప్పట్లేదు తిప్పలు"

' ఏం కోడల్లె అన్నయ్య, ఎప్పుడు ఖైదీలు. కేసులు అంటూ తిరుగుతూ ఉంటుంది తప్ప ,ఇంటి ధ్యాసే ఉండదు

'అదేమిటమ్మా, వంటంతా చేసి వెళ్ళిందన్నాడు శంకరం

"అన్నాడు, అనకేం చేస్తాడు.. పెళ్ళాం అంటే. వాడికి .. ' అని ఇంకా ఏదో అన బోతూ వుంటే '

"అమ్మా "అంటూ గట్టిగా అరిచాడు శంకరం .
." ఏమి తెలియనట్టు శంకరం వంక చూసింది

"ముందు చిన్నుకి టిఫిన్ పెట్టటం పూర్తి చెయ్యి, స్కూల్ టైమ్ అవుతోంది.

"అలా అయితే. ఈ టిఫిన్ ఏదో నువ్వే పెట్టుకో అంటూ డైనింగ్ టేబుల్ దగ్గర నుండి లేవబోయింది' అప్పటి దాకా మౌనంగా వున్న వర్లు గారు,

అప్పటి దాక మౌనంగా ఉన్న వర్లు గారు "వాడు అన్నదాంట్లో తప్పేముంది, అంతలా వుడుక్కుంటావేమిటి. వంట మొత్తం కోడలు పిల్లే చేసి వెళుతోంది కదా? కనీసం ఇలాంటి చిన్న చిన్న పనులన్నా మనం చెయ్యవలి కదా?" అంటు గట్టిగా

అన్నారు

'ఇదీ వరస అన్నయ్య గారు,కోడలు పిల్లని ఒక్క మాట అననివ్వరు. మీరైన చెప్పండి... " తాతారావు వంక చూస్తూ అంటూ ఉంటె

"వాడేం చెపుతాడు, వాడి కొడుకు, కోడలు సరిగ్గా వుంటే, వాడికెందుకీ తిప్పలు, .... వర్లు గారు మధ్యలో అడ్డు పడ్డారు."

"వాళ్ళ దేమి తప్పు లేదురా? అంతా మా మంగతాయురుదే. ఏ కోడలు మాత్రం ఎన్నాళు వుంటుంది రాచి రంపాన పెడుతుంటే, అందుకనే వేరుకాపురం పెట్టారు.."

"చూసావా, . వాళ్ళతో పోలిస్తే ని కోడలు ఎంత మంచిదో

"అంటే నేను కోడల్ని రాచి రంపాన పెడుతున్నాననా ?..."

"వాడలా అనలేదు కదమ్మా?..."

"ఇంకెలా' అనాలి అన్నయ్య గారు, మీరుకూడా ఆయనకే వత్తసు పలుకుతున్నారు......

అంతేలే ఎంతైనా పెళ్ళాలంటే మీకు చులకన భావన అంటు మౌనంగా మళ్ళీ చిన్నుకి టిఫిన్ పెట్ట సాగింది.

"ఇది రోజూవుండేదే కాని, అసలు నువ్వు వచ్చిన విషయం చెప్పలేదు.. "అంటూ తాతారావు వంక చూశాడు వర్లు గారు

"ఏమి లేదురా, మన కాలనీ చుట్టూ అపార్టు మెంట్లు వచ్చేస్తున్నాయి కదా? ముందు ముందు మనకి వాటర్ ప్రొబ్లమ్ వస్తుందేమోనని మన కాలనీల వాళ్ళు భయపడుతున్నారు"

"ఆ విషయం నా దృష్టికి కూడా వచ్చింది. మనం మినిష్టర్ను కలిస్తే తప్ప ఈ సమస్యకు పరిష్కారం దొరకదు. నేను ఒకసారి మినిష్టరు అపాయింటి మెంట్ తీసుకుని చెబుతాను అందరం వెళదాం"

"సరే రా మరి నే వెళ్ళొస్తా , వుంటాను 'చెల్లాయ్' అంటూ లేచాడు తాతారావు"

(ఇంకా ఉంది )

దసరా కవితల పోటీలో బహుమతి పొందిన కవిత

# తూకం

పెనుమాక నాగేశ్వరరావు

నిర్ణయాలెప్పుడూ నిజాయితీగానే వుండాలి
నిజాయితీ ఎప్పుడూ నిర్ద్వంద్వం గానే వుండాలి
నిబద్ధతకి కొలబద్ద ఏముంటుంది?
నిష్కల్మషతకి  కొలత ఏముంటుంది?

ఆరు నూరయినా, నూరు ఆరయినా మాటవరసకే గా
కొలతలూ,కొలమానాలూ కొన్నింటికేగా
మక్కువ ఎంతో  తూచటానికి తక్కెడ వుంటుందా?
స్థూల  కాయాన్ని సున్నితపు త్రాసు తూయగలదా!

బంగారానికి తూకం వుందిగానీ బండారానికి లేదుగా!
తగరపు త్రాసు బరువేం తూస్తుంది?
ఓదార్పును  దేనితో కొలుస్తాం? దేనితో పోలుస్తాం?
మనోభావాల్ని మల్లెపూవుల్లాగా తూచనూలేము,తుంచనూలేము

వాకిలికీ వుంటుంది ఓ కొలత, కానీ  ఆకలికి ఏది కొలత
ఐశ్వర్యానికి ఉన్నది తూకం  ఆనందానికి ఏది తూకం?
సాయానికి, దాహానికి  తూకం వుంటుందా!
శతమానం భవతి  అనే  మనసుకి కొలమానం వుంటుందా!

మనోవేగాన్ని కొలిచే సాధనం పేరేమిటి?
గుక్క కి లేక్కుందేమో కానీ, తిక్కకు లెక్కుండదుగా  !
లెక్కలేనితనానికి, లెక్కచేయని తరానికి లెక్కలేం చెబుతాం!
అటు ఆరూ, ఇటు రెండూ కదూ చిట్టచివరి లెక్క?

జానేడు పొట్ట,  గుప్పెడు మెతుకులు, గుక్కెడు నీళ్ళు
చారెడుపసుపు , దోసెడు కుంకుమ  వీసెడుగంధం
బారెడుపొద్దు , కోసేడు దూరం, , తట్టెడు మట్టి
కడివెడు( క)న్నీళ్లు, పిడికెడు బూడిద,చిటికెడు చితాభస్మం
ఎవ్వరికైనా చివరి తూకాలు,కొలతలు ఇవేగా!

వైరల్

# కళ్ళు తెరిచిన బాలరాముడు



అయోధ్య గర్భగుడిలో రామ్ లల్లా విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ పూర్తయిన తర్వాత ఫోటోలు, వీడియోలు బయటికి వచ్చాయి. ఈ ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం విశ్వవ్యాప్తం అయ్యాయి. ఈ నేపథ్యంలోనే అన్నింటికన్నా ఒక వీడియో మాత్రం బాగా వైరల్‌గా మారింది. ఆ వీడియోలో ఉన్న బాలరాముడిని చూస్తే అది విగ్రహం కాకుండా ప్రత్యక్షంగా ఒక మనిషిని చూసినట్లే కనిపిస్తోంది. బాలరాముడు కళ్లు తెరిచి ఉన్నట్లు ఉన్న ఆ వీడియోను చూసి భక్తులు పరవశించిపోతున్నారు. చిరునవ్వుతో కంటి రెప్పలు కొడుతూ తలను అటూ ఇటూ కదిలిస్తూ చూస్తున్నట్లు ఉన్న వీడియో ప్రస్తుతం తెగ వైరల్‌గా మారింది.

# వైరల్



అయితే అయోధ్య గర్భగుడిలో దర్శనమిచ్చిన బాల రాముడి విగ్రహానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలను కొందరు ఎడిటింగ్ చేసి ఈ వీడియోను తయారు చేశారు. ఇది నిజమైన వీడియో కానప్పటికీ.. రామ భక్తులకు మాత్రం చాలా సంతోషాన్ని కలిగిస్తోంది. ప్రస్తుతం ఉన్న టెక్నాలజీతో ఇలాంటి వీడియోలు చేయడం సర్వసాధారణమేనని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అయోధ్యలో రాముడిని చూసినప్పుడు ఎంత అనుభూతి కలుగుతుందో ఈ వీడియో చూస్తే అంతే అనుభూతి కలుగుతోందని మరికొందరు కామెంట్లు చేస్తున్నారు. మొత్తానికి ఈ వీడియో మాత్రం రామ భక్తులకు తెగ నచ్చేస్తోంది.

ప్రాణ ప్రతిష్ఠ తర్వాత విగ్రహంలో పెరిగిన తేజస్సు:

హిందూ ఆచారాల ప్రకారం.. ఆలయాలను కొత్తగా నిర్మించిన సమయంలో విగ్రహ ప్రాణ ప్రతిష్ఠకు ఎంతో ప్రాధాన్యం ఉంది. ప్రాణ ప్రతిష్ఠ అంటే విగ్రహంలోకి ప్రాణ శక్తిని స్థాపించడం. ఆ దైవాన్ని విగ్రహంలోకి ఆవాహన చేయడమే ప్రాణ ప్రతిష్ఠ. ఈ కార్యక్రమం ద్వారా ఆ విగ్రహం పూజకు అర్హమైందిగా మారుతుంది.

పవిత్ర నదీ జలాలతో విగ్రహానికి స్నానమాచరించి.. తర్వాత శుభ్రమైన వస్త్రంతో తుడిచి, సంప్రదాయబద్ధంగా అలంకరణ చేసిన అనంతరం మంత్రోచ్చారణతో ప్రాణ ప్రతిష్ఠ జరుపుతారు. అనంతరం హారతి ఇచ్చి ఆ దైవానికి నైవేద్యం సమర్పిస్తారు. అయోధ్య బాల రాముడి ప్రాణ ప్రతిష్ఠ సమయంలోనూ ఇలాగే చేశారు. రాముడు జన్మించిన అభిజిత్ ముహూర్తంలో బాలరాముడికి ప్రాణ ప్రతిష్ఠ నిర్వహించారు.

ప్రాణ ప్రతిష్ఠకు ముందుతో పోలిస్తే.. ప్రాణ ప్రతిష్ఠ తర్వాత అయోధ్య బాలక్ రామ్ విగ్రహంలో జీవ కళ ఉట్టిపడుతుండటాన్ని గమనించొచ్చు. ఈ విషయాన్ని స్వయంగా ఆ విగ్రహ శిల్పి అరుణ్ యోగి రాజ్ చెప్పాడు. నెలల తరబడి తాను చెక్కిన విగ్రహమే అయినా సరే.. ప్రాణప్రతిష్ఠ తర్వాత రాముడు పూర్తిగా మారిపోయాడని ఆయన చెప్పారు. తాను చెక్కినప్పుడు విగ్రహం వేరు.. ప్రాణ ప్రతిష్ఠ తర్వాత విగ్రహం వేరని ఆయన తెలిపరు. అయోధ్య వచ్చి రాముణ్ని దర్శించుకున్న ఆయన.. గర్భాలయంలో ఉన్న విగ్రహాన్ని చూసి ఆశ్చర్యపోయారు. బాల రాముడి ముఖంలో చిరునవ్వుతోపాటు.. ముఖంలో హావభావాలు మారిపోయాయని ఆయన చెప్పారు.

అరుణ్ యోగి రాజ్ ఏడు నెలలకుపైగా కుటుంబానికి దూరంగా ఉండి మరీ బాల రాముడి విగ్రహాన్ని ఎంతో భక్తి శ్రద్ధలతో చెక్కారు. ఆ విగ్రహాన్ని ఆయన కంటే దగ్గర, సునిశితంగా మరొకరు గమనించి ఉండరు. అలాంటి వ్యక్తే రాముడు మారిపోయాడని చెబుతుండటం గమనార్హం. ప్రాణ ప్రతిష్ఠ తర్వాత విగ్రహం మరింత కళగా కనిపిస్తోందని భక్తులు కూడా చెబుతున్నారు

ప్రాణ ప్రతిష్ఠకు ముందు విగ్రహం ఉన్న వాతావరణం వేరు.. ప్రాణ ప్రతిష్ఠ తర్వాత గర్భాలయంలోని వాతావరణం వేరు. దీప కాంతుల నడుమ.. స్వర్ణాభరణాలు, రంగు రంగుల పూల మాలలతో.. ఆ బాలరాముడి అందం అమాంతం పెరిగిపోయింది. అయోధ్యలో కొలువైన రాముణ్ని దర్శించుకున్న అనంతరం తాము అలౌకిక అనుభూతికి లోనయ్యామని భక్తులు చెబుతున్నారు.


★★★

సాహితి సామ్రాట్ కథలు

నాకు నిద్ర వస్తోంది'

ఈ నెల కథ

## మొదటి బహుమతి పొందిన కథ



శ్రీపతి లలిత.

'బంగారు ప్రాయమిదే పవళించవె తల్లీ' గాలిలో తేలుతూ పాట వినిపిస్తోంది సంధ్య మనసులోని మాట లాగా.

"నేను నిద్ర పోవాలి, నాకు చాలా నిద్ర వస్తోంది, పడుకుంటే లేచేదాకా లేపకండి" అని కొడుకు,కోడలికి చెప్పి రూంలోకి వెళ్ళింది సంధ్య.

" అన్నం తిని పడుకోమ్మా! ఆకలికి మధ్యలో మెలుకువ వస్తుంది" అన్నాడు కొడుకు రఘు.

# సాహితి సామ్రాట్ కథలు

## నాకు నిద్ర వస్తోంది’

“లేదులే పడుకోనీ రఘు! పళ్ళు కోసి బెడ్ పక్కన పెడతాను, లేస్తే తినండి అత్తయ్యా!” అంది కోడలు సింధు.

“సరే” అని రూంలోకి వెళ్లి మంచం మీద పడుకుంది.

మంచం అవతలి వేపు భర్త స్థానం ఖాళీ, మంచం మీద, తన జీవితంలోను.

ఏడుపు రాలేదు సంధ్యకి , నిద్ర మత్తు వస్తోంది.

తనకి ఇష్టమైన పాటలు పెట్టి కళ్ళు మూసుకుంది. ‘బంగారు ప్రాయమిదే పవళించవే తల్లి’ పాట సుశీల గొంతులో ఎంతో మధురంగా వినిపిస్తోంది.



‘ మొదటిసారి ఆడపిల్ల మంచి నిద్రపోయేది అన్నెంపున్నెం తెలీని వయసులో, రెండోది చివరి శాశ్వత నిద్ర.’ పాట ముందు మాట వింటూ ఆరుద్ర కలం నుంచి ఎటువంటి జీవిత సత్యం జాలువారింది, అనుకుంటూ కళ్ళు మూసుకున్న సంధ్యకి తన జీవితం కళ్ళముందు తిరిగింది.

నలుగురు అన్నదమ్ముల మధ్య అపురూపంగా గడిచింది బాల్యం.

నోరు తెరిచి అడిగితే కొండమీద కోతిని దింపేవారు తండ్రి, అన్నదమ్ములు.

ఈ గారాబం చూసి అప్పుడప్పుడు నానమ్మ సణిగినా, మళ్ళీ ఆవిడే “మన ఇంటి మహాలక్ష్మి రా!” అనేది. తల్లికి తనేమి చేసినా అపురూపమే.

చదువులో ఫస్ట్, సంగీతంలో ఫస్ట్, స్కూల్ లో టీచర్స్ అందరికీ ఇష్టమైన స్టూడెంట్ గా, ఒక యువరాణిలా వెలిగింది.

డిగ్రీ చదివేప్పుడు కూడా, కాలేజీలో ‘సంధ్య’ అనగానే అందరూ గుర్తించే స్థితి లో ఉండేది.

బంధువుల పెళ్ళిలో తనని చూసిన భర్త రాజారామ్ “ఆ అమ్మాయినే చేసుకుంటా” అని పట్టుబట్టి మరీ చేసుకున్నాడు. రాజారామ్ ఇంటికి పెద్ద కొడుకు, తరవాత ఇద్దరు మరుదులు, ఇద్దరు ఆడపడుచులు.

కోడలు ఇంట్లో అడుగుపెట్టగానే అత్తగారు వంటయింటి బాధ్యత అప్పచెప్పారు.

సాహితి సామ్రాట్ కథలు

# నాకు నిద్ర వస్తోంది'

'నాకు తెలీదు, నాకు రాదు' అనే మాటలు ఏమాత్రం ఇష్టం లేని సంధ్య, తనకిచ్చిన బాధ్యతని ప్రేమగా స్వీకరించింది.

"మా కోడలులాంటి అమ్మాయిని చూపించండి, పందెం" అనే అత్తమామలు, "మా వదిన బెస్ట్" అనే మరుదులు, ఆడపడుచులకు, అన్నీ అమర్చడానికి, సంధ్య నిద్ర లేచిన రెండుగంటల తరవాత సూర్యుడు లేచేవాడు.

రాత్రి అలసిపోయినా, ఏరికోరి చేసుకున్న భర్త ముందు బయటపడకుండా అలరించేది.

పిల్లలు పుట్టాక, రాత్రిళ్ళు ఇంకా చిన్నవయ్యాయి. పిల్లల పెంపకం, మరుదులు, ఆడపడుచుల పెళ్లిళ్లు, వాళ్ళ పురుళ్ళు, పుణ్యాలు ఎప్పుడు రోజులు వత్సరాలయ్యాయో, ఎప్పుడు తన అద్దాల్లోని బిడ్డలు పెళ్లి వయసుకి వచ్చారో తెలీలేదు.

వాళ్ళవి అయ్యేసరికి మరుదుల పిల్లలు.

తోడికోడళ్లు తెలివిగా ( అతి ) నీ నేర్పు మాకు లేదు అక్కా!, మా పిల్లలు కూడా నీ చేతిమీద పెరగాలి, నీ చేత్తోనే పెళ్లి పేరంటాలు అంటే కాస్త ఉబ్బిపోయి అన్నీ బాగానే పూసుకుని, పూనుకుని చేసింది.

సన్నగా, నాజూగ్గా, పెద్ద జడతో ఉండే అందగత్తె సంధ్య, వయసుతో వచ్చే వళ్ళుతో, పనిచేసి, చేసి మొరటు తేలిన చేతులు, వేలుముడికి అందే జుట్టుతో, వయసుకి మించిన పెద్దరికంతో పెద్దది అయిపోయింది. సంగీతలక్ష్మి సంధ్యకి మాట్లాడే టైమే లేదు, ఇంకా పాటలేమి పాడుతుంది మంగళ హారతులు తప్ప

సన్నగా, నాజూగ్గా, పెద్ద జడతో ఉండే అందగత్తె సంధ్య, వయసుతో వచ్చే వళ్ళుతో, పనిచేసి, చేసి మొరటు తేలిన చేతులు, వేలుముడికి అందే జుట్టుతో, వయసుకి మించిన పెద్దరికంతో పెద్దది అయిపోయింది. సంగీతలక్ష్మి సంధ్యకి మాట్లాడే టైమే లేదు, ఇంకా పాటలేమి పాడుతుంది మంగళ హారతులు తప్ప.

ఇంట్లోవాళ్ళు, ఇంటికి వచ్చినవాళ్లు, పనివాళ్ళు, పాలవాళ్ళతో సహా సంధ్య మాటకే ఎందుకు విలువ ఇచ్చేవారో ఇద్దరు తోడికోడళ్ళకి అర్ధం అయ్యేదికాదు. "ఏదో జాదూ" అనుకోవడం తప్ప.

తనకంటే రెండేళ్లే చిన్నదైన తోడికోడలు, షిఫాన్, జార్జెట్ చీరలు కడుతూ "నువ్వు పెద్దదానివి" అంటుంటే 'కాబోసు' అనుకుని ఉప్పాడ, గద్వాల పెద్దరికంగా ఉంటాయి అని సరిపెట్టుకుంది.

మామగారు తేలిగ్గా వెళ్లిపోయినా, అత్తగారు మంచాన పడితే "నీ ఓర్పు మాకు లేదక్కా! ఆవిడని విసుక్కుంటే బాధపడతారు" అంటే అదేదో 'పద్మశ్రీ' బిరుదులా ఆవిడకి అన్నీ చేసి కడతేర్చింది, కానీ, నడుంనొప్పి, మోకాలి నొప్పులు బహుమానాలుగా వచ్చాయి.

తన మనవళ్ల దగ్గరికి వచ్చేసరికి లేని ఓపిక తెచ్చుకుని చేసింది. అప్పుడు కూడా వేలెత్తి ఏ సాయమూ చెయ్యని తోటికోడళ్ళని "నేర్చుకోండి, రేపు మీ పిల్లలకి ఎవరు చేస్తారు?" అంటే

"నీవుండ మాకేల భయం? వై ఫియర్ వెన్ యు అర్ హియర్" అన్నాక,

కొంచెం బుద్ధి తెచ్చుకుని

"నేను పెద్దదాన్ని అయ్యాను, కూర్చుని చెప్పగలను కానీ చెయ్యలేను" అనగానే

"ఇప్పటివరకు మాత్రం నువ్వు చేసినదేమిటి? కూర్చోడం తప్ప" అన్న వాళ్ళని చూసి నోరు తెరుచుకుని చూడడం తప్ప ఏమి చెయ్యలేకపోయింది.

## సాహితి సామ్రాట్ కథలు

# నాకు నిద్ర వస్తోంది'

ఏమాటకామాటే, తన కోడలు తన అడుగుజాడల్లో నడుస్తూ భారం అంతా మోయడానికి సిద్ధపడితే, ఇప్పటికయినా కళ్ళు తెరిచి, మరుదులతో వేరుకాపురాలు పెట్టించి బోలెడు తిట్లు, చివాట్లు మూటగట్టుకుంది.

'హమ్మయ్య' ఇంక మనవలతో ఆడుతూ, ఇంత తిని 'కంటినిండా నిద్రపోదాము' అని ఏ దుర్ముహుర్తాన అనుకుందో, రాజారాంకి కాన్సర్ అని డాక్టర్లు చెప్పారు.

బాధతో కొన్ని రోజులు, ఆయన బాధ చూడలేక కొన్ని రోజులు, భరించలేని నొప్పితో బాధపడే భర్తని తీసుకెళ్లమని దేవుణ్ణి ప్రార్థిస్తూ కొన్ని రోజులు,నిముషాలు సంవత్సరాల లాగా గడిచాయి.

ప్రతిరోజూ తెల్లారగానే భర్త ఉన్నందుకు సంతోషించాలా, ఇంకోరోజు, ఆయన బాధచూస్తూ ఉండాల్సినందుకు దుఃఖపడాలా, అసలు తన మనసు ఇలా దేనికీ స్పందించకుండా రాయి లాగా, మంచులాగా గట్టిగా అయిపోయిందని గ్రహింపు కూడా లేనందుకు ఏమనుకోవాలో అర్థం అయ్యేదికాదు సంధ్యకి.

ప్రతిరోజూ తెల్లారగానే భర్త ఉన్నందుకు సంతోషించాలా, ఇంకోరోజు, ఆయన బాధచూస్తూ ఉండాల్సినందుకు దుఃఖపడాలా, అసలు తన మనసు ఇలా దేనికీ స్పందించకుండా రాయి లాగా, మంచులాగా గట్టిగా అయిపోయిందని గ్రహింపు కూడా లేనందుకు ఏమనుకోవాలో అర్థం అయ్యేదికాదు సంధ్యకి.

అసలు ఏ రకమైన మనోభావాలు లేకుండా రోజులు గడిచిపోతున్నాయి.

చివర, చివర్లో రాజారామ్ నిద్రపట్టక పాతకాలం కబుర్లు చెప్పేవాడు.

ఇంకో నాలుగు రోజులు పోతే చెప్పేందుకు ఆయన ఉండడు అని, నిద్ర వచ్చినా ఆపుకుని, ఆయన కబుర్లు అన్నీ వింటూ, పాత జ్ఞాపకాలు తెచ్చుకుంటూ రాత్రంతా ఇద్దరూ కలిసి నవ్వుకునేవారు, ఏడవలేక.

దాదాపు అయిదేళ్లపాటు ఏమి తిందో, ఎప్పుడు పడుకుందో ఎవరికీ తెలీదు.

ఆడపడుచులు, మరుదులు తప్పనిసరిగా చుట్టపుచూపు పలకరింపులు తప్ప ఒక్కనాడూ అన్నా,వదినలకు 'మేమున్నాము' అన్న మానసిక స్థైర్యం ఇవ్వలేదు. అయినా ఏ రోజూ సంధ్య బాధపడలేదు.

"వీళ్ళేమిటమ్మా? మరీ ఇలా, కొంచెం కూడా సాయం లేదు" అన్న కొడుకు, కోడలితో

"నా బాధ్యత నేను చేశాను ఆ తృప్తి చాలు నాకు" అనేది.

ఇన్ని కష్టాల్లో వెలుగురేఖ కొడుకు, కోడలు.

అన్నం సరిగ్గా తినకపోతే " మీరు మామయ్యగారికి చెయ్యాలంటే ఓపిక ఉండాలి కదా" అని పండో, పాలో ఇచ్చి " ఒక్క పదినిమిషాలు పడుకోండి, ఆయన పిలిస్తే రఘు చూస్తాడు" అని చూసిన బంగారు తల్లి, కోడలు సింధు.

ఇంక రఘు, తండ్రికి చెయ్యద్దు అనలేదు, తల్లి నలిగిపోతే చూడలేడు.

రోజూకాసేపు తల్లిదగ్గర కూర్చుని అన్నం తింటూ " ఈ కూర చూడు నీ కోడలు ఎలా చేసిందో, నువ్వు నేర్పాలి అమ్మా! చూడు కొంచెం రుచి చూసి చెప్పు" అంటూ తల్లికి గోరు ముద్దలు పెట్టిన కన్నతండ్రి, కొడుకు రఘు.

## సాహితి సామ్రాట్ కథలు

# నాకు నిద్ర వస్తోంది'

రాజారాంని బాధ నుంచి విముక్తి చేస్తూ ఆదేవుడు ఆయన్ని తీసుకెళ్లాడు.
భర్త పోయిన బాధ కన్నా ఉపశమనం కలిగింది సంధ్యకి.

అప్పుడు ఉండి సాయం చెయ్యడానికి మరుదులకు, ఆడపడుచులకు 'అన్న లేని ఇంట్లో ఉండబుద్ధి కాలేదు' ఆయన

జబ్బుతో ఉన్నప్పుడు వచ్చి ఏదో పొడిచేసినట్టు.

పన్నెండో రోజు అన్ని కార్యక్రమాలు అయ్యాక, బంధువులు అందరూ వెళ్ళిపోయాక ఇల్లంతా గందరగోళంగా ఉన్నా కళ్ళు వాసుకుపోతున్నాయి సంధ్యకి.

భర్త ఇంక రాడు అన్న విషయం కూడా మెదడులో ఇంకనంత నిద్ర వస్తోంది.

అందుకే పిల్లలకి చెప్పి గదిలోకి వచ్చి పడుకుంది.

"రేపు నిద్ర లేస్తానా లేక ఇదే ఆఖరి నిద్రా? ఎవరికి తెలుసు? ముందు కంటినిండా నిద్రపోవాలి" అనుకుంటూ ఉండగానే కళ్ళు మూతలు పడ్డాయి సంధ్యకి.

రేపు ఉదయం, సూర్యుడు ముందా? సంధ్య ముందా? ఎవరు ముందు లేస్తారు?

ఉషోదయం అయితేకానీ తెలియదు.

సమాప్తం



## ఈ శీర్షిక మీదే


## కొంటె ప్రశ్న - చిలిపి జవాబు

ఈ క్రింది కొంటె ప్రశ్నకు తుంటరి జవాబులు రాసి పంపండి
ఉత్తమ జవాబుకు రూ116/-
బహుమతిగా ఇవ్వాబడును

**ఆడవాళ్ళ వంటకన్నా మగవాళ్ళ వంట రుచిగా ఉంటుంది ఎందుకు ?**

(అందుకే నలభీమ పాకం అన్నారు కాని ద్రౌపది సుబద్ర పాకం అనలేదు )

జవాబులు ఫిబ్రవరి 25 లోపు చేరాలి
sumathi.potilu@gmail.com



సాహితి సామ్రాట్ కథలు

# దృష్టి

ఈ నెల కథ

## మొదటి బహుమతి పొందిన కథ



టి. వి. యెల్. గాయత్రి

ఇరవై శోభన కాలేజీలో లెక్చరర్. ఆ రోజు పొద్దున్నే కాలేజీకి బయలుదేరుతూ తల్లి మొహంలో దిగులును గమనించింది. విషయం అర్థం అయ్యింది.

“నువ్వేమీ దిగులు పడకమ్మా!నేను బాగానే ఉన్నాను. అయినా నా పెళ్ళికి అంత తొందరేమొచ్చింది చెప్పు!”అంది.

“ఒక్కో సంబంధం ఇలా వెళ్లిపోతుంటే నీ గురించి నాకు బెంగ ఎక్కువవుతోంది “అంది శ్రావణి దిగులుగా.

సాహితి సామ్రాట్ కథలు

# దృష్టి

ఈ లోపల శోభన తండ్రి కృష్ణమూర్తి అక్కడికి వచ్చాడు.

"నీకు కాలేజీకి టైమవుతుంది గానీ నువ్వు బయలుదేరు తల్లీ!"అన్నాడు కూతురుతో.

శోభన గబగబా కాలేజీకి వెళ్ళింది.

కృష్ణమూర్తికి ఇద్దరు పిల్లలు శోభన, సుధేష్ణ.

శోభనకు టెన్త్ క్లాసు చదివేటప్పుడు తండ్రి బైకు మీద బజారుకెళ్తుంటే యాక్సిడెంటు అయ్యింది. ఇద్దరికీ ప్రాణాపాయం కలగలేదు కానీ శోభన ముఖం మీద పెద్ద గాయమయ్యింది. నుదురుమీద పెద్ద చీలిక నిలువుగా పడింది.

కుట్లు వేశారు డాక్టర్లు. ఎడమ కన్నుమీద కూడా దెబ్బ తగలటంతో కన్ను చిన్నదిగా అయ్యింది. ఆమె దృష్టికేమీ లోపం రాలేదు కానీ ఆమె ముఖం కొద్దిగా అందవిహీనంగా కనిపిస్తుంది.తర్వాత ప్లాస్టిక్ సర్జరీ చేయించి కొంత వరకు సరిదిద్దినా కూడా ఈ రెండు మచ్చలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి.

శోభనకు పెళ్ళిసంబంధాలు చూస్తున్నారు. ఫొటోలో కొంచెం బాగా కనిపించినా ఆమెను దగ్గరగా చూస్తే మాత్రం ఆమె ముఖంలో ఉన్న లోపం కనిపించటంతో నాలుగైదు సంబంధాలు తప్పిపోయాయి.

"పిల్లకు కొంచెం లోపం ఉంది కదా కృష్ణా!కాస్త తక్కువ స్థాయి సంబంధాలు చూడు!లేకపోతే పెళ్ళి కావటం కష్టం!"అంటూ దగ్గర బంధువులు కృష్ణమూర్తికి చెబుతూనే ఉన్నారు.

శోభన ముఖం చూసి పిల్ల నచ్చలేదని చెబుతున్నారు కానీ ఆ అమ్మాయిలో ఉన్న లోపం పరిగణించదగినదా? ఈ ప్రపంచంలో అందం మాత్రమే ఎన్నదగినదా? మనసు, వ్యక్తిత్వం, చదువు, సంస్కారం గురించి ఆలోచించే మనుషులు కరువైపోయారా?

కృష్ణమూర్తి కూతురుకు తమకంటే తక్కువ స్థాయి సంబంధాలు చూడసాగాడు.తమ డబ్బు చూసి, ఇచ్చే కట్నకానుకల కోసం మాత్రమే కూతుర్ని చేసుకుంటామనే వాళ్ళే కనిపిస్తున్నారు. వాళ్ళల్లో ఉండే డబ్బు యావ అతడిని భయపెడుతోంది. అంత లేకిగా ప్రవర్తించేవాళ్లకు పిల్లనివ్వటం అస్సలు ఇష్టం లేదతడికి.

భార్యాభర్తలిద్దరికీ శోభన గురించిన దిగులు పీడిస్తూనే ఉంది. అమ్మాయిని చేసుకునే వాడు ప్రేమను పంచి ఇచ్చి బాధ్యతగా చూసుకునేవాడు కావాలని తండ్రిగా కృష్ణమూర్తి కోరిక.ఆ కోరిక ఎలా తీరుతుంది?

కాలేజీకి వచ్చింది శోభన. కాలేజీ అయ్యాక ప్రిన్సిపాల్ తో లెక్చరర్లకు మీటింగ్ ఉంది. మీటింగ్ హాల్లో అందరూ సమావేశమయ్యారు. ప్రిన్సిపాల్ అందరినీ ఉద్దేశించి "డియర్ ఫ్రెండ్స్!ఈ రోజు మన కాలేజీకి డాక్టర్ సుధామ వచ్చారు. వీరు ఆంగ్ల, తెలుగు సాహిత్యాల్లో డాక్టరేట్స్ చేశారు. అతి చిన్నవయసులోనే రెండు డాక్టరేట్స్ చేసిన మేధావిగా కీర్తి ప్రతిష్టలు సాధించిన సుధామగారు మన కాలేజీలో సేవలందిస్తారు. మన వాళ్ళల్లో ఎవరైనా ఉత్సాహం ఉన్నలెక్చరర్లు ఎమ్. ఫిల్, పి. హెచ్. డి. చెయ్యాలంటే డాక్టర్ సుధామగారి పర్యవేక్షణలో చెయ్యవచ్చు. వీరు మన కాలేజీకి రావటం మన అదృష్టం."అంటూ డాక్టర్ సుధామను ఆహ్వానించింది.

డాక్టర్ సుధామ అందరినీ విష్ చేసి ప్రిన్సిపాల్ కు కృతజ్ఞతలు తెలిపాడు.

సుధామ స్ఫురద్రూపి. నిండైన విగ్రహం. చక్కని నవ్వు. కానీ అతడు నల్లకళ్ళజోడు పెట్టుకొని ఉన్నాడు. చేతిలో అంధులు ఉపయోగించే కర్ర ఉంది. అతడు పుట్టుకతో అంధుడు. వయసు ముప్పై ఉండొచ్చు.

చదువులో ఏకసంధాగ్రాహి అనే పేరు అతడికి ఉంది.

# సాహితి సామ్రాట్ కథలు

'అంత విద్యావంతుడికి అంధత్వమా!విధివిలాసం!'అని అనుకున్నారందరు.

శోభనకు ఎమ్. ఫిల్. చెయ్యాలని ఉంది. యూనివర్సిటీకి వెళ్లకుండా తమ కాలేజీలోనే మార్గదర్శకత్వం లభిస్తుంటే అంతకంటే కావాల్సింది ఏముంది?ఆమె తెలుగు లెక్చరర్. ప్రిన్సిపాల్ దగ్గరికి వెళ్లి తనకు ఎమ్. ఫిల్. చెయ్యాలని ఉందని చెప్పి ఇంటికి వచ్చింది.

సుధామకు తెలుగు భాషలో అపారమైన పాండిత్యం ఉంది. అతడు తెలుగు కావ్యాల గురించి వివరంగా, అర్థమయ్యేట్లు చెప్పగలడు. శోభన అతడి దగ్గర చేరింతర్వాత తను చదివింది చాలా తక్కువ అని ఆమెకు అర్థం అయ్యింది. అందుకని ఖాళీ దొరికితే వెళ్లి సుధామ దగ్గర పాఠాలు చెప్పించుకుంటోంది.

రోజూ సుధామను అతడి అసిస్టెంట్ రమణ తన బైక్ మీద తెచ్చి కాలేజీలో దింపి వెళతాడు. అతడే కాలేజీ అయిపోయే టైముకు మళ్ళీ వచ్చి ఇంటికి తీసికొని వెళతాడు.

ఆ రోజు క్లాసు అయిపోయాక ఖాళీ టైములో శోభన సుధామ దగ్గరికి వెళ్ళింది.

సుధామకు తెలుగు భాషలో అపారమైన పాండిత్యం ఉంది. అతడు తెలుగు కావ్యాల గురించి వివరంగా, అర్థమయ్యేట్లు చెప్పగలడు. శోభన అతడి దగ్గర చేరింతర్వాత తను చదివింది చాలా తక్కువ అని ఆమెకు అర్థం అయ్యింది. అందుకని ఖాళీ దొరికితే వెళ్లి సుధామ దగ్గర పాఠాలు చెప్పించుకుంటోంది.

"రండి శోభనా!నిన్న నేను ఇచ్చిన ప్రబంధకావ్య విశిష్టత గురించి చదివారా?"అడిగాడు సుధామ.

"చదివాను సర్!ఉదాహరణ కావ్యాల గురించి కూడా నోట్స్ వ్రాసి తెచ్చాను "అంది శోభన.

"చాలా సంతోషం!....... ఆ..శోభనా!నేనొక విషయం గమనించాను. చెప్పనా!"

"చెప్పండి సర్!"

"మీ కంఠస్వరం చాలా బాగుంటుంది. కొద్దిగా సంగీతం నేర్చుకొంటే చాలు!మీరు పాటలు పాడొచ్చు!"

ఆ కాంప్లిమెంటుకు ఆనందం వేసింది శోభనకు.

"ఉద్యోగం, చదువూ మింగేస్తున్నాయి. ఇంకా సంగీతానికి తీరికేది సర్ "

"అలా అనకండి!మనకు భగవంతుడు ఇరవైనాలుగు గంటలు ఇచ్చాడు. రోజుకొక అరగంట కేటాయించలేమా?"

"ఆలోచిస్తాను సర్!"అంది శోభన.

సుధామ తన దగ్గరికొచ్చే విద్యార్థులకు సాహిత్యం గురించే కాకుండా సంగీతం గురించి కూడా ప్రోత్సాహం ఇస్తూ ఉంటాడు. చాలా కల్చరల్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తూ ఉంటాడు. అతడు వైలెన్ వాయిద్యం కూడా అద్భుతంగా వాయిస్తాడు. అతడు అవివాహితుడు. అన్నయ్య ఇంజనీరు.అతడిది తల్లి తండ్రి, అన్నా, వదినలు కలిసి ఉండే మంచి కుటుంబం. చదువులో అతడికి చాలా రికార్డ్స్ ఉన్నాయి.ప్రస్తుతం సంస్కృతంలో ఎమ్. ఎ. చేస్తున్నాడు.

మూడు నెలల తర్వాత జరిగిన కల్చరల్ ప్రోగ్రాములో శోభన అన్నమాచార్య కీర్తన ఒకటి పాడింది. రెండోరోజు నోట్స్ చూపించడానికి సుధామ దగ్గరికి వెళ్ళింది.

"సంగీతం నేర్చుకుంటున్నట్లు నాకు చెప్పలేదేం శోభనా!"అన్నాడు సుధామ నవ్వుతూ.

"మీకు సర్ప్రైజ్ ఇద్దామని సర్!"

సాహితి సామ్రాట్ కథలు

# దృష్టి

"నేను రేడియో స్టేషనులో రెగ్యులరుగా వైలెన్ వాయిస్తుంటాను. మీరు కీర్తనలు పాడతానంటే రేడియో స్టేషనులో చెప్తాను!"

"అలాగే సర్!"అంది శోభన ఉత్సాహంగా.

ఒక నెల తర్వాత శోభనకు అరగంట సేపు కీర్తనలు పాడటానికి అవకాశం ఇస్తున్నట్లు, ఆమె ప్రక్కన సుధామ వైలెన్ వాయిస్తున్నట్లు రేడియో స్టేషన్ నుండి కబురొచ్చింది.

"సాధన చెయ్యటానికి మా ఇంటికి వస్తారా శోభనా!"అడిగాడు సుధామ.

"తప్పకుండా సర్!మా నాన్నగారిని తీసికొని వస్తాను!"అంది శోభన సంతోషంగా.

ఈ మధ్య శోభన చాలా ఉత్సాహంగా ఉంటోంది. సంగీతం నేర్చుకోవటం, అప్పుడప్పుడూ సరదాగా కొత్త విషయాల గురించి చెల్లితో, తల్లితో మాట్లాడుతూ ఉండటం, ఏదో తెలియని ఆనందం ఆ అమ్మాయిని కమ్ముకుంటూ ఉంటే ఆమె ముఖంలో వెలుగు కనిపిస్తోంది.

ఈ మధ్య శోభన చాలా ఉత్సాహంగా ఉంటోంది. సంగీతం నేర్చుకోవటం, అప్పుడప్పుడూ సరదాగా కొత్త విషయాల గురించి చెల్లితో, తల్లితో మాట్లాడుతూ ఉండటం, ఏదో తెలియని ఆనందం ఆ అమ్మాయిని కమ్ముకుంటూ ఉంటే ఆమె ముఖంలో వెలుగు కనిపిస్తోంది.

కృష్ణమూర్తి కూతురు కళ్ళల్లో మెరుపును గమనిస్తున్నాడు. దీనికంతటికీ కారణం సుధామ పరిచయం అనికూడా అతడికి తెలుసు.

శోభన సుధామను ఇష్టపడుతోందా? చూస్తూ చూస్తూ ఒక గుడ్డివాడిని..... ఏమనాలో తోచడం లేదతడికి.

శోభన, కృష్ణమూర్తి కలిసి సుధామ ఇంటికి వెళ్లారు. వీళ్ళను సాదరంగా ఆహ్వానించారు సుధామ కుటుంబసభ్యులు.
కాసేపు అవీ ఇవీ మాట్లాడాక "మా అమ్మాయికి సంబంధాలు చూస్తున్నాము. కుదిరితే పెళ్ళి చెయ్యాలని అనుకుంటున్నాము."అన్నాడు కృష్ణమూర్తి.

శోభనను చూశాక ఆ అమ్మాయికి పెళ్ళి ఎందుకు కుదరటంలేదో అర్థం అయ్యింది సుధామ అన్నయ్య శేఖరుకు.
సుధామ, శోభనల సంగీత సాధన అయ్యాక సుధామ కుటుంబ సభ్యులను తమ ఇంటికి ఆహ్వానించి వాళ్ళ దగ్గర సెలవు తీసికొని తమ ఇంటికి వచ్చారు తండ్రీ కూతుళ్లు.

ఆరాత్రి భోజనాలయ్యాక సుధామ గదిలోకి వచ్చాడు శేఖర్.

"శోభన గురించి నీ అభిప్రాయం ఏమిటి?"అన్నాడు మంచం మీద కూర్చుంటూ.

"చాలా తెలివైనది. ఏ విద్య అయినా నేర్చుకునే తపన ఆమెలో ఉంది.చక్కని కంఠస్వరం."

"అంతేనా!"

"అంతకాక ఏముంది? ఆమెను చూశావు కదా!పోనీ నువ్వు చెప్పు!నేను వింటాను!"

"ఆ అమ్మాయిని నువ్వు పెళ్ళి చేసుకుంటే బాగుంటుందని."

"వాళ్ళు చాలా పేదవాళ్ళా?గుడ్డి వాడికి పిల్లనిచ్చేంత దీనత్వంతో బాధపడుతున్నారా?"

"వాళ్ళు మనలాంటి మధ్యతరగతి

# దృష్టి

వాళ్ళే!"

"ఆ అమ్మాయి గురించి ఆలోచించకు!నాకు లేని ఆలోచన, ఆరాటం నీ కెందుకన్నయ్యా?" అసహనంగా అన్నాడు సుధామ.

"నువ్వు మనుషులను చూడలేవు. నీకు ఎవరైనా మాట్లాడితే మాత్రమే తెలుస్తుంది. నేను ఆ అమ్మాయిని చూశాను. నేను ఆ అమ్మాయి కళ్ళల్లో కదిలే భావాన్ని చదవగలను. శోభన నిన్ను ఇష్టపడుతోంది. ఆ విషయం వాళ్ళ నాన్నకు కూడా చూచాయగా తెలుసు."

తల విదిల్చాడు సుధామ.

"అది ప్రేమ కాకపోవచ్చు. కేవలం ఒక గురువు మీద ఉండే అభిమానం కావచ్చు. ఈ కాలం అమ్మాయిలకు గుడ్డివాళ్ళ మీద, కుంటి వాళ్ళ మీద అప్పనంగా ప్రేమ పుట్టుకొస్తుందనుకునే మూర్ఖుడిని కాను...."

"ఈ లోకంలో ప్రేమ అనేదే ఉండదు. కేవలం ఈ ప్రపంచాన్ని తెలివిగలవాళ్ళు మాత్రమే శాసిస్తారని నీ అభిప్రాయం అవునా!"అన్నాడు శేఖర్.

"పెళ్ళి ఒక వ్యాపారమయింది. నువ్వు నాకేమిస్తావు? నేను నీకేమివ్వాలి?.. ఇదే కదా విషయం. ప్రేమ బంధం కంటే సౌకర్యమే చూసుకొంటున్న తరం. తల్లి దండ్రులను వదిలేసే కాలం. అన్నదమ్ములతో గొడవలు పడే బంధుత్వాలు. ఎవరికి వాళ్ళు విడివిడిగా తమకు తాము ప్రపంచాన్ని సృష్టించుకొంటున్న కాలం . ఇక్కడ, ఇప్పుడు మనసును గుర్తించే స్వచ్ఛమైన ప్రేమ దొరుకుతుందా? ప్లాస్టిక్ పూవుల్లో మకరందం ఉంటుందా?"

"ఒక వేళ ఆ అమ్మాయి నిన్ను ఇష్టపడితే నువ్వు కాదంటావా? చెప్పు!"అడిగాడు శేఖర్.

మౌనంగా ఉన్నాడు సుధామ.

"నువ్వు అతిగా ఆలోచించే మేధావివి. నాకు, మీ వదినకూ పెళ్లయినప్పుడు మా పరిచయం కేవలం పదిహేను రోజులు మాత్రమే. మా మధ్య ప్రేమ లేదా? వ్యాపారబంధమే మిగిలి ఉందా? ఇద్దరు పిల్లలు పుట్టాక కూడా మామధ్య ప్రేమ పెరుగుతోందే కానీ తగ్గిపోవటం లేదే!అమ్మా నాన్నల ప్రేమ వయసెంత? మరీ మూర్ఖంగా ఆలోచించకు!ఒకరితో ఒకరికి సాహచర్యంతో సాన్నిహిత్యం ఏర్పడుతుంది. అదే రోజు రోజుకూ పటిష్ఠమై విడిపోలేని ప్రేమ బంధం అవుతుంది.నేను ఆ అమ్మాయి వాళ్ళ నాన్నగారితో మాట్లాడతాను. ఒక వేళ నా ఊహ నిజమయితే మనం ముందుకు వెళదాము!"

"కానీ అన్నయ్యా!... "

"నువ్వేమీ సందేహాలు పెట్టుకోకు!ఆమెకు బలవంతం ఏమీ లేదుగా!ఇష్టం లేకపోతే నిక్కచ్చిగా చెప్తుంది. ఈ కాలం పిల్ల. చదువుకుంది ఉద్యోగం చేస్తుంది. తనకు కాంప్రమైజ్ అవ్వాల్సిన అవసరం ఏమాత్రం లేదు."అన్నాడు శేఖర్.

సుధామ ఆలోంచిస్తున్నాడు.

శేఖర్ తమ్ముడి భుజాలచుట్టూ చేతులు వేసి

"నువ్వు కూడా నాలాగా పెళ్ళి, సంసారం అనే భవ బంధాల్లో చిక్కుకొని గిజగిజలాడుతూ ఉంటే చూడాలని ఉందిరా!నేను ఒక్కడినే ఇద్దరు పిల్లలతో సంసారంలో పడి కొట్టుకుంటూ ఉంటే నువ్వు మాత్రం పుస్తకాలతో , సంగీతంతో ఎంజాయ్ చేస్తూ ఉంటే నాకు కుళ్లుగా ఉండదూ!" అన్నాడు నవ్వుతూ.

ఫక్కున నవ్వాడు సుధామ.

"ఎక్కువ ఆలోచించకు!చూద్దాం!బి పాజిటివ్!గుడ్ నైట్!"అంటూ తన రూములోకి వెళ్ళాడు శేఖర్.

సాహితి సామ్రాట్ కథలు

# దృష్టి

బాల్కనీలోకి వచ్చాడు సుధామ. మాధవీ లత పరిమళం మనసును పరవశింపచేస్తోంది.

అతడు ఆలోచిస్తున్నాడు. చందమామ, నక్షత్రాలు చూడటానికి బాగుంటాయట. చాలా పుస్తకాల్లో చదివాడు. శోభనతో పరిచయం అయ్యాక ఆమెలో ఉన్న చైతన్యం మనసుని ఆకర్షిస్తోంది.

కానీ పుట్టు గుడ్డివాడయిన తనకు చందమామ దొరకదు. అది తనకు బాగా తెలుసు. అన్నయ్యకు ఆరాటం ఎక్కువ. అన్నయ్య ఊహలు నిజం కావు. కలల్లో కల్పనల్లో మునగటం తన స్వభావానికే వ్యతిరేకం.

సాహిత్య, సంగీతాలు మాత్రమే తనకు తోడు నీడ.

మాధవీలతను చేత్తో స్పృశించాడు. చల్లగా, మృదువుగా తగిలింది.

★★

ఆ పై ఆదివారం శోభన ఇంటికి వచ్చాడు సుధామ. అప్పటికి సంగీతం టీచరు సుజాత కూడా అక్కడికి వచ్చి ఉంది.

సుధామ వైలెన్ వాయిస్తూ ఉంటే శోభన పాడుతూ ఉంది.

"టీచర్!మీరు శోభనగారిని సంగీతం పరీక్షలకు ప్రిపేర్ చెయ్యండి!గాత్రంలో డిప్లొమా అవుతుంది. సర్టిఫికెట్ ఉంటే రేడియో స్టేషనులో అవకాశాలు ఎక్కువగా వస్తాయి."టీచరుతో చెప్పాడు సుధామ.

"అవును!నేను కూడా అదే అనుకొంటున్నాను "అంది టీచరు.

"సిలబసులో రెండు వర్ణాలు మాత్రమే ఉన్నాయి. మీరు కనీసం ఏడెనిమిది వర్ణాలు నేర్పించాక కృతులకు వెళ్ళండి!వర్ణాలు కనుక బాగా సాధన అయితే పునాది గట్టిగా ఉంటుంది!"

సుజాత టీచరుకు సంతోషం వేసింది. ఎదురుగ్గా ఉన్నవాడు సంగీతంలో నిష్ణాతుడు.

అక్కడే ఉన్న కృష్ణమూర్తి సుధామ నుద్దేశించి

"మీరు ఇంత విద్యను ఎలా నేర్చుకొన్నారు?"కుతూహలంగా ప్రశ్నించాడు.

"నిజానికి మా లాంటి అంధులకు స్కూళ్లు సరిగ్గా ఉండవు. బోధనా సిబ్బంది కొరత ఎక్కువగా ఉంటుంది. మన దేశంలో ఇప్పటికి ఒకటిన్నర కోటి మంది గుడ్డివాళ్ళు ఉన్నారు. బ్లైండ్ స్కూళ్లు మాత్రం దేశం మొత్తం మీద పాతికలోపే ఉన్నాయి. సగం స్టేట్స్. లో స్కూళ్లే లేవు.
బ్రెయిలీలో ఉండే పుస్తకాలు తక్కువ. నాది శృతపాండిత్యమే. మా అన్నయ్య, నాన్న, ప్రతి పుస్తకం చదివి రికార్డ్స్ చేసి పెట్టేవాళ్ళు. నేను విని గుర్తుపెట్టుకొనేవాణ్ని. తెలుగు పద్య భారతం బ్రెయిలీలో దొరుకుతుందా? నేను రికార్డ్స్ ద్వారా విన్నాను. ప్రతి పద్యమూ, శ్లోకమూ కూడా అన్నయ్య, నాన్న, అమ్మ రికార్డ్ చేసేవాళ్ళు. నా చిన్నప్పటినుండి నా కుటుంబ సభ్యుల సహకారంతో ఈనాడు ఇలా ఉన్నాను.
నాకు లభించిన సహకారం ఎంతమందికి లభిస్తుంది? అందుకే మేము ఒక గ్రూప్ పెట్టుకొని చాలా వరకు పుస్తకాలను రికార్డ్ చేయిస్తూ ఉంటాము. ఆ గ్రూప్ మా నాన్నగారి పర్యవేక్షణలో పనిచేస్తుంది."వివరంగా చెప్పాడు సుధామ.

"అయితే నేను కూడా మీ గ్రూపులో చేరతాను. నాకు కూడా బుక్స్ ఇవ్వండి!రికార్డ్ చేసి పెడతాను!"మనస్ఫూర్తిగా చెప్పాడు కృష్ణమూర్తి.

"చాలా సంతోషం అంకుల్!మీరు కేటాయించే ఈ కొద్ది సమయం మా లాంటి వాళ్లకు వెలుగునిస్తుంది."

నిజానికి అతనితో మాట్లాడుతుంటే

సాహితి సామ్రాట్ కథలు

# దృష్టి

కృష్ణమూర్తికి తెలియని అవ్యక్తమైన ఆత్మీయత మనసులోనుంచి పొంగుకొస్తోంది. తనకే ఇలా ఉంటే చిన్నపిల్ల శోభన సుధామను ఇష్టపడటంలో వింతేముంది?

రేడియో స్టేషనులో శోభన ఒక వర్ణం, రెండు కీర్తనలు మధురంగా గానం చేసింది. ప్రక్కన సుధామ వైలెన్ వాయిస్తుంటే ఆమెలో ఒక నూతనోత్సాహం జలపాతంలాగా ఉరకలు వేస్తున్నట్లుగా ఉంది.

ఆ తరువాత వచ్చిన సోమవారం కృష్ణమూర్తికి ఫోన్ చేసి తను వాళ్ళ ఇంటికి వస్తున్నట్లు చెప్పాడు శేఖర్.

"రండి!రండి!అందరిని తీసికొని రండి!"ఆహ్వానించాడు కృష్ణమూర్తి.

"లేదంకుల్!నేను ఒక్కడినే మీతో మాట్లాడాలి!"

విషయం కొంచెం అర్థం అయింది కృష్ణమూర్తికి. ఆ సమయానికి శోభన కాలేజీలో ఉంటుంది.

శేఖర్ వచ్చాడు.

ఉపోద్ఘాతం ఏమీ లేకుండా సరాసరి విషయానికి వచ్చాడు.

"మీ అమ్మాయి శోభనను మా తమ్ముడికి చేసుకుందామని మా ఇంట్లో ఆలోచిస్తున్నాము. సుధామది జెనటిక్ ప్రాబ్లెమ్. వాడికున్న లోపం వల్ల చదువులో కానీ, ఉద్యోగంలో కానీ వాడు పెద్దగా ఇబ్బంది ఎదుర్కొలేదు. దృష్టి ఉన్న మనుషులకన్నా వాడు చాలా నయం. వాడి ప్రపంచం పుస్తకాలు, సంగీతం. ఆ రెండింటిని ఇష్టపడే అమ్మాయినిచ్చి పెళ్ళి చెయ్యాలని చూస్తున్నాము.

గుడ్డివాడికి మీ అమ్మాయిని అడిగామని మీరు తప్పుగా భావిస్తున్నారా? నాకు శోభన కళ్ళల్లో వాడి పట్ల ప్రేమ కనిపించింది. అది నా ఊహ మాత్రమే అయితే మీరు అమ్మాయితో ఏమీ చెప్పవద్దు!వాడి పట్ల ఉన్నది కేవలం గురుభావమే అయితే విషయాన్ని ఇంతటితో వదిలి వేద్దాము!..... "

"అదేమీ లేదు శేఖర్ గారూ!ఈ మధ్య మా అమ్మాయి చాలా ఉత్సాహంగా ఉంటోంది. దానికి కారణం సుధామతో పెరుగుతున్న స్నేహం. సుధామకు కళ్ళు లేవని తప్ప కుటుంబం, సాంప్రదాయం అంతా నాకు నచ్చింది. కానీ కళ్లు లేని వాడికి భార్యగా తరువాత తరువాత మా అమ్మాయి ఎటువంటి సమస్యలు ఎదుర్కొంటుందో అని భయంగా ఉంది. నేను ఎటూ ఆలోచించలేకపోతున్నాను. అన్నదమ్ముల పట్ల, తల్లితండ్రుల పట్ల బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించే ఎంతో మందిని నేను చూశాను. మిమ్మల్ని చూస్తుంటే శ్రీరామచంద్రుడు ఇలాగే ఉంటాడు అనిపిస్తోంది. మీ వంటి వారి మధ్య మా అమ్మాయి జీవితం భద్రంగా ఉంటుందని నమ్మకం కూడా కలుగుతోంది. మా అమ్మాయికి కన్ను చిన్నగా ఉంటుంది.దృష్టిలోపం లేదు. పిల్లను చూడంగానే అందవిహీనంగా కనిపిస్తోంది... బాధ కలిగించే విషయం ఏమిటంటే ఈ ప్రపంచంలో మనసును చూసే వాళ్ళు తక్కువయ్యారు. "

"మీరు అమ్మాయిని కదిపి చూడండి!ఒక వేళ తనకు ఇష్టం లేకపోతే సుధామ వల్ల అమ్మాయికి కాలేజీలో అమ్మాయి చదువుకు ఎటువంటి సమస్య రాదని నేను హామీ ఇస్తున్నాను. అమ్మాయికి మంచి సంబంధం చూసే విషయంలో నేను కూడా మీకు తోడుగా ఉంటాను. నన్ను మీరు కొడుకుగా భావించండి!" ఇంటికి వెళ్ళటానికి ఉద్యుక్తుడయ్యాడు శేఖర్.

శేఖర్ చేతులు పట్టుకున్నాడు కృష్ణమూర్తి. అతడి కళ్ళల్లో నీళ్లు తిరిగాయి.

"మీ వంటి పుత్రులు ఉన్న మీ తల్లితండ్రులు అదృష్టవంతులు. "అంటూ వరండా దాకా వచ్చి శేఖర్ కు వీడ్కోలు చెప్పాడు.

సాహితి సామ్రాట్ కథలు

# దృష్టి

ఆ పూట అంతా వాళ్ళ గురించి మాట్లాడుకుంటూ ఉన్నారు భార్యాభర్తలిద్దరు.
శ్రావణి మాత్రం సమాధానపడలేక పోతోంది.

"ఎంతయినా మన పిల్లను గతిలేని వాళ్ళలాగా గుడ్డివాడికిచ్చి చేద్దామా!నేను భరించలేను" అంటూ ఏడ్చింది.

"మనం ఒక సారి శోభనను అడిగి చూద్దాము!కష్టనష్టాలు అన్నీ చర్చిద్దాము! "అన్నాడే కానీ అతడి మనసులో కూడా ముల్లు గుచ్చుకున్నట్లుగా ఉంది.

ఆ రాత్రి శ్రావణి, కృష్ణమూర్తి సుధామ శోభన అభిప్రాయం అడిగారు.

"నాకు ఇష్టమే నాన్నా!సంకుచితత్వం లేని మనిషి. మీరు మన ఇల్లు, లక్షల్లో కట్నం ఇస్తే నన్ను ఉద్ధరించినట్లు పెళ్ళి చేసుకుంటామనే వాళ్ళ కంటే సుధామ చాలా బెటరు. అతడిలో ఒక లోపం ఉంది. నాలో ఒక లోపం ఉంది. నేను అందంగా ఉండను. నా మనసు, నాలో ఉన్న టాలెంట్, నా వ్యక్తిత్వాన్ని గుర్తించే మనిషి కబోది ఎలా అవుతాడు నాన్నా!కళ్ళు లేవనే లోపం తప్ప సుధామలో ఇంకో లోపాన్ని వెదకండి!..."

"జీవితమంతా అతడు ప్రక్క మనిషి తోడు లేకుండా గడపలేడు. పిల్లలు పుట్టాక చాలా వరకు భారం నీ మీద పడుతుంది. అప్పుడు నీకు అసంతృప్తి మొదలయితే తట్టుకోగలవా? మీ ఇద్దరి మధ్య ఏదైనా మనస్పర్థలు వస్తే పరిష్కారం ఎలా అనే దిశగా కూడా ఆలోచించాలి. పెళ్ళి అంటే జీవితాంతం కలిసి బాధ్యతలు నిర్వహించటం."

తండ్రి మాటలకు బదులివ్వలేదు. వేలితో పక్క మీద గీతలు గీస్తూ ఉంది శోభన.

"ఇంత బతుకు బ్రతికి పిల్లను గుడ్డివాడికిచ్చి చేశామంటే అందరిలో ఎంత పరువు తక్కువ!బంధువుల్లో తల ఎత్తుకొని తిరగగలమా? ఆలోచించు!నా కయితే అస్సలు ఇష్టం లేదు. మొన్న ఒక సంబంధం వచ్చింది!చూడు!ఏభై లక్షలు కట్నం అడిగారు. ఇచ్చి చేస్తాం. పిల్ల వాడు బాగానే ఉన్నాడు. ఇంజనీరు.ఈ రెండిళ్ళఆస్తి మేము కట్టుకుపోతామా!నీకు, చిన్నదానికే కదా!

అది ఇప్పుడే ఇస్తాము!మరీ ముష్టివాళ్ళలాగా గుడ్డివాడిని చేసుకొనే ఖర్మ నీకేంటి?కట్నం భారీగా ఇస్తే నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాడు. మేము కూడా నీ పక్కనే ఉంటాము!"అంటూ అసంతృప్తిని వెళ్ళగక్కింది శ్రావణి.

తల్లి మాటలకు దిగులుగా చూసింది శోభన.

"ఎంతకని డబ్బు పెడతారు? నన్ను, నా వ్యక్తిత్వాన్ని చూడని మనిషిని చేసుకొని ఏం సుఖపడతాను? నాక్కూడా నన్ను ప్రేమించే భర్త కావాలని ఉంటుందమ్మా!"

కూతురి తల నిమిరాడు కృష్ణమూర్తి.

"ఖర్మ ఎదురయితే కాట్లోకి పొయ్యే కాలం వచ్చిందట!అలా వుంది మన జాతకం!"తల కొట్టుకుంది శ్రావణి.

నిస్సహాయంగా తండ్రివైపు చూసింది శోభన.

"నువ్వు చిన్నపిల్లవు కాదు!మళ్ళీ ఆలోచించు!మేము నీ క్షేమం గురించి ఆందోళనపడుతున్నాము తల్లీ!"అంటూ కూతురును దగ్గర తీసికొని ఆమె నుదురు చుంబించాడు కృష్ణమూర్తి.

ఆ రాత్రి భర్తను పట్టుకొని ఏడుస్తూనే వుంది శ్రావణి.

రెండుమూడు రోజులు వాదించి

సాహితి సామ్రాట్ కథలు

# దృష్టి

తల్లిని ఒప్పించింది శోభన. కృష్ణమూర్తి సుధామతో కూతురు జీవితం గురించి దిగులుపడినా అతడి వ్యక్తిత్వం తెల్సుకొని తన సంసిద్ధతను వ్యక్తం చేసాడు.

శోభన, సుధామ బిర్లా మందిర్ దగ్గర కూర్చున్నారు. వాళ్లిద్దరినీ మాట్లాడుకోమని బయటకు పంపించారు పెద్దవాళ్ళు.

"నన్ను ఎందుకు పెళ్ళి చేసుకోవలనుకుంటున్నారు శోభనా!"అడిగాడు సుధామ.

అతడు అలా అడిగేసరికి కొంచెం సహజసిద్ధంగా ఆడపిల్లకు కలిగే సిగ్గు కలిగింది శోభనకు. ఆమె ఏమీ మాట్లాడలేదు.

"మీరు మాట్లాడితేనే నాకు తెలుస్తుంది. లేక పోతే ఎలా తెలుసుకోగలను?"మృదువుగా నవ్వుతూ పలికాడు సుధామ.

అప్పుడు గుర్తొచ్చింది శోభనకు. తను సిగ్గు పడితే అతడికి తెలియదు.

"మీకు నా శరీరం కనిపించదు. నాకు చిన్నప్పుడు జరిగిన యాక్సిడెంటులో ముఖం మీద పెద్ద గాయం అయ్యింది. ఎడమ కన్ను కాస్త చిన్నగా కనిపిస్తుంది. నాకున్న చదువుకూ, ఉద్యోగానికి అదేమీ పెద్ద లోపం కాదు. కానీ దాన్నే పెద్ద లోపంగా చూస్తూ, నన్ను కించపరుస్తూ, కట్న కానుకలతో నన్ను తూకం వేస్తూ జరిగే ఈ పెళ్ళి సంబంధాల వరస నాకు పరమ అసహ్యాన్ని కలగచేస్తోంది. మా నాన్న నాకు కట్నంగా లక్షలు లక్షలు దోచి పెడితే, అంతంత మాత్రం చదువుకొన్న వాడు నాకు దొరుకుతాడు. అటువంటి వాడిని చేసుకొని నేను ఎంత మాత్రం సుఖపడతానో దేవుడికే తెలియాలి. మీకు నాకున్న లోపం కంటే ఎక్కువ లోపం వుంది.

నాకు నచ్చిన చదువు మీకు వుంది. నన్ను గుర్తించి , నాలో ఉన్న కళను ప్రోత్సాహించే మనసు ఉంది. ఎంత మంది భర్తలు తమ భార్యలను కళాకారులుగా తీర్చి దిద్దుతారు? కేవలం బాహ్యసౌందర్యాన్ని చూసే దృష్టి ఉన్నవాళ్ళ కంటే మీరు నాకు ప్రత్యేకంగా కనిపించారు...... ఇంత కంటే నేను చెప్పలేను..."

ఆమె కంఠం వణికింది.

ఇంక ఎక్కువ చెప్పాల్సిన అవసరం లేదు. అతడు చెయ్యి చాచాడు. ఆమె మెల్లగా అతడి చేతిలో చెయ్యి వేసింది.

అతడు ఆమె చేతిని భద్రంగా పట్టుకొని తన పెదవులకు తాకించి ముద్దు పెట్టుకున్నాడు.

ఒక విద్యుత్తరంగం తన తనువులోకి ప్రవహించినట్లనిపించింది శోభనకు.

ఆమె జీవితానికి శుభారంభం పలుకుతున్నట్లు గుడిలో గంటల నెవరో మోగించారు.

సమాప్తం.

సాహితి
సామ్రాట్
కథలు

# ఆత్మస్థైర్యం

ఈ నెల
కథ

## రెండవ బహుమతి పొందిన కథ



పద్మావతి దివాకర్ల

భోజనం చేసి రాత్రి పదిన్నరకి నిద్రపోవడానికి ఉపక్రమిస్తున్న మూర్తి ఎవరో తలుపులు దబదబా బాదడంతో ఉలిక్కిపడి మంచం మీద నుండి లేచాడు, ‘ఇంత రాత్రివేళ వచ్చినది ఎవరై ఉంటారబ్బా!’ అనుకొని. లక్షణంగా కాలింగ్‌బెల్ ఉన్నా తలుపులు అలా బాదడంవల్ల అతని మనసు ఏదో కీడు శంకించింది. అప్పుడే నిద్రలోకి జారుతున్న పార్వతి ఆ శబ్దానికి లేచి కూర్చొని, “చూడండి! వేళకాని వేళ ఎవరొచ్చారో? ఎవరికి ఏ అవసరం వచ్చిందో పాపం!” అంది.

సాహితి సామ్రాట్ కథలు

# ఆత్మస్థైర్యం

మూర్తి హాల్లో లైట్ వేసి తలుపు తెరిచాడు 'ఎవరు ఈ సమయంలో వచ్చుంటారా!' అని బయటకి చూస్తూ. ఎదురుగా స్నేహితుడు మాధవ్ నిలబడి ఉండటం కనిపించింది. అతను ఆ వీధిలోనే రెండిళ్ళ అవతల ఉంటాడు. అతని వళ్ళంతా చెమటలు పట్టిఉంది. మనిషి కొద్దిగా వణుకుతున్నాడు.

స్నేహితుణ్ణి అలా చూడగానే కంగారుపడ్డాడు మూర్తి.

"ఏమైంది మాధవ్! ఏమిటి అలా ఉన్నావు? ఒంట్లో బాగుంది కదా! ఇంట్లో అందరూ బాగున్నారు కదా!" అందోళనగా అడిగాడు మూర్తి.

మూర్తి మాటలేమీ పట్టించుకోకుండా, "మూర్తీ! ఇది విన్నావా? మన రాఘవ కొడుకు పోయాడు, ఇప్పుడే ఫోన్ చేసి చెప్పాడు. వాడలా ఫోన్ చేసి చెప్పగానే, నా కాళ్ళూ చేతులూ ఆడలేదురా! ఏం చెయ్యాలో తోచక ఉన్నఫలాన నీ దగ్గరకు వచ్చాను." అన్నాడు. వాడి గొంతులో సన్నని వణుకు! ఆ వార్త విన్న మూర్తికి ఒక్క క్షణం నోట మాట రాలేదు. ఏం మాట్లాడాలో వెంటనే అర్థం కాలేదు. "మూర్తీ! వింటున్నావా నేను చెప్పిన మాట! పాపం ఇంట్లో వాడొక్కడే ఉన్నాడు, ఎవరూ తోడు లేరు." రెట్టించాడు మాధవ్.

ఈలోకంలోకి వచ్చాడు మూర్తి. "ఆc...! ఎలా జరిగింది?" మూర్తి గొంతులో తడి.

"ఏమో నాకూ తెలియదు. విషయం తెలియగానే ఏం చెయ్యాలో తోచక వెంటనే నీ దగ్గరకు వచ్చాను. పద! వెళ్దాం. పాపం రాఘవ పరిస్థితి ఏమిటో?" మధవ్ గొంతులో విచారం, దుఃఖం ధ్వనించాయి. "అలాగే! ఉండు, ఒక్క క్షణం బట్టలు మార్చుకొని వస్తాను." అని ఇంట్లోకి వెళ్ళి భార్య పార్వతికి విషయం టూకీగా చెప్పాడు.

"అయ్యో! పాపం, వెళ్ళిరండి." అందామె కూడా జరిగినదానికి బాధపడుతూ. మూర్తి బట్టలు మార్చుకొని హాల్లోకి వచ్చేసరికి అప్పటివరకూ సోఫాలో కూలబడిన మాధవ్ లేచి నిలబడ్డాడు.

రాఘవ, మూర్తి, మాధవ్ ముగ్గురూ స్నేహితులు. చిన్ననాటి స్నేహబంధం వాళ్ళ ముగ్గురిదీ. ఒకే స్కూల్లో, కాలేజీలో చదివిన తర్వాత ముగ్గురి దారులూ వేరైనా, ఉద్యోగ విరమణ తర్వాత మళ్ళీ ఒకే చోట కలిసారు, ఒకే కాలనీలో ఇళ్ళు కట్టుకున్నారు. రాఘవ భార్య గతించి చాలా సంవత్సరాలైంది.

రాఘవకు ఒకే ఒక కొడుకు ఉన్నాడు, పేరు సాత్విక్. చిన్నప్పటి నుండి మందకొడిగా ఉంటే ఏమో అనుకున్నారు, కాని ఆ తర్వాత మానసిక వికలాంగుడిగా తేలాడు. పాపం రాఘవ, అతని భార్య ఎంత మంది డాక్టర్లకో చూపించారు, కానీ ఫలితమేమీ కనపడలేదు. ఎన్ని మందులు వాడినా ఫలితం శూన్యం. రోజు రోజుకీ పరిస్థితి క్షీణించిందేకానీ, మెరుగుపడలేదు. కొడుకు చికిత్స కోసం చాలా డబ్బులు ఖర్చు పెట్టి, అప్పులపాలైయ్యాడు కూడా రాఘవ. అతని భార్య కమల అయితే మొక్కని మొక్కు లేదు, ఎక్కని గుడీ లేదు. నమ్మిన బాబాలవల్ల కూడా పెద్దగా ప్రయోజనం కూడా ఏమీ కలగలేదు.

అంతకంతకీ సాత్విక్ మానసిక పరిస్థితి దిగజారడంతో ఆమె కొడుకు కోసం బెంగపెట్టుకొని మంచమెక్కింది. అటు భార్య, ఇటు కొడుకు...ఇద్దరికీ సేవలు చేస్తూ రాఘవ పూర్తిగా నలిగిపోయాడు. చాలా ఇబ్బంది పడ్డాడు. కొడుకు భవిష్యత్తు మీద బెంగతోనే ఆమె దేహం చాలించింది, ఆ బాధ్యతను పూర్తిగా రాఘవ పైన పెట్టి. అటు ఉద్యోగ నిర్వహణలో సతమతమవుతూనే కొడుకు ఆలనా పాలనా చూసుకునేవాడు. ముందు కొడుకుని చూడటానికి ఓ ఆయాని నియమించాడు. రాను రాను వ్యాధి ముదిరిపోవడంతో చెయ్యలేక ఆమె పని మానేసింది. ఆ తర్వాత కూడా కొడుకు వైద్యం కోసం చాలా చోట్ల తిరిగాడు, ఏం చేసినా మానసిక వైకల్యం పెరిగిందే కానీ ఏ మాత్రం

సాహితి సామ్రాట్ కథలు

# ఆత్మస్థైర్యం

> వృధ్ధాప్యంలో ఆసరాగా ఉంటాడనుకున్న కొడుకు అలాంటి స్థితిలో ఉంటే ఏ తండ్రికైనా ఎలా ఉంటుందో స్నేహితులిద్దరికీ బాగా తెలుసు. ఇప్పుడు ఎలాగోలా బతికి ఉన్నాడనుకున్న వాడు కూడా రాఘవను వంటరివాణ్ణి చేసి పోయాడు.

తగ్గలేదు. చిన్నపిల్లాడికి వలే అన్నీ తానే చెయ్యవలసి వచ్చేది పాపం రాఘవకి. తిండి తినిపించడం నుండి అన్ని పనులు తానే చెయ్యవలసి వచ్చేది. రాఘవకి దగ్గర బంధువులంటూ పెద్దగా ఎవరూ లేరు. ఉన్న దూరపు బంధువులు కూడా రాఘవ కొడుకు మానసిక పరిస్థితికి జడిసి ఇంటికి రావడం మానేసారు. ఆ విధంగా విధితో ఒంటరి పోరాటం చేస్తూ జీవితాన్ని లాక్కొస్తున్న రాఘవకి, అప్పుడే ఉద్యోగ విరమణ చేసి ఆ కాలనీలోనే స్థిరపడ్డ మూర్తి, మాధవ్‌ల అండ కొద్దిగా లభించింది. అయితే వాళ్ళు కూడా స్నేహితుడి పరిస్థితికి సానుభూతి చూపడం తప్పించి, మరే విధంగా పెద్దగా సహాయ పడలేకపోయేవారు. అలాంటి పరిస్థితి పగవారికి కూడా రాకూడదని అనుకునేవారు.

వృధ్ధాప్యంలో ఆసరాగా ఉంటాడనుకున్న కొడుకు అలాంటి స్థితిలో ఉంటే ఏ తండ్రికైనా ఎలా ఉంటుందో స్నేహితులిద్దరికీ బాగా తెలుసు. ఇప్పుడు ఎలాగోలా బతికి ఉన్నాడనుకున్న వాడు కూడా రాఘవను వంటరివాణ్ణి చేసి పోయాడు.

ఆ కాలనీలోనే వెనుక వీధిలో ఉన్న రాఘవ ఇంటికి వెళ్తున్న ఇద్దరి స్నేహితుల్లోనూ ఆలోచనల అలజడిలే! ఇప్పుడు కొడుకు పోయిన దుఃఖంలో ఉన్న రాఘవని ఊరడించడం ఎలా అన్నదే ఇద్దరి ప్రధాన సమస్య.

ఇద్దరూ రాఘవ ఇంటికి చేరేసరికి అక్కడి వాతావరణం చాలా గంభీరంగా ఉంది. కింద నేలపై కూలబడి శూన్యంలోకి చూస్తున్న రాఘవ వద్దకు వెళ్ళారిద్దరూ. ఏడిచి ఏడిచి కళ్ళల్లో నీళ్ళు ఆవిరి అయిపోయాయో ఏమో మరి రాఘవ కళ్ళు నిశ్చలంగా ఉన్నాయి. పక్కనే మంచం పై మీద సాత్విక్ నిర్జీవంగా పడి ఉన్నాడు. రాఘవని ఆ పరిస్థితిలో చూసేసరికి ఇద్దరికీ కన్నీళ్ళు ఆగాయి కావు. 'పాపం రాఘవకి ఇదో పెద్ద షాక్! ఎలా తట్టుకుంటాడో ఏమో?' అని బాధపడ్డాడు మూర్తి.

అలా నిశ్చలంగా ఉలుకూ పలుకూ లేకుండా శూన్యంలో దృష్టి నిలిపిన రాఘవని చూసేసరికి మాధవ్‌కి భయం వేసింది.

రాఘవకి మతిగాని చలించలేదు కదా అని అనుకున్నాడో క్షణం. నిజమే మరి! అసలే భార్య పోయిన దిగులులో ఉన్న వాడికి ఎలాగోలా బతికి ఉన్నాడనుకొన్న కొడుకు కూడా ఇప్పుడు విగతజీవుడై పూర్తిగా వంటరివాడైతే ఎవరికైనా ఎలా ఉంటుంది మరి! అంతటి శిక్ష పగవాళ్ళకి కూడా కలగ కూడదని మనసులోనే అనుకున్నాడు. ఇప్పుడు చూస్తూంటే రాఘవకి నిజంగానే మతి చలించిందేమోనని భయం వేసింది స్నేహితులిద్దరికీ. "రాఘవా...రాఘవా...!" మూర్తి అదుర్దాగా రాఘవ భుజాలు పట్టి ఊపాడు. పక్కనే నిలబడ్డ మాధవ్ పరిస్థితీ అలాగే ఉంది. స్నేహితుడ్ని అలా చూసేసరికి మాధవ్‌కి కూడా కన్నీళ్ళు ఆగలేదు. రాఘవ తలతిప్పి నిశ్చలంగా మూర్తివైపు చూసాడు. అతని కళ్ళలో ఏదో తెలియని ప్రశాంతత గోచరించింది మూర్తికి. మొహంలో ఏ భావం లేదు. అక్కుణుంచి రాఘవని లేవనెత్తి సోఫాలో కూర్చోబెట్టారు మూర్తి, మాధవ్‌లు. చాలా సేపు తర్వాత నోరు తెరిచాడు రాఘవ, "వెళ్ళిపోయాడ్రా వాడు! ఇక మరి వాడికి నేను సేవలు చేయవలసిన అవసరం లేదు. ఇక నాకంతా విశ్రాంతే విశ్రాంతి! ఇక నేను ఎవరి కోసం బ్రతకాలి? కమలేమో ముందే వెళ్ళిపోయింది. ఇప్పుడు వాడు కూడా తన దారి తను

**సాహితి సామ్రాట్ కథలు**

# ఆత్మస్థైర్యం

చూసుకున్నాడు!" అంటూ రెండు కన్నీటి బొట్లు రాల్చి చేతులతో మొహం కప్పుకున్నాడు. రాఘవ్‌ని ఓదార్చడం వాళ్ళిద్దరితరం కాలేదు. అతని దుఃఖం తీరేంతవరకూ అలాగే వదిలేసారు.

ఆ రాత్రంతా రాఘవకి తోడుగా ఉన్నారు మూర్తి, మాధవ్‌లు. ఊరడిస్తూ ఏవో మాటలు చెప్తూనే ఉన్నారు వాళ్ళిద్దరూ రాత్రంతా, రాఘవని ఒంటరిగా విడిచిపెడితే ఏమైపోతాడో అన్న భయంతో. తెల్లారిన తర్వాత ఆ వార్త తెలిసి ఊళ్ళోనే ఉన్న మిగతా స్నేహితులు, తెలిసినవాళ్ళూ వచ్చారు. రాఘవవైపు సానుభూతితో చూస్తూ పరామర్శిస్తున్నారు. రాఘవ అందరి మాటలు మౌనంగా వింటున్నాడు. జరగవలసిన కార్యక్రమాలన్నీ యధావిధిగా జరిగాయి.

కొడుకు అంత్యక్రియలు పూర్తయ్యాక రాఘవని ఎలా ఆ ఇంట్లో ఒంటరిగా వదలాలా అని ఆలోచించసాగాడు మూర్తి. మాధవ్‌ని అడిగితే, "వాడొక్కడ్నీ వదిలేస్తే ఇంకా ఢీలా పడిపోతాడు. కొన్నాళ్ళ పాటు మనమేనా వాడినంటిపెట్టుకొని వాడింట్లో ఉండాలి, లేదా మనిద్దరిలో ఎవరైనా మనింటికి తెచ్చి కనిపెట్టుకోవాలి." అన్నాడు.

కొద్దిసేపు ఆలోచించి, "సరే! ఇవాళ నువ్వు రాఘవ ఇంట్లో ఉండు. రేపు ఊళ్ళోనే ఉన్న మా అమ్మాయిని ఇంటికి వచ్చి మా ఆవిడకి తోడు ఉండమంటాను. రేపటినుండి నేను రాఘవకి తోడు ఉంటానులే!" అన్నాడు మూర్తి. మాధవ్ అందుకు ఒప్పుకున్నాక, రాఘవకి చెప్పి మూర్తి తన ఇంటికి తిరిగివచ్చాడు.

ఇలా వంతులు వేసుకొని ఓ పది రోజులు మూర్తి, మాధవ్‌లు రాఘవకి తోడుగా ఉండి ధైర్యం చెప్తూనే ఉన్నారు. పదకొండో రోజు మాధవ్ రాఘవ ఇంట్లో ఉన్నప్పుడు, అర్ధరాత్రి మూర్తికి ఫోన్ వస్తే ఎత్తాడు.

"ఒరే, మూర్తీ! ఘోరం జరిగిపోయిందిరా! ఇప్పటి వరకూ బాగానే ఉన్న రాఘవ మాటాపలుకు లేదు. త్వరగా రా, నాకెందుకో భయంగా ఉంది!..." కంగారుగా ఇంకా ఏదో మాట్లాడుతున్న మాటలు మరి వినిపించలేదు మూర్తికి. వెంటనే భార్య పార్వతికి విషయం చెప్పి బట్టలైనా మార్చుకోకుండా బయటకు దారితీసాడు.

వెళ్ళేముందు తమ ఫ్యామిలీ డాక్టర్ విశ్వంకి ఫోన్ చేసి నేరుగా అక్కడికి రమ్మని అర్థించాడు.

పరుగుపరుగున రాఘవ ఇంటికి చేరుకున్న మూర్తికి గుమ్మంలోనే ఎదురయ్యాడు మాధవ్. ఇంట్లోకి వెళ్ళి రాఘవని చూస్తూనే అతను చనిపోయాడన్న సంగతి గ్రహించాడు మూర్తి డాక్టరు అవసరం లేకుండానే. నిర్జీవమైన రాఘవ మొహంలో అదే ప్రశంతత కొట్టొచ్చినట్లు కనిపించింది. దీర్ఘంగా నిట్టూరుస్తూ మాధవ్ భుజంపై చెయ్యి వేసాడు. మరో అయిదు నిమిషాల్లో అక్కడికి చేరుకున్న డాక్టర్ విశ్వం కూడా రాఘవ మరిణించాడన్న విషయం దృవీకరించాడు. మిత్రుడ్ని పోగొట్టుకున్న స్నేహితులిద్దరూ దుఃఖంతో ఒకరిమొహాలొకరు చూసుకున్నారు. ఇద్దరి కళ్ళల్లోనూ నీరు నిండింది. వారం తర్వాత మూర్తికి డాక్టర్ విశ్వం నుండి ఓ నిజం తెలిసి నివ్వెరపోయాడు. అయిదేళ్ళ నుండి రాఘవ క్యాన్సర్‌తో బాధపడుతున్న విషయం మూర్తికి అప్పుడే తెలిసింది. అదో పెద్ద షాకింగ్ వార్త మూర్తికి! తమకి తెలియకుండా రాఘవ ఆ విషయం ఇన్నాళ్ళూ ఎలా దాచగలిగాడో బోధపడలేదు.

"క్యాన్సర్ ఫైనల్ స్టేజిలో ఉన్న రాఘవ నా వద్దకు వస్తే, అతన్ని నాకు తెలిసిన స్పెషలిస్ట్ డాక్టర్ ఆనంద్ వద్దకు ట్రీట్‌మెంట్ కోసం పంపాను. ఏడాదికి మించి బతకడనుకున్న మనిషి, అయిదేళ్ళ

సాహితి సామ్రాట్ కథలు

# ఆత్మస్థైర్యం

బతకడం చాలా ఆశ్చర్యంగా ఉంది! డాక్టర్ ఆనంద్ కూడా ఇన్నాళ్ళు అతను బతుకుతాడనికి అనుకోలేదు." అన్న డాక్టర్ విశ్వంని ఆశ్చర్యంగా చూసాడు మూర్తి. అదే విషయాన్ని మాధవ్‌తో ప్రస్తావిస్తే, ఓ క్షణం ఆగి, "రాఘవ ఎప్పుడూ ఓ విషయం అనేవాడు గుర్తుందా నీకు. తనే గనుక ముందు పోతే, ఆ తర్వాత తన పై పూర్తిగా ఆధారపడిన కొడకుకెవరు దిక్కు అని ఎప్పుడూ మధన పడేవాడు. ఆ అవసరం కలగకుండా ఎప్పుడైతే సాత్విక్ తనకన్నా ముందే పోయాడో, అప్పుడే వాడి కి తన సమస్యకి పరిష్కారం దొరికిపోయింది.

పూర్తిగా ఏడాది కూడా ఆయుష్షు లేనివాడు, ఆ బెంగతోనే క్యాన్సర్‌తో యుద్ధం చేస్తూ అయిదేళ్ళు జీవితం లాగించాడు. విల్ పవర్ వాడి ఆయుష్షని పెంచింది.

అప్పటివరకూ కబళించాలని వచ్చిన క్యాన్సర్ కూడా వాడి ఆత్మస్థైర్యం ముందు ఓడిపోయింది. కొడుకు పోయిన క్షణానే వాడి ఓటమి ఆరంభమైంది! వాడి బాధ్యత కూడా పూర్తిగా తీరిపోయింది! వాడికున్న ఒకేఒక బంధం కూడా తెగిపోయి, ప్రశాంతంగా ఈ లోకాన్ని వదిలిపెట్టి వెళ్ళిపోయాడు. వాడి ఆత్మకి శాంతి కలుగగాక!" అన్నాడు దీర్ఘంగా నిట్టూరుస్తూ.

మాధవ్ చెప్పిన మాటలు అర్థమైన మూర్తి రాఘవని తల్చుకొని, 'ఓం శాంతి!' అనుకున్నాడు మనసులో కళ్ళు చెమర్చగా.

సమాప్తం

## శరీరం పైన భావోద్వేగాల ప్రభావం



బహుమతి
పొందిన
ఫ్యామిలీ
సీరియల్

# మమతల తరంగాలు





పాండ్రంకి సుబ్రమణి

ఆరోజు శుక్రవారం.చంద్రవతమ్మ కూతుర్నీ మనవరాళ్ళనూ చూసి పోవడానికి వచ్చింది.నలుగురు మనవరాళ్ళకూ పెన్సిల్లూ పేనాలు తెల్లనోటు పుస్తకాలూ యిచ్చి,వచ్చేది దసరా పండగని అల్లుడికి రెడీ మేడ్ షర్టూ రెడీ మేడ్ ప్యాంటూ యివ్వమని కూతురుకి యిచ్చింది.

భార్య అందజూపిన కొత్త దుస్తుల్న చూసి పూర్ణచందర్ ప్రసన్నుడు కాలేదు సరికదా——ఆగ్రహోదగ్రుడయ్యాడు.

“సమయం చూసి,దుర్ముహూర్తాన గురిపెట్టి నన్ను మీయింట్లోవాళ్ళందరూ జతచేరి కౌకుదెబ్బ తీయడానికి పూనుకు న్నారన్న మాట

బహుమతి
పొందిన
ఫ్యామిలీ
సీరియల్

# మమతల తరంగాలు

**జరిగిన కథ**
శారద ,పూర్ణ చందర్ దంపతులు. శారదకు నాలుగు కాన్పుల్లో కూడా ఆడపిల్లలే పుట్టటం తో అత్త బద్రమ్మ సూటిపోటి మాటలతో ఇబ్బంది పెడుతూ ఉంటుంది . శారద తల్లి చంద్రావతి మనుమరాళ్ళను చూడటానికి వస్తే ఆమెను కూడా నానా రకాల మాటలతో ఇబ్బంది పెడుతుంది . శారద సహనం కలది కాబట్టి ఏ గొడవలు లేకుండా కాపురం నెట్టుకొస్తోంది
**ఇక చదవండి**

--నీకు నిజంగా నాపైన గౌరవ భావం గాని ఉంటే,తిన్నగా యిప్పటికిప్పుడే–నువ్వు ఈయింటి కోడలవన్న వాస్తవాన్ని మరచిపోకుండా వెళ్ళి చదువుల రాయడు,మీసాల రాయడు మీ అన్నయ్య ముఖాన పడేసిరా!ఐసే క్విక్!“శారద బిత్తరపోయి నిల్చుంది.

చెప్పుకోతగ్గ దగ్గరితనం లేని మాట వాస్తవమైనా,బావమరదులిద్దరి మధ్యా అంతటి అగాధం ఉంటుందని ఆమెప్పుడూ ఊహించలేదు.భర్తకు వాటిల్లిన యిప్పటి పరిస్థితికి తమ కుటుంబానికి యేర్పడ్డ దుస్థితికి అన్నయ్యేమి చేసాడు? తోడబుట్టిన చెల్లి భర్తను అతడెందుకు కించపరుస్తాడు? పూర్ణ చందర్ దేనినో ఊహించుకుంటూ మరేదో భావించుకుంటూ అలా ఆక్రోశంతో ప్రవర్తిస్తున్నాడని గ్రహించింది శారద.

చెప్పుడు మాటలు వినడం మానుకోకపోతే ఇంకెన్ని అవాంఛిత పర్యావసానాలు యెదురవబోతున్నాయో కుటుంబానికి!అటువంటి ఉద్రిక్త వాతావరణంలో అతడితో వాదోపవాదాలకు దిగే సమయం అది కాదని ముఖ్యంగా అతను వినే మానసిక స్థితిలో లేదని తెలుసుకున్న శారద నిదానం కోల్పోకుండా గొంతున యెటువంటి ఉద్వేగమూ ఉద్రిక్తతా కనబర్చకుండా అంది “మరి అన్నయ్య నాకూ పిల్లలకు కూడా కొత్త దుస్తులు పంపించాడు. తీసుకునే దండీ!” పూర్ణ చందర్ యేమీ అనలేదు.ఓసారి శారద ముఖంలోకి చూసి–“అందరికీ పనిగట్టుకుని బట్టలు పంపించిన మీ అన్నయ్య అమ్మకు మాత్రం రిక్తహస్తాలు చూపించాడు. అంతేకదూ!” అని అదోలా ముఖం పెట్టి అక్కణ్ణించి కదలబోయాడు.

అప్పుడామె ఆపింది.

“కాదండీ!అత్తయ్యకు కూడా ఉప్పాడ చీర పంపించాడండీ!“ఆ బదులు విన్నంతనే పూర్ణచందర్ అక్కణ్ణించి సర్రున కదలి వెళ్ళిపోయాడు,నోట మాట అందక-- అలా వడివడిగా నడచి వెళ్ళిపోతూన్న భర్తను కొన్ని క్షణాల పాటు చూస్తూండిపోయి లోపల జరిగిందేమీ తల్లికి చెప్పకుండా–కాఫీ కప్పు చేతికందిచ్చి “గుడ్డలన్నీ బీరువాలో పెట్టి వస్తానమ్మా!” అంటూ వాటిని బీరువాలో సర్ది పెట్టింది;

సూర్య వివేక్ బామ్మర్ది కోసం పంపించిన జత రెడీ మేడ్ దుస్తులతో సహా--ఏదో ఇగో క్లేష్ కోసం బెట్టు చూపిస్తున్నాడు గాని,వాస్తవానికి భర్తకు తొడుక్కోవటానికి కుదురైన దుస్తులు లేవన్నది ఆమెకు తెలుసు.ప్రతినెలా ప్రతి పండక్కీ కాకపోయినా-- అడపాదడపా బట్టలు కొని కుట్టిస్తేనే కదా బీరువాలో ఉండటానికి—— అలా లోలోన అనుకుంటుందే గాని పైకి చెప్పదు శారద. అలాగ్గాని చెప్తే యింటి పరిస్థతి అగ్గిగుగ్గిలమయిపోదూ!

బహుమతి
పొందిన
ఫ్యామిలీ
సీరియల్

# మమతల తరంగాలు

ఆరోజు అంబగుడిలో పుష్ప యాగం.శారద నలుగురు కూతుళ్ళనూ తీసుకువెళ్ళి పుష్ప యాగానికున్న విశిష్టత గురించి, ఈ యాగాన్ని నిర్వహించేవారికి,దానిని తిలకించేవారికి ప్రాప్తమయే పుణ్యఫలం గురించీ వివరించి చెప్పింది.తను చెప్పిందంతా పిల్లలు నలుగురికీ పూర్తిగా అర్థమయి ఉండదని ఆమెకు తెలుసు. కాని యిటువంటి విషయాలలో ఆమెకంటూ ఒక బలమైన ఆధ్యాత్మిక ఆచరణీయ దృక్పథం ఉంది.మంచి విషయాలు మంచి ఆచారాలు చిన్నపిల్లల మనసులోకి ఒక్కసారిగా గుండూసూది లా జొప్పించడం సాధ్యం కాదు.

మొదట వాళ్ళకు అటువంటి విషయాల పట్ల ఆసక్తి కలిగించాలి,అవి పదే పదే వినేలా చేయాలి.ఆ తరవాత వాటిలో యిష్టాపూర్వకంగా పాల్గొనే అలవాటుగా మార్చాలి.అలా చేయడం చెప్పేటంత తేలిక కాదు. క్రమ క్రమంగా లేత మనసులకి పట్టించడం పూర్తిగా కాకపోయినా చాలావరకు వీలవుతుంది.ఆ రీతిన ఆమె కూతుళ్ళకు,ముఖ్యంగా యెదిగొచ్చిన ప్రీతికీ మాన్వితకీ పోతనా మాత్యుడి భాగవతం లోని ఉదంతాలను కూడా రాత్రిపూట భోజనాలు అయింతర్వాత ఒకరి కొకరు సంభాషిస్తున్నట్టు విడమర్చి చెపుతుంటుంది.

అంతేకాక——వాళ్ళనుండి ప్రశ్నలు వచ్చేలా ప్రోత్సహిస్తుంది. రేపు పెరిగి పెద్దయింతర్వాత అమ్మాయిలకు యెటువంటి భర్తలు వస్తారో చెప్పడం యిప్పటికిప్పుడు ఊహించడం తన చేతిలోనో పూర్ణ చందర్ చేతిలోనో ఉండక పోవచ్చు. అలా కుదరడం కుదురకపోవడం పూర్వ జన్మ సుకృతమేగా!కాని ఒకటి మాత్రం తల్లిగా తనచేతుల్లో ఉంది;సుకుమార సుగుణాత్మక స్త్రీత్వాన్ని కూతుళ్లలో కొంతలో కొంత వికసన చెందేలా చేయడం.

గుడినుండి తెచ్చిన ప్రసాదం పెద్ద కూతురు ప్రీతి ద్వారా అత్తగారికి అందించి లోపలకు వెళ్ళి చీర మార్చుకుని వచ్చేటప్ప టికి హాలులో ల్యాండ్ లైన్ ఖంగున మ్రోగింది.గోడమీది గడియారం వేపు చూపు సారించిందామె.రాత్రి తొమ్మిదవుతూంది.పూర్ణ చందర్ యింట్లోనే ఉన్నాడు.అతడికోసం ఫ్యాక్టరీ యూనియన్ మనుషులెవరో ఫోను చేసుంటారేమో అనుకుంటూ ఫోను క్రెడిల్ చేతిలోకి తీసుకుని హల్లో అంది శారద.“నేనే శారదా!అదోలా ఉంది గొంతు.

నిద్రపోతున్నావా?”అన్నయ్య పలకరింపు విని శారద మనసున ఉన్నపాటున పాలపొంగు చోటు చేసుకుంది.మాట రానంటుంది.’ఒక చిన్నమాట–
చిన్నటి మంచి మాట మనసు గాయంబు మాన్పజాల గొప్ప మందు వోలె——‘ తోడబుట్టిన దానితో మాటలు కలపడానికి యిన్నాళ్ళా!శుభ ముహూర్తం చూసే మాట్లాడతారు కాబోలు తోబుట్టువుతో–– తను ఉన్నానో లేదోనని తెలుసుకోవడానికేనా యీ చిలకరింపు?ఆమె ఉద్వేగం ఆపుకో లేక యెడాపెడా గొంతెత్తి అరవాలనిపించింది.కాని వెంటనే తనను తను తమాయించుకుంది. ఆవేశ ప్రవాహానికి అడ్డుకట్ట వేసింది. నిదానం తెచ్చుకుంది. ఎట్టకేలకు అన్నయ్య ఆపసోపాలు పడి యింటికి యేతెంచితే జరగబోయేదేమిటో తనకు తెలియనిదా! అడుగడుగునా తిరస్కారమూ ముభావమూను––అంతేకదా!తనేమిటి చొరవ తీసుకుని యెదురు తరిగి అన్నయ్యకు అత్తయ్య హంటింగ్ చూపు దాటి ఉపచర్యలు చేయగలదా! అప్పుడు సూర్య వివేక్ గొంతు వినిపించింది –”శారదా!అదేమిటి అలా మాన్పడి నిల్చుండిపోయావు?ఒంట్లో సుస్తీ గాని చేసిందా!“

“అబ్బే అదేమీ లేదురా అన్నయ్యా!చాలా రోజులకి నీ గొంతు వినిపిస్తేనూ——గొతు పెగల్లేదు––“

“నేనొచ్చి మాట్లాడకపోతేనేం!అమ్మ దాదాపు ప్రతి నెలా వస్తూనే

బహుమతి పొందిన ఫ్యామిలీ సీరియల్

# మమతల తరంగాలు

ఉందిగా!మొన్న మీ వదిన కూడా వచ్చిందిగా!అది సరే గాని నేను పంపిన బట్టలు నీకు నచ్చాయా?"మళ్ళీ ఆమె గొంతు--యేదో అడ్డుపడ్డట్టు ఆగిపోయింది.

ఎంత మంది వచ్చిపో తేనేం,తండ్రి తరవాత పెద్దదిక్కయిన అన్నయ్య ఉనికికి సమానమవుతుందా వాళ్ళ రాక! సూర్యవివేక్ కంఠ స్వరం సవరించు కుని అడిగాడు యేమైందని–"మరేం లేదురా అన్నయ్యా!పంపిన బట్టలు చాలా బాగున్నాయి.మరి–ఇన్నాళ్ళూ యెక్కడు న్నావని?" సూర్యవివేక్ వెంటనే బదులివ్వలేదు.నిదానంగా చెల్లికి సమాధానపర్చడానికి పూనుకున్నాడు–

"ప్రభుత్వోద్యోగం——పిలుపందుకున్న వెంటనే టూరు ప్రోగ్రాము తయారు చేసుకుని రెక్కలు కట్టుకుని వెళ్ళాలి. చుట్టు ప్రక్కల ఊళ్లలో ట్రైనింగ్ క్లాసులు హాజరవాలి. ఇవన్నీ తప్పుతుందా!సరే——ఇప్పుడు పాయింటుకి వస్తున్నాను.నీ కూతుళ్ళ పరీక్షలు యెప్పుడు ఆరంభమవుతాయి?ఎప్పుడు ముగుస్తాయి?"

"మార్చిలో ఆరంభమయి యాప్రిల్ లో ముగుస్తాయి హర్తాళ్ళూ బంద్ లూ యేవీ అడ్డంకిగా లేకపోతే–ఎందుకడుగుతున్నావు?" " మరేం లేదు.చాలా రోజులయిందికదా--వీలు చూసుకుని వచ్చి నా ముద్దుల మేనగోడళ్ళను చూడాలని"

"మేనగోడళ్ళను చూడటానికి ముందస్తుగా చెప్పి రావాలా యేమిటి?ఇప్పుడే రావచ్చుగా!

"అలగే!ఇంకా రెండు టూర్ ప్రోగ్రాములున్నాయి.వాటిని పూర్తి చేసుకుని బెంగళూరు వెళ్ళి పునశ్చరణ తరగతులకు హాజరయి ఆతరవాత వస్తాను.సరేనా!"శారద నవ్వుతూ అలాగేనని ఫోను క్రెడిల్ పైనుంచింది.గుంపు గుంపుగా కనిపించే స్టాఫ్ సంగతేమిటో గాని,గవర్నమెంట్ ఆఫీసర్లకు పలు కారణాల వలన పని రద్దీ యెక్కువేనని విన్నది. అన్నయ్య డ్యూటీ వివరాల పట్టీ వింటుంటే——అది నిజమేననిపిస్తూంది.

శారద భయపడినట్లే అయింది.కార్మిక లోక అశాంతికి కారకులైన యాక్టివ్ యూనియన్ నాయకుల్ని గురిపెట్టి టార్గట్ చేసి ఫ్యాక్టరీ మేనేజ్మెంటు పూర్ణచందర్ కి వ్యతరేకంగా ఇండస్ట్రియల్ యాక్ట్ ప్రకారం ఇంక్వయిరీ ఆరంభించి ఉద్యోగం నుండి సస్పెండ్ చేసింది. అతడితో బాటు మరొక ఆరుగుర్ని కూడా జతచేర్చి అదే రీతిన పనిలోనుండి సస్పెండ్ చేసారు.

భర్త పోరాటం న్యాయమైన కోర్కెల కోసమే కావచ్చు.డిమాండ్లు పెట్టడం కార్మికుల ప్రజాస్వామ్య హక్కు కూడా కావచ్చు. కాని అదేపనిగా తెరపిలేని విధంగా అలజడి లేవదీస్తుంటే ఉత్పత్తి తగ్గిపోతుందన్న మిషతో యాజమాన్యం నిస్తేజంగా చూస్తూ ఊరుకోదు కదా! తగవు యెంతకూ తెగకపోతే వాళ్ళు దేనికైనా తెగిస్తారు.వాళ్ళకు ఇక్కడున్న ఒక్క ఫ్యాక్టరీ మాత్రమే కాదు,తదితర ప్రాంతాల్లో కూడా మరి కొన్ని వ్యాపార సంస్థలు ఉండవచ్చు. వాళ్ళకు పోయేదేముంది? రాజు తలచుకోవాలే గాని, దెబ్బలకా కొదువ! డబ్బూ దస్కంతో బాటు పరపతి భారీగా ఉన్నవాళ్ళు ఫ్యాక్టరీ యజమానులు . పరిశ్రమలను నడిపే వారు ఊరకేనా వివిధ జాతీయ స్థానిక రాజకీయ పార్టీలకు దండిగా విరాళాల యిచ్చేది?క్లిష్ట సమయంలో ఘర్షనాత్మక వాతావరణంలో వాళ్ళ ఆసరా లభిస్తుందన్న విశ్వాసంతోనేగా అలా చేసేది! ఏమో యిప్పటికిప్పుడు చెప్పడం కష్టమేమో గాని,రేపు మేనేజ్మెంట్ వాళ్ళు లాకౌట్ ప్రకటించినా ప్రకటిస్తారు.ఆ తలంపుతో శారద గుండెల్లో దడ ఆరంభమైంది. తను ఒకసారి కాదు,పలుసార్లు చెప్పింది పూర్ణచందర్ తో–రెండవ కాన్పుకే కుటుంబ నియంత్రణ చేసుకుంటానని.కాని వినలేదు,తల్లి మాటే అతడికి రాజశాసనం. మగపిల్లాడు పుట్టిన తరవాతనే

బహుమతి
పొందిన
ఫ్యామిలీ
సీరియల్

# మమతల తరంగాలు

కుటుంబ నియంత్రణ గురించి ఆలోచించవచ్చని జాప్యం చేస్తూ వచ్చాడు.కడకు యిప్పుడేమ యింది? గోడలతో బాటు యింటి పునాదులు కూడా కదలనా రంభించాయి.

అప్పుడో యెప్పుడో చప్పుడు లేని పేకమేడల్లా కునారిల్లిపోతాయి. అంత వరకూ అంతులేని గుత్త ఆధిపత్యం వహించిన అత్తగారు అదేదో అపశకునాన్ని సూచించే తోకచుక్కను చూసినట్టు దూరంగా తొలగి అరుగుపైన బాసింపట్టు వేసుక్కూర్చుంది. ఇప్పుడు తనేమి చేయగలదు? కుటుంబ భారాన్ని యెలా సంబాళించ గలదు?తన వద్దున్నది--ఒక వెండి వడ్డాణం పూర్ణ చందర్ కట్టిన పుస్తెల తాడు తప్ప మరేముందని? తనుగాని తెగువ చూపించి యిద్దరు పిల్లలతో చాలించి ఉంటే తనీపాటికి యేదైనా చిన్న పాటి ఉద్యోగంలో స్థిరపడి ఉండేది. నాలుగురు పిల్లల తల్లి అయిన తరవాత తనకు మిగిలిన ఆప్షన్ యేముంది?ఒక విధంగా చూస్తే యిప్పటి గడ్డు పరిస్థితికి తను కూడా కారణమే!తనలోని బలహీనతే తననూ తన కుటుంబాన్నీ యింతవరకు తీసుకు వచ్చి నిలిపింది.భర్తను యెదిరించ లేదు.ముఖ్యంగా అతణ్ణి నొప్పింప లేదు.పూర్ణ చందర్ వైపునుంచి తనేమీ చెప్పలేదు గాని,తన గురించి చెప్పాలంటే తను అతణ్ణి మనసార ప్రేమిస్తుంది; భర్తగా కూతుళ్ళ తండ్రిగా-- అదే తన బలహీనతకు అసలు కారణం.

కన్నీటికి ఒక విచిత్రమైన వైఖరి ఉంది.దు:ఖం వస్తే కన్నీరు కారుతుంది.ఉద్వేగం పొంగుకు వస్తే కారుతుంది.అమితా నందం తాకితే కూడా కన్నీరు చుక్కలు చుక్కలుగా పడుతుంది.ఇక ముందుకు సాగితే మరొకటి కూడా యెదురవుతుంది. ఉద్వేగమూ ఉద్దేశ్యమూ లేకుండానే కన్నీరు నిశ్శబ్ద ధారలా కారనారంభిస్తుంది.కట్టుకున్న చీర చెంగుని తడిపేస్తుంది.ఇప్పుడు శారద పరిస్తతి కూడా దాదాపు అదే—లేచి నిల్చున్న తరవాతనే తెలిసింది తనంత వరకూ యేడుస్తూ కూర్చుందని.

ఆమె బరువుగా అడుగులు వేస్తూ వెళ్ళి నీళ్ళు తాగి లోగిలి వేపు తలెత్తి చూసింది.పూర్ణ చందర్ వాలు కుర్చీలో కూర్చుని యెటో చూపులు నిలిపి పరధ్యానంగా కనిపించాడు.ఆమెకు తెలుసు,యిది కాదు సమయం భర్తను సమీపించి అనునయించ డానికి.కారణం ఉన్నా లేకపోయినా రెచ్చిపోతాడు. తననూ పిల్లల్నీ అదరగొడ్తాడు.ఆమె అలా ఆలోచిస్తూ వంట గదివేపు తిరిగేట ప్పటికి వాకిట తలుపు యెవరో తట్టినట్లనిపించి అటు కదలింది.'పూర్ణ చందర్ ని తోడ్కొని పోవడానికి కార్మిక నాయకులు వచ్చి ఉంటారేమో!'అని పరి పరి విధాల తలపోస్తూ వెళ్ళి తలుపు గొండెం తీసిందామె.నిలువెత్తు ఆశ్చర్యంతో నిల్చుండిపోయింది.

(ఇంకా ఉంది )

బహుమతి
పొందిన
కామెడీ
సీరియల్






బొందల నాగేశ్వర రావు

"ఏమిటోయ్ ఏమైంది నీకు?ఏదో లోకంలోవిహరిస్తూ నన్నలా చూస్తుండిపోయావ్! నువ్వలా కళ్ళలోకి చూస్తూ నన్ను కట్టి పడేస్తే నేను ఆఫీసుకు ఎలా వెళ్ళాలమ్మా! కావాలంటే చెప్పు.ఇవాల్టికి సెలవు పెట్టేసి ఇంట్లోనే ఇక్కడే నీతోనే వుండిపోతాను " అని వెళ్ళి సోఫాలో కూర్చొన్నాడు.

సంధ్య అక్కడే టీపాయి మీద వున్న టిఫన్ బాక్సును తీసి బ్రీఫ్ కేసులోపెట్టి చేతి కందించి "బాబ్బాబ్బాబూ!మీకో నమస్కారం.ఇక దయ చేయండి,ప్లీజ్ "అంది.

చక్రవర్తి బ్యాగును చేత పట్టుకొని పైకి లేచాడు.అతనిలో ఏదో తెలియని నీరసం చోటూ చేసుకోగా గత్యంతరంలేక బాగా నీరసపడిపోయినవాడిలా ఒకడుగు మెల్లగా ముందుకేశాడు.

బహుమతి పొందిన కామెడీ సీరియల్

# నా మొగుడు నాకే సొంతం

**జరిగిన కథ**
చక్రవర్తి ,సంధ్య ప్రేమించి పెళ్లి చేసుకుంటారు .వాళ్ళ ఇద్దరకూ తరుణ్ చక్రవర్తి ఒక్కడే పిల్లాడు . పిల్లాడిని గారాబంగా పెంచు తూ ఉంటారు. చక్రవర్తికి భార్య సంధ్య అంటే వల్లమాలిన ప్రేమ .సంధ్యకు కుడా భర్త అంటే అంతే ప్రేమ .
**ఇక చదవండి**

" వెళ్ళోస్తా సంధ్యా!" గుమ్మం వరకూ నడిచాడు.

"ఏమండీ..! కాస్త ఇలా రండి"అని భర్తను వెనక్కు పిలిచింది సంధ్య. త్వరత్వరగా దగ్గరకు వచ్చాడు చక్రవర్తి.

సంధ్య కళ్ళలోకి చూస్తూ"ఏమిటి సంధ్యా!పిలిచావెందుకమ్మా?"అని ప్రేమతో గోముగా అడిగాడు.

"ఆఁ...ఏమీలేదు"అంటూ చక్రవర్తిని ఆపాదమస్తకం తేరిపారజూసింది.ఓ రకమైన తృప్తికి లోనైన సంధ్య "మీరివాళ చాలా అందంగా వున్నారండి"అంది కళ్ళలోకి చూస్తూ.

'బ్రతికించావురా భగవంతుడా!ఏదో అనుకొని భయపడ్డాను'అని మనసులో అనుకొని "ఏమిటి సంధ్యా!ఈ మాట చెప్పటానికేనా గుమ్మం వరకూ వెళ్ళిన వాణ్ణి వెనక్కు పిలిచావ్ .నేనింకేదో అనుకున్నా!" అని మెళ్ళోని 'టై' ని స్టయిల్గా సర్దుకున్నాడు.

మీరు చాలా అందంగా వుంటారండీ అన్న భార్య కామెంటుకు లోలోన మురిసి పోయి గర్వంగా ఫీలవుతూ "ఇంతకీ... నా అందానికి నువ్వదోలా అయి పోయి నట్టున్నావ్ కదూ?"అంటూ బ్రీఫ్ కేసును టీపాయిమీద పెట్టి క్రాపును సర్దుకున్నాడు చక్రవర్తి.

"అదేమీ కాదులే !చెప్పాలనిపించింది.చెప్పాను. ఆఁ... ఏమండీ!మీ ఆఫీసులో ఆడవాళ్ళు చాలా మంది వుంటారు కదండీ!"తడబడుతూ అడిగింది.

"ఆఫీసన్నాక ఆడవాళ్ళు లేకుండా వుంటారా!బోలెడు మంది వున్నారు.వారిలో అచ్చంగా నా కంట్రోల్లో అయిదుగురు వున్నారు. ఇహ వాళ్ళ పేర్లు వరుసగా సుధ,రాధ,సీత,గీత.ఇంకెవరబ్బా... ఆఁ...కంప్యూటరాపరేటరు లత.ఇంకా...." ఆలోచిస్తున్నాడు చక్రవర్తి.

"ఇంకా ఎవరున్నారండి... ఐదుగురేనన్నారుగా!"సంధ్య నోటి వెంట బాధతో వచ్చాయామాటలు.

"అవునవును.ఐదుగురేనని చెప్పాను కదూ !అంతే అయిదుగురే"అంటూ సర్ది చెప్పుకున్నాడు చక్రవర్తి.

సంధ్య చక్రవర్తికి దగ్గరగా వచ్చింది.భర్త 'టై'ని పట్టుకొని మెల్లగా అటూ ఇటూ ఆడిస్తూ "అందరూ పెళ్ళయిన వారే కదండీ ?"సాగతీతతో అడిగింది.

"ఎవడాఅంది?ముగ్గురికి మాత్రమే పెళ్ళయ్యింది. ఏమిటీ విషయం?నువ్వేదో పెద్ద పోలీసాఫీసర్ లాగా ఆరా తీస్తున్నావ్ ?అయినా మా ఆఫీసు గోల నీకెందుకు సంధ్యా!"చిరునవ్వుతో అన్నాడు చక్రవర్తి భార్య ముఖ కవలికలను గమనిస్తూ.

"అన్నట్టు నాకెందుకూ

బహుమతి పొందిన కామెడీ సీరియల్

# నా మొగుడు నాకే సొంతం

వంటింట్లో పడుండేదాన్ని.వూరికే అడిగానులెండి. పోనీ లంచ్ అందరూ ఒకే చోట తీసుకుంటారు కదండీ?"నిర్ధారించుకోవాలన్న వుద్దేశ్యం తో అడిగింది.

"అబ్బే... ఆడవాళ్ళు మా మేనేజరు గదికి అటువైపు. మగవాళ్ళమంతా ఇటువైపు. అయినా ఆయనగారి గదికున్న అద్దాల్లోంచి వాళ్ళను వీళ్ళు, వీళ్ళను వాళ్ళు ఏంచక్కాచూసుకోవచ్చు. అవునూ...ఈ వివరాలన్నీ నీకెందుకమ్మా?"ప్రశ్నించాడు.

"అన్నట్టు నాకెందుకూ!వూరికే అడిగానులెండి. ఏమండీ!మరేమో... మరేమో ఈ కాలంలో చాలామంది మగవాళ్లు ఎంతో సులువుగా ఆడవాళ్ళ వల్లో పడిపోతార టండి. అలాగని... మన ఎదురింటి శాంతమ్మ పిన్నిగారు నాతో చెప్పారు! వుంది మీ మీద నాకా నమ్మకం వుంది" 'టై'ని అటూ ఇటూ ఆడిస్తూ అంది.

"టైని వొదులు సంధ్యా!"అన్నాడు చక్రవర్తి.టైని వదిలిపెట్టి ఒకడుగు వెనక్కు వచ్చింది సంధ్య. ఆమె ముఖంలోకి సూటిగా చూశాడు చక్రవర్తి.

"ఏమిటీ...నేను ఆడవాళ్ళ వల్లో పడిపోతానని నీకు భయమా" చక్రవర్తి నవ్వుతూ అన్నాడు.

"కాదండీ!మీరు శ్రీరామచంద్రుల్లా ఏకపత్నీ వ్రతులుగా నాతోనే వుండి పోతారని చెప్పనలవికానంత నమ్మకం నాకు. ఏదేమైనా అలాంటి పోకిరి ఆడవాళ్ళు మిమ్మల్ని చూస్తే వల్లో వేసుకోను ప్రయత్నించరటండీ!... అందుకనీ..."ఆమె మాటలు పూర్తి కాలేదు.

"అర్థమైంది సంధ్యా!నువ్వు లాగబోతున్న'లా' పాయింటేమిటోనన్నది నాకు బాగా అర్థమైంది. నిజం చెపుతున్నాను. నాకు పెళ్ళికాక ముందు నేనెవర్ని ప్రేమించ లేదు. ఈ ఆఫీసులో అసిస్టంటు మేనేజర్ను అయిన తరువాత కూడా నేను ప్రేమలో పడలేదు.చివరిగా నిన్ను పెళ్ళాడి నా దాన్ని చేసుకొన్నాక..." తటపటా యించాడు.
"ఆ...చెప్పండి నన్ను పెళ్ళిచేసుకొన్నాక..."ఆత్రుతతో అడిగింది.

"అనగా నీమెళ్ళో ఆ మూడు ముళ్ళు వేసిన తరువాత ఒకరిని ప్రేమించాను.... ప్రేమిస్తున్నాను... ఇకపై కూడా ప్రేమిస్తాను"టపీమని చెప్పి నవ్వాడు చక్రవర్తి. ఏడుపు మొహం పెట్టుకొంది సంధ్య.

"ఏమండీ!మీరు ఏదో అయి పోయారండి. కాకపోతే కట్టుకున్న పెళ్ళాన్ని నిండుగా నేను మీముందు వుండగా నాకు కాని మాటలు నాతోనే చెపుతారా?మీరు ఎవర్తి వల్లోనో పడిపోయారండి" ఏడుపు లంకించుకుంది.వెంటనే ఓ నిర్ణయానికొచ్చినట్టు కన్నీళ్ళను తుడుచుకుంది.పమిటను బొడ్లోకి దోపుకుంది. నిముషాల మీద మహంకాళిగా మారిపోయింది.
"ఒప్పుకోనండి...నేనస్సలొప్పుకో ను. దాన్ని... దాన్ని...కత్తి పీటతో నరికి పారే స్తాను. కొబ్బరి తురిమినట్టు తురిమి పారేస్తాను. అదెవతో చెప్పండి"అంటూ వూగి పోయింది సంధ్య.

"సంధ్యా...ఏమిటి అలా వూగిపోతున్నావ్.ఆఫీసుకు వెళ్ళేవాణ్ణల్లా పిలిచి గొడవ పెట్టుకున్నావేమిటి? రా...నేను ప్రేమిస్తున్న అమ్మాయిని ఇప్పుడే ఇక్కడే చూపిస్తాను రా!"అంటూ సంధ్యను నిలువుటద్దం వద్దకు తీసుకెళ్ళాడు.అద్దం ముందు నిలబెట్టాడు. సంధ్యకు ప్రక్కనే తను నిలబడి "చూడూ నేను ప్రేమిస్తున్న అమ్మాయి ప్రతిబింబం ఆ అద్దంలో వుంది. బాగా చూడూ"అన్నాడు. అంతే సంధ్యకు ఎక్కడలేని సంతోషం. చక్రవర్తిని అలా చూస్తూ,సిగ్గుపడుతూ అతనికి దగ్గరగా వెళ్ళింది "సారీ అండీ"అంటూ.

బహుమతి
పొందిన
కామెడీ
సీరియల్

# నా మొగుడు నాకే సొంతం

"నీ మనసు నాకు తెలియదా సంధ్యా!చిన్నపాటి బాధను కూడా నువ్వు తట్టుకో లేవు.నేనూ ఇంత మంచి భార్యనొదలి మనసును మరో వేపుకు మరల్చలేను" అన్నాడు సంధ్యను కౌగిలికి తీసుకొంటూ.

" నామనసే అంతండి. మిమ్మల్ని ఇంకో ఆడదానితో వూహించుకోలేను.అలాంటి పరిస్థితులు ఎదురైతే ఆ రోజు మీ సంధ్య ప్రాణాలతో వుండదండీ"అప్పటికే కళ్ళలో నీళ్ళు తిరిగి అవి చెక్కిళ్ళపైకి జారాయి. ఆ కన్నీటి ధారలను తన చేత్తో తుడిచాడు చక్రవర్తి.భర్త బాహువుల్లోకి చేరింది సంధ్య.

"నాకు తెలుసు సంధ్యా!నీ కల్మషం లేని మనసులో పూర్తిగా నేనే వున్నాను. ఆ నేను ఏ పొరపాటు చేయకూడదనీ నీ ఆకాంక్ష.నిజం చెపుతున్నాను. కనీసం కల్లో కూడానీకు ద్రోహం తలపెట్టలేనమ్మా"అన్నాడు చక్రవర్తి వాచీలో టైం చూసుకొంటూ.

చక్రవర్తి గుండె లోతుల్లోనుంచి వచ్చిన ఆమాటలకు సంతోషపడిపోతూ టీపాయి మీదున్న బ్రీఫ్ కేసును తీసి భర్త చేతికిచ్చింది సంధ్య. కారును స్టార్టు చేసుకొని ఆఫీసుకు బయలుదేరాడు చక్రవర్తి.

సంధ్య పుట్టి పెరిగింది ఓ మోస్తారైన టౌనులో.చిన్నతనంలోనే ఓ అక్సిడెంటులో తల్లితండ్రులను పోగొట్టుకున్న ఆమె బాబాయి చిదంబరం ఇంట్లో వుంటూ డిగ్రీ వరకు చదువుకుంది. సంధ్య స్వయాన చిదంబరానికి అన్నకూతురు కావటంతో ఆమెకు ఏలోటూ లేకుండా తన సొంత కూతురులా చూసుకొంటూ వచ్చారు చిదంబరం ఆయన భార్య సూర్యకాంతం.

చిదంబరానికి బుజ్జిబాబు అనే కొడుకున్నాడు. వాడు బుద్ధిపరంగా ఎదుగు దలలేని వాడు.అయితే తనకు కూడా సంధ్యంటే చాలాప్రేమ.తన తోడ బుట్టిన అక్కలా చూసుకుంటాడు. ఎప్పుడూ"సందెక్కాయ్ ...సందెక్కాయ్"అంటూ సంధ్య చుట్టూ తిరుగుతుంటాడు. ఇరవై నాలుగేళ్ళు వచ్చినా ఇప్పటికీ నిక్కర్లు వేసు కొంటాడు. నిత్యం బొటన వ్రేలు చీకటం అతని అలవాటు.

చక్రవర్తి,సంధ్యలు భార్యభర్తలై సంసార జీవితంలోకి కాలిడిన తరువాత వాళ్ళు అన్యోన్యమైన జీవితం గడుపుతూ వచ్చారు. అలాంటి అన్యోన్యమైన జీవితాన్ని గడపటం మూలాన వాళ్ళకు సంవత్సరం తిరక్కుండానే తరణ్ చక్రవర్తి పుట్టాడు.

ఓ రోజు గంట మధ్యాహ్నం పన్నెండు కావస్తుండగా పోస్టుమేన్ ప్రత్యక్షమెయ్యాడు. "సార్ పోస్టు"అని పిలిచాడు. ఏదో పనిమీద వున్న సంధ్య వంటింట్లోనుంచి పరిగెత్తినట్టు వచ్చింది"నాకేనా పోస్టు"అంటూ.

"అవును మేడం! ఇదిగో "అంటూ కవరు చేతికిచ్చి వెళ్ళిపోయాడు పోస్టుమేన్ .

కవరు మీది అడ్రసు చూసుకొంది సంధ్య.అది వూరిలో వున్న చిదంబరం బాబాయి రాసింది. అంతే...ఆమెకు ఎక్కడ లేని సంతోషం.దాదాపు సంవత్సరం తరువాత బాబాయి వద్దనుంచి వచ్చిన వుత్తరమది.ఇంట్లోకి వెళ్ళకుండా వరాండాలోనే నిలబడి అవసరవసరంగా కవర్నుఓపన్ చేసి చదివింది.అందులో చిదంబరం బాబాయి, తమ్ముడు బుజ్జిబాబుతో పాటు తనవద్ద కొస్తున్నట్టు వుంది. ఆ వచ్చే రోజు ఇవాళేనని డేటు చూసి తెలుసుకొంది.

బాబాయి చిదంబరం,తమ్ముడు బుజ్జిబాబు తన వద్దకు రావటం సంధ్యకు ఓ ప్రక్క సంతోషకరమైన విషయమైనా మరో ప్రక్కఅంత అడావిడిగా వాళ్ళు ఎందుకొస్తున్న ట్టు అన్నసందేహం వచ్చింది. ఏదేమైనా తన్ను చిన్నతనం నుంచి ప్రాణపదంగా చూసుకున్నబాబాయి

బహుమతి పొందిన కామెడీ సీరియల్

# నా మొగుడు నాకే సొంతం

దంబరాన్నిఆహ్వానించటం ముఖ్యమనుకొంది. త్వరగా స్నానమదీ ముగించుకొని తయారుకావాలనుకొని ఇంట్లోకి వెళ్ళింది.

సంధ్య స్నానం చేసి చక్కగా తయారై హాల్లోకొచ్చికూర్చొంది. టీపాయిమీదనున్న దినపత్రికను త్రిప్పుతూ అప్పుడప్పుడు రోడ్డు వేపు చూస్తూవుంది.కారణం తన అంచన ప్రకారం బాబాయి అర్థగంట లోపే వచ్చుండాలి. దాదాపు గంటైనా వాళ్ళ జాడ కనబడక పోయే సరికి తలుపుకు గడియపెట్టి పడగ్గది లోకి వెళ్ళిపోయి పడుకొంది సంధ్య. చిదంబరం కొడుకు బుజ్జిబాబుతో పాటు ఆటోలో వచ్చి దిగాడు. పెట్టెబేడా మోసు కొంటూ కాంపౌండు వాల్ గేటును తెరచుకొని లోనికి నడిచారిద్దరూ.

చిదంబరం అతి కష్టం మీద వరాండా మెట్లెక్కాడు.అప్పటికే ఆయాసం తన్ను ఇబ్బంది పెడుతుండగా అక్కడే వరాండాలో వున్న వాలు కుర్చీలో కూర్చొన్నాడు 'అక్కను పిలవరా బుజ్జీ'అంటూ.

నెత్తిమీదున్న సూటుకేసును క్రింద పెట్టి నోటిలో వుంచుకున్న వ్రేలు తీసి ఇప్పటి వరకూ ఒక్కింత కూడా అమాయకత్వాన్ని వీడని ఆకతాయి బుజ్జిబాబు తలుపు దగ్గరకు వెళ్ళి 'సందెక్కాయ్ ...సందెక్కాయ్'అంటూ గట్టిగా తలుపును తట్టాడు. లోపలి నుంచి రెస్పాను లేదు.

"నాన్నా!అక్కతలుపు తీయట్లేదే"అన్నాడు బుజ్జిబాబు అలవాటు ప్రకారం నోట్లో వ్రేలు వేసుకొని చీకుతూ.

చిదంబరం వాలుకుర్చీలోనుంచి మెల్లగా లేచాడు.తలుపుదగ్గరకు నడిచాడు.తనూ తలుపు తట్టాడు. రెస్పాన్సు లేదు.

"నాన్నాబుజ్జీ! మనమొస్తున్నది ఉత్తరం ద్వారా తెలుసుకున్న అక్క మనకోసం పండ్లు ,తిను బండారాలు తేవటానికి కెళ్ళుంటుందేమో!కాకపోతే వుదయా న్నే అక్క ఎటెల్లినట్టు?" సందేహాన్ని వెలిబుచ్చాడు చిదంబరం.

బుజ్జిబాబు నోట్లో వ్రేలును తీసి కిటికీలోనుంచి ఇంట్లోకి చూసి"కాదు నాన్నోయ్ ! హాల్లోఫ్యాన్ తిరుగుతుంది. బహుశా అక్క ఇంట్లోనే వుండి వుంటుంది.పిలుస్తాను" అని కాస్త వాల్యూమ్ పెంచి'సందెక్కాయ్...ఓ సందెక్కాయ్!వూరినుంచి వూరతిండి బోతులం నేనూ నాన్న వచ్చాం.తలుపు తీయవూ?'అని చుట్టూ వున్న ఇళ్ళకు సైతం వినబడేలా పెద్దగా పిలిచాడు. అప్పుడూ రెస్పాన్సు లేదు.

"ఒరేయ్ !ఎందుకలా అరుస్తావ్ ?ఏమిటీ...మనం వూర తిండి బోతులమా!ఏమిటా మాటలు. నువ్వొక్కడివి చాలురా నా పరువు తీయటానికి"మందలింపు ధోరణితో అన్నాడు చిదంబరం మళ్ళీ వాలుకూర్చీలో కూర్చొంటూ.

(ఇంకా ఉంది )

బహుమతి పొందిన ఫ్యామిలీ సీరియల్

# బాంధవ్యం





పి.వి.సుధా రమణ

"నమస్తే, నమస్తే" అంటూ వాళ్ళ వైపు, భర్త వైపు మార్చి మార్చి ప్రశ్నార్థంగా చూసింది వర్ధని. అప్పుడు రావుగారు

"ఆ, వర్ధని నీకు చెప్పనే లేదు కదా నేను., మొన్న రఘుని దింపడానికి స్కూల్ కి వెళ్లానా, అప్పుడేం జరిగిందంటే " అంటూ చెప్పసాగారు.

"సార్  సార్ మిమ్మల్నే ఒక్క నిమిషం మీతో మాట్లాడ వచ్చా" అంటూ పరుగులాంటి నడకతో వస్తున్న కస్తూరి టీచర్ని చూసి ఆగేరు రావుగారు. దగ్గరగా వచ్చిన ఆమె ని చూసి, "చెప్పండి" అన్నారు.

బహుమతి
పొందిన
ఫ్యామిలీ
సీరియల్

# బాంధవ్యం

**జరిగిన కథ**

వర్ధనమ్మ ,కోటేశ్వర రావు గార్ల కొడుకు రఘు భార్య విశాల.కొడుకు పెళ్లి కామాక్షి దగ్గరుండి చేయిస్తుంది .కామాక్షిని తలుచుకుంటూ గతం లోకి వెళుతుంది వర్ధనమ్మ. కొత్త ఇంట్లోకి వర్ధని ,కోటేశ్వర రావులు వెళ్ళటం తో పథ ఇంటిని కామక్షి కి అద్దెకు ఇస్తారు.

**ఇక చదవండి**

“నాకో చిన్న హెల్ప్ కావాలండి” అంది కస్తూరి,

“సరే..చెప్పండీ ఏమ్ కావాలి మీకు” - - -

“మా బంధువుల అబ్బాయి కి ఈ మధ్యే పెళ్లయిందండి, అతను ఒక పెద్ద ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఇప్పుడు అతనికి ఈ ఊరికి బదిలీ అయ్యింది. రేపు వచ్చి డ్యూటీలో జాయిన్ అవ్వాలి. మా అందరికీ ఈ ఊరు కొత్త, అందువలన మీకు తెలిసిన వాళ్ళ ఇల్లు ఏమైనా ఖాళీ ఉంటే అద్దెకి ఇప్పిస్తారేమో అని, నాకు పెద్దగా ఎవ్వరితో పరిచయం కూడా లేదు, మిమ్మల్ని అడగొచ్చో లేదో కూడా తెలీదు, కానీ వేరే ఆప్షన్ లేదు, అందుకని, మిమ్మల్ని అడిగాను.. తప్పైతే క్షమించండి”.

“అయ్యో ఫర్లేదు, దానిదేముంది, అన్ని సౌకర్యాలతో మూడు గదుల ఇల్లు సరిపోతుందా వాళ్ళకి”

“అమ్మో, అన్ని సౌకర్యాలతో మూడు గదులు అంటే అద్దె ఎక్కువ ఉంటుందేమో, వాళ్ళు ఎక్కువ అద్దె ఇవ్వలేరు” - - -

“మరి ఎంతలో కావాలి వారికి?”

“ రెండు గదుల ఇల్లు, ఓ 500 రూపాయల అద్దెలో ఏమైనా ఉంటే చెప్పగలరా”

“ఓహో ! సరే, అయితే, మూడు గదుల ఇల్లు..అద్దె 500 రుపాయలు, మీ వాళ్ళని తీసుకొని ఎల్లుండి ఉదయం పది గంటలకి రండి “

“ఉదయం పదింటికి అంటే నాకు సెలవు లేదు అందుకని నేను రాలేను, అడ్రస్ చెప్తే వాళ్ళని పంపిస్తాను “.

“ఇది నా విజిటింగ్ కార్డు, ఈ అడ్రస్ కి వాళ్ళని పంపండి.”

“సార్, మీ విజిటింగ్ కార్డు ఇచ్చేరు, మరి ఇల్లు ఎక్కడ “

“ విజిటింగ్ కార్డు నాదే, ఇల్లు నాదే, వాళ్ళని పంపండి నేను చూసుకుంటాను “

“చాలా థాంక్స్ అండీ “ అంటూ కస్తూరి టీచర్ స్కూల్ లోకి వెళ్ళిపోయింది.

“అదీ జరిగిన విషయం “ అన్నారు రావుగారు.

“ఓహో, సరే “ అంటూ ఆ వచ్చిన వాళ్ళని, ఇల్లు చూపించటానికి లోపలికి తీసుకు వెళ్ళింది వర్ధని.

“ఇదిగో...ఇది మూడు గదుల వాటా. చివరి గది బెడ్ రూమ్, మధ్య గది వంటగది ఇక ఈ ముందు గది హాలుగా వాడుకోవొచ్చు. ఈ వంటగది అవతల వైపు మా వంటగది. ఇదిగో మధ్యలో ఉన్న ఈ తలుపు వేసేసి ఇవతల మీరు, అవతల మేము ఏమైనా అడ్డు పెట్టేసుకుందాం. ఆ.., చెప్పడం మరచా, మేము అద్దెకివ్వాలని అనుకోలేదు కదా అందుకని వంటగది వీలుగా లేదు, నాలుగు రోజులలో అన్నీ తయారైపోతాయి. అప్పుడే మీరు వచ్చేద్దురుగాని, మేము కూడా అప్పుడే వస్తున్నాం “

బహుమతి పొందిన ఫ్యామిలీ సీరియల్

# బాంధవ్యం

అంది వర్ధని.

"అయ్యో నాలుగు రోజులలో అంటే అవ్వకపోవచ్చును అండీ, మా వాళ్ళు పై వారం వస్తారు, అప్పుడు ఇల్లు చూసి దానికి తగ్గట్టుగా సామాను కొంటామన్నారు. మాకు పెళ్ళి పది నెలలు అయ్యింది, ఇంకా మా వాళ్ళు సారె పెట్టలేదు అండీ " అంది కామాక్షి.

"అయ్యో, ఏం ఫర్లేదు, మేము ఇంటంతటికి ఫర్నిచర్ చేయించేసాం కదా, మీరు మీ బట్టలు, వంట సరుకులు తెచ్చుకోండి చాలు. మిగతావన్నీ ఇక్కడ ఉంటాయి. నాకు నిన్ను చూస్తే మా ఆడపడుచు మీనాక్షిని చూసినట్టే ఉంది. నువ్వు అంటున్నానని ఏమనుకోకమ్మా, నువ్వు నాకంటే చిన్నదానివి కదా అందుకని అలా పిలుస్తున్నా. ఇక మీ అయన నాకు తమ్ముడు అనుకో. నాకెలాగూ తమ్ముళ్లు లేరు, ఉన్న అన్నయ్యా వాళ్లంతా ఎక్కడో విదేశాల్లో ఉన్నారు " అంది వర్ధని.

"అలాగే వదినగారు, మీదేంత మంచి మనసు. ముందు త్వరగా మా వాళ్ళకి ఈ విషయాలన్నీ చెప్పాలి, వాళ్ళు చాలా బెంగగా ఉన్నారు, మేము ఈ ఊర్లో ఎలా ఉంటామో, మంచి ఇల్లు దొరుకుతుందో లేదో అని. అందుకే ముందు వాళ్ళకి మంచి ఇంటితో పాటు మంచి మనసులు కూడా కుదిరాయి కాపురాముండటానికి అని ఎక్స్ ప్రెస్ టెలిగ్రామ్ పంపిస్తాను, వాళ్ళ మనసులు కుదుటపడతాయి పాపం " అంది కామాక్షి.

అనుకున్నట్టుగానే నాలుగు రోజులలో అందరూ కొత్త ఇంటికి వచ్చేసారు. ఇల్లంతా నౌకర్ల సాయంతో చక్కగా కావాల్సినట్టు సర్దేసుకున్నారు వర్ధని, కామాక్షి. మెల్ల మెల్లగా అంతా ఒక కుటుంబంలా కలిసిపోయారు. కామాక్షి బాగా చదువుకున్న పిల్ల కానీ కుటుంబంలో ఎవరికి తను ఉద్యోగం చెయ్యడం ఇష్టం లేకపోవటం వలన ఇల్లు చక్కదిద్దుకుంటూ, వర్ధనికి అన్ని విషయాల్లో చేదోడు వాదోడుగా ఉంటూ, రఘుకి చక్కగా చదువు చెప్తోంది. అతి కొద్దీ కాలం లోనే రఘు, అత్తా...అత్తా.. అంటూ కామాక్షికి బాగా చేరువయ్యాడు.

కాలచక్రం గిర్రున తిరిగిపోయింది. చూస్తుండగానే ఇరవై సంవత్సరాలు గడిచిపియాయి. ఎన్నో ఎన్నెన్నో మార్పులు, ఎన్నో తీపి అనుభూతులు, ఇంకెన్నో మంచి సంఘటనలు చోటుచేసుకున్నాయి వాళ్ళ జీవితాల్లో. కామాక్షి, హరి దంపతులకు ఇద్దరు కొడుకులు, రాజా, రవి, వాళ్లిప్పుడు డిగ్రీ చదువుతున్నారు.

ఒకరోజు.. రావుగారు ఆఫీసులో ఉండగా, అతని స్నేహితుడు గోపాలం గారు వచ్చారు. గోపాలాన్ని చూస్తూనే..
" ఏరా గోపాలం, రా రా, ఏంటి విషయం, ఊరకే రారు మహానుభావులు ".

" ఏం లేదురా, ఇదిగో ఈ ఫోటో చూడు. మా మేనకోడలు విశాలాక్షి. డిగ్రీ చేసింది. పెళ్లి సంబంధాలు చూస్తున్నాం.
" అవునా, సంబంధాలమైనా చూసారా., పెళ్లి కుదిరిందా ?".

" ఇంకా లేదురా, ఆ పనిమీదే వచ్చాను ఇక్కడికి. 'చల్ల కొచ్చి ముంత దాచడం ఎందుకూ', మన రఘుకి చేసుకోమని అడగడానికి వచ్చేను".

" ఓహో! అదా విషయం, సరే పద అయితే మీ ఇంటికి వెళదాం "
" ఇప్పుడేనా, 'లేడీకి లేచిందే ప్రయాణం' అన్నట్లుగా, ముందు మనం అన్ని విషయాలు మాట్లాడుకుందాం".
" మనం మాట్లాడుకుందికి ఏముందిలే, వెళుతూ దార్లో మాట్లాడుకుందాం "
సరే అని ఇద్దరూ గోపాలం కారులో బయలుదేరారు.




# బాంధవ్యం

అబ్బాయి, అమ్మాయిల గురించి అన్ని విషయాలు చర్చించుకున్నారు. అలా మాట్లాడుకుంటూ ఇంటికి చేరుకునారు.

"అమ్మా విశాలా.. ఇలా రామ్మా" అని పిలిచారు గోపాలంగారు. విశాలని చూసి, రావుగారు ---

" అమ్మా విశాలా… మా రఘుని చేసుకోవటం నీకిష్టమేనా " అనగానే, విశాల సిగ్గుతో లోపలికి పారిపోయింది. "ఒరేయ్ గోపాలం ఈ ఫోటో తీసికెళ్లి, ఇంట్లో వాళ్లకు చూపిస్తాను మా కోడలు అని " అంటూ ఫోటో జేబులో పెట్టుకున్నారు రావుగారు.

" అదేంట్రా, మరి రఘుని కూడా అడగాలి కదరా ".

"ఎందుకు అడగడం, నువ్వు చెప్పావు కదరా, ఇష్టపడ్డాడని, ఇంకేం, అది చాలు, మీవాళ్లందరిని తీసుకొని మన ఇంటికి బయలుదేరు, ఇవాళ చాలా మంచిరోజుట, పంతులుగారు ఇందాకే చెప్పారు. నేను ముందు వెళ్లి, ఇంట్లోవాళ్ళకి మీరు వస్తున్నారని చెప్తాను. రఘు కూడా ఇవాళే వస్తున్నాడు ఊరునుండి, మీరు త్వరగా వచ్చెయ్యండి" అంటూ బయలుదేరారు రావుగారు అక్కడ నుండి.

కళ్యాణం వచ్చినా, కక్కొచ్చినా ఆగదన్న మన పెద్దవాళ్ళ మాట నిజం అన్నట్లుగా అంతా క్షణంలో, కలా నిజమా అన్నట్టుగా జరిగిపోయింది.

"ఏమోయ్! వర్ధూ ఎక్కడున్నావు, త్వరగా రా" అంటూ కేకేశారు రావుగారు ఇంట్లోకి వస్తూనే.
"ఆ, వచ్చే వచ్చే" అంటూ గబ గబా వచ్చేరు వర్ధనమ్మగారు.

"ఇదిగో ఈ ఫోటో చూడు, ఈ అమ్మాయి మన కాబోయే కోడలు, నా స్నేహితుడు గోపాలం మేనకోడలుట, మొన్నామధ్య రఘు.. ఆఫీసు పనిమీద గోపాలం ఇంటికి వెళ్ళినప్పుడు ఈ అమ్మాయిని చూసాడుట. వాడి కళ్ళలో మెరుపు చూసి, వాళ్ళిద్దరికీ పెళ్లి చేస్తే బావుంటుందని అనుకొని నా దగ్గరకు వచ్చేడు. అబ్బాయి ఇష్టపడ్డాడు అని తెలిసి వెళ్లి వాళ్ళతో మాట్లాడి సంబంధం కుదిర్చేసాను. ఇంకాసేపటిలో వాళ్ళు మన ఇంటికి వస్తున్నారు. నీకు పరిచయం చేస్తాను. కామాక్షి, హరి, రాజా, రవి వాళ్ళందరిని కూడా ఉండమను వాళ్ళు వచ్చేసరికి. అందరిని ఒకేసారి పరిచయం చేసేస్తాను. అబ్బాయి రఘు కూడా వచేస్తున్నాడు, ఫ్లైట్ దిగిపోయాడు, కాసేపటిలో ఇంట్లో ఉంటాడు " అంటూ గుక్క తిప్పుకోకుండా అన్ని విషయాలు చెప్పేసారు రావుగారు.

"అవునా, సరే అందరిని కేకేస్తాను, మీరు హైరానా పడకండి, ప్రశాంతంగా కూర్చోండి, విషయం చెప్పేరు కదా నే చూసుకుంటా మిగతా విషయాలు " అంది వర్ధనమ్మ.

వారిది అన్యోన్య దాంపత్యం. అందువలన భర్త ఏం చెప్పినా… భార్య, భార్య ఏం చేసినా--- భర్త, సరే అనేస్తారు. ఎదురు ప్రశ్నలకు తావులేదు వాళ్ళ మధ్య.

భర్త అంటే ఎంతో గౌరవం వర్ధనికి. భార్య అంటే అమితమైన ప్రేమ రావుగారికి. వీరిని చూసి అలాగే ఉంటారు కామాక్షి, హరి దంపతులు. అందువలన ఇప్పటివరకు వాళ్లెవరికీ అభిప్రాయభేదాలు రాలేదు, ఇకముందు రావు కూడా. అందరివీ అంత మంచి మనసులు మరి.
గోపాలంగారు, పెళ్లివారందరినీ తీసుకొని వచ్చేరు. రఘు కూడా వచ్చేసాడు. అందరి పరిచయ కార్యక్రమాలు అయ్యేక, అందరూ అమ్మాయి ఫోటో చూసారు, అమ్మాయి చాలా బావుంది అనుకున్నారు. రఘుని పిలిచి అడిగారు రవి, రాజాలు అమ్మాయి నచ్చిందా అని, రఘు సిగ్గుపడ్డాడు. పెళ్లి మాటలు అన్నీ అయ్యేక, గోపాలంగారు వాళ్ళు ఆనందంగా వెళ్లిపోయారు.

మర్నాడు వర్ధనమ్మగారు పంతులుగారిని పిలిపించి పెళ్ళికి ముహూర్తం పెట్టించారు. ఇంత

బహుమతి పొందిన ఫ్యామిలీ సీరియల్

# బాంధవ్యం

దగ్గరలోనే ముహూర్తం అంటే ఎలా అన్నారు రావుగారు. "

ఏం ఫర్వాలేదు అన్నయ్యగారు, ఇంతమంది ఉన్నాం కదా, తలో పని పట్టుకుంటే సరి" అంది కామాక్షి. అనుకున్నట్టుగానే పెళ్లి పనులు మొదలుపెట్టేసారు. రఘు, విశాల పెళ్లి చాలా ఘనంగా జరిగింది. పెళ్ళికి వచ్చిన వారంతా ఒక్కొక్కరు బయలుదేరుతున్నారు, అందరి నోటా ఒకటే మాట పెళ్లి బాగా జరిగిందని.

వర్ధని దంపతులు అందరికీ బట్టలు పెట్టేరు. అంతా వెళ్లిపోయారు. వర్ధని, కామాక్షి మిగిలిన సామానంతా సర్దుతున్నారు పెళ్లి కబుర్లు చెప్పుకుంటూ. అప్పుడు రవి వచ్చి

"అత్తయ్యా... మామయ్య పిలుస్తున్నారు" అని చెప్పేడు.

"ఆ, వస్తున్నా" అంటూ వర్ధని లేస్తూ,

"అన్నట్టు చెప్పటం మరచిపోయాను కామాక్షి, రేపు ఉదయానికి పాలు కొంచెం ఎక్కువ తెప్పించు, ఆ, అలాగే పంతులుగారికి ఫోన్ చేసి రేపు పిల్లని దిగబెడుతున్నారు కదా, ఇక్కడ ఏర్పాట్లు చూడటానికి ఇవాళ రమ్మని చెప్పు. ఏం తక్కువైనా మీ అన్నయ్య కోప్పడతారు, రాజాని బ్యాంకు కి పంపించు చెక్కు మార్చుకు రమ్మని, నేను కిందికి వెళుతున్నాను మీ అన్నయ్య పిలుస్తునారుట " అంటూ వర్ధని కిందికి వెళ్లి,

" ఏమిటి రమ్మన్నారుట" అంది.

"హమ్మయ్య! వచ్చేవా, చాలసేపటి నుండి చూస్తున్నా నీ కోసమే, ఇదిగో ఇది తీసుకొని అన్నీ సరిగ్గా ఉన్నాయో లేదో చూడు, రేపు కోడలికి పెట్టవలసిన నగలు అవి, నువ్వు సెలెక్ట్ చేసినవన్నీ ఉన్నాయో లేదో చూడు. అన్నీ సరిపోతే షావుకారు గారు వెళ్ళిపోతారు" అన్నారు రావుగారు.

"అయితే ఉండండి, కామాక్షిని కూడా పిలుస్తాను " అంటూ ఉంటే, ఇంతలో కామాక్షే వచ్చింది కిందకి.. "వదినగారు పంతులుగారు బయలుదేరారుట" అంటూ.

"ఆ, కామాక్షి ఇదిగో చూడు కోడలి నగలు వచ్చేయి, అన్నీ సరిపోయాయా చూడు నువ్వు కూడా" అంది వర్ధని. ఇద్దరు కలిసి నగలన్నీ ఒక్కొక్కటి తీసి టేబుల్ మీద పెట్టి చూసుకుని అన్నీ చాలా బాగా కుదిరాయి అనుకున్నారు ఇద్దరూ.

"అన్నీ సరిపోయాయా అయితే షావుకారు గారిని పంపించేస్తాను" అంటూ .

"షావుకారు గారు ధన్యవాదాలండీ, మీ చెక్ తీసుకోండి" అన్నారు రావుగారు. చెక్ తీసుకొని షావుకారుగారు వెళ్లిపోయారు. పంతులుగారు వచ్చి చూసి కావలసిన ఏర్పాట్లు చేసి వెళ్ళేరు.

కొత్తకోడలు రావడం, పూజా కార్యక్రమాలు జరగడం అయ్యింది. అప్పటివరకు ఉన్న కొద్దిమంది బంధువులు కూడా వెళ్లిపోయారు. అన్ని పనులు అనుకున్నట్టు పూర్తి అయ్యేయి. రోజులు గడుస్తున్నాయి, విశాల మెల్లగా అలవాటు పడింది. కొత్త, బెరుకు పోయి అందరితో కలిసిపోయింది. స్వతహాగా విశాల చాలా కలుపుగోలు పిల్ల అవ్వడం వలన త్వరగానే కలిసిపోయింది. రాజా, రవి కూడా అక్కా.. అక్కా... అంటూ కబుర్లు చెప్తున్నారు. స్వంత అక్కలాగే చూసుకుంటున్నారు. విశాల కూడా వాళ్ళిద్దరినీ స్వంత తమ్ముళ్లుగానే భావించేది.

రఘు, విశాల కూడా ఎంతో అన్యోన్యంగా ఉంటున్నారు. వాళ్ళ పెళ్లయి నాలుగేళ్లు అయ్యింది.

వాళ్ళ అన్యోన్యతకి గుర్తుగా ముద్దులు మూటకట్టే ముత్యాలు లాంటి ఇద్దరు పిల్లలు పుట్టేరు. బాబు ధీరజ్, పాప నీరజ. పాపని

బహుమతి పొందిన ఫ్యామిలీ సీరియల్

# బాంధవ్యం

ముద్దుగా మున్నీ అని, బాబుని చింటూ అని పిలుచుకుంటున్నారు. మున్నీకి మూడవ నెల వచ్చింది. మెల్ల మెల్లగా బోర్లా పడటానికి ప్రయత్నం చేస్తోంది. అందరూ మున్నీ చుట్టూ చేరి సంబరంగా చూస్తున్నారు. అప్పుడే ఆఫీస్ నుండి మేనేజర్ భాస్కరం వచ్చేడు. రంగన్న వచ్చి ఆ విషయం చెప్పగానే రావుగారు కిందకి వెళ్లి మేనేజరు తో మాట్లాడి మళ్ళీ పైకి వచ్చేసారు.

మర్నాడు ఉదయాన్నే నిద్ర లేచి, విశాల కిందకి వచ్చింది. రోజూ ఆ సమయానికి హడావిడిగా ఉండే కామాక్షి వాళ్ళ వాటా నిశ్శబ్దంగా ఉంది. కామాక్షి పిన్నిగారు ఇంకా లేవలేదా అనుకుంటూ, "పిన్నిగారు… పిన్నిగారు..". అంటూ పిలుస్తూ వస్తున్న విశాలకి ఓ ఉత్తరం ఇచ్చేడు నౌకర్ రంగన్న. అది చదివిన విశాల, పరుగు పరుగున మేడ మీదకి వెళ్లి భర్తని లేపి ఆ ఉత్తరం చూపించింది. రఘు ఆ ఉత్తరం చదివి హతాసుడై,

"అమ్మా.. అమ్మా.." అంటూ తల్లిదండ్రులకు ఆ ఉత్తరం చూపించాడు. వర్ధని మెల్లిగా ఆ ఉత్తరం చూసింది,

"మేము ఇల్లు విడిచి వెళ్లిపోతున్నాం, మమ్మల్ని క్షమించండి.... మీ కామాక్షి." అని ఉంది ఉత్తరంలో. వాళ్లెవరికీ ఏమి అర్థం కాలేదు.

రంగన్నని పిలిచి ఏం జరిగిందని అడిగారు.

"అయ్యా.. రాత్రి బయట పడుకున్న నన్ను నిద్రలేపి, ఈ ఉత్తరం ఇచ్చి రెండు పెట్టెలు పట్టుకొని కారులో ఎల్లిపోయారయ్యా.. అప్పుడు అర్ధరాత్రి ఒంటి గంట అయ్యిందయ్యా… " అన్నాడు.

"అత్తయ్యా.. అత్తయ్యా..." అన్న పిలుపుతో ఉలిక్కిపడి వర్ధనమ్మ గతం లోనుండి ప్రస్తుతానికి వచ్చింది.

"ఏంటత్తాయ్యా, ఏమాలోచిస్తున్నారు, అన్ని సార్లు పిలిచినా పలకలేదు " అంది.

" ఏం లేదమ్మా, కామాక్షి పేరు వినగానే గతం అంతా గుర్తొచ్చింది " అంది అత్తగారు.

" అలా ఎందుకు వెళ్లిపోయారో, పాపం ఏం కష్టం వచ్చిందో వాళ్ళకి, నీకు తెలీదుగాని విశాలా, పాతికేళ్ళు ఒకే కుటుంబం లాగా ఉన్నాం. మీ పెళ్ళికి అన్ని పనులు వాళ్ళే చేసారు. మమ్మల్ని ఒక్క పని కూడా చెయ్యనివ్వలేదు అనుకో. వాళ్ళే లేకపోతే మీ పెళ్లి అంత ఘనంగా చేయటడం మా వల్ల అయ్యే పనేనా, డబ్బుంటే సరా తల్లి, నమ్మకంగా, బాధ్యతగా చేసే మన అనుకునే మనుషులు ఎక్కడ దొరుకుతారు చెప్పు " అంటూ బాధ పడుతున్న అత్తగారితో

" ఊరుకోండి అత్తయ్యా, బాధపడకండి, ఎటూ రేపు రానే వస్తున్నారుగా అన్ని విషయాలు తెలుస్తాయి " అంది విశాల.

"అవునూ, రేపు వాళ్ళు ఎన్నిగంటలకి వస్తామన్నారు, టిఫిన్లు, భోజనాల ఏర్పాట్లు చూడమ్మా, పాత విషయాలు ఏమి వాళ్ళ ముందు అనకుండా జాగ్రత్త పడదాం. వాళ్ళు ఏం చెప్తారో విందాం, ఏమిటో పిచ్చిపిల్ల, ఎలా ఉందో, ఏమిటో " అనుకుంటూ నిద్రలోకి జారుకుంది వర్ధనమ్మ.

(ఇంకా ఉంది )

సాహితి సామ్రాట్ కవితలు

# ఏది సత్యం -ఏదినిత్యం..!!

డా. రాగతి రమ



సన్మార్గం ఆత్మహత్యకు
పాల్పడుతోందని
అరుస్తూ అలసిపోతే.
... పెరిగి పోతున్నవి రాతి హృదయాలు
అంటూ ఆక్రోశిస్తూ అలమటిస్తే
సమానత్వం సమాధి అయిందంటూ
తల్లడిల్లి అల్లాడిపోతే
అక్కడే నువ్వు పొరబడుతున్నావ్.
రాబందులున్న చోట రామ చిలుకలూవుంటాయి.
కాలసర్పాలు చుట్టూనే శాంతివనాలు వుంటాయి.
కావుకావు మనే కాకులమధ్యనే కుహుకుహూ
కోయిలలుంటాయి.
చెదపురుగుల మనసుల మధ్యనే
నిస్వార్ధ చైతన్య హృదయాలుంటాయి
కుత్తుకలు కోసే కత్తుల మధ్యనే
కుట్లు వేసే కరములుంటాయి.
అంతటా దుర్మార్గందే గెలుపుకాదు
సన్మార్గంలో లక్షలాది దివిటీలు
దారి చూపిస్తూ దారి తీస్తుంటాయి.
వెలకట్టలేని అభయ హస్తాలు
ఆకలి తీరుస్తుంటాయి
గ్రహిస్తే ఈ నిజం
మానవత్వం బ్రతికున్నదన్న సత్యం
సోదరా.... ధైర్యంగా మనగలవు భువిపై నిత్యం.

చరిత్రాత్మక సీరియల్

# రాణాప్రతాప్ సీరియల్





డా. పులిచెర్ల సాంబశివరావు

## అసలు రహస్యం!

18, మార్చి, 1576!

అక్బర్ చక్రవర్తి బుర్రనిండా రాణా ప్రతాప్ను గూర్చిన ఆలోచనలే గిర్రున తిరుగు తున్నాయి.

ఉన్నది దర్గాలో! ఆలోచిస్తున్నది దుర్గాల గూర్చి!!

బంగాళాప్రాంతాన్ని పూర్తిగా స్వాధీనం గావించుకొని, పరిపాలనకు తగిన ఏర్పాట్లను గూడా పూర్తిగావించాడు. ఆ మరుసటేడే జోధ్పూర్లో చంద్రసేనుణ్ణి ఓడించి ఆ ప్రాంతాలన్నీ చేపట్టాడు. మొత్తం ఉత్తరభారతం కాశ్మీర్, ఒరిస్సా తప్ప– అక్బర్ వశం అయింది!

చరిత్రాత్మక సీరియల్

# రాణాప్రతాప్



**జరిగిన కథ** అక్బర్ చక్రవర్తి! అశేష సైన్యసమూహాలతో, విశేషాయుధ సంపత్తితో చిత్తోడ్ను కైవసం చేసుకోవడానికి అవకాశం కోసం ఎదురుచూస్తున్నాడు!
ఈ ఆలోచనలతో సతమతమవుతూ, మనశ్శాంతి కోసం ఉదయసింహుడు రాజధానిని విడిచి అరణ్యమార్గాన అనుచరవర్గంతో ఏకలింగనాథస్వామి సన్నిధికి చేరాడు.అక్కడ 'ఓం నమశ్శివాయ!' అంటూ వినపడింది. ఆ శబ్దం వచ్చిన దిశగా వెతుక్కుంటూ వెళితే ఓ సాధువు కనిపించాడు . 'ఉదయా చిత్తోడ్ వదిలి నేను చుపించాచోట కోట నిర్మంచమని చెపుతాడు . దానికి ఉదయసింహుడి మంత్రులు అది పిచ్చి ఆలోచన అంటారు .కాని ఉదయ సింహుడి కొడుకు మాత్రం తండ్రి ఆజ్ఞ పాటించలంటాడు. అక్బర్ అనుమతితో బైరాంఖాన్ తన కరకు కరవాలంతో హేమూ శిరమును ఒక దెబ్బతో తెగనరికాడు .చిత్తోడ్ అక్బర్ వశంఅయ్యింది . అగ్ర కోటకి ఇరు వైపులా జయమల్, పత్తా విగ్రహాలను నిలిపాడు అక్బర్ .చిత్తోడ్ మొత్తం శ్మశానంలా మారిపోయింది.దానితో దిగులుతో మంచం ఎక్కాడు ఉదయ సింహుడు .చిన్నరాణి తనకొడుకు జగమ్మల్లుడికి పట్టాభిషేకం చెయ్యమంటుంది .మాట ఇచ్చి మరణిస్తాడు ఉదయ సింహుడు. కాని అక్కడి సర్దారులు అందుకు ఒప్పుకోరు . రాణాప్రతపుడికే పట్టం కడతారు .దానితో జగమల్లుడు పగ బడతాడు .రాజ మాన్సింగ్ షోలాపూర్ జయిస్తాడు .మాన్సింగ్ ను రణ ప్రత్జాప్ అవమానిస్తాడు . తగిన గుణ పాఠం చెప్పాలని అక్బర్ అనుకుంటాడు .మాన్ సింగ్ ను సర్వ సైన్యా ధ్యక్షుడిగా నియమించి రణ ప్రతాప్ మీదకు యుద్దానికి పంపుతాడు అక్బర్

ఇక చదవండి

ఇక మిగిలింది ప్రతాపుడే!

అతణ్ణి అణిచేస్తేగాని మేవాడు ప్రాంతం పూర్తిగా స్వాధీనంగాదు! అతణ్ణి అంతంచేస్తే గాని రసపుత్రులంతా తనకు లొంగివుండరు.ఇందుకు సమర్థుడెవరు? వజ్రాన్ని వజ్రంతోనే కోయాలి!

అంటే ప్రతాప్ను జయించడానికి మరో రసపుత్రవీరుడే తగినవాడు! అటువంటి వీరుడు మానసింహుడు! వెంటనే చక్రవర్తి మానసింహుడికి కబురుచేశాడు. మానసింహుడు రెక్కలు గట్టుకొనివాలాడు.

"జీ హుజూర్!"

"మాన్సింగ్! నువ్వు అసమాన ప్రతాపశాలివి! ఉత్తరభారతదేశంలో నీయంతటి వీరుడు లేడు! పైగా గొప్ప రసపుత్ర వంశానికి చెందినవాడివి!"

"షాహిన్షా వారు దయాహృదయులు! మనుషుల విలువలను గుర్తించగల ఉదార హృదయులు!"

"అందుకే మిమ్మల్ని మా సేనాపతులుగా నియమించుకున్నాం! మంచుతో నిండిన కాకసస్ నుండి హిందూమహాసముద్రం వరకు గల ఈ విశాల భూఖండాన్ని మీ సాయంతోనే స్వాధీనం గావించుకున్నాం. కాబూల్, అరకాన్ రాజ్యాల్ని అణచడంలో మీ పాత్ర మరువరానిది! మిమ్మల్ని ఇప్పుడు సర్వసేనాధ్యక్షులుగా చేస్తున్నాం!"

"ఇందుకు జన్మజన్మలకూ మీకు ఋణపడి ఉంటాం!"

"పైగా మా బంధుగణంలో మీరు

చరిత్రాత్మక సీరియల్

# రాణాప్రతాప్



ముఖ్యులు! మహారాణి పక్షపు వారంటే మాకు ప్రీతి!"

"అది మా మేనత్తగారి అదృష్టం!"

"ఇప్పుడు మీరు చేయగల కార్యం ఒకటున్నది!"

"మహారాణా ప్రతాపుడు మాకు పక్కలోబల్లెములా వున్నాడు! మా ఆధిపత్యాన్ని తిరస్కరించాడు! చిక్కడు దొరకడు!

కంటిలోని నలుసులా ఈ మహారాణా విషయం మమ్మల్ని అనునిత్యం బాధిస్తోంది!"

"అవును! ప్రతాపుడు పరమ దుర్మార్గుడు. మిమ్మల్ని మమ్మల్ని అవమానించాడు! అహంకారి!"

"అతడి అండ చూచుకొని రాజపుత్రస్థానంలో ప్రతివాడూ మాపై కాలుదువ్వు తున్నాడు!"

"మీరు ఆజ్ఞ ఇవ్వండి జహాపనా! ఆ ప్రతాపుణ్ణి కండకండలుగా కోసి పారేస్తాను! అతడి అండ చూచుకొని ధిక్కరించేవారిని చీల్చి చెండాడతాను!"

"భేష్! మాన్ సింగ్! నువ్వు రెండులక్షల సైన్యంతోనూ, ఆధునిక ఆయుధాలతోను రాణాపై దండెత్తు! ఘాజీఖాన్, ఖ్వాజామహమద్ రఫీ, షియాబుద్దీన్ పైండాకజాక్, ఆలీమురాద్ ఉజ్బెక్, కాజీఖాన్లు మీకు తోడుగా వస్తారు! ప్రతాప్ను బంధించిగానీ, శిరస్సును ఖండించిగానీ మాముందు వుంచు!"

ఏప్రిల్ 3వ తారీఖు 1576! కున్వర్ మాన్ సింగ్ అజ్మీర్ నుండి బయలుదేరాడు. వెంట హేమాహేమీలైన సేనానాయకులున్నారు. ఆసఫ్ ఖాన్, మెహతర్ఖాన్, సయ్యిద్ అహ్మద్, సయ్యద్ హాషిమ్ బెర్హా, రాజా జగన్నాథ్ కచ్చవాహ, రాయ లోన కరణ్ వంటి యోధానయోధులు తమ తమ సైన్యాలతో మాన్సింగ్ వెంట నడిచారు. ఇందులో రాజా జగన్నాథ్ కచ్చవాహగారు స్వయాన మాన్‌సింగ్ మామ!

అబుల్ ఫజల్ ఈ సందర్భంలో తన 'అక్బర్నామా'లో ఇలా వ్రాసుకున్నాడు.

"కున్వర్ మానసింగ్ చక్రవర్తిగారి సర్వసైన్యాధ్యక్షులుగా నియమింపబడ్డాడు. షాహిన్షా వారి ఆస్థానంలో అతడు మిగుల విశ్వాసపాత్రుడూ, సాహసికుడూ, మేధావీ కావడమే దీనిక్కారణం. ఇతర బహూకృతులతో పాటు షాహిన్షా మాన్సింగ్కి ఫరింద్ (కొడుకు)అనే బిరుదును అతని సేవలను మెచ్చి ప్రసాదించారు!" బదౌని మాత్రం మహమ్మదీయ సేనానాయకులు హిందువైన మాన్‌సింగ్ సైన్యాధ్యక్షుడు కావడాన్ని హర్షించలేకపోయిన సంగతి పసిగట్టి తన 'మునతాఖబ్ –ఉత్–తవారిఖ్' లో "ముస్లిం సైన్యాధిపతులు మానసింహుని సర్వసైన్యాధ్యక్షత్వాన్ని నిరసించారు" అని వ్రాశాడు.

అసలు రహస్యం మాత్రం అక్బర్కే తెలుసు!

'మాన్సింగ్ పూర్వులు రాణాల కొలువులో వుండి, శిశోదియా వారికి సేవలొనర్చిన వారు! అందువలన తన పైకి మాన్సింగ్ దండెత్తి వచ్చాడంటే మహా రాణాప్రతాప్ రోషంతో కొండలు, అడవులు విడచి బహిరంగప్రదేశంలో యుద్ధానికి దిగుతాడు. అదే తనక్కావల సింది. కొండల్లోనైతే ప్రతాప్ను పట్టుకోవడం తమకు చేతకాదు కాని, మైదానప్రాంతంలోనైతే అనంతమైన తన సైన్యవాహిని ముందు రాణా తలవంచక తప్పదు!

దేశద్రోహులారా! ఖబడ్దార్!! అజ్మీర్ నుండి మండల్ గఢ్ డెబ్బై మైళ్ళున్నది.

చక్రవర్తి సైన్యవాహిని మండల్ గఢ్ చేరుకొన్నది. మొఘల్ సర్వసైన్యాధ్యక్షుడు కున్వర్మాన్సింగ్! రాజపుత్రుడు! ఆహా! విదేశీదురాక్రమణదారుల

చరిత్రాత్మక సీరియల్

# రాణాప్రతాప్



దమననీతి! ఒక దేశభక్తుణ్ణి అణచడానికి, అతడి పైకి అదే జాతికి చెందిన వీరుణ్ణి వినియోగించడం! ఇద్దర్లో ఎవరు చచ్చినా ఆ దురాక్రమణ దారుడికి ఒకటే!
ఏప్రిల్ మధ్య నుండి జూన్ మధ్య వరకు రెండు నెలలపాటు మాన్సింగ్ మండల్ గఢ్ లోనే మకాం వేశాడు.

రాజా జగన్నాథ్ గారికి చాలా తొందరగా ఉంది.
"ఇంకా ఎన్నాళ్ళు అల్లుడూ! పద! మహారాణాని మసిచేసి వద్దాం!"
కాదు!

మామగారి మాటలకు మాన్సింగ్ నవ్వుకున్నాడు. రాణాతో యుద్ధమంటే మాటలు
"మామయ్యా! నేనిప్పుడు ఊరికే ఉన్నాననుకున్నావా? చూడు! రాణా పాడుపెట్టిన ఆ విశాల భూముల్లో నరపురుగు లేదు! మనం ఇక్కడనుండి చక్రవర్తి గారికి వార్తలు పంపడం ఎలా? ముందుగా ఆ వ్యవస్థ ఏర్పాట్లు చేస్తున్నాను! ఇప్పటికి ఆ పని పూర్తయింది! రెండు నెలలపాటు ఊరికే కూర్చోవాలంటే నా మనస్సు మాత్రం అంగీకరిస్తుందా! ఏం చేద్దాం? ఆ కొండల్లోకి వెళ్ళి మనవాళ్లు మళ్ళీ ప్రాణాలతో తిరిగివస్తారా అని నా అనుమానం! మనం ఇక్కడే కదలకుండా ఉంటే రాణా ఎదురుచూచి, ఎదురుచూచి, ఇక ఓర్చుకోలేక తొందరపడి తనే సైన్యంతో మనపైకి వచ్చాడనుకో...!"

"ఇంకేముంది! మైదానప్రాంతానికి వచ్చాడంటే చచ్చాడే! ఓహ్ నీ బుర్ర అమోఘం
అల్లుడూ! అందుకే షాహిన్షా నిన్ను ఇంత సేనకు నాయకుడుగా నియమించి పంపారు!"

"ఏదో వారి దయ మామా!" అని తన తెలివితేటలకు తనే మురిసిపోయాడు మాన్.

రాణాప్రతాప్ 'గీర్వా' కనుమల మధ్యలో అక్బర్ సైన్యాన్ని ఎదుర్కోవాలని నిశ్చయించాడు. కుంభల్ గఢ్ నుండి కదిలివచ్చి లోక్సాంఘ్ అనే చిన్న గ్రామంలో విడిదిచేశాడు. కుంభల్ గఢ్ పర్వతశ్రేణి హాల్దీఘాటి దగ్గర సన్నటికనుమగా కుంచించుకు పోయింది.

రాణాప్రతాప్ ఎంతకాలానికీ తనపైకి రాకపోయేసరికి చివరకి తనే సహనం కోల్పోయి. మాన్ సింగ్ మండల్ గఢ్ను వీడి, మైదానమార్గం గుండా ఖామ్నోర్ సమీపం లోని మొలీలపట్టణంలో డేరా వేశాడు. మొలీల బనాస్ నదిఒడ్డున వుంది. బనాస్నది పడమటి

పర్వతాలనుండి చంబల్ లోకి ప్రవహిస్తుంది.

రాణా విడిదిచేసిన లోహ్ సింఘ్కి, మాన్సింగ్ ఉన్న మొలీలకూ సరిగ్గా పదిమైళ్ళ దూరం వుంది!

రాణా ఎన్నుకున్న స్థలం వ్యూహరీత్యా అత్యుత్తమమైంది. ప్రతాపుని సైన్యంపై ఈగ కూడా వాలడానికి వీలులేని చోటు అది! కొండలనడుమ, సన్నని ఇరుకైన మార్గం ద్వారా ఒక్కటిన్నర మైలు నడిస్తే గాని ఎవరైనా ఆ ప్రాంతానికి చేరలేరు. దారి ఎంత చిన్నదంటే, అందులోనుండి ఒక మనిషి మాత్రమే నడవగలడు!

గుర్రమైతే ఎంతో కష్టంమీద కాలు వేస్తుంది! ఆ మార్గంలో మధ్యమధ్య కొన్ని చోట్ల ఏమాత్రం అశ్రద్ధగా నడిచినా అంతేసంగతులు! ఆ లోయలో ఇరుక్కుపోయిన వాళ్ళు మళ్ళా బ్రతికిబయటపడలేరు!

ఒకసారి లోనికి ప్రవేశిస్తే బయటకు వేరే దారే ఉండదు. చుట్టూ ఎత్తయిన పర్వతాల శిలలు పెట్టని గోడలవలె ఉంటాయి. కేవలం కొంతమంది అశ్వికులు ఆ కనుమ ముఖం దగ్గర కాపలా వుంటే చాలు! వందలమంది శత్రువులను నిలువరింపగలుగుతారు! ఒకవేళ అనుకోని రీతిలో ప్రమాదం ముంచుకువస్తే, వెంటనే అక్కడి వీరులు కొండల్లోకి కోనల్లోకి

చరిత్రాత్మక సీరియల్

# రాణాప్రతాప్



మాయమై పోవచ్చు! వారిని వెతికి వెంటాడుదా మనుకున్నవాళ్ళు హతమైపోతారు.

శత్రువులకు ఎక్కడ చెట్టుందో, ఎక్కడ గుట్ట వుందో తెలీదు. స్థానికులకు అవన్నీ కొట్టినపిండి! మైదానప్రాంతాల్లో యుద్ధం చేసే వాళ్ళు ఇక్కడ చిల్లిగవ్వక్కూడా కొరగారు! అక్కడ చిక్కుకుపోతే శత్రువులు ఆకలిదప్పులతో అల్లాడి నరకయాతన పడతారు! ఆకులలములు తినే అలవాటున్న స్థానికులకు అది స్వర్గం.

మహారాణా ప్రతాప్ అటువంటి కీలకప్రదేశంలో తన అనుచరులను నిలిపి యుద్ధపు ఏర్పాటులను పర్యవేక్షిస్తున్నాడు.

దూరాజురాబియా, నేతాశిదోయాతో కూడి వేగంగా వచ్చి ప్రభువు ప్రోల నిలిచాడు! వాళ్ళిద్దరూ ప్రతాపుని గూఢచారులు.

"ప్రభూ! మాన్ సింగ్ తన సైన్యంతో బనాస్నదీతీరంలో బిచాణావేశాడు. ఇవ్వాళ గీర్వాకనుమ సమీపానికి సైన్యాన్ని పంపాడు!" అని మనవిచేశారు.

వెంటనే ప్రతాపుడు తన సైన్యాన్ని సిద్ధపరిచాడు.

3,000 ఆశ్వికులు, 2,000 పదాతిదళం, 100 గజసైన్యం, 100 మంది యుద్ధభేరీలు, కాహళాలు మోగించేవారు – ఇదీ రాణా సైన్యం. ప్రతాప్ వీరవరులైన తన అనుచరులను పేరుపేరునా పిలిచాడు.

"హకీమూర్ పఠాన్!"

"ప్రభూ!"

"సకల శూర లాంఛనాలనూ నీకు ప్రసాదిస్తున్నాం! నీవే మా సైన్యానికి నాయకు డివి! మతం వేరైనా నీ దేశభక్తి మా అందరికీ సమ్మతం! అందుకో ఈ కైజారును!"

హకీమూర్ వినయంతో రాణా అందించిన కైజారును కన్నులకద్దుకొని తీసుకున్నాడు.

"సలుంబరికి చెందిన చందావత్ కృష్ణదాస్, సర్దార్కి చెందిన భీమ్‌సింగ్, దియోగఢ్కా చెందిన రావత్సంగా, బదనోర్కి చెందిన రాథోడ్ రాందాస్లు మన సేనాపతులు!"

ఆ వీరులంతా ముందుకువచ్చి మహారాణాకు వినయంగా వంగి నమస్కరించారు. అందరికీ ప్రతాప్ తాంబూలాలు ప్రసాదించాడు. రాథోడ్ రాందాస్ తాంబూలం అందుకొని ప్రతాపుని పాదాలకు వంగి నమస్కరించాడు. ప్రతాపుని కన్నులు తళుక్కున మెరిశాయి.

"వీరకిశోరమా! నీ తండ్రి జయమల్ మహాదేశభక్తుడు! మాకు పితృతుల్యుడు! చిత్తోడ్ సంరక్షణార్థం ప్రాణాలర్పించిన శూరశేఖరుడు! అట్టి సింహం కడుపున పుట్టిన శూర శిఖామణివి నువ్వు! రసపుత్ర వీరవరులకిది పరీక్షాసమయం! నిష్కళంకమైన మీ వంశ ప్రతిష్ఠకు వన్నెతెచ్చే విధంగా వీరవిహారం చేయి!"

"మహాప్రసాదం!" అని ఆ వీరసింహం ఠీవిగా నడచిపోయింది. "రాజారామ్సింగ్ తువార్!"

"మహారాణా!"

"మీ గ్వాలియర్ కోటను ఆక్రమించుకున్న దుర్మార్గులపై పగతీర్చుకొనే తరుణమిదే! మీ ముగ్గురు కుమారులతోగూడి ఈ కుడిపక్కన సమరం సాగించండి!" రామ్సింగ్ తన కుమారులైన శాలివాహన్, భవానిసింగ్, ప్రతాపసింగులు వెంట రాగా రాణా వద్దనుండి తాంబూలం స్వీకరించాడు.

"మాన్సింగ్ ఝూలా!" ప్రభుశక్తిపరాయణుడైన ఝూలామాన్‌సింగ్ రాణాకు నమస్కరించి, చేతులు కట్టుకొని నిలుచున్నాడు.

చరిత్రాత్మక సీరియల్

# రాణాప్రతాప్



ఎంత తేడా?

ఇద్దరూ పేరుకు మాన్సింగులే! కానీ ఒకడు దేశద్రోహి! విదేశీయుడికి తొత్తుగా

మారి పవిత్ర భరతమాతను సంకెళ్ళతో బంధింపజూచే దుర్మార్గుడు ఆ మాన్సింగ్! మరి ఇతడు? తన ప్రాణాలను పణంగా పెట్టి అయినాసరే మహా దేశభక్తుడైన వీరప్రతాపుణ్ణి రక్షించుకోవాలనే దీక్షగలవాడు ఈ మాన్సింగ్! ఝూలామాన్సింగ్ తాత కాణ్వాయుద్ధంలో రాణాసంగ్రామునికి తోడుగా ఉండి బాబర్ని ఎదిరించాడు. ఇప్పుడితడు రాణాప్రతాపునికి తోడుగా వుండి అక్బర్ సైన్యాన్ని ఎదిరించాడు!

“దేశభక్తాగ్రగణ్యా! మానసింహా! కత్తిపట్టుకుని కదనరంగంలో దూకితే మాన సింహునితో సమానులే లేరనిపించుకున్న శౌర్యఖనివి! నీవు ఎడమవైపున నిలువు! ఝూలార్కు చెందిన అక్షయరాజ్ కుమారరత్నం మాన్సింగ్ సోనాగ్ర, బాది–సాద్రి రాజైన ఝూలాబిడ నీకు తోడునీడగా ఉంటారు.”

“ప్రభూ! నేనెక్కడున్నా నా మనసుమాత్రం మిమ్మల్ని వెన్నంటే వుంటుంది. అవసరం వచ్చినప్పుడు నా స్థానాన్ని వదలి మీ సమీపానికి వచ్చి సమరం సాగించడానికి అనుమతినీయండి!” అని ఝూలామాన్సింగ్ వేడుకున్నాడు. “అలాగే కానివ్వండి!” రాణా అనుమతిని ప్రసాదించాడు.

పనర్వాకి చెందిన రాణాపుంజాను సైన్యం వెనుకభాగాన నిలిపాడు. పురోహిత్ గోపీనాథ్, జగన్నాథ్, జైసా, సోనియానా చరణలను రాణా పుంజాకు అండగా ఉండవలసిందిగా

ప్రతాప్ ఆజ్ఞాపించాడు.

ఘాటీ మధ్యభాగాన మహారాణాప్రతాప్ చేతకాశ్వంపై నిలిచాడు. ఆయన వెనుక మంత్రి తారాచంద్ నిలిచాడు. రాణాపుంజా సైన్యం ముఖ్యభాగం భిల్లులే ఆక్రమించుకున్నారు! ఘాటీకి ఇరుప్రక్కలా వున్న పెద్ద పెద్ద బండలచాటున భిల్లులు మాటువేశారు. చిన్న కత్తులు, విల్లమ్ములు, బండరాళ్ళు – ఇవే వారి ఆయుధాలు. వీటికంటే మించిన పెద్ద ఆయుధం వారి దగ్గర ఉంది. అదే దేశభక్తి! మహారాణాప్రతాపుణ్ణి వారు ఆరాధిస్తారు. ఆయన కోసం ఏం చేయడానికైనా వాళ్ళు సిద్ధమే!

రాణా సైన్యం భిల్లులతో కలిసి మొత్తం, 22,000 మాత్రమే! కానీ ఒక్కొక్కడు ఒక్కొక్క సింహం! దేశ ద్రోహులను చీల్చి చెండాడి, వారి రుధిరధారలు కడుపార గ్రోలాలనే ఉత్సాహంతో వీరసింహాలు హాల్దీఘాటీకి నడిచాయి.!

(ఇంకా ఉంది )

సాహితి సామ్రాట్ కవితలు

# పొడిచే పొద్దు

## బొప్పెన వెంకటేష్

ఉన్నదాన్ని పంచుకు తిని

పరాకతు పరమయిన (కు)పాలకులు

రాజ్యం పులిమిన కాకి బంగారం ఛాయలో
ఒట్టిపోతున్న ప్రజ

ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో

కనీసం ఒక్కడుంటే ఒక్కడైనా ఉంటాడు

వాడే..

పశ్చిమాన్ని పొడిచే పొద్దు..!!

మేము చేతులు జోడించాం

వాడు పిడికిలి బిగించాడు

మేం కాళ్లకు చెప్పులేసుకున్నం

వాడు గజ్జె కట్టుకున్నాడు

మేం గంజి తాగి చల్లబడ్డాం

వాడు గింజను మర్లించిన
వాడి పై ఉడుకెత్తాడు

మేం అడుక్కున్నాం

వాడు ప్రశ్నించాడు

మేం చూస్తూ చూస్తూ ఊరుకుండి పోయాం

వాడు ఏదో చేయాలని ఏరు దాటాడు

మేం చిల్లుకానికి చివికిన డప్పు కొట్టాం

వాడు నడి ఒడ్డున దండోరా వేశాడు

ఈ రాజ్యం కూలాలని..!!

జాతినిండా జవసత్వాలు పొరలి

చైతన్య గొంతుక కదం తొక్కింది

మదుగు కట్టిన ప్రభుత్వం మీద

## సదాశివ శతకం

అయోధ్యకు రాముడొచ్చాడని ఆనందిస్తున్నారు తప్ప

లోపలున్న ఆత్మా రాముడు అరుపులకు భయపడి

మనసులో నుండి పరిపోతున్నాడని గ్రహించరేమిరా

దేవుడైన జీవుడైనా మనలోనే ఉన్నాడు కదరా సదాశివా

సహస్ర వ్యాస కవి

వార్తల్లో వ్యక్తి

## భారత రత్న

# కర్పూరీ ఠాగూర్



. మాజీ ముఖ్యమంత్రి ఆయన బీహార్ ముఖ్య మంత్రిగా వుండగా, తదనంతర కాలంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన యశ్వంత్ సిన్హా ఐఏఎస్ అధికారిగా వుండి, కర్పూరీ ఠాకూర్ కు కార్యదర్శిగా పనిచేశాడట.

ఆయన ఒకసారి కర్పూరీ ఠాకూర్ స్వగ్రామానికి వెళితే, ఆయన వుంటున్నది ఒక చిన్న పూరిగుడిసెలోనట. ముఖ్య మంత్రిగారి భార్య ఈయనకు కట్టెల పొయ్యి మీద టీ పెట్టి ఇస్తే, యస్వంత్ సిన్హా కళ్ళ వెంట నీళ్లు వచ్చాయట.

కర్పూరీ ఠాకూర్ తండ్రి 85 ఏళ్ళ వయసులో కూడా తన కులవృత్తిని కొనసాగించేవాడట. ముఖ్య మంత్రి తండ్రయి వుండి, ఇంకా ఈ పనెందుకని ఎవరైనా అడిగితే, "మావాడు జులాయిగా తిరుగుతున్నాడు. నేను కూడా పని మానేస్తే, ఇల్లు ఎట్లా గడుస్తుంది" అనే వాడట ఆయన.

కర్పూరీ ఠాకూర్ ఒకసారి జయప్రకాష్ నారాయణ్ జయంతి కార్యక్రమానికి చిరిగిన చొక్కాతో వెళ్ళాడట. అది చూసిన చంద్రశేఖర్ "వీడికి చొక్కా కొనుక్కోవడానికి చందాలివ్వండి" అని ఎగతాళిగా అన్నాడట.

కర్పూరీ ఠాకూర్ వెంటనే తన ముందు ఒక గుడ్డ పరుచుకొని కూర్చున్నాడట.

వచ్చిన డబ్బులను సీ.యం. రిలీఫ్ ఫండుకు జమచేశాడట. ను మరణానంతరం భారత అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న వరించింది. జన నాయక్‌గా ప్రసిద్ధి చెందిన ఆయన రెండుసార్లు బిహార్ సీఎంగా పని చేశారు. కర్పూరీ థాకూర్ శతజయంతి సందర్భంగా ఆయనకు కేంద్రం భారతరత్న పురస్కారాన్ని ప్రకటించింది. కర్పూరి ఠాకూర్ బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాలోని పితౌంజియా (ప్రస్తుతం కర్పూరి గ్రామం) గ్రామంలో గోకుల్ ఠాకూర్ మరియు రామ్‌దులారి దేవి దంపతులకు జన్మించారు. 1924 జనవరి 24న నాయీ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించిన కర్పూరీ థాకూర్ టీచర్‌గా తన జీవన ప్రయాణాన్ని ప్రారంభించారు.

కర్పూరి ఠాకూర్, నాయి కమ్యూనిటీకి చెందిన, ఇతర వెనుకబడిన తరగతుల (OBCలు) లో అత్యంత వెనుకబడిన తరగతి (EBC), సమస్తిపూర్‌లోని రాజ్‌పుత్-ఆధిపత్య గ్రామమైన పితౌంజియా (ప్రస్తుతం కర్పూరి గ్రామం) నుండి రాజకీయ శక్తిగా ఉద్భవించారు. జిల్లా. ఆయన రాజకీయ ప్రయాణం 1952లో శాసనసభ ఎన్నికలలో గెలుపొందడంతో ప్రారంభమైంది మరియు 1985లో తన చివరి అసెంబ్లీ ఎన్నికల వరకు శాసనసభ్యుడిగా కొనసాగారు. ఠాకూర్ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న సమయంలో జైలు శిక్షను కూడా ఎదుర్కొంటూ ప్రజా సేవ పట్ల తిరుగులేని నిబద్ధతను ప్రదర్శించారు.

కర్పూరి ఠాకుర్ బిహార్‌లో సామాజిక ఉద్యమానికి ఓ చిహ్నంబిహార్‌లో కనీసం రెండు శాతం కూడా లేని నాయీబ్రాహ్మణ కులంలో పుట్టి, పెద్ద నాయకుడిగా ఎదిగిన కర్పూరి ఠాకూర్ ఆశయాలు సాకారం చేస్తామని ఆయన జన్మదినోత్సవం నాడు రాజకీయ పార్టీలు ప్రతిన పూనుతుంటాయి. అందుకే ఆయన వారసత్వానికి తామే




భారత రత్న

# కర్పూరీ ఠాగూర్

ప్రతినిధులమని చెప్పుకొనేవారు పెరుగుతున్నారు

ఠాకూర్ రాజకీయ ప్రయాణంలో ఆయన రెండుసార్లు బీహార్ ముఖ్యమంత్రి అయ్యాడు, అయితే అతని పదవీకాలం స్వల్పకాలికం. మైనారిటీ నాయి (మంగలి) కులానికి చెందినప్పటికీ, ఠాకూర్ బీహార్‌లో వెనుకబడిన కుల నాయకుడిగా ప్రముఖంగా ఎదిగారు, రాష్ట్ర రాజకీయ దృశ్యంపై చెరగని ముద్ర వేశారు.

జయప్రకాష్ నారాయణ్, డాక్టర్ రామ్‌మనోహర్ లోహియా మరియు రామనందన్ మిశ్రా వంటి ప్రముఖుల మార్గదర్శకత్వంలో కర్పూరి ఠాకూర్ యొక్క రాజకీయ ప్రయాణం, స్వాతంత్ర్య సమరయోధుడిగా మరియు అంకితభావంతో కూడిన సోషలిస్ట్‌గా ప్రారంభమైంది. ఈ కాలం అతని తరువాతి రాజకీయ జీవితాన్ని నిర్వచించే సోషలిస్ట్ ఆదర్శాలు మరియు సూత్రాల పట్ల అతని నిబద్ధతకు పునాది వేసింది. ప్రాముఖ్యతను సంతరించుకుని, ఠాకూర్ 1970లో బీహార్ ముఖ్యమంత్రి అయ్యాడు,

హిందీని ప్రోత్సహించడం, ఉర్దూను రెండవ అధికార భాషగా ప్రకటించడం మరియు విస్తృతమైన సామాజిక-ఆర్థిక సంస్కరణలను ప్రారంభించడం వంటి అతని విధానాలు రాష్ట్రంపై చెరగని ముద్ర వేసాయి. ర్పూరి ఠాకుర్ 1967లో తొలిసారి ఉప ముఖ్యమంత్రి కాగానే స్కూల్స్‌లో ఇంగ్లిష్‌ను రద్దు చేశారు. దీనిపై అనేక విమర్శలు వచ్చాయి. కానీ దీనివల్ల ఆయన సామాన్యుల వద్దకు చదువును తీసుకువెళ్ళగలిగారనేది నిజం. అప్పట్లో మెట్రిక్యులేషన్‌లో ఇంగ్లిష్ సబ్జెక్టులో తప్పినవారంతా తాము 'కర్పూరి డివిజన్' పాసయ్యామని సరదాగా చెప్పుకుంటూ ఉండేవారు. ఠాకుర్ ఉపముఖ్యమంత్రితోపాటు విద్యాశాఖను కూడా చూసేవారు. ఆయన చేసిన ప్రయత్నాల కారణంగా మిషనరీ స్కూళ్ళు హిందీలో విద్యాబోధన ప్రారంభించాయి.ఆర్థికంగా వెనుకబడిన వర్గాల పిల్లలకు ఆయన స్కూలు ఫీజులను రద్దు చేశారు. భారతదేశంలో మెట్రిక్యులేషన్ వరకు ఉచిత విద్యను ప్రకటించిన తొలి ముఖ్యమంత్రి కూడా కర్పూరీ ఠాకురే.బిహార్‌లో ఉర్దూను రెండో అధికార భాషగా చేసేందుకు ఆయన ప్రయత్నించారు.1971లో ఆయన ముఖ్యమంత్రి అయ్యాక ఆదాయం లేని భూములపై పన్నును రద్దుచేసి రైతులకు అతిపెద్ద ఊరట కలిగించారు. అప్పట్లో బిహార్ సచివాలయంలో నాలుగోతరగతి ఉద్యోగులకు లిఫ్టును వినియోగించుకోవడానికి అవకాశం ఉండేది కాదు.ఠాకుర్ ముఖ్యమంత్రి కాగానే నాలుగో తరగతి ఉద్యోగులు కూడా లిఫ్టును ఉపయోగించుకునే వెసులుబాటు కల్పించారు.

ఇక రెండోసారి 1977లో కర్పూరి ఠాకుర్ ముఖ్యమంత్రి అయ్యాక మంజిరీలాల్ కమిషన్ ద్వారా ఉద్యోగ రిజర్వేషన్లు అమలు చేసినందుకు అగ్రవర్ణాల వారికి శత్రువుగా మారారు.కానీ ఆయన వెనుకబడిన కులాలకోసం పనిచేయడం మాత్రం ఆపలేదు.

బిహార్‌లోని అన్ని ప్రభుత్వ శాఖలు హిందీలోనే కార్యకలాపాలు సాగించడాన్ని ఆయన తప్పనిసరి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికి ఈక్వల్ పే కమిషన్ అమలు చేసిన మొదటి వ్యక్తి కూడా ఆయనే. యువతకు ఉద్యోగకల్పన కోసం ఆయన కట్టుబడి ఉండేవారు. ఆయన దాదాపు 9,000 మంది ఇంజనీర్లు, డాక్టర్లకు ఉద్యోగాలు కల్పించారు. దీని తరువాత ఇప్పటిదాకా ఇంత పెద్ద సంఖ్యలో ఇంజనీర్లు, డాక్టర్లను నియమించుకోవడమనేది ఏ ప్రభుత్వానికీ సాధ్యం కాలేదు. రాజకీయాలలో పేదవారి గొంతు వినిపించాలని ఆయన

వార్తల్లో వ్యక్తి

భారత రత్న

# కర్పూరీ ఠాగూర్

రాత్రింబవళ్ళు పనిచేసేవారు. ఆయనకు సాహిత్యం, సంస్కృతిపట్ల మక్కువ ఎక్కువగా ఉండేది.

రాజకీయాలలో సుదీర్ఘకాలం ప్రయాణించిన ఠాకుర్, చనిపోయేనాటికి తనకు గానీ, తన కుటుంబసభ్యులకు గానీ సొంత ఇంటిని కూడా సమకూర్చలేకపోయారు.పాట్నాలో కానీ, లేదంటే తన పూర్వీకుల నుంచి వచ్చిన ఇంటికి అదనంగా ఓ గజాన్ని కొనడం కానీ ఆయన చేయలేదు. ప్రతిరోజూ కోట్లాది రూపాయల కుంభకోణాలలో చిక్కుకున్న రాజకీయనాయకుల పేర్లు వింటున్న ఈరోజుల్లో కర్పూరి లాంటి నేత ఒకరున్నారంటే నమ్మశక్యం కాకుండా ఉంటుంది.కర్పూరి ఠాకుర్ నిజాయితీ గురించి బిహార్‌లో కథలుకథలుగా చెప్పుకుంటారు.

ఒకరోజు కర్పూరి ఠాకుర్ వద్దకు సమీపబంధువు ఒకరు వచ్చి తనకో ఉద్యోగం ఇప్పించడానికి సిఫార్సు చేయమని అడిగారు. దీనిపై ఠాకుర్ కోపగించుకున్నారని, జేబులోంచి 50 రూపాయలు తీసి ఆయనకు ఇచ్చి, వెళ్ళి గడ్డం గీసే కత్తి కొనుక్కుని పూర్వీకుల నుంచి వస్తున్న పని చేసుకోమని చెప్పారని కర్పూరితో పనిచేసిన కొందరు గుర్తు చేసుకున్నారు.కర్పూరి ఠాకుర్ ముఖ్యమంత్రిగా ఉన్న రోజులలో ఆయన స్వగ్రామంలో కొందరు భూస్వాములు కర్పూరి ఠాకుర్ తండ్రిని హేళన చేయడానికి ప్రయత్నించారు.ఈ వార్త అంతటా తెలియడంతో డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ ఆ గ్రామానికి వెళ్ళి భూస్వాములపై చర్యలు తీసుకోవడానికి సిద్ధపడ్డారు.కానీ కర్పూరి ఠాకుర్ వారిపై చర్యలు




తీసుకోవద్దని ప్రతిగ్రామంలోనూ అణగారిన వర్గాలు ఇటువంటి అవమానాలు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

కర్పూరి ఠాకుర్ ముఖ్యమంత్రి అయిన కొత్తలో తన కుమారుడు రామ్‌నాథ్‌కు ఓ లేఖ రాశారు. దీని గురించి రామ్‌నాథ్ మాట్లాడుతూ '' ఆ లేఖలో మూడే విషయాలున్నాయి. నా పదవిని చూసి ఎటువంటి ప్రభావానికి గురికావద్దు, ఎవరైనా నిన్ను ప్రలోభపెట్టినా అందులో చిక్కుకోకు. దీనివల్ల నాకు చెడ్డపేరు వస్తుంది'' అని రాశారు

' కర్పూరి ఠాకుర్ ఆర్థిక సమస్యల గురించి తెలిసిన దేవీలాల్ కర్పూర్జీ ఎప్పుడు డబ్బులు అడిగినా ఇవ్వండి. ఆ డబ్బులు నాకు అప్పుగా ఇచ్చాను అనుకోండి అని పట్నాలోని తన హరియాణా స్నేహితులకు చెప్పారు. తరువాత దేవీలాల్ చాలాసార్లు కర్పూర్జీ డబ్బులు తీసుకున్నారా లేదా అని స్నేహితులను ఆరా తీసినప్పుడల్లా వారు కర్పూర్జీ డబ్బులు తీసుకోలేదనే చెప్పేవారు. అసలు ఆయన దేని గురించి అడిగేవారు కాదని చెప్పేవారు'' అని ఉత్తర ప్రదేశ్‌కు చెందిన ప్రముఖ నాయకుడు హేమవతి నందన్ బహుగుణ తన జ్ఞాపకాలలో రాసుకున్నారు.

తన తండ్రి నిరాండబరత గురించి రామ్‌నాథ్ ఓ సంఘటన గుర్తు చేసుకున్నారు. '' 1952లో జననాయక్ ఎమ్మెల్యే అయ్యారు. ఆయన ఓ సమావేశానికి ఆస్ట్రియా వెళ్ళాల్సి వచ్చింది. ఆయన దగ్గర కోటు లేదు. దీంతో తన స్నేహితుడిని అడిగి ఆయన కోటు తీసుకున్నారు. ఆయన అక్కడి నుంచి యుగోస్లోవియా వెళ్ళారు. అయితే కర్పూర్జీ కోటు చిరిగిపోవడాన్ని మార్షల్ గమనించి ఆయనకు ఓ కోటు అందించాడు'' అని తెలిపారు

## వార్తల్లో వ్యక్తి

### భారత రత్న

# కర్పూరీ ఠాగూర్

సామాజిక రాజకీయాలలో కర్పూరి ఓ గొప్పనాయకుడని ప్రేమ్ కుమార్ మణి చెప్పారు. ఆయన పేరు చెప్పుకుంటున్నవారు నిరాండబరత, నిజాయితీలలో ఆయన దారిని అనుసరించే సాహసం చేయలేరని, అందుకే కర్పూరి లాంటి నేతలు గుర్తుండిపోతారని తెలిపారు.

ఆయన బీహార్ ముఖ్య మంత్రిగా వుండగా, తదనంతర కాలంలో కేంద్ర మంత్రిగా పనిచేసిన యశ్వంత్ సిన్హా ఐఏఎస్ అధికారిగా వుండి, కర్పూరీ ఠాకూర్ కు కార్యదర్శిగా పనిచేశాడట. ఆయన ఒకసారి కర్పూరీ ఠాకూర్ స్వగ్రామానికి వెళితే, ఆయన వుంటున్నది ఒక చిన్న పూరిగుడిసెలోనట. ముఖ్య మంత్రిగారి భార్య ఈయనకు కట్టెల పొయ్యి మీద టీ పెట్టి ఇస్తే, యస్వంత్ సిన్హా కళ్ళ వెంట నీళ్లు వచ్చాయుట.

కర్పూరీ ఠాకూర్ తండ్రి 85 ఏళ్ళ వయసులో కూడా తన కులవృత్తిని కొనసాగించేవాడట. ముఖ్య మంత్రి తండ్రయి వుండి, ఇంకా ఈ పనెందుకని ఎవరైనా అడిగితే, "మావాడు జులాయిగా తిరుగుతున్నాడు. నేను కూడా పని మానేస్తే, ఇల్లు ఎట్లా గడుస్తుంది" అనే వాడట ఆయన.

కర్పూరీ ఠాకూర్ ఒకసారి జయప్రకాష్ నారాయణ్ జయంతి కార్యక్రమానికి చిరిగిన చొక్కాతో వెళ్ళాడట. అది చూసిన చంద్రశేఖర్ "వీడికి చొక్కా కొనుక్కోవడానికి చందాలివ్వండి" అని ఎగతాళిగా అన్నాడట. కర్పూరీ ఠాకూర్ వెంటనే తన ముందు ఒక గుడ్డ పరుచుకొని కూర్చున్నాడట. వచ్చిన డబ్బులను సీ.యం. రిలీఫ్ ఫండుకు జమచేశాడట.

అయితే బిహార్ రాజకీయాలలో పార్టీలు మార్చడం, ఒత్తిడితో కూడిన రాజకీయాలు చేయడంపై కర్పూరిపై విమర్శలు ఉన్నాయి. రాజకీయ వంచకుడనే విమర్శలు వచ్చాయి. కులసమీకరణాలను దృష్టిలో పెట్టుకుని అభ్యర్థులను ఎంపిక చేస్తున్నారని ప్రజలు ఆయనను ప్రశ్నిస్తుండేవారు. కానీ బిహార్ సంప్రదాయ వ్యవస్థలో అణగారిన కోట్లాదిమంది ప్రజల గొంతుకగా కర్పూరీ నిలిచారు.

అత్యంత వెనుకబడిన తరగతి (EBC) నాయకుడిగా ముద్ర వేయబడిన అతను రాజకీయ ఔచిత్యాన్ని నిలుపుకోవడానికి చాలా కష్టపడ్డాడు. ముఖ్యంగా అతని రిజర్వేషన్ విధానానికి సంబంధించి విమర్శలు పెరిగాయి మరియు 1988లో నక్సలైట్లు 42 మంది అగ్రవర్ణ వ్యక్తులను చంపిన గ్రామాన్ని సందర్శించినప్పుడు ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కొన్నారు. ఠాకూర్ యొక్క అత్యంత శాశ్వతమైన వారసత్వం అతని రిజర్వేషన్ విధానంలో ఉంది. 1978లో, అతను 26% రిజర్వేషన్లను అందించడానికి ప్రతిఘటనను అధిగమించి లేయర్డ్ రిజర్వేషన్ విధానాన్ని అమలు చేశాడు, ఈ నమూనాలో OBCలు, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు, మహిళలు మరియు అగ్రవర్ణాల నుండి ఆర్థికంగా వెనుకబడిన తరగతులు ఉన్నాయి. ఈ ప్రగతిశీల నమూనా ఆర్థికంగా బలహీనమైన విభాగం కోటాను ప్రవేశపెట్టడం వంటి తదుపరి పరిణామాలకు నాంది పలికింది

1976లో ముంగేరి లాల్ కమిషన్ సిఫార్సులకు ప్రతిస్పందనగా ప్రవేశపెట్టిన 'కర్పూరీ ఠాకూర్ ఫార్ములా' 26% రిజర్వేషన్లు, OBCలు, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు OBCలు, మహిళలు మరియు అగ్రవర్ణాల పేదలకు వాటాలను పంపిణీ చేసింది. ఈ నిర్ణయం దీర్ఘకాలంలో ప్రభావం చూపినప్పటికీ, ఠాకూర్‌కు రాజకీయంగా నష్టం వాటిల్లింది, ఇది అతని ప్రభుత్వ పతనానికి దారితీసింది.

★★★

క్రైం
సీరియల్




"మనం అనుకున్న ప్లాన్ అనుకున్నట్లు గానే జరుగుతోంది కదా ?" ఓ ఆడగొంతు అడిగింది

" నువ్వు చెప్పటం, నేను అమలు చెయ్యక పోవటమా? ఇంత వరకూ అవకున్నది అనుకు న్నట్లే జరిగింది. ఇక ముందు చూడాలి..' ఓ మగ గొంతు సమాధానం చెప్పింది.

'మన మధ్యనున్న సంబంధ ఎవ్వరికీ తెలియదు కదా ?" మళ్లీ అదే మగ గొంతు

'ఏం తెలిస్తే మీ ఆవిడ గొడవ చేస్తుందా ?" నవ్వుతూ అంది ఆడగొంతు

క్రైం
సీరియల్

# గర్భ శ్లోకం

**జరిగిన కథ**

ఓ గుర్తు తెలియని మహిళ , పోలీసులు వెంబడిస్తుంటే తన బిడ్డతో సహా కృష్ణా నదిలోకి దూకుతుంది .ప్రముఖ హీరోయిన్ సుస్మిత హత్యకు గురవుతుంది .డి సి పి శ్రీనివాస రావు కేసు టేక్ అప్ చేస్తాడు .సుస్మితను పెళ్లి చేసుకోమని హీరో నవీన్ బ్లాక్మెయిల్ చేస్తుంటాడు .జూనియర్ ఆర్టిస్ట్ కాంతం తన కూతురు సుస్మితని ఇండస్ట్రీలో పెద్ద స్టార్ని చెయ్యాలని ప్రయత్నిస్తుంది.డి . సి పి మళ్ళీ ఒకసారి హత్యా జరిగిన ఇంట్లో వాళ్ళఅందరిని ప్రశ్నిస్తాడు . ఊరి శివార్లలో ఎవరిదో శవం ఉన్నాడని తెలిసి అక్కడకు వెళతాడు డి .సి .పి.అక్కడ శవం పక్కన పోలీసులు పెట్టుకునే స్టార్ పడి ఉంటుంది. సుస్మితను పెళ్లి చేసుకోవటానికి నవీన్ ఇష్టపడకపోతే సి .ఐ. అంబుజం ఒప్పిస్తాడు. సి సి టి వి ఫుటేజిలు పరిశీలించిన డి . సి .పి ఏదో అర్థమయిన వాడిలా తన బృందంతో ముందుకు కదులుతాడు. ఎంత ప్రయత్నించినా ఒక్క సాక్ష్యం కుడా సేకరించలేక పోవటంతో సుస్మిత నటించిన సినిమాల్లో పనిచేసిన వాళ్ళను ఇంటరాగేట్చెయ్యాలని నిర్ణయించుకుంటారు. తీర వాహిని స్టూడియో కి వివేక్ వెళ్లేసరికి డైరెక్టర్ అనిల్ కుమార్ తన కారవాన్ లో చచ్చిపడి ఉంటాడు . డి.సి.పి తన బృందం తో అక్కడి కెళ్ళి దర్యాప్తు చేస్తే అనిల్ ని చంపింది కుడా ఒక ఆడదే అని తెలుస్తుంది.ఉష మీద అనుమానం తో ఆమె ఫోటో తో పోల్చి చూస్తాడు వివేక్ .సుస్మిత వేణు అవుట్ డోర్ షూటింగ్ కి వెళతారు .వాళ్ళతో పాటు రౌడి శంకర్ కుడా వాళ్ళను అనుసరిస్తాడు . **చదవండి**

"మా ఆవిడదేముంది, పిచ్చిమొఖం. బయటకు తెలిస్తే మన అనకున్న దంతా తల.. కిందులౌతుంది. ఇప్పటిదాక అవష్ట వశాత్తు మనకు అన్ని కలసి వచ్చాయి కాబట్టి మన ప్లాను అమలు వెయ్యగలుగుతున్నాము. రేపు ఏదన్న పొరపాటు జరిగితే , మన మిద్దరం జైల్లో కూర్చోవాలి "

హెచ్చరించింది మగగొంతు.

అటు వంటి అవకాశమే లేదు, ఇద్దరూ పూర్తిగా నన్ను నమ్మరు. నేను ఏం చెపితే అది గంగి రెద్దుల్లా ఊ అనేస్తారు.

"మరి, జూనియర్ ఆర్టిస్టు సంగతి ఏం చేసావ్

'ఎందుకు దొరకరు, వళ్ళు అమ్ముకోటానికి వంద మంది ముందుకొస్తునే ఈ రోజుల్లో, ఉబ్బులిస్తా మంటే రాకుండా వుంటారా? '

వేరొకరి గర్భం మొయటానికి ఆడదే కావాలి. వేరొకరిని పెళ్ళి చేసుకుని ఏమార్చటానికి ఆడదే కావాలి, డబ్బు సంపాదించటానికి ఆడదే కావాలి. ఈ సమాజం మొదటి నుంచి ఆడదాన్నీ అనేక రకాలుగా వాడుకోవటానికి

# గర్భ శ్లోకం

అలవాటు పడిపోయింది.

ఇప్పుడు మరో అడదాన్ని తమ  అవసరం కోసం బలి చెయ్యటానికి సమాయుత్తం అవుతోంది  ఈ సమాజం.

--

"ఎంత కాలమని ఈ జూనియర్ ఆర్టిస్టు వేషాలేస్తావు . -- నాతో రాకూడదా

"వస్తే, ఏంచేస్తావు. పెళ్ళి చేసుకుంవా ? ఒక సారి అలా చెప్పే నన్ను గర్భవతిని చేశావు. అది  వదిలించుకోటానికి నానా తిప్పలు పడాల్సి వచ్చింది .. నిన్ను నమ్మింది ఎవరు' మొఖాన అంది  జనియర్ ఆర్టిస్టు తిట్టినట్టు

ఆ మాటలతో తల కొట్టేసినట్టు అయ్యింది  డైరెక్టర్ అనీలకి. కాని అవసరం తనది , వస్తున్న కోపాన్ని  దిగమింగుకుంటు

'అప్పడేదో తెలియని ఆవేశంలో జరిగి  పోయింది. ఈ సారి అలా జరగదు, నువ్వు "ఒప్పుకుంటే నిన్ను మహారాణిని చేస్తాను

"అదే ఎలా? పెళ్ళి చేసుకోనంటావు .మహారాణిని చేస్తాను అనాత్వు. కొంప దీసి నన్ను ఎవరికంన్ అమ్మేస్తావా ఏమిటి ? లేదా నన్ను హిరోయిన్గా పెట్టి సినిమా తీస్తావా ''ఏంటి' అనుమానంగా అడిగింది జూనియర

'నిన్ను పెట్టి సినిమా' తీస్తే ఎవడు చూస్తాడే "అని మనసులో అనుకుంటూ

'అలాంటి దేమి లేదు కాని, మంచి కర్రాడున్నడు, అతనికి నీతో పెళ్లి చేద్దామని  అనిల్ మాట పూర్తీ కాక ముందే

'ఛు, నీకు సిగ్గు లేదా ? నీ పక్కన పడుకున్న దాన్ని ఇంకోడి పక్కన పడుకోమన్ని చెపుతున్నావు" 'అంటు  మొహాన ఉమ్మి వేసినంత  పని చేసింది జూనియర్ ఆర్టిస్టూ

ఆ మాటలకి పట్టరాని కోపంతో ఊగిపోయాడి అనిల్

"ఏందీ వాగుతున్నావు, వేషాల కోసం ఎంత మంది దగ్గర పడుకోలేదు  నువ్వు . ఏ దో  పతి వ్రతలాగా కబుర్లు చెపుతున్నావు "అంటూ  జూనియర్ ఆర్టిస్టు మీద విరుచుకు పడ్డాడు .

గొడవ పెద్దదయ్యేటట్టు వుందని గ్రహించిన జూనియర్ ఆర్టిస్టు"ఇష్ అరవకు అరిస్తే పోయేది నీ పరువే, నాకు పోయేది ఏమిలేదు. ఇప్పటికే అన్నీ, పోగట్టుకుని చచ్చిన శవంలా బతుకుతున్నా. నువ్వే పెళ్లి చేసుకో, లేకపోతే నామోనాన నన్ను వదిలేయ్, నా బతుకేదో నేను బతుకుతా, ఈ విష యం మీద మళ్ళీ నన్ను పిలవకు " అంటూ అక్కడ నుంచి విస విస నడుచుకుంటా వెళ్ళిపోయింది

---

" నాకు  కూడా మేడమ్ గారి ప్రవర్తన చూస్తుంటే కాస్త చిరాగ్గానే  వుంటుంది. అది భయమో లేక  కెరేర్ పాదవుతుండు అనే అనుమానమో లేక నా వెనుక సిని  పెద్దలున్నారు నాకేంటి అనే అహమో అర్ధం :కావట్లేదు ", తన కొచ్చిన సందేహాన్ని  వేణు ముందు వుంచింది ఉశ

"అదేంటండి  అలా అంటారు, నిన్నటి దాక  సుస్మిత వైపువుండి, ఆమెకు మద్దతిచ్చే మీరే నా ఇలా మాట్లాడేది " ఉష  ఆలోచన కరెక్టు కాదు అన్నట్టు చెప్పాడు .

'లేదు వేణు ఏ ఆడదైనా తల్లి కావటానికి ఇష్టపడుతుంది, కాని అందుకు సుస్మిత మాత్రమే మినహాయింపుగా కనపడుతుంది. బహుశా తను సీనీ గ్లామరు లో నుండి బయట పడ లేక పోతుంది అనుకుంటా? '

'నేను మొదటి నుండి వెప్పేది అదే కదా? ఈ తళుకు బెళుకులు తాత్కలికమని చెప్పిన సుస్మిత

క్రైం
సీరియల్

# గర్భ శ్లోకం

వినలేదు , మీరు వినలేదు . ఇప్పుడు చూడండి పీకల దాక ఇరుక్కున్నాము అసలు ఈ చిక్కుముడి విడి పోకపోగా, ఒకదాని తరువాత ఇంకొకటి ముడులు వేసుకుంటు పోతున్నాము ఇప్పుడు సరగోసి అంటూ ఒ కొత్త ఆలోచన ,అసలు , ఎటు పోతున్నాయో తెలియట్లేదు '

"అదేనేను ఆలోచిస్తూనే ఉన్నాను . నేను వద్దని వారించినా ఆ ముసలాడిని పెళ్ళి వేసుకుంది. అదే పెద్ద తప్పటడుగు'

"ఇప్పుడు మాత్రం పోయిందేముంది, జరిగినదంతా మీడియాకి చెప్పి వాడిని వదిలించుకుంటే పోతుంది కదా? "

" చెప్పావు, అందుకు సుస్మిత ఒప్పు కోవాలిగా . మీడియాకి చెప్పిన మరుక్షణం. ఇండస్ట్రీ ఆమెను దూరం పెడుతుంది'

""అన్నీ మీరే చెపుతారు, అపలు ఇప్పుడపం చెయ్యలో చెప్పిండి ' కాస్త విసుగ్గా అన్నాడు వేణు

"సుస్మితను మర్చిపోయి, హాయిగా వేరే పెళ్ళి చేసుకుని నువ్వు సుఖంగా వుండు

"ఇది మీ ఆలోచన ? లేక సుస్మితదా? అనుమానంగా అడిగాడు వేణు

"లేదు , సుస్మిత కసలు ఈ విషయంలో ఏ సంబంధం లేదు. నా కె ఎందుకో నీజీవితంతో ఆడుకుంటున్నట్టు అనిపించింది, అందుకే అంటున్నా "

"నాకేమి తక్కువయ్యింది, ఇవాళ కాకపోయినా రేపయినా సుస్మిత నాది కావాల్సిందే కదా ?'

"పిచ్చి వేణు ఇది సినీఫీల్డు, ఎప్పుడు . ఎవరితో కలుస్తారో, ఎప్పుడు వీడిపోతారో ఎవ్వరికి తెలియదు. అంతా కాఁయాజా కాయ్"

' పిల్లలు పుడితే. మారుతుంది' అంతా సర్దుకుంటుంది"

పిల్లల్ని కడుపునా కంటే మారుతుంది. కాని సరీగోసిలో కంటే వాళ్ళ మీద ఏంప్రేమ 'వుంటుంది చెప్పు'

ఉష మాటలతో ఆలోచనలో పడ్డాడు వేణు

ఓ నిమిషం తరువాత, "ఇప్పుడు నేను ఏమి చెయ్యాలి

"హాయిగా పెళ్ళి చేసుకో."

"మళ్ళీ పెళ్ళా? సుస్మిత ఊరుకుంటుందా?"

' ఎందుకు ఉరుకోదు , సరగోసి కోసం ఉత్తుత్తి పెళ్ళి అని నమ్మిస్తాం ."

సరగోసి కోసం పెళ్ళి చేసుకోవాలా? "

"అవసరం లేదు, కాని ఆ వంకతో హాయిగా పెళి చేసుకుని, పిల్లల్ని కని నీ బతుకు నువ్వు బతుకు.,"

"మరి సుస్మిత.. "

" వుంటుంది, ఎక్కడికి పోతుంది, తను అ మాయాలోకంలో నుంచి బయట పడే లోగా తన జీవితం తన చేతుల్లో నుంచి చేజారిపోతుంది

ఏవిటో అంతా అయోమయంగా వుంది.."

తన పాచిక పారుతున్నందుకు లోలోన సంతోష పడింది ఉష

(ఇంకా ఉంది )

నాలుగో కోతి

# ట్రోలింగ్


డా. మణికంఠ M.D





నేటి యువతలో అసహనం నానాటికీ వ్యవస్థీ కృతం అవుతూ హేయమైన రీతు లలో వ్యక్తమవుతోంది. ఫాసిజం, అన్ని జీవితపార్శ్వాలనూ, మానవ సంబంధాలనూ విషపూరితం చేయడానికి కొన్ని సాంకేతిక సాధనాలను సమకూర్చుకుంటున్నది. అలాంటి వాటిలో ట్రోలింగ్ ఒకటి. నానాటికి సమాజం లో విలువలు తగ్గిపోవటం, వాటికి ప్రాధాన్యం లేకపోవటంతో , యువతలో నైతిక విలవలు అడుగంటి పోతున్నాయి . ఉచ్చం నీచం మరచి కేవలం భౌతిక సుఖాలు ,అసాశ్వతమైన ఆనందం కోసం ,ఎదుటవారి గౌరవాన్ని , మానాన్ని కించపరుస్తూ చేసే ఈ రాక్షస క్రీడా నేడు ఎక్కువవుతోంది మానవ జీవితంలో నిశ్శబ్ద విప్లవాన్ని తెచ్చిన అంతర్జాలంలో మొద లైన వెక్కిరింపులు, వేధింపులతో కూడిన సంభాషణకు – దాని ప్రత్యేక స్వభావాన్ని బట్టి ట్రోల్ అనేమాట 1980ల నుండి వాడుకలోకి వచ్చింది.

# నాలుగో కోతి





అల్లరి, దురుద్దేశం, తప్పుడు సమాచారం, ఆధార రహిత ఆరోపణలు, విద్వేషం, విధ్వంసం వంటి వాటితో రాను రాను హానికర ప్రక్రియగా మారిపోయింది. అసాంఘిక చర్య అయింది. అహం కేంద్రీకృత భావాలు, మోసం, విషయాలను తారుమారు చేసే ధోరణి, సానుభూతి రాహిత్యం, మొహ మాటం లేకపోవటం; ఇతరులను మాటలతో, చేతలతో బాధపెట్టి ఆనందపడే తత్వం, విధ్వంసంలో సంతృప్తి – ట్రోలింగ్ కారకాలుగా గుర్తించబడ్డాయి.

రాజకీయ ఆధిపత్యం కోసం ట్రోల్ సాధనం అవుతున్నదని మరచిపోకూడదు. ప్రతిపక్షపార్టీల ప్రతినిధులు కూడా ట్రోల్స్కు మినహాయింపు కాదు. అందువల్ల ట్రోల్ అన్నది నిరపేక్ష విషయం కాదనీ, రాజకీయప్రయోజనాలతో నిర్వహించబడుతూ ఆర్థిక ఆధిపత్యాన్ని కూడా స్థాపించగల వ్యవస్థ అనీ భావించవచ్చు. నానాటికీ సంక్లిష్టమవుతున్న ఆర్థిక, రాజకీయ ఆధిపత్య సంబం ధాల, సంఘర్షణల నేపథ్యంలో ట్రోల్ ఒక అణచివేత సాధనంగా ముందుకు రావటం చూస్తాం. ఆ క్రమంలోనే సామాజిక రంగాలలోకి విస్తరిస్తున్న స్వతంత్ర భావాలు గల మహిళలు ట్రోల్ అవుతున్నారు. మగవాళ్లు మత,జాతి, రాజకీయ విశ్వాసాలకు ట్రోలవుతుంటే... స్త్రీలకు తరచు లైంగిక వేధింపులు, అవాంఛిత సెక్స్ మెసేజులు ఎదురవుతూ వుంటాయి. లైంగిక ప్రతీకలతో అవమానిం చటం, అగౌరవకరంగా చూడటం మహిళలు ఎదుర్కొనే అదనపు ఆరళ్ళు. వ్యక్తిగత జీవితం పబ్లిక్ చర్చకు పెట్ట బడుతుంది. ట్రోల్స్ వాటంతటఅవి పుట్టవు, మనం నివసిస్తున్న సమాజ లక్షణాలే వాటిని ఉత్పత్తి చేస్తాయి.

పేరును, ముఖాన్ని దాచుకొని అంతర్జాలం వేదికగా ఆడే విద్వేష క్రీడ ట్రోలింగ్. ఇంటర్నెట్ – మనిషి జీవి తంలో, చదువులలో, వృత్తి, వ్యాపార వ్యవహారాలలో విడదీయరాని భాగమయిన తరువాత పిల్లల నుండి పెద్దల వరకూ ఏదొక సమయంలో, సందర్భంలో ట్రోల్ అవ్వడానికి అవకాశాలు ఎక్కువని ప్రపంచ వ్యాప్తంగా అధ్యయనాలూ, పరిశోధనలూ చెప్తున్నాయి. అందువల్ల భయానికి, మానసిక ఒత్తిడికి, అనారోగ్యాలకు గుర వుతూ, ఒక్కొకసారి తమ జీవనరంగాల నుండి దూర మవుతూ ఒంటరితనంలోకి కుంగిపోతున్న వాళ్ళ గురించి ఆందోళన పడుతూనే... దానిని ఎదుర్కొని నిలబడటం గురించి హెచ్చరించాయి. వాటిని పట్టించుకోకపోవటం, స్పందించకపోవటమే మంచిదని చెప్పాయి. 'డోంట్ ఫీడ్ ది ట్రోల్' అనే మాట ఇప్పుడు ఎక్కువగా వినపడుతోంది . అయితే ఏది చెప్పినంత తేలిక కాదు. మానసికంగా దృఢంగా ఉన్నవాళ్ళు మాత్రమే ఇలా చేయ గలరు, సున్నిత మనస్కులకు ఇది చాల కష్టమైన పనే .

ట్రోల్ మీద జరిగిన అధ్యయనాలలో భారతదేశపు పాత్రికేయురాలు స్వాతి చతుర్వేది వ్రాసిన 'ఐ యామ్ ఎ ట్రోల్; ఇన్సైడ్ ది సీక్రెట్ వరల్డ్ ఆఫ్ ది బీజేపీస్ డిజిటల్ ఆర్మీ (జనవరి 2017). రెండవది, ఆస్ట్రేలియా దేశపు పాత్రికే యురాలు జింజర్ గొర్మన్ రాసిన ట్రోల్ హంటింగ్; ఇన్సైడ్ ది వరల్డ్ ఆఫ్ ఆన్లైన్ హేట్ అండ్ ఇట్స్ హ్యూమన్ ఫాల్బాట్' ( ఫిబ్రవరి 2019). ఇద్దరూ స్వీయా నుభవం నుండి విస్తృతంగా పరిశోధన చేసి రాసిన పుస్తకా లివి. ఈ పాత్రికేయులు ఇద్దరూ తమపై జరిగిన ట్రోలింగ్ గురించి చెప్పుకొనటంతో పాటు, దానికి కారణమైన వ్యవస్థల ఉనికిని గుర్తించి చక్కగా వివరించారు .

★★★

సాహితి సామ్రాట్ కవితలు

# ఆగండి ! ఆలోచించండి

## కారంచేటి విజయకుమార్

- మీ సంబరం అంబరాన్ని అంటినప్పుడు

ఆనందం ఆర్ణవమైనప్పుడు

భావోద్వేగంతో వ్యాకులపడినప్పుడు

ఆగండి ! ఆలోచించండి !

తర్వాతే నిర్ణయం తీసుకోండి .

అనాలోచిత నిర్ణయాల అనర్థాలు నివారించి

మీ జీవితసౌధాన్ని అందంగా అలంకరించండి .

మనకెవరో కీడు చేశారని

ఆవేశంలో వారిపై కోపం చూపకండి

కోపం చూపడమంటే

విషం మనం తాగి

మరణం ఎదుటివారికి రావాలనుకోవడం లాంటిది

ప్రతీకారం కోరకండి

ప్రతీకారం అంటే

కుక్క మనల్ని కరిచిందని

ఆ కుక్కను మనం కరవడంలాంటిది.

ఇలాంటి పరిస్థితి ఎదురైనప్పుడు

ఒక్కనిముషం ఆలోచిస్తే తెలుస్తుంది.

ఈ లక్షణాలతో మనకెంత కీడో !

అహంకారం వాకిట్లోనుంచి వస్తే

అభివృద్ధి కిటికీలోంచి పోతుందట.

గర్వం ఉంటే సర్వం పోతుందట .

నేనే గొప్పని విర్రవీగు వెర్రివారికి చూపండి

చదరంగం ఆడే పటంలో ఉన్నంతవరకే

రాజుకైనా , బంటుకైనా విలువ

ఆటైపోతే పావులన్నీ చేరేది ఓ డబ్బాలోకే

మనగొప్ప మన పని ప్రదేశంలో మాత్రమే

అది దాటితే అంతా సమానమే !

ఇది గమనిస్తే

అహం అరక్షణంలో మాయం .

ప్రతి కష్టానికీ మరణమే శరణమనే

యువతకు, అపజయం అధ్యాపకుడవ్వాలి

ఆశకు మించిన ఔషధం లేదు

నిరాశకు మించిన విషం లేదు

ప్రతిమనిషీ నిద్రించే అగ్నిపర్వతం

అద్భుతం దాచుకున్న విత్తనం

ఈ మాటల్లో విశ్వాసం ఉంటే

విశ్వాన్నే జయించవచ్చు .

**సాహితి సామ్రాట్ కవితలు**

# అక్షరానికి ఆయువు పోయాలి

శింగరాజు శ్రీనివాస రావు



చిట్లిన సిరలు చిందించిన రక్తాన్ని

అక్షరాలుగా మార్చి ఆరబెడుతున్నాడు

అతని బ్రతుకు అన్నం నిండుకున్న అక్షయపాత్ర

ఏ కృష్ణుడూ వచ్చి మెతుకు తీసిన దాఖలాలు లేవు

అతని ఎండిన పేగుల కోశాలలో

చొరబడిన గాలి తప్ప, ఉడికిన గింజ జాడలు లేవు

చిక్కిన చేతులతో చెక్కిన అక్షరాలను

చల్లుకుంటూ పోతున్నాడు

నేల గర్భంలో నాటబడిన తాలుగింజల్లా

కాగితంలో వాలిపోయాయి తప్ప, అచ్చుకు నోచలేదు

ఆనందభాష్పాలు రాల్చని ఆకాశం కింద

పగుళ్ళ బీడు మధ్య నిలచిన రైతులా

కాగితాల మధ్య నిలబడి కన్నీరు కారుస్తున్నాడు

పిడికెడు ముద్దకోసం పంచాక్షరిని

విపణిలో పెట్టను ఇష్టపడని సరస్వతీ పుత్రుడతను

కవిత్వమంటే కాకులకు విసరివేసే పిండం కాదు

కంచెకట్టి కాపాడుకోవలసిన పంటచేను

పండిన అక్షరకంకులను ఉచితంగా దోచాలనుకోకుండా

గిట్టుబాటు ధర చెల్లించి అక్షరకర్షకుడిని ఆదుకునే రోజు రావాలి

అక్షరం మరణించే లోపు పాఠకలోకం మేలుకుని

విలువ కట్టలేని అక్షరానికి ఆయువు పోసి

అమరగ్రంథాల ఆవిష్కరణకు బాటలు పరవాలి

మన దృష్టికోణం మారితే

ఈ సృష్టికోణం మారుతుంది .

సహనంతో ఒక్కనిముషం ఆలోచించి

మనలోని సద్గుణాలు దుర్గుణాలూ తెలుసుకుని

హృదయతాళంతో హృదయాన్ని తెరచి

సహృదయాన్ని ఆవిష్కరించి

దుర్గుణాలను దూరంచేసి

సద్గుణాలు పెంచుకుంటే

కాబోదు ఏ జీవితం సమస్యలవలయం

అవుతుంది ఆనందానికి నిలయం .

★★★

సెటైర్

# బిర్యాని కథ కమీషు ...

## నెట్టింటి రామాయణం





ఈ. సాయి అలేఖ్య

ఒకప్పుడు మన దేశంలో ఉడిపి హోటల్' లేని ఉరు లేదంటే అతి సయోక్తి కాదు .. అంతగా ఉడిపి హోటళ్ళు ప్రాచుర్యం పొందాయి. వీటికి ఆద్యుడు , ఉడిపి శ్రీకృష్ నిలయంలో వంటశాలలో పనిచేసే కె కృష్ణారావు గారు అని చెప్పవచ్చు. 1922 లో మదరాసులోని శారదా విలాస్ బ్రాహ్మణ హోటల్లో వంట మాష్టరుగా చేరాడు. అక్కడే అతను 1925 లో మసాల దోశను కనుగొన్నాడు. అప్పట్ల ఆయన జీతం రూ 700 /- అంటే ఇప్పుడు 7లక్షలు కింద లెక్క . 1937 లో కృష్ణారావు సొంతంగా ఉడిపి శ్రీకృష్ణ విలాస్ హోటల్ ను ప్రారంభించాడు.

సెటైర్

# నెట్టింటి రామాయణం

## బిర్యాని కథ కమీషు . ...

తదనంతర కాలం లో అదే వుడ్ లాండ్స్ గా మారి శాఖాహారుల మన్ననలు పొందింది . 1925లో వచ్చివ వరదల వల్ల . అనేక మంది వంట వాళ్ళ ఉడిపి నుండి దక్షిణ భారత దేశంలోని వివిధ నగరాలకు వలస పోయి, తమ సొంత హోటాళ్లు మొదలు పెట్టారు వీటిల్లో బాగా పేరు పొందినవి సీతారామారావు గారి 'దాస్ సప్రకాష్ హోటల్, మైసూరు, 'మావెల్లి టిఫిన్ రూం' బెంగుళూరు వంటివి.

ఏమిటి, బిర్యాని గురించి చెపుతానని ఉడిపి హోటుళ్ళ గురించి చెబుతున్నాను అనుకుంటున్నారా .సరే కాసేపు ఉడిపి హోటళ్ళ విషయం పక్కన బెడదాం

ఇవాల్టి రోజున మన దేశంలో రామాలయం లేని ఊరు వున్న దేమో కాని బిర్యాని దొరకని ఊరంటే లేదంటే అశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. సందు సందు కు ఓ బిర్యాని హోటల్ కనపడుతుంది ఈ రోజున.ముప్పైరూపాయల నుండి మూడు వేల రూపాయల వరకు అమ్ముడయ్యేబిర్యానీలు నేడు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి .

బిర్యాని మన దేశపు వంటకం కాదు. ఇంకా గట్టిగా మాట్లాడితే బిర్యాని 'అనే పదమే పర్షియన్ భాషకు చెందింది.'బిరియన్' అనే పర్షియన్ భాష నుంచి వచ్చిందే బిర్యాని ."బిరియన్' అంటే వంటకు ముందు కాల్చటం అని అర్థం .. అలాగే 'బిరింజ్' అనే ఇంకో పదానికి అర్థం బియ్యం' అని, అంటే బియ్యం తో చేసే వంటకాన్ని బిర్యాని అని పిలవ సాగారు ఈ బిర్యానిని




మొఘల్ రాజులు తమ విందు వినోదాలలోఎక్కువగా ఉపయోగించిన దాఖలాలు వున్నయి .

కొంత మంది చరిత్రకారులు షాజహన్, భార్య ముంతాజ్ మహల్(1573-1631) ఈ బిర్యానిని వండి వడ్డించేది అని చెపుతున్నారు .మరి కొంతమంది 1398 లో టర్కీ రాజు తైమూర్ బిర్యానీ ని మనదేశానికి తీసుకువచ్చాడు అని చెపుతారు .

ఏదయితే నేమి, ఇవాళ మన దేశంలో ఆహార పరిశ్రమకు చెందిన అతి పెద్ద వ్యాపారం ఏదైనా వుందంటే అది 'బిర్యాని' వ్యాపారమే. దేశంలో ఇప్పుడు బిర్యానికి సంబంధించి 3000 కోట్ల రూపాయల వ్యాపారం సాగుతోంది. రూ50 మొదలుకుని 5000 రూపాయల వరకు ధరలు కల బిర్యానీలు నేడు మార్కెట్లో లభ్యమౌతున్నాయి . దేశంలోనే అత్యంత ఖరీదైన బిర్యాని రాయల్ గోల్డ్ బిర్యాని ', 20 కారట్ల బంగారు రేకులను ఈ బిర్యాని వంటకంలో వినియోగిస్తారు.

దేవుడికి వంద అవతారాలు ఉన్నట్లు , మన దేశం లో కుడా వంద రకాల బిర్యానీలు అందుబాటులో ఉన్నాయి .వీటిలో హైదరాబాద్ బిర్యాని ప్రపంచం లోనే నం.1 బిర్యానిగా ప్రసిద్ధి పొందింది. దేశంలోనే బిర్యాని రాజధానిగా హైదరాబాదు వినుతికెక్కినది . బిర్యాని వండి వడ్డించటం లో బావార్చి, ప్యారడైజ్,నిజాం కిచెన్ , బిర్యాని బ్లూస్ తదితర సంస్థలు ముందున్నాయి. ఇహ మన తెలుగు రాష్ట్రాల కొస్తే భీమవరం రాజుల బిర్యాని,

సెటైర్

# నెట్టింటి రామాయణం

## బిర్యాని కథ కమీషు . .

మారేడుమల్లి బిర్యాని, తాడిపత్రి బిర్యాని, గుంటురు బిర్యాని 'ఇలా ఊరికొక బిర్యాని అమ్ముడౌతోంది. భగవంతుడు సర్వాంతర్యామి అన్నట్టు మన బిర్యాని కుడా అన్ని రకాల కూరలు, పచ్చళ్ళు , చారులతో కలిసిపోయి తన ఉనికి చాటుతోంది .గోంగూర బిర్యాని , అవకాయ బిర్యాని, ఉలవచారు బిర్యానీ,. ఇలా రకరకాల రుచుల్లో లభ్యమతున్నాయి. నాలికకో రుచి అన్నట్టు, ప్రాంతానికో అభిరుచి .అందుకు అనుగుణంగా బిర్యాని కుడా తన రూపం మార్చుకున్నది .అర్కాట్ బిర్యాని, దిండిగల్ బిర్యాని మలబార్ బిర్యాని , చెట్టినాడు బిర్యాని, -వంటివి తమిళనాడలో ఫిష్ బిర్యాని, మలబార్ కడక్కు బిర్యాని వంటివి కేరళలో దొరుకుతున్నాయి. ఇక కుండ బిర్యాని, బొంగులో బిర్యాని, బకెట్ బిర్యాని వంటివి వుండనే వున్నాయి. బిర్యానీని ప్లేట్లు లెక్కన కాకుండా కిలోల లెక్కన కూడా అమ్ముతున్నాడు బిర్యాని వ్యాపారస్తుడు కౌశిక్ రాయ్.

బిర్యాని అమ్మకాల్లో హైదరబాద్ దేశంలోనే మొదటి స్థానంలో వుంది. నెలకు 72 లక్షల బిర్యానీలు ఒక్క హైద) బాదులోనే అమ్ముడు అవుతుండగా . బెంగుళూరు 50 లక్షల అమ్మకాలతో రెండో స్థానంలో, చెన్నయ్ 30 లక్షల అమ్మకాలతో మూడో స్థానంలోవున్నాయి. బిర్యానీ విక్రయించే రెస్టారెంట్లు (24000) బెంగుళూరులో ఎక్కువగా వున్నాయి.

2022 లో నిమిషానికి 156 బిర్యాని ఆర్డరు వచ్చినట్టు జమోటో పేర్కొన్నది . 2023 లో 21,500 బిర్యానీలు అమ్మినట్టు స్విగ్గీ పేర్కొనది. 2023 లో మొత్తం 760 లక్షల బిర్యానీ ఆర్డర్లు వచ్చినట్టు స్విగ్గీ పేర్కొన్నది అంటే గంటకు 13140 "బిర్యానీలు అమ్మారు. వీటిలో సింహభాగం ధమ్ బి ర్యానిదే . 85 వెరైటీల్లో దొరికే ధమ్ బిర్యాని , ఏడాదికి 62 లక్షల కిలోల అమ్ముడవుతున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ,13000 కిలోల బిర్యాని ని తయారు చేసి గిన్నీస్ బుక్లో చోటు సంపాదించారు, దీని ఖరీదు 28660 పౌండ్లు. దేశంలో దిండిగల్ తలప్పకట్టి బిర్యాని ఎక్కువగ్గా అమ్ముడౌతున్న బ్రాండ్, దీని విలువ 500 కోట్ల పైమాటే.


ఒక వ్యక్తి 1633 బిర్యానీలు ఆర్డరు చేసి రికార్డు నెలకొల్పగా, మరోవ్యక్తి ఒకే సారి 31,522 రూపాయల బిర్యాని ఆర్డరు పెట్టి రికార్డు నెల కోల్పాడు . మరి మీకు కూడా బిర్యాని ఆర్డరు పెట్టాలని వుందా? మరి ఇంకెందుకు ఆలస్యం పదండి ముందుకు బిర్యాని విందుకు. బిర్యాని తో పాటు బిర్యాని ఛాయ్ కూడా ఆర్డర్ పెట్టండి. ఏమిటి వింతగా వుందా. ఇరానీ ఛాయ్ విన్నాం, కానీ ఈ బిర్యానీ ఛాయ్ ఏమిటో అనుకుంటున్నారా?... మరయితే వచ్చే సంచిక వరకు ఆగాల్సిందే... ఇకశలవ్

## సుమతి సాహితీ స్రవంతి

కవులకు ,సాహిత్య ప్రియులకు ఇక నెలల పండగే . సుమతి జూమ్ లో సాహిత్య గోష్టులు జరప తలపెట్టింది సుమతి. కవులు తమ కవితలను , కథలను , సాహితీ విమర్శలను , ఇతర సాహిత్య ప్రక్రియలను సుమతి సాహితీ స్రవంతిలో ఆన్లైన్ లో శ్రోతలకు వినిపించవచ్చు .ఒక రకంగా సుమతిరేడియో అన్నమాట .తదనంతరం . సాహితీ స్రవంతిని రికార్డు చేసి సమతి ఛానల్ లో(యు ట్యూబ్ ) ప్రసారం చెయ్యబడును .సుమతిచందా దారులకు ముందుగా అవకాశం ఇవ్వబడును

కార్టూన్ కార్నర్

# నవ్వండి ప్లీజ్ !



నవ్వటం ఒక యోగం ,

నవ్వలేక పోవటం ఒక రోగం ,

ఆ తరువాత మీ ఇష్టం



## గోపాలకృష్ణ కార్టూన్లు










యాత్ర

# అయోధ్య

## చూడాల్సిన ప్రదేశం



అనుకున్నట్లే ఎటువంటి ఆటంకాలు లేకుండా నిర్విఘ్నంగా బాల రాముడి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం అయోధ్యలో జరిగింది .ఇప్పటి వరకూ రూపొందిన రాముడి విగ్రహాల్లో అయోధ్యలో కొలువు తీరిన వగ్రహమే అత్యంత విపులంగా ఉన్నదని భక్తులందరూ భావిస్తున్నారు. ఒక పాదం వద్ద హనుమంతుడు , మరో పాదం వద్ద గరుత్మంతుడు, విగ్రహం చుట్టూ విష్ణుమూర్తి దశావతారాలు, సనాతన ధర్మానికి సంబంధించిన చిహ్నాలు... అయోధ్య రామమందిరంలో ప్రతిష్ఠించిన బాల రాముడి విగ్రహంలో ఇవన్ని కొలువుదీరాయి. నిశితంగా పరిశీలిస్తే.. రాముడి విగ్రహానికి ఇరువైపులా శ్రీహరి దశావతారాలు చెక్కినట్లు కనబడుతోంది. నరసింహ, కృష్ణ, పరశురామ, కల్కి తదితర అవతారాల వర్ణనలు విగ్రహంపై ఉన్నాయి


యాత్ర

# అయోధ్య

రామభక్తుల్లో అగ్రగణ్యుడైన హనుమంతుడు స్వామివారి కుడి పాదం వద్ద, విష్ణువు వాహనమైన వైనతేయుడు ఎడమ పాదం వద్ద కొలువుదీరారు. విగ్రహంపై భాగంలో సనాతన ధర్మం, హిందూ మతానికి చెందిన పవిత్ర చిహ్నాలు స్వస్తిక్, ఓంకారం, చక్రం,గద, శంఖాలను చిత్రీకరించారు. అలాగే సూర్య వంశీ యుడైన రామయ్య తల చుట్టూ దేదీప్యమానంగా వెలుగుతున్న సూర్య భగవానుడిని ఏర్పాటు చేశారు.ఈ చిహ్నాలన్నీ రాముడు, విష్ణుమూర్తితో దగ్గరి సంబంధాన్ని కలిగి ఉన్నవే. అలాగే బాల రాముడి కుడి చేయి అభయ ముద్రలో బాణాన్ని పట్టుకొని ఉండగా, ఎడమ చేతిలో ధనస్సు ఉంది. బాలుడి రూపంలో, పద్మపీఠం పై నిలబడిన భంగిమలోదివ్యత్వం ఉట్టిపడుతున్న 51 అంగుళాల బాలరాముని చూడటానికి రెండు కళ్ళు చాలవు

అయోధ్య రాములోరికి పుట్టిన రోజు సందర్భంగాకానుకల వర్షం కురుస్తోంది. అయోధ్య రామమందిర ప్రతిష్ఠాపన వేడుకకు సిద్ధమవుతున్న వేళ, దేశం నలుమూలల నుంచి బహుమతులు వెల్లువెత్తుతున్నాయి. దేశ విదేశాల నుంచి గిఫ్టులు అయోధ్యకు చేరుకుంటున్నాయి. ఇక సీతమ్మ జన్మస్థలం నుంచి 3 వేలకు పైగా కానుకలు వచ్చాయి

500 కిలోల ఇనుప-రాగి 'నాగడ' మరియు 'ఓనవిల్లు' విల్లు, అలాగే భగవంతుని బొమ్మలతో అలంకరించబడిన కంకణాలు వంటి అద్భుతమైన వస్తువులు. రామ్ మరియు 56 రకాల 'పేటా'




నగరానికి అందుతున్న అనేక బహుమతులలో ఉన్నాయి. అలాగే జనవరి 22న జరిగే కార్యక్రమం లో కనౌజ్‌లోని ప్రత్యేక పరిమళ ద్రవ్యాలు, అమరావతి నుండి 500 కిలోల 'కుంకుమ' ఆకులు, ఢిల్లీలోని రామాలయంలో సేకరించిన ధాన్యాలు, భోపాల్‌లోని పూలు మరియు 4.31 కోట్ల సార్లు 'లార్డ్ రామ్' అని వ్రాసిన కాగితాలు ఉన్నాయి.

హైదరాబాద్‌కు చెందిన చల్లా శ్రీనివాస శాస్త్రి తన తండ్రి కల నెరవేర్చడం కోసం బంగారు పూత పూసిన పాదుకలను తీసుకుని అయోధ్యకు చేరుకున్నారు. అయితే తన తండ్రి కరసేవకుడని చెప్పారు. గుజరాత్‌లోని వడోదరకు చెందిన అరవింద్ భాయ్ మంగళ్ భాయ్ పటేల్ అనే రైతు 1100 కిలోల భారీ దీపాన్ని తయారు చేసి అందించారు. బంగారం, వెండి, రాగి, జింక్, ఇనుముతో ఆ భారీ దీపాన్ని తయారు చేసినట్లు తెలిపారు. ఉత్తర ప్రదేశ్‌లోని అలీగఢ్‌కు చెందిన సత్య ప్రకాశ్ శర్మ 400 కిలోల బరువైన తాళాన్ని బహూకరించారు. మరోవైపు.. ఉత్తరప్రదేశ్‌లోని జలేసార్‌లో 2100 కిలోల బరువున్న భారీ గంటనుతయారు చేసి.. అయోధ్య శ్రీరామునికి సమర్పించారు. 8 లోహాలతో తయారు చేసిన ఈ భారీ గంటను రెండేళ్ల పాటు తయారు చేశారు.

నేపాల్‌లోని జనక్‌పూర్ నుంచి వచ్చిన 3 వేలకు పైగా బహుమతుల్లో వెండి పాదుకలు, ఆభరణాలు, దుస్తులు వంటివి వీటిలో ఉన్నాయి. శ్రీలంకకు చెందిన ప్రతినిధి బృందం ఆ

యాత్ర

# అయోధ్య

దేశంలోని అశోక వాటిక నుంచి ఓ శిలను తీసుకొచ్చింది. ఇక గుజరాత్‌లోని వడోదర వాసి అయిన విహా భర్వాడ్ 108 అడుగుల పొడవు, 3.5 అడుగుల వెడల్పు ఉన్న అగర్‌బత్తీని తయారు చేశారు. దీని బరువు 3610 కిలోలు ఉన్నట్లు తెలిపారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి 44 అడుగుల పొడవైన కంచు ధ్వజ స్తంభం, మరో 6 చిన్న ధ్వజ స్తంభాలను తీసుకుని ఓ టీమ్ గత వారం బయల్దేరింది. శ్రీలంకలోని అశోక్ వాటికా నుండి ప్రత్యేక బహుమతులతో ఒక ప్రతినిధి బృందం అయోధ్యకు వచ్చింది. రావణుడు సీతను తీసుకెళ్లి, శ్రీలంకలోని అశోకవనంలో ఉంచినట్లుగా రామాయణ ఇతిహాసంలో ప్రస్తావన ఉంటుంది. ఆ అశోక్ వాటికా అనే ఉద్యానవనం నుండి ఓ రాయిని...ఈ ప్రతినిధి బృందం అయోధ్యకు తీసుకువచ్చింది.

### రూ.1.65 లక్షల రామాయణం

ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన రామాయణం అయోధ్యకు చేరుకుంది, దీని విలువ లక్షా అరవై ఐదు వేల రూపాయలు. రామాలయ కార్యక్రమానికి హాజరయ్యేందుకు రామాయణంతో అయోధ్యకు చేరుకున్న పుస్తకాల విక్రేత మనోజ్ ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన రామాయణం ముద్రించి కానుకగా సమర్పించారు.. అత్యంత అందమైన రామాయణం అయోధ్యలో ఉందని చెప్పవచ్చు. దాని విలువ రూ. 1.65 లక్షలు. మూడు అంతస్తులతో నిర్మించిన రామమందిరంలా మూడు అంతస్తుల పెట్టె ఉంది. కాబట్టి ఇది కూడా అదే విధంగా రూపొందించబడింది. పెట్టెకు అమెరికన్ వాల్‌నట్ కలపను ఉపయోగించారని, కాగితం ఫ్రాన్స్‌కు



చెందినదని, జపాన్‌కు చెందిన సిరా అని తెలిపారు. "పుస్తకం కవర్ మెటీరియల్ ఇంపోర్టెడ్ మెటీరియల్.. ఈ పుస్తకానికి సంబంధించిన ఇంక్ జపాన్ నుంచి దిగుమతి అయ్యింది.. ఇది ఆర్గానిక్ ఇంక్.. ఈ పుస్తకం 400 ఏళ్లపాటు ఉంటుంది.

### ముత్యాల గజమాల

హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తుడు రామయ్యపై తనకు ఉన్న భక్తిని ప్రత్యేకంగా చాటుకున్నాడు. విలువైన ముత్యాల గజమాలను రామయ్యకు కోసం తయారు చేశాడు. రూ. 5.5 లక్షల వ్యయంతో మంచి ముత్యాలను ఉపయోగించి 8 ఫీట్లతో ఈ గజమాలను తయారు చేశాడు. నగరంలోని తార్నాకకు చెందిన ముత్యాల వ్యాపారి వెంకట్ దాస్.. రామయ్య భక్తుడు. అయోధ్యలో కొలువుదీరుతున్న బాలరాముడికి ఏదైనా కానుక ఇవ్వాలని భావించాడు. చినజీయర్ స్వామి శిష్యుడైన వెంకట్ దాస్.. ఆయన సలహాతో రామయ్యకు ముత్యాల గజమాల తయారు చేశాడు.

ముంబై నుంచి సేకరించిన 5 కేజీల మంచి ముత్యాలను ఉపయోగించి ఈ గజమాలను తయారు చేశారు. వెంకట్ దాస్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు మొత్తం 9 మంది 9 రోజుల పాటు ఎంతో నిష్ఠతో ఈ గజమాలను రూపొందించారు. గజమాల మధ్యలో అలంకరణ కోసం పింక్, గ్రీన్ ముత్యాలను ఉపయోగించారు. మాల అందంగా ఉండేందుకు లోపల స్పాంజి, తెల్లటి వస్త్రాన్ని వాడారు. పూలతో చేసిన

యాత్ర

# అయోధ్య

గజమాల మాదిరిగా సువాసనలు వెదజల్లేందుకు గాను వస్త్రం మధ్యలో 250 గ్రాముల మంచి గంధాన్ని ఉంచారు. ఈ మాల తయారీకి రూ. 5.5 లక్షల వ్యయం అయ్యిందని .. అయోధ్య రామయ్య మెడలో ఈ మాల చూడాలనేది తన కోరికగా వెంకట్ దాస్ చెప్పారు.

### హైదరాబాద్ నుంచి తలుపులు, బంగారు పాదుకలు

అయోధ్య గర్భాలయంలో అష్టధాతువులతో నిర్మించిన 600 కిలోల గంట ప్రత్యేక ఆకర్షణ. గర్భాలయాన్ని తెల్లటి మకరానా పాలరాతితో తీర్చిదిద్దారు. ప్రధానమైన గర్భాలయ ముఖ ద్వారం, తలుపులు తయారుచేసే అవకాశం హైదరాబాద్‌కు చెందిన అనురాధ టింబర్ డిపో వారికి దక్కింది. నాణ్యమైన బర్మా టేకుతో భారీ దర్వాజల్ని కళాత్మకంగా తీర్చిదిద్దారు. ఈ ద్వారాలపై బంగారు తాపడం చేశారు రాములవారికి పాదుకల్ని సమర్పించే భాగ్యం కూడా తెలుగువారికే దక్కింది. హైదరాబాద్‌కు చెందిన భాగ్యనగర సీతారామ సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు చల్లా శ్రీనివాస శాస్త్రి కిలో బంగారుపూత పూసిన 9 కిలోల పాదుకల్ని సమర్పించారు. 41 రోజులపాటు వివిధ క్షేత్రాల్లో దర్శనం అనంతరం అయోధ్యకు తరలించారు

### భారీ దీపం

ప్రపంచంలోనే అతిపెద్ద దీపం అయోధ్యలో వెలిగించనున్నారు. 28 మీటర్ల పొడవు ఉండే ఈ దీపాన్ని వెలిగించడానికి సుమారు 21 క్వింటాళ్ల నూనె అవసరం అవుతుంది. దీపంలో పెట్టె వత్తి కోసం 1.25 క్వింటాళ్ల పత్తి ఉపయోగించారు.

### విలువైన గడియారం

ఇక లక్నోలోని కూరగాయల వ్యాపారి అనిల్ కుమార్ సాహు ప్రత్యేకంగా ఓ గడియారాన్ని తయారు చేశారు. అందులో ఒకేసారి 8 దేశాల సమయం కనిపిస్తుంది. భారత కాలమానం ప్రకారం సమయంతోపాటు జపాన్, రష్యా, దుబాయ్, చైనా, సింగపూర్, మెక్సికో, వాషింగ్టన్ డీసీ, న్యూయార్క్ ప్రాంతాల్లో ఉండే సమయాన్ని ఆ గడియారం చూపిస్తుంది

### 1265 కిలోల లడ్డూ

1,265 కిలోల లడ్డూ హైదరాబాద్‌లోని శ్రీరామ్ క్యాటరింగ్ సర్వీసెస్ వారు ఈ లడ్డూ ప్రసాదాన్ని తయారు చేశారు. కేటరింగ్ సర్వీసెస్ యజమాని నాగభూషణం రెడ్డి ప్రతిరోజూ 1 కిలోల లడ్డూను సిద్ధం చేస్తానని ప్రతిజ్ఞ చెయ్యటం విశేషం

### 7 వేల కిలోల రామ్ హల్వా

అయోధ్యలో రామ్ లల్లా విగ్రహ ప్రతిష్ఠ రోజు నాగ్ పూర్ కి చెందిన చెఫ్ విష్ణు మనోహర్ సుమారు 7 వేల కిలోల రామ్ హల్వాని తయారు చేయించబోతున్నారు. రామ మందిర ప్రాంగణంలో జరిగే ఈ కార్యక్రమం కోసం 12 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన ప్రత్యేక కడాయిని రూపొందించారు. దీన్ని ఎత్తాలంటే క్రేన్ ఉపయోగించాలి. దీని బరువు సుమారు 1300–1400 కిలోల బరువు ఉంటుంది.

ఈ కడాయిలో 7 వేల కిలోల రామ్ హల్వాని తయారు చేయబోతున్నారు. 10 నుంచి 12 కిలోల బరువు ఉన్న గరిటెలు దీనికి ఉపయోగిస్తారు. 900 కిలోల రవ్వ, వెయ్యి కిలోల నెయ్యి, వెయ్యి కిలోల పంచదార, 2000 లీటర్ల పాలు, 2500 లీటర్ల నీళ్ళు, 300 కిలోల డ్రై ఫ్రూట్స్, 75 కిలోల యాలకుల పొడితో హల్వా తయారు చేయనున్నట్లు చెఫ్ మనోహర్ తెలిపారు.

### అతి చిన్న రాముని విగ్రహం

దేశవ్యాప్తంగా ఉన్న కళాకారులు తమ కళా ప్రావీణ్యంతో ఆ అయోధ్య రాముడిపై తమ భక్తిభావాన్ని చాటుకుంటున్నారు. ఆ అయోధ్యకు కానుకలను పంపుతున్నారు.ఈ క్రమంలోనే రాజస్థాన్‌లోని

యాత్ర

# అయోధ్య

జైపూర్‌కు చెందిన మినియేచర్ ఆర్టిస్ట్, గిన్నిస్ బుక్ రికార్డు గ్రహీత నవరత్న ప్రజాపతి తన కళ ద్వారా ఆ అయోధ్య రాముడిపై భక్తిని చాటుకున్నారు.పెన్సిల్ మొనపై శ్రీరాముడి విగ్రహాన్ని చెక్కారు నవరత్న ప్రజాపతి. ఎంతో ఓర్పు, మరెంతో భక్తితో కేవలం 1.3 సెం.మీ పొడవైన రాముడి విగ్రహాన్ని పెన్సిల్ మొనమీద రూపొందించారు. ప్రస్తుతం ఈ విగ్రహం ప్రపంచంలోనే అతి చిన్న విగ్రహంగా

### శ్రీరామాలయాన్ని ప్రతిబింబించే సిల్క్ బెడ్ షీట్

అయోధ్య రామాలయానికి అందిన మరో కానుక శ్రీరామాలయాన్ని ప్రతిబింబించే సిల్క్ బెడ్ షీట్. ఈ బెడ్ షీట్ ను తమిళనాడుకు చెందిన ఓ సిల్క్ తయారీదారు రూపొందించారు. సేంద్రియ పద్ధతిలో తయారు చేసిన స్వచ్ఛమైన కుంకుమపువ్వు, ఆఫ్ఘనిస్తాన్ నుండి కుభా (కాబూల్) నది నీరు కూడా అయోధ్య రాముడికి కానుకలుగా అందాయి.

### 60 మీటర్ల పట్టు చీర

ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల ధర్మవరం పట్టణానికి చెందిన మాస్టర్ వీవర్ డిజైనర్‌గా మారిన జె.నాగరాజు 180 అడుగుల పొడవు, 16 కిలోల బరువున్న భారీ పట్టుచీరను ఎంతో శ్రమతో నేసిన రామ్‌లల్లా ఆలయానికి సమర్పించారు. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి ముందు, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం ప్రాంతంలో చేనేత పరిశ్రమకు సంబంధించిన రెండు కుటుంబాలు హిందువుల భక్తికి చిహ్నంగా సీతమ్మకు 60 మీటర్ల పొడవైన పట్టుచీరను నేసారు. దేవత. ధర్మవరంలోని రెండు చేనేత కుటుంబాలు 16 కిలోల బరువు, 44 అంగుళాల వెడల్పుతో 60 మీటర్ల పొడవున్న చీరను నేయడానికి నాలుగు నెలల సమయం పట్టింది. రూ.5 లక్షల విలువైన పట్టుచీరను పూర్తిగా నాణ్యమైన పట్టుతో తయారు చేసినట్లు చేనేత కార్మికులు తెలిపారు.



తెలుగు, కన్నడ, మరాఠీ, ఒడియా, తమిళం, గుజరాతీ, కొంకణి, మలయాం, ఉర్దూ మరియు ఇతర భాషలతో సహా 13 విభిన్న భారతీయ భాషల్లో మెగా సిల్క్ చీరపై, హిందూ శ్లోకం 'జై శ్రీ రామ్' 32,200 సార్లు థ్రెడ్‌లో అల్లినది. చీరలో రామాయణం నుండి రాముడి జీవితాన్ని వివరించే 168 చిత్ర వర్ణనలు కూడా ఉన్నాయి. ఈ చీరను చేనేత కళాకారుడు నాగరాజు రూపొందించారు మరియు సురేంద్రనాథ్ మరియు అతని కుమారుడు తేజ మగ్గంపై నేసినారు. హిందువుల ఆరాధ్యదైవమైన సీతకు పట్టుచీరను బహుమతిగా ఇచ్చే అవకాశం రావడం తమ అదృష్టంగా భావిస్తున్నామని చేనేత కుటుంబాలు తెలిపారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన నేత కళాకారుడు హరిప్రసాద్ మరో వినూత్న ప్రయోగానికి తెరలేపారు. అయోధ్య శ్రీరామచంద్రుడు పాదాల చెంత బంగారు చీర ఉంచనున్నారు. హరిప్రసాద్ తన చేతులతో స్వయంగా తయారు చేసిన బంగారు చీరను జనవరి 26న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అందించనున్నారు. ప్రధాని చేతుల మీదుగా రాముడు పాదాల చెంత చీరను ఉంచనున్నారు.

★★★

విహారి

# వారసత్వ నగరంగా పుదుచ్చేరి





ఒక నగరాన్ని వారసత్వ నగరం (World Heritage City) అని ఎలా పిలుస్తారు? అసలు ఏదైనా నగరం వారసత్వ నగరంగా మారగలదా? ఇతర నగరాలతో పోలిస్తే వారసత్వ నగరం ఎలా ఉంటుంది? యునెస్కో ప్రపంచ వారసత్వ నగరమైన గుజరాత్‌లోని అహ్మదాబాద్ వంటి ప్రదేశాల గురించి విన్నప్పుడు ఇలాంటి ప్రశ్నలే తలెత్తుతాయి. తాజా సమాచారం ప్రకారం కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరి (Puducherry) కూడా ఆ ప్రతిష్టాత్మకమైన ప్రపంచ వారసత్వ నగరం అనే ట్యాగ్‌ని సొంతం చేసుకునేందుకు కృషి చేస్తోంది అయితే అసలు హెరిటేజ్ సిటీ అంటే ఏమిటనేది ఇక్కడ తెలుసుకుందాం.

# విహారి

UNESCO వరల్డ్ హెరిటేజ్ సిటీ ట్యాగ్‌ని సొంతం చేసుకోవాలంటే కేవలం ఆ నగరంలో కొన్ని పురాతన స్మారక చిహ్నాలు లేదా అభివృద్ధి చెందిన ప్రదేశాలు ఉండటం కాదు. ఆ నగరంలోని ప్రతీది ఎంతో గొప్పగా ఉంటూ ఆ ప్రదేశాలు కూడా అభివృద్ధి చెంది ఉండటంతో పాటు స్థానికుల గుర్తింపు, వారి వారసత్వం కూడా అలాగే కొనసాగడం. ఉదాహరణకు పాత అహ్మదాబాద్‌ను తీసుకుంటే.. అది 600 సంవత్సరాల పురాతన నగరం. 5.43 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఆ నగరంలోని ప్రజలు శతాబ్దాల కాలంగా చెక్కతో నిర్మించిన నివాసాల్లోనే నివసిస్తున్నారు.

ఇక ఇప్పుడు పుదుచ్చేరి గురించి ఆలోచిస్తే.. అది ఒకప్పుడు ఫ్రెంచ్ కాలనీ అని అందరికీ తెలిసిందే. ఇక్కడ తమిళంతో పాటు వలసవాద సారాంశం కనిపిస్తాయి. రెండు వేర్వేరు నేపథ్యాలను కలిగిన అరుదైన సమ్మిళిత ప్రదేశం. దీంతో ఈ నగరం వరల్డ్ హెరిటేజ్ సిటీ ట్యాగ్‌ని పొందడానికి.. ఈ రెండు భిన్న సంస్కృతి, సంప్రదాయాలను ఒకేసారి పరిరక్షించుకోవాల్సిన పరిస్థితి ఉంటుంది. మీరు పుదుచ్చేరిలోని పాత ఫ్రెంచ్ క్వార్టర్స్‌ను సందర్శించినప్పుడు కొందరు విదేశీ ముఖాలను చూడటం సాధారణ విషయం. అయితే, అక్కడ కనిపించే విదేశీయులంతా పర్యాటకులు కాదు. అందులో చాలా మంది స్థానికులే ఉంటారు. వారు తరతరాలుగా పుదుచ్చేరిలోనే నివసించడం గమనార్హం.



వరల్డ్ హెరిటేజ్ కన్వెన్షన్ అమలు కోసం UNESCO ప్రపంచ వారసత్వ ప్రదేశాల హోదా దక్కాలంటే.. ఆ ప్రదేశాలు కేవలం పురాతన కాలంలో నిర్మించినవే కాకుండా ఆయా స్థలాల సాంస్కృతిక వారసత్వ విలువలను కూడా కాపాడుకోవాలి. అప్పుడే యునెస్కో వాటిని పరిగణనలోకి తీసుకుంటుంది. అలాంటప్పుడు పుదుచ్చేరికి ప్రపంచ వారసత్వ నగరం అనే గుర్తింపు వస్తే అది ఫ్రెంచ్ క్వార్టర్స్ కా లేక తమిళ నేపథ్యానికి కూడానా అని ఆలోచించాలి

అయితే, ఇప్పుడున్న పుదుచ్చేరి పునరుద్ధరించిన నగరం అని చెప్పొచ్చు. ఎందుకంటే ఈ పాత పుదుచ్చేరి నగరాన్ని ఫ్రెంచ్, బ్రిటీష్ పాలకులు ఇద్దరూ పూర్తిగా మార్చేసి నేటి ఆధునిక నగరాన్ని నిర్మించారు. అంతకుముందు ఈ పురాతన పట్టణంలో 'నలుపు', 'తెలుపు' అనే ప్రాంతాలు ఉండేవి. వాటిని తమిళ, ఫ్రెంచ్ క్వార్టర్స్ అని పిలిచేవారు. శతాబ్దాల పాటు ఎవరికి వారు తమ పరిధిలో నివసించేవారు. అలా ఈ రెండు భిన్నమైన ప్రపంచాలే పుదుచ్చేరిని అద్భుతమైన ప్రదేశంగా మార్చాయి.

అయితే, కాలక్రమేణా ఫ్రెంచ్ క్వార్టర్స్ అలాగే ఉన్నప్పటికీ తమిళ ప్రాంతంలో పురాతన సాంప్రదాయ గృహాలు కనుమరుగయ్యాయి. అలా శతాబ్దాల నాటి తమిళ గృహాలు ఇప్పుడు కొన్ని మాత్రమే మిగిలాయి. మరోవైపు ఫ్రెంచ్ క్వార్టర్స్ అలాగే ఉంటూ నిత్యం టూరిస్టులను ఆకర్షిస్తున్నాయి. ఇప్పుడు ఆ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతోందనేది కూడా నిజం. ఇలాంటి పరిస్థితుల్లో పుదుచ్చేరి దాని విశిష్టమైన వారసత్వాన్ని కాపాడుకోగలదా..? యునెస్కో ప్రపంచ వారసత్వ నగరంగా గుర్తింపు దక్కించుకోగలదా చూడాలి..

★★★

దసరా కవితల
పోటీలో
బహుమతి
పొందిన కవిత

# ఛిద్రం..!

యర్రాబత్తిన మునీంద్ర

సాంకేతికత ఎదగని రోజులే
మేలనిపిస్తున్నాయ్..
అవకాశం లేదని ఊపిరి జోలికి పోలేదు..
అభివృద్ధి పథంలో రివ్వున ఎగిసిన
నేటి కాలం ...అనైతికతకు అద్దం పడుతోంది..

కన్న పేగు పాశం మరిచారో ఏమో
తమపై తమకే చులకనెందుకో....
అమ్మ కూడా కన్న కూతురి కడుపు కోయించే
దారుణాలు దాపురించడమేమిటో..?

తాను పడ్డ కష్టం పగవాడికి కూడా వద్దనుకోవడం
ప్రతి హృదయపు ధర్మం ...
అత్త తాననుభవించిన బాధను కోడలిని
అనుభవించమనడమేమిటో...?

సృష్టికి మూలం ఆడదని చెప్పిన అమ్మమ్మే
నిండు ప్రాణాన్ని బలి చేయమంటుంటే
స్త్రీ స్థానం సమాజంలో ఏంటో
అర్థం కాని తల్లుల గుండెకోతలేమిటో...?

చెల్లెలి వేదనను తట్టుకోలేక బావని
తిట్టుకున్న ఓ అన్న మనసు ...
తన భార్య దగ్గరికొచ్చేసరికి
నీళ్ళు నములుతుందేమిటో..?

కడుపు తడుముకుంటూ శిశువుతో మాటాడే
అమ్మ ఆనందం ఆవిరిచేస్తున్న వారందరూ
అదే తల్లి గర్భాన ప్రాణం పోసుకున్న వాళ్ళేగా
అయినా..కర్కశంగా...

ఆ కొత్త జీవాన్ని ఛిద్రం చేయడమేమిటో..? .

## పరమపద సోపానం

# పరమపద సోపానం ఆట మీకు తెలుసా?



పదమూడో శతాబ్దంలో జ్ఞానదేవ అనే ముని మరియు కవి పిల్లల ఆట ఒకటి తయారు చేశారు. ఆ ఆట పేరు మోక్షపదం (వైకుంఠపాళి)

మన సంస్కృతిని, ఆచారాలను అన్నిటినీ నాశనం చేసేందుకు కంకణం కట్టుకున్న బ్రిటిష్ వారు భన ఆటల్లో కూడా మనం పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పిస్తున్నాం అని గ్రహించి ఆ ఆటని మొత్తం బ్రిటీష్ వారు మార్పు చేసి Snakes and Ladders గా విడుదల చేసారు. వారికి కలిసొచ్చిన అంశం, అప్పటికి ముద్రణా వ్యవస్థ అందుబాటులోకి రావడం.

ఈ ఆటలో వంద చతురస్రాలు ఉంటాయి. మన మునీశ్వరులు జ్ఞానదేవ్ రూపొందించిన ఆటలో 12వ చతురస్రం అంటే 'నమ్మకం' అని, 51వ ది అంటే 'విశ్వసనీయత' అని, 57 వ ది 'దాతృత్వాన్ని' సూచిస్తుంది, అలాగే 76వ చతురస్రం 'జ్ఞానాన్ని' సూచిస్తుంది. 78వది 'మునివృత్తి' ని సూచిస్తుంది. ఆ గళ్ళ క్రింద నిచ్చెన ఉంటుంది. ఆ గడిలో పాచిక పడితే నిచ్చెన ఎక్కి వేగంగా ఆటలో పైకి వెళ్లే అవకాశం ఏర్పడుతుంది.

అలాగే 41వ గడి 'అవిధేయతకు' ప్రతీకగా, 44వ గడి లో పడితే 'అహంకారం' అని, 49వ గడిలో పడితే 'అశ్లీలత' అని....అలాగే 52వ గడిలోకి ప్రవేశిస్తే 'దొంగతనం' అని, 58వ గడిలో 'అబద్ధలాడుట' అని, 62 లో ప్రవేశిస్తే 'తాగుబోతు' అని, 69వ గడిలోకి అడుగుపెడితే 'అప్పులుపాలు' అని, 73వ గడిలోకి ప్రవేశిస్తే 'హంతకుడు/హత్యలు' అని 84వ చతురస్రం లోకి వెళితే 'కోపిష్టి' అని, 92 లో 'దురాశను' 95వ గడి 'గర్వాన్ని' సూచిస్తాయి అని, చివరగా 99వ గడి 'కామాన్ని' సూచిస్తాయి అని చెప్పారు. ఈ గళ్ళల్లో పాము నోరు తెరుచుకుని ఉండి, ఆయా గుణాలను బట్టి కిందకు జారిపోతారు.

ఆటలోనే మంచి చెడు నేర్చుకోవాలి అని ముని మనకు చెప్పకనే చెప్పిన విధంగా తెలుస్తుంది పిల్లలకు.

చెడుమార్గాన్ని ఎంచుకునే వారు అధఃపాతాళానికి చేరుకుంటారు. మంచి గుణాలు అలవర్చుకుంటే జీవితంలో పైకి ఎదుగుతాము అని ఆటల ద్వారా కూడా చెప్పడం.

100 వ గడిలోకి ప్రవేశిస్తే "మోక్షం"

ప్రతి నిచ్చెన పై భాగంలో ఎవరో ఒక దేవుడు/ దేవత లేకపోతే వివిధ లోకాలు, లేదా కైలాసం, వైకుంఠం లేదా బ్రహ్మలోకం ఇలా ఉంటాయి.

ఆట ఆడుతుంటే పిల్లలకు ఉత్సాహంగా అనిపించి నిజజీవితంలోని అనేకానేక ఒడిదుడుకులు కనిపిస్తాయి. నిచ్చెన ఎక్కితే మంచి కర్మలు చేసినట్టు, పాము నోట్లో పడితే పాపాలు పండినట్టు రూపొందించారు. పరమ పద సోపనాన్ని పోలిన ఆటలు నేడు అనేకం లభ్యమౌతున్నాయి . బిసినెస్ గేమ్స్ కూడా ఇటువంటి తరహావే. ఈ మధ్య రామాయణం,మహా భారతం ఘట్టాలతో ఇటు వంటి ఆటనే రూపొందించి చిన్నారులకు అందుబాటులో ఉంచుతున్నారు .ఆటకు ఆట, వినోదానికి వినోదం, విజ్ఞానానికి విజ్ఞానం ఈ ఆటలా వాళ్ళ లభిస్తుండటం తో వీటికి గిరాకి ఎక్కువగా ఉంది .

సాహితి సామ్రాట్ కథలు

# దాహం

ఈ నెల కథ

## రెండవ బహుమతి పొందిన కథ



కొండ గుంట వెంకటేష్

THE GREATEST QUEST IN LIFE IS TO REACH ONES POTENTIAL,

స్కూల్ ఆవరణ నిశబ్దంగా ఉంది. ఎక్కడ చిన్న చడి చప్పుడు వినిపించటం లేదు. క్లాసులో పాఠాలు చెప్పుతున్న మాస్టర్ల గొంతు మాత్రం గంభీరంగా వినిపిస్తున్నాయి. అప్పుడే ఒక వ్యక్తి స్కూల్ లోపలికి వచ్చాడు.

తిన్నగా వెళ్ళి ఒక క్లాసు రూమ్ ముందు నిలబడ్డాడు.

పాఠం చెప్పుతున్న మాస్టర్ విస్సుగా చూసి “ఎవరుకావాలి”అని అడిగాడు.

సాహితి సామ్రాట్ కథలు

# దాహం

"రాజ్యం కోసం వచ్చానండి. ఆమె బాబు అర్జంటుగా ఆమెను ఇంటికి తీసుకురమ్మన్నారండి"అన్నాడు అతను.

మాస్టర్ లేచి క్లాసు వైపు చూసి "రాజ్యం నీ కోసం ఎవరో వచ్చారు. వెళ్ళు"అన్నాడు.

సంచి భుజానికి తగిలించుకుని క్లాసులోంచి బయటకు వెళ్ళింది రాజ్యం.

"ఏమిటి బాబాయ్. ఎందుకు నాన్నగారు రమ్మన్నారు"అడిగింది రాజ్యం. ఆమెకు పద్నాలుగు సంవత్సరాలు ఉంటాయి. పదవక్లాసు చదువుతోంది.

"నాకేం తెలియదమ్మా. మీ అయ్య తీసుకురమ్మన్నాడు అంతే"

ఇంకేం మాట్లాడలేదు రాజ్యం. పావు గంట తరువాత ఇద్దరు ఇంటికి చేరుకున్నారు. ఇంటిముందు అందమైన ముగ్గులు వేసున్నాయి. గమ్మాలకు తోరణాలు కట్టారు. లోపల పనివాళ్ళు హడావిడిగా తిరుగుతున్నారు. ఇల్లంతా దీపాలతో నిండిపోయింది. ఈ హడావిడి దేనికోసమో రాజ్యానికి అర్థం కాలేదు.

సంచి గదిలో పెట్టి వంటింట్లోకి వెళ్ళింది. లోపల పనివాళ్ళు పిండివంటలు చేస్తున్నారు. రాజ్యం తల్లి వాళ్ళకు పనులు పురమాయిస్తూ హడావిడి చేస్తోంది.

"ఏమిటమ్మా ఇది. నన్ను ఎందుకు రమ్మన్నారు"అంది రాజ్యం.

తల్లి రాజ్యాన్ని అక్కున దగ్గరకు చేర్చుకుంది. తనివి తీర కూతురు బుగ్గలు పండింది.

"నీకు మంచి సంబంధం వచ్చింది పిచ్చి మొద్దు. ఈ రోజు నీకు పెళ్ళిచూపులు. పోలీసోడు నీకు మొగుడుగా రాబోతున్నాడు. వెళ్ళి ముందు స్నానం చెయ్యి. తరువాత నిన్న తెచ్చిన కొత్త పట్టు చీర కట్టుకుని తయారుగా ఉండు"అంది.

తలమీద పిడుగుపడినట్టు ఉలిక్కిపడింది రాజ్యం. పిచ్చిదానిలా తల్లి వైపు చూసింది.

"ఇప్పుడు నాకు పెళ్ళేమిటమ్మా. నేను ఇంకా బాగా చదువుకోవాలి. పెద్ద ఉద్యోగం చెయ్యాలి"అంది.

"చదువు ఎక్కడికి పోతుంది. ఎప్పుడైన చదువుకోవచ్చు. పెళ్ళి తరువాత చదుకో. ఎవరు కాదంటారు. ఈ సంబంధం చాల మంది సంబంధం. అబ్బాయి పోలీసు డిపార్ట్ మెంట్ లో పనిచేస్తున్నాడు. నీ ఫోటో చూసి వెంటనే సరే అన్నాడు."

"అమ్మా. నాకు ఇప్పుడిప్పుడే పెళ్ళిచేసుకోవాలని లేదమ్మా. నాన్నతో చెప్పి ఈ పెళ్ళి మాన్పించమ్మా"అంది బ్రతిమాలుతూ రాజ్యం.

"అమ్మో ఇంకేమైన ఉందా మీ నాన్నగారు చంపేస్తారు. వెళ్ళు ఆయన రాకముందే తయారవ్వు. నాకు అవతల బోలేడంత పని ఉంది"అని హడావిడిగా వెళ్ళిపోయింది తల్లి.

నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయింది. ఒక్కసారిగా రాజ్యానికి ఏడుపు ముంచుకు వచ్చింది. ఏడుస్తూ తన గదిలోకి వెళ్ళిపోయింది.

"దేవుడా ఎలాగైన ఈ సంబంధం తప్పిపోయేలా చూడు. నీకు వంద కొబ్బరికాయలు కొడతాను"అని వేడుకుంది.

దేవుడు ఆమె మొర వినలేదు. అనుకున్న సమాయానికి పెళ్ళి చూపులు జరిగాయి. పెద్దవాళ్ళు కట్నం కానుకలు మాట్లాడుకున్నారు. రాజ్యం మాత్రం మౌనంగా ఉండిపోయింది. తన కర్మ ఇంతే అని సరిపెట్టుకుంది. వచ్చే నెలలో మంచి ముహూర్తం ఉందని పంతులుగారు చెప్పారు. ఆ తేదికే రాజ్యం తండ్రి కాయం చేశారు. ఆ రాత్రి రాజ్యం నిద్రపోలేదు. ఏడుస్తూ ఉండిపోయింది. మొదటిసారి తండ్రిని మనస్సులో ఇష్టం వచ్చినట్టు

సాహితి సామ్రాట్ కథలు

# దాహం

తిట్టుకుంది. తన జీవితాన్ని నాశనం చేసిన రాక్షసుడని కసిగా అనుకుంది.

--

కాలం ఎవరి కోసం ఆగదు. కాలంతో పాటు మనిషి ఎదుగుతాడు. జ్ఞానం సముపార్జించుకుంటాడు.

మానసిక పరిపక్వత తెచ్చుకుంటాడు. అనుకున్న టైంకు రాజ్యం పెళ్ళి అట్టహాసంగా జరిగింది. రాజ్యం భర్త రాజు చాల బాగుంటాడు. మంచివాడు కూడా. ఇరవైసంవత్సరాలు ఉంటాయి అతనికి. పెళ్ళయిన వెంటనే రాజ్యాన్ని హైద్రాబాదు తీసుకువెళ్ళిపోయాడు. మీర్ పెట్ పోలీసు స్టేషన్ లో కానిస్టెబుల్గా పనిచేస్తున్నాడు అతను. ఇంకా పోలీసు క్వార్టర్స్ అలాట్ కాలేదు. అందుకే ఒక అద్దె ఇంట్లో కాపురం

పెట్టాడు.

వచ్చిన కొన్నిరోజులకు రాజ్యం ముభావంగా ఉంది. భర్తతో సరిగ్గా ప్రవర్తించలేకపోయింది. మనస్సు విప్పి మాట్లాడేది కాదు. ఎప్పుడు ఏదో తలుచుకుంటు మౌనంగా ఉండిపోయేది. రాజు ఈ విషయాలు గమనించిన కోపగించుకోలేదు. తను చాల చిన్న పిల్ల అని సరిపెట్టుకున్నాడు. కొన్నిరోజుల తరువాత తనే మారిపోతుందని అనుకున్నాడు.

అందుకే ఆమెను ఏమనేవాడు కాదు. సాధ్యమైనంతవరకు ఆమెను సంతోషపెట్టాలని చూసేవాడు. ఆమె అడగకుండానే అన్ని కొనిపెట్టేవాడు. డబ్బుకు ఇబ్బంది లేదు. రాజు తండ్రి ఒక మోతుబరి. ఇరవై ఎకరాల ఆసామి. రాజు ఒక్కడే కొడుకు.

ప్రతిరోజు రాజ్యాన్ని బయటకు తీసుకువెళతాడు రాజు. ఒక రోజు సినిమాకు, ఒకరోజు టాంక్ బండ్ కు ఇంకో రోజు గుడికి. ఇలా భార్యను సంతోషపెట్టటానికి చాల కష్టపడేవాడు రాజు. కాని రాజ్యంలో మాత్రం పెద్దగా మార్పు రాలేదు. కాని లోపల మాత్రం భర్తను చూసి జాలిపడేది. కాని సర్దుకోలేకపోయింది. తనచదువు అర్ధాంతరంగా అగిపోవటానికి కారణం ఇద్దరు. ఒకరు ఆమె తండ్రి. ఇంకోకరు ఆమెను పెళ్ళిచేసుకున్న రాజు. అందుకే తనకు చేతనైన పద్ధతిలో పగపెంచుకుంది.

ఈ పరిస్థితిలో ఆమె ఒక విషయం గమనించింది. వీధిలో ఉన్నవాళ్ళందరు రాజును ఎంతో ఆప్యాయంగాపలకరిస్తారు. అతని ముందు చేతులు కట్టుకుని నిలబడతారు. చాల మర్యాదగా ప్రవర్తిస్తారు. ఈ పరిణామం రాజ్యానికి ఎంతో నచ్చింది. ఇంటి దగ్గర మాత్రమే కాదు. సినిమా హాలులో కూడా అతన్ని ఎంతో మర్యాదగా చూసేవాళ్ళు. థియటర్ మేనేజర్ స్వయంగా వచ్చి రాజును సాధరంగా లోపలికి తీసుకువెళ్ళేవాడు. ఈ విషయాలు గమనించిన రాజ్యం తన భర్త ఎంతో గొప్ప వాడు అనుకుంది. అందుకే అందరు మర్యాదగా చూస్తున్నారని భావించింది.

ఆ రోజు ఇద్దరు సినిమాకు వెళ్ళారు. వచ్చేటప్పుడు హోటల్ లో భోజనం చేశారు. ఇంటికి వచ్చేసరికి పన్నెండు అయింది. చాల అలసటగా ఉందని రాజు పడుకున్నాడు. వెంటనే నిద్రలోకి జారుకున్నాడు.

రాజ్యానికి మాత్రం నిద్రరావటం లేదు. తదేకంగా భర్త వైపు చూసింది. అమాయకంగా నిద్రపోతున్నాడు అతను. నిద్రలోనే ఏదో గుర్తుకువచ్చినట్టుగా ఉంది. అతని పెదవులు సన్నగా విచ్చుకున్నాయి. ఆ భంగిమలో భర్త ఎంతో ముద్దువచ్చాడు. ఒక్కసారిగా ఆమెను ప్రేమ చుట్టుముట్టింది. గట్టిగా అతన్నికౌగలించుకుంది.

ఉలిక్కిపడి కళ్ళు తెరిచాడు రాజు. భార్య తనను కౌగలించుకోవటం చూసి నవ్వాడు. భార్య మారిపోయినందుకు అతనికి ఎంతో సంతోషం కలిగింది. ఆప్యాయంగా ఆమెను ఇంకా దగ్గరకు లాక్కున్నాడు. వాళ్ళకు అదే

సాహితి సామ్రాట్ కథలు

# దాహం

రోజు శోభనం జరిగింది.

---

రెండు సంవత్సరాలు గడిచాయి.

ఆ రోజు హడావిడిగా ఇంటికి వచ్చాడు రాజు.

"ఏమిటా హడావిడి. ఏమైంది"అంది రాజ్యం.

"రేపు ఆగస్ట్ 15. మనకు స్వాతంత్రము వచ్చిన రోజు. పెరేడ్ గ్రౌండ్స్ లో పెద్ద మీటింగ్ జరుగుతోంది.మనం కూడా వెళ్ళాలి. నాకు అక్కడే డ్యూటి వేశారు. చక్కగా తయారవ్వు. ఇద్దరం కలిసి వెళదాం"అన్నాడు.

"నిజంగానా. నన్ను ఏ చీర కట్టుకోమంటారు"ఉత్సాహంగా అడిగింది రాజ్యం.

"నీకు నచ్చింది కట్టుకో. నువ్వు ఏది కట్టుకున్నా బాగుంటుంది."

"నీలం రంగు జార్జెట్ చీర కట్టుకుంటాను"అంది. మీరు మీరు ఏం వేసుకుంటారు."

"నా యూనిఫారమ్ ఉందిగా"అన్నాడు రాజు నవ్వుతూ.

---

మరునాడు ఇద్దరు శుభ్రంగా తయారయి బైక్ మీద బయలుదేరారు. ;చుట్టు పక్కల ఉన్నవాళ్ళు కూడా బయలుదేరారు. అందరు రాజుకు నమస్కారం చేశారు. వాళ్ళలో పెద్దవాళ్ళు ఉన్నారు. చిన్నవాళ్ళు ఉన్నారు. ఇదంతా చూసి రాజ్యానికి చాల ఆనందం కలిగింది. తన భర్త ఎంతో గొప్పవాడని మురిసిపోయింది.

ఒక సంఘటన జీవితాన్ని మార్చేస్తుంది అని అంటారు. అది రాజ్యం విషయంలో నిజమైంది. గంట తరువాత బైక్ పెరేడ్ గ్రౌండ్స్ కు చేరుకుంది. బైక్ ను పార్క్ చేసిన తరువాత ఇద్దరు లోపలికి వెళ్ళారు. లోపల చాల మంది పోలీసు ఆఫీసర్స్ ఉన్నారు. వాళ్ళను చూసి రాజు స్టిఫ్ గా సెల్యుట్ చేశాడు.

అక్కడ రాజును చూసి ఎవరు నమస్కారం చెయ్యలేదు. అందరికి రాజు సెల్యుట్ చేశాడు. ఈ విషయం రాజ్యం చూసి ఆశ్చర్యపోయింది. ఇన్నిరోజులు అందరు భర్తకు నమస్కారం పెట్టటం ఆమె చూసింది.

ఇప్పుడు భర్త అందరికి నమస్కారం చేస్తున్నాడు. ఈ పరిణామం ఆమె అర్థంచేసుకోలేకపోయింది. ఆమె సంతోషం ఆవిరైపోయింది. ఉత్సాహం చచ్చిపోయింది. ఏదో తెలియని చిరాకు బాధ కలిగాయి. పెద్ద పెద్ద అధికారులు పోలీసు ఆఫీసర్స్ ముందు కూర్చున్నారు. వెనుక ఎక్కడో రాజ్యం కూర్చుంది. రాజు మాత్రం

డ్యూటిలో ఉన్నాడు. వస్తున్న వాళ్ళకు సెల్యుట్ చేస్తూ లోపలికి తీసుకువస్తున్నాడు.

అప్పుడే ఒక పోలీసు ఆఫీసర్ రాజును చూసి "కానిస్టెబుల్ ఇలా రా "అని హుంకరించాడు.

కంగారుగా రాజు ఆ ఆఫీసర్ దగ్గరకు వెళ్ళాడు.

"మా పాపకు కూల్ డ్రింక్ తీసుకురా"అని డబ్బు ఇచ్చాడు.

రాజు పరిగెత్తుకుని వెళ్ళి కూల్ డ్రింక్ తెచ్చి ఇచ్చాడు. ఆ తరువాత చాల ఆఫీసర్స్ అతనికి పనులుపురమాయిచారు. ఎవరికి కాదనలేదు రాజు. వాళ్ళకు కావల్సింది తెచ్చి ఇచ్చాడు. ఈ దృశ్యం దూరం నుంచి రాజ్యం గమనిస్తోంది. ఆమె బాధ ఇంకా ఎక్కువైంది. తన భర్త పనివాడిలా అందరికి సేవలు చెయ్యటం ఆమెను చాల వ్యధకు గురిచేసింది. ఆమె పల్లెటూరు నుంచి వచ్చింది. సిటి లైఫ్ గురించి పెద్దగా తెలియదు. తన భర్త పెద్దవాడని ఇంతకాలం నమ్ముతూ వచ్చింది. చాల మంది అతనికి నమస్కారం చెయ్యటం ఆ

# దాహం

అభిప్రాయాన్ని ఇంకా బలపరిచింది. కాని ఇక్కడ దృశ్యం మరోలా ఉంది. ఒక పని వాడి కంటే చాల దారుణందా తన భర్తను చూస్తున్నారు.

చేదుమాత్ర మింగినట్టు ఫీలయింది రాజ్యం. ఆక్షణం నుంచి ఆమె మూడ్ మారిపోయింది. ప్రోగ్రాం ను మనసారా ఎంజాయ్ చెయ్యలేకపోయింది.బాధ చిన్నతనం ఆమెను కలిసికట్టుగా కుదిపేశాయి.

---

ప్రోగ్రాం పూర్తి అయ్యేసరికి రాత్రి పదకొండుగంటలైంది. పోలీసు ఆఫీసర్స్ అందరు వెళ్ళిపోయారు.

వాళ్ళను స్వయంగా రాజు మిగత సిబ్బంది పంపిచారు. తరువాత చివరగా రాజు బయలుదేరాడు.

"ఎలా ఉంది ప్రోగ్రాం"నవ్వుతూ అడిగాడు రాజు.

"బాగానే ఉంది "అంది రాజ్యం. ఆమె మాటలు పొడిగా ఉన్నాయి.

"ఇది మా పోలీస్ డిపార్ట్ మెంట్ ఏర్పాటుచేసిన ప్రోగ్రాం. అందుకే అంతమంది పోలీసు ఆఫీసర్స్

వచ్చారు"అన్నాడు రాజు బైక్ స్టార్ట్ చేస్తూ.

నిరాసక్తంగా నిస్సత్తువగా కూర్చున్నట్టు కూర్చుంది రాజ్యం.

బైక్ బయలుదేరింది. రాజు సంతోషంగా ఫంక్షన్ విషయాలు చెప్తూతున్నాడు. ఊ కొడుతుంది రాజ్యం.

అంతకుమించి ఆమె నోరు విప్పలేదు. భార్య మౌనానికి కారణం ఏమిటో రాజుకు అర్ధంకాలేదు. కొంపదీసి మళ్ళి మొదటికి వచ్చిందా. సంవత్సరం ముందు ప్రవర్తన మళ్ళి కొనసాగిస్తుందా. భయంతో తల్లడిల్లిపోయాడు రాజు. అయిన ఏం అడగలేదు.

బైక్ ఇంటి ముందు ఆగింది. అప్పుడే చాల మంది చుట్టుపక్కలవాళ్ళు వచ్చేశారు. రాజును విష్ చేసి ఫంక్షన్స్ బాగుందని ప్రశంసించారు. ఈ సారి రాజ్యానికి వాళ్ళ మాటలు కొంచం కూడా సంతోషం ఇవ్వలేదు. పైగా చిరాకు కలిగింది. వాళ్ళంతా అతిగా ప్రవర్తిస్తున్నారని అనిపించింది.

ఇంటి ముందు బైక్ ఆగింది. రాజ్యం దిగి చరచర లోపలికి వెళ్ళిపోయింది. రాజుతో ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఈ పరిణామానికి కారణం అతనికి అర్ధంకాలేదు. తన వల్ల ఏదైన పొరపాటు జరిగిందా అని వాపోయాడు. ఎంత ఆలోచించిన తను తప్పుచేసిన దాఖలాలు కనిపించలేదు. అంతవరకు ఉన్న అతని ఉత్సాహం చప్పగా చల్లారిపోయింది. ఊసురుమంటు లోపలికి వెళ్ళాడు.

ఇద్దరికి భోజనం వడ్డించింది రాజ్యం. ఒక్క మాట కూడా మాట్లాడలేదు. రాజు పలకరించిన జవాబు

ఇవ్వలేదు. మౌన వ్రతం పాటించినట్టు మూగనోము పట్టింది.

బెడ్ రూంలో కూడా ఆమె ప్రవర్తన మారలేదు. భర్తకు దూరంగా పడుకుంది. ఈ చర్యతో రాజు సహనం

పూర్తిగా పోయింది. కోపంతో ఆమెను తన వైపు లాక్కున్నాడు.

"ఎందుకలా ఉన్నావు. ఏమైంది. నా వల్ల ఏదైన తప్పుజరిగిందా. జరిగితే చెప్పోచ్చుగా. మౌనంగా ఉంటే

నాకెలా తెలుస్తుంది"అని కోపగించుకున్నాడు. ఏం మాట్లాడలేదు రాజ్యం. లేచి బాల్కనిలో నిలబడింది.

చుట్టు చీకటి ఆవహించుకుంది. దాదాపు అందరి ఇళ్ళలో లైట్లు ఆరిపోయాయి. వెళ్ళి ఆమె పక్కన నిలబడ్డాడు రాజు. అనునయంగా భుజం మీద చెయ్యివేశాడు.

"ఏమైంది రాజ్యం. ఎందుకిలా చేస్తున్నావు. ఇంతసేపు ఓపికతో

# దాహం

ఉన్నాను. ఇక నా వల్ల కాదు. నేను మనిషినే. నాకు వ్యక్తిత్వం రోషం ఉన్నాయి. చివరిసారి అడుగుతున్నాను. ఏమైందో చెప్పు. ఫంక్షన్ లో

నిన్ను ఎవరైన ఏమైన అన్నారా. వాళ్ళు ఎవరో చెప్పు. తాటతీస్తాను"అన్నాడు రాజు.

"నిజంగా తాటతీస్తారా"మొదటిసారి గొంతు విప్పింది రాజ్యం.

"నిజంగానే. ఆ మనిషి ఎవరో చెప్పు. ఆడదైన ఫర్వాలేదు. ఊరుకోను. ఏదో కేసు పెట్టి బొక్కలోకి

తోసేస్తాను."

"మాట తప్పరు కదా."

"తప్పను. ఇంతకుముందు ఎప్పుడైన తప్పానా . నన్ను నమ్ము."

"మీకు ఫంక్షన్ లో పనులు పురమాయించిన అధికారుల తాట తియ్యండి"అంది స్థిరంగా రాజ్యం

---.

మొదటి ఆ మాటలను సీరియస్ గా తీసుకోలేదు. నవ్వుతూ భార్య వైపు చూశాడు. ఆమె మొహం చాల సీరియస్ గా ఉంది. తన మాటలకు భర్త నవ్వటం ఇంకా కోపం తెప్పించింది ఆమెకు.

"చెప్పానుగా. ఆ పని చెయ్యగలరా? అంది గట్టిగా.

"వాళ్ళు నా పై అధికారులు. వాళ్ళు ఏం చెప్పిన చెయ్యాలి.అది నా డ్యూటి. బాధ్యత. వాళ్ళకు ఆ హక్కు

ఉంది. ఇందులో వాళ్ళ తప్పు ఏం ఉంది."

"ఆ హక్కు ఎలా వచ్చింది.?

"ఐ.పి.యస్ చదవటం వల్ల."

"మీరెందుకు చదవలేదు".

"నాకు పెద్దగా చదువు అబ్బలేదు. చిన్న తనం నుంచి గారాబంగా పెరిగాను. నాకు నాలుగు సంవత్సరాలు

ఉన్నప్పుడు అమ్మ పోయింది. అప్పటినుంచి నాన్న తనే అమ్మ నాన్న అయి పెంచాడు. నేను బాగా

చదువుకోవాలని నాన్న కోరిక. కాని నా వల్ల కాలేదు. అలాగని నేను చిల్లరగా తిరగలేదు. చెడ్డవాళ్ళతో

స్నేహం చెయ్యలేదు. ఎందుకో కాని నాకు చదవు ఒంటబట్టలేదు. అతికష్టం మీద పదవక్లాసు పాసయ్యాను.

తరువాత చదువు ఆపేశాను. అప్పటినుంచి మా వ్యవసాయం చూసుకనేవాడిని. నాన్నతో కలిసి పొలానికి వెళ్ళేవాడిని. నాలుగు

సంవత్సరాలు గడిచాయి.అప్పుడే పేపర్ లో పోలీస్ కానిస్టెబుల్స్ కావాలని ప్రకటన పడింది. వాళ్ళు అడిగిన అర్హతలన్ని నాకు ఉన్నాయి. వెంటనే అప్లయ్ చేశాను. అతికష్టం మీద రాత పరీక్షలో పాసయ్యాను. ఫిజికల్ ఫిట్ నెస్ లో కూడా విజయం సాధించాను. అలా అంతా కలిసివచ్చింది నాకు వెంటనే చేరిపోయాను. "

"ఐ.పి.యస్ చదవటం కష్టమా"

"మాములు కష్టం కాదు. చాల కష్టం. రాత్రిపగలు చదవాలి. లెక్కలేనన్ని పుస్తకాలు చదవాలి. ఆ కోర్సు గురించి నాకు పూర్తిగా తెలియదు. కొని ఒక విషయం మాత్రం తెలుసు. సంవత్సరానికి కొన్ని లక్షల మంది

ఆ పరీక్షలకు చదవుతారు. రాస్తారు. కాని వాళ్ళలో వందమందిని మాత్రమే సెలక్ట్ చేస్తారు. దాన్ని బట్టి అది

ఎంత కష్టమో అర్థమవుతుంది."

"నేను చదువుతాను. ఐ.పి.యస్ పాసవుతాను"అంది స్థిరంగా. విస్తూబోయి చూశాడు రాజు. ఆమె మొహంలో దృఢనిశ్చయం కనిపిస్తోంది. కళ్ళలో వింత వెలుగుగోచరిస్తోంది. ఏదైన సాధించాలనుకునేవారి కళ్ళు అలాగే ఉంటాయి. "

"నువ్వుటెన్త్ కూడా రాయలేదు. ఎలా

# దాహం

రాస్తావు. దానికి డిగ్రి ఉండాలి."

"మీరు సరే అంటే అన్ని పూర్తిచేస్తాను. విజయం సాధిస్తాను."

"వద్దు రాజ్యం. నీ వల్లకాదు. పాసుకాకపోతే బాధపడతావు. ఇంత కష్టపడ్డాను. నేను ఎందుకు పాసుకాలేదు అని వాపోతావు. అది నీకు అవసరమా. నా మాట విను. ఈ ఆలోచన నీ బుర్రలోంచి తీసేయ్."అని నచ్చచెప్పాడు. కాని రాజ్యం వినిపించుకోలేదు. తను కష్టపడి చదువుతానని చదివించమని కోరింది. ఒక వైపు రాజుకు కోపం వస్తోంది. ఇంకో వైపు ఆనందంగా ఉంది ఆమె పట్టుదల చూసి.చేసేది లేక సరే అన్నాడు.

గొప్ప విజయం సాధించినట్టు సంబరపడిపోయింది రాజ్యం. ఆర్తిగా భర్తను చుట్టుకుపోయింది.

---

ఆ తరువాత తతంగం వేగంగా జరిగిపోయింది. ప్రైవేట్ గా పదవక్లాసులో ఎన్ రోల్ చేసుకుంది రాజ్యం.

సహజంగా ఆమె చాల తెలివైంది. చదువులో దిట్ట. అందుకే కష్టపడి చదివింది. మంచి మార్కులతో పాసయింది. తరువాత ఇంటర్మీడియట్ చేరింది. మొదటి సంవత్సరం మంచి మెరిట్ లో పాసయింది.

రెండో సంవత్సరంలోకి అడుగుపెట్టింది. అప్పుడే ఆమె గర్భవతి అయింది. అయిన కంగారుపడలేదు.

రెట్టించిన ఉత్సాహంతో చదివింది. పరీక్షలకు రెండు నెలలు ముందు ఆమెకు ప్రసవం జరిగింది. పండంటి మగపిల్లవాడు పుట్టాడు. రాజు రాజ్యం సంతోషానికి అవధులు లేకుండ పోయింది. రోజు ఇంటి పని వంటపని పిల్లవాడిని చూసుకోవటంతో సరిపోయేది. క్షణం కూడా తీరిక ఉండేది కాదు.

అయిన తన చదువును అలక్ష్యం చెయ్యలేదు. బాబు రాజు నిద్రపోయిన తరువాత చదువుకునేది. ఒక రోజు రాత్రి రాజుకు మేలుకువ వచ్చింది. దాహం వేసి మంచి నీళ్ళ తాగటానికి లేచాడు. హాలులో టేబుల్ముం దు కూర్చుని ఉంది రాజ్యం. దీక్షగా పాఠ్యపుస్తకాలు చదువుతోంది. మధ్యమధ్యలో ఏవో నోట్సే సుకుంటుంది.

భార్య పట్టుదల దీక్ష చూసి రాజుకు ముచ్చటవేసింది. గర్వం కూడా వేసింది.

ఇంటర్మీడియట్ కూడా పూర్తిచేసి డిగ్రిలో చేరింది. ఒక వైపు బాబును భర్తను చూసుకుంటునే ఇంకో వైపు తన చదువు కొనసాగించింది.

చదువు కోవాలనే తపన ఆమె అణువు అణువున వ్యాపించిఉంది. అందువల్ల పడుతున్న శ్రమ ఆమెకు తెలియలేదు.

మూడు సంవత్సరాలు గడిచాయి. రాజ్యం డిగ్రికూడా ఫస్ట్ క్లాసులో పాసయింది.

ఆ రోజు వాళ్ళింట్లో పండుగ వాతావరుణం నెలకొంది. బాబుకు నాలుగు సంవత్సరాలు నిండాయి. ముద్దు మాటలతో ఇద్దరిని అలరిస్తున్నాడు వాడు. వారంరోజులపాటు పూర్తి విశ్రాంతి తీసుకుంది రాజ్యం.

తరువాత ఆ రోజు రాత్రి ఆమె రాజు గదిలో కూర్చున్నారు. బాబు పక్కన నిద్రపోతున్నాడు.

"ఐ.పి.యస్ లో చేరుతాను"అంది మెల్లగా.

"అలాగే చేరుతాను. ఎంత ఖర్చవుతుందో తెలుసుకున్నావా"అడిగాడు రాజు.

"తెలుసుకున్నానండి."

"ఎంత?

చెప్పింది రాజ్యం.

అలాగే రెండు రోజులలో ఏర్పాటు చేస్తాను. ఈ లోగా కోచింగ్ సెంటర్ గురించి వివరాలు తెలుసుకో."

సాహితి సామ్రాట్ కథలు

# దాహం

"అంత డబ్బు ఎక్కడనుంచి తెస్తారు"బాధగా అడిగింది రాజ్యం.

"ఊళ్ళో ఉన్న పోలం కొంత అమ్ముతాను."

"మామయ్యగారు ఒప్పుకుంటారా"

"చదువుకునేవాళ్ళంటే నాన్నగారికి చాల ఇష్టం గౌరవం. నేను ఎలాగు చదువుకోలేకపోయాను. కనీసం

కోడలైన పెద్ద చదువులు చదువుతున్నందుకు సంతోషిస్తాడు. డబ్బు గురించి నువ్వు వర్రికాకు. అంతా నేను

చూసుకుంటాను. నువ్వు మాత్రం చదువు మీద లగ్నం చెయ్యి"అన్నాడు.

---

కోరినట్టుగానే ఐ.పి.యస్ పూర్తిచేసింది. సెలక్ట్ అయింది. 78 వ ర్యాంకు వచ్చింది. ఆనందం తట్టుకోలేకపోయాడు రాజు. భార్యను అమాంతం ఎత్తుకుని గిరిగిర తిప్పాడు. ఉద్వేకం సంతోషం ఇద్దరిని కలిసికట్టుగా కుదిపేశాయి. ఇదేం అర్ధంకాని బాబు బోసినోటితో నవ్వుతున్నాడు.

ఈ విషయం వీధిలో వాళ్ళకు వెంటనే తెలిసిపోయింది. అందరు గుంపులుగా రాజు ఇంటికి వచ్చారు.

రాజ్యాన్ని పొగడ్తలతో అభినందించారు. ఒక కానిస్టెబుల్ భార్య ఇంత పెద్ద ఆఫీసర్ కావటం వాళ్ళకు ఎంతో విస్మయం కలిగించింది.

రెండు రోజులపాటు ఆ కుటుంబం ఆనందంలో మునిగిపోయారు. తరువాత రాజ్యం ట్రయినింగ్ కు వెళ్ళింది. వెళ్ళేముందు ఆమె కళ్ళలో సన్నగా కన్నీటి పొరలు కనిపించాయి.

"ఏమిటిది ఏడుస్తున్నావా. ఈ సమయంలో సంతోషంగా ఉండాలి. ధైర్యంగా ట్రయినింగ్ పూర్తిచేసిరా. అక్కడ కూడా నువ్వు మంచి పేరు సంపాదించుకోవాలి"అన్నాడు రాజు.

భర్తను బాబును విడిచిపెట్టి ట్రయినింగ్ కు వెళ్ళిపోయింది.

---

రాజ్యం వెళ్ళిన తరువాత బాబును రాజు చూసుకునేవాడు. రోజు ఆఫీసుకు బాబును తనతో తీసుకువెళ్ళేవాడు. దానికి సీనియర్ పర్మిషన్ కూడా తీసుకున్నాడు. వారానికి రెండు సార్లు రాజ్యం కాల్చేసేది. గంటసేపు మాట్లాడేది.

## పాఠకులకు విజ్ఞప్తి

సుమతి సకుటుంబ వార పత్రికకు పాఠకులే మూల స్థంభాలు . మీరిచ్చే ప్రోత్సాహమే సుమతికి ఆయువు . మీరు కట్టే చందాలే సుమతికి ఆధరవు. అందుకనే పాఠకుల అభిప్రాయాలకు సుమతి ఎప్పుడు అత్యంత విలువనిస్తుంది. కావున సుమతి పాఠకులు తమ తమ అభిప్రాయాలను ఈ కింది మెయిల్ కు పంపండి . పాఠకుల కోసం ఇకనుండి ఒక పేజిని కేటాయించటం జరుగుతుంది. పాఠకుల అభిప్రాయాలతో పాటుగాpho-to కుడా ప్రచురించ బడును.

ఉత్తమ అభిప్రాయానికి రు 11 6 /– బహుమతిగా ఇవ్వ బడును .

sumathi.salahaalu@gmail.com

సాహితి సామ్రాట్ కథలు

# దాహం

బాబు గొంతు కూడా వినేది.
రోజులు గడుస్తున్నాయి. ఆ రోజు మాములుగా రాజు బాబును తీసుకుని స్టేషన్ కు వెళ్ళాడు. ఆ రోజు చాల హాడావిడిగా ఉంది.

స్టేషన్ సిఐ మిగత సబ్బులు హాడావిడిగా తిరుగుతున్నారు. ఫైల్స్ అన్ని సక్రమంగా ఏర్పాటుచేస్తున్నారు.టేబుల్స్ శుభ్రంగా తుడిచారు. ఈ తతంగం దేనికో రాజుకు అర్ధంకాలేదు.

కొలిగ్ ను అడిగాడు.

"ఈ రోజు కొత్తఏ.ఎస్.పి వస్తున్నారు"అని చెప్పాడు.

స్టేషన్ సిబ్బంది అంతా అలర్ట్ గా ఉన్నారు. రాబోతున్న ఆఫీసర్ కోసం ఎదురుచూస్తున్నారు.

ఇంతలో ఒక పెద్ద కారు వచ్చి అగింది. అందులోంచి ముందు డ్రైవర్ దిగాడు. తరువాత వెనుక తలుపులుతీశాడు. అందులోంచి రాజ్యం దిగింది. ఆమె పూర్తిగా పోలీస్ యూనిఫారమ్ లో ఉంది. భుజం మీద ఐ.పి.యస్ గుర్తు గర్వంగా ఠీవిగా కనిపిస్తోంది.

అందరు అటెన్షన్ లో నిలబడి సెల్యుట్ చేశారు. రాజు కూడా స్టిఫ్ గా సెల్యుట్ చేశారు.

రాజ్యం తిన్నగా వచ్చి భర్తముందు నిలబడింది. ఠీవిగా భర్తకు సెల్యుట్ చేసింది. చూస్తున్నవాళ్ళంతా ఖంగుతిన్నారు.

సిఐ వెంటనే రెస్పాండ్ అయి "మేడం మీరు ప్రోటోకోల్ మరిచిపోతున్నారు. అతను ఒక మాములు కానిస్టేబుల్. "

"కాని ముందు నా భర్త."అంది రాజ్యం.

అందరు నిర్ఘాంతపోయారు.

----

బాబుతో ఇంటికి చేరుకున్నాడు రాజు. ఇంట్లోకి అడుగుపెట్టిన వెంటనే ఒక్కసారిగా స్పందించింది రాజ్యం.

అమాంతం భర్త కాళ్ళ మీద సాష్టాంగంగా పడింది.

"ఏమిటి ఈ చాదస్తం. ఇప్పుడు మాములు రాజ్యం కాదు. రాజ్యం ఐపియస్ . నా కాళ్ళమీద పడకూడదు.

కన్నీళ్ళతో మెల్లగా పైకి లేచింది రాజ్యం.

"నా చదువు ఆగిపోవటానికి కారకులు మీరని అపోహపడ్డాను. కాని అది పొరపాటు అని ఇప్పుడు తెలుసుకున్నాను. చాల మంది మగవాళ్ళకు ఈగో ఉంటుంది. తమ కంటే తమ భార్యలు ఎక్కువగా చదువకోకూడదని అనుకుంటారు. పెద్ద పదవులు అలంకరించకూడదని భావిస్తారు. వాళ్ళంతా బాగా చదువుకున్నవాళ్ళే. కాని ఈగో వాళ్ళను పూర్తిగా కమ్ముకుంటుంది. కాని మీరు అలా కాదు. నా చదువుకు ఎంతో సహకరించారు. ఎన్నికష్టాలు వచ్చిన ఓపికగా భరించారు. ఎప్పుడు నా మీద కోపగించుకోలేదు.

--

పైగా ప్రోత్సహించారు. మీ లాంటి భర్త దొరకటం నా అదృష్టం. ఈ క్షణం నుంచి మిమ్మల్ని బాబును చూసుకుంటాను."అని రాజు గుండెల మీద వాలిపోయింది.

రాజు రెండు చేతులు ఆమె చుట్టు పెనవేసుకున్నాయి. ఆ స్పర్శలో కామం లేదు కోరిక లేదు. ప్రేమ ఆప్యాయత మాత్రం ఉన్నాయి.

ఒక చిన్న సంఘటన వాళ్ళ జీవితాలను మార్చేసింది. చదువుకుని పెద్ద ఉద్యోగం చెయ్యాలనే రాజ్యంకోరిక

ఈ రోజు నెరవేరింది. ఆమె దాహం తీరింది. కేవలం దాహం ఉంటే సరిపోదు. దానికి తగినట్టు లక్ష్యశుద్ధి ఉండాలి. అదే ఫోకస్ ఉండాలి. అది ఉంటే మనిషి ఏదైన సాధించగలడు. ఈ విషయం రాజ్యం నిరూపించింది.

సమాప్తం.

సాహితి
సామ్రాట్
కథలు

# యజ్ఞం

కథ



కొల్ల పుష్ప

”అమ్మాయి సుగుణ ఏంటి? నేను విన్నది నిజమేనా! అన్నది పక్కింటి పిన్ని గారు  సుగుణ బయటకి రాగానే.

“ఏ విషయం పిన్ని గారు” అన్నది తెల్ల మొహం వేస్తూ సుగుణ.

“అదేనమ్మా నీ భర్త మంచి గౌరవప్రదమైన కాలేజీ ప్రిన్సిపల్ గా ఉద్యోగం చేస్తూ మీ ఆయన రోజూ బార్లకి, క్లబ్బులకి తిరుగుతున్నాడట కదా! మన కాలనీలో అందరూ అనుకుంటున్నారు నీ వరకు రాలేదా?” అంది బుగ్గల నొక్కుకుంటూ కాంతం పిన్ని గారు.

“అలాగా పిన్ని గారు నాకు తెలియదు కాలేజీలో పని ఉండి ఆలస్యంగా వస్తున్నారేమో అనుకున్నాను” అంది సుగుణ కలవర పడుతూ.

సాహితి సామ్రాట్ కథలు

# యజ్ఞం

"పిల్లా జాగ్రత్త రిటైర్మెంట్ కి దగ్గర్లో ఉన్నాడు ఆ రిటైర్మెంట్ ఏదో అయిపోతే ఇక రోజంతా ఆ బార్లోనే, క్లబ్బుల్లోనూ ఉంటాడేమో జాగ్రత్తపడు ఇప్పుడే" అంటూ సుగుణ మనసులో అనుమాన బీజం వేసింది.

'తన భర్త అలాంటివాడు కాదే చాలా మంచివాడు ఇప్పుడేంటి ఈ అలవాటు' అని ఆలోచనలో పడింది.

---

ఆలోచిస్తూ కూర్చున్న సుగుణ ఫోన్ మోగుతుంటే ఉలిక్కిపడి ఫోన్ తీసింది.

విషయం విన్న సుగుణ కంగారుగా "అలాగా ఎప్పుడు? ఎక్కడున్నారు? నేను ఇప్పుడే వస్తాను" అని ఫోన్ కట్ చేసి.

భర్త హరీష్ కి ఫోన్ చేసి "హాస్పటల్ కి రండి అని హాస్పిటల్ పేరు చెప్పి" ఫోన్ పెట్టేసి ఆదరాబాదరాగా బయలుదేరింది.

తన ఫ్రెండు శారద కొడుకు బొంబాయి చదువు కోసం వెళ్ళాడు అని చెప్పింది. ఈ లోపే ఇలా జరిగింది అనుకుంటూ టాక్సీ దిగి హాస్పిటల్ లోనికి పరిగెత్తింది సుగుణ.

ుగుణను చూడగానే శారద బావురుమంది. శారదను పొదివి పట్టుకొని పట్టుకుని "అసలేం జరిగిందో చెప్పవే? ఏమైంది నీ కొడుక్కి? అంది సుగుణ... శారద కళ్ళు తుడిచి కూర్చోబెట్టింది రాహుల్ ఫ్రెండ్ రాజా చెప్పింది కళ్ళ ముందు కదలాడింది.

---

"ఒరేయ్ డ్యాడ్ నా బర్తడే హోటల్ సవేరా లో పార్టీ ఇస్తున్నాను మీ గ్రూప్ అందరూ రావాలి" అన్నాడు బిజినెస్ మాగ్నెట్ కొడుకు రోహిత్.

"ఒరేయ్ మేము రాము చదువుకోవాలి" అన్నారు ఇద్దరూ ఒకేసారి రాజా, రాహుల్.

"ఈ ఒక్క రోజుకి చదవకపోతే ఏం కాదులే" అన్నాడు రోహిత్. "మీరందరూ మల్టీమిలినీయర్స్ పిల్లలు.... నేను మామూలు సివిల్ ఇంజనీరు కొడుకుని" అన్నాడు రాహుల్.

"అందుకే కదా రమ్మంటున్నాను? మేము ఇస్తున్న పార్టీ ఇది నువ్వు ఎంజాయ్ చేయాలి రా" అన్నాడు ఇంకొకడు.

మొత్తం మీద రాజా తప్ప అందరూ సాయంత్రం బార్ కి చేరుకున్నారు. ఒళ్ళు పై తెలియకుండా తాగారు.

రోహిత్ కారు తీశాడు తిన్నగా రూములకు వెళ్లకుండా హైవే ఎక్కించాడు. మత్తు బాగా తలకెక్కడంతో ఎలా డ్రైవ్ చేస్తున్నాడో తెలియదు అంతే కళ్ళు తెరిచేలోపున అంతా అయిపోయింది.

"అందరూ స్పాట్లో చనిపోయారు ఆంటీ ఇదంతా నాకు పోలీసులు చెప్పారు. నాకు ఆరోజు జ్వరం రావడం వలన నేను వెళ్ళలేదు" అన్నాడు రాజా. జరిగినది సుగుణకు చెప్తూ "నా కొడుకు అలాంటివాడు కాదు కానీ ఏ బలహీన క్షణం వాడిని ప్రేరేపించిందో వాడు ఇలా బలి అయ్యాడు"

అన్నది శారద ఏడుస్తూ.

ఆ ఒక్క బలహీన క్షణం చాలు శారద... మనిషి వ్యసనం పాలవడానికి ఆ ఒక్క క్షణం మనసుని కట్టడి చేసుకోగలిస్తే ఇటువంటి ప్రమాదాలు జరగవు, తల్లిదండ్రులకు కడుపుకోత ఉండదు. పిల్లలకి ఎప్పుడు అర్థమవుతుందో? తల్లి,దండ్రులు పడే బాధ, వేదన అన్నది శారదను ఓదారుస్తూ.

--

"సార్ మీ అబ్బాయి పోస్టుమార్టం అయిపోయింది తీసుకెళ్ళొచ్చు" అన్నాడు డాక్టర్ కూలబడి కూర్చున్న శారద భర్త ఆనందరావుతో.

'వెళ్తూ ,వెళ్తూ యువత చెడిపోతుంది

# యజ్ఞం

తల్లితండ్రుల బాధ తెలియట్లేదు యువతకు.

హైదరాబాదులో ఇలాంటి కేసులు చాలా ఉండేవి కానీ ఆరు నెలల నుంచి ఇటువంటివి రాలేదు. ఏం మిరాకిల్ జరుగుతుందో లేక యువత బాగుపడుతుందో, ఏది ఏమైనా కొంతమంది తల్లిదండ్రుల కడుపుకోత తగ్గించిన వారికి కృతజ్ఞతలు' అని తనలో తను అనుకుంటూ వెళ్ళాడు డాక్టర్.

రెండు రోజులు శారద, ఆనందరావు లకు తోడుగా ఉండి అన్ని పనులు పూర్తి చేశారు సుగుణ,హరీష్. కానీ వారి బాధని తగ్గించలేకపోయారు. ఎవరేం చేసేది లేదు కనుక ధైర్యం చెప్పి ఇంటికి వచ్చేసారు.

---

ఆరోజు రాత్రి 10 గంటలకు బయటికి వెళుతున్న భర్తను అడిగింది "ఎక్కడికి"? అని "క్లబ్ కి" అన్నాడు బూట్లు వేసుకుంటూ.

"మీరు వెళ్లారంటే ఒప్పుకోను ఇన్ని చూస్తూ కూడా మిమ్మల్ని ఆ బార్లకి, క్లబ్బులకి పోనివ్వను... కాలనీలో అందరూ మీ గురించి చెడ్డగా చెప్పుకుంటున్నారు, వాళ్ల గురించి కాకపోయినా మీరు మీ క్షేమం నాకు ముఖ్యం తాగి ఏ ఆక్సిడెంటో చేస్తే నేను భరించలేను" అంది భర్తని బతిమాలుతూ.

--

"నేను క్లబ్ కి, బార్లకి వెళుతున్న మాట నిజమే నేను తాగి ఏనాడైనా ఇంటికి రావడం చూసావా"? అన్నాడు హరీష్.

"మీరు తాగకపోయినా బాగా తాగే వాళ్లతో వెళ్లడం ఎంత ప్రమాదమో చూస్తున్నాం కదా! అంది సుగుణ.

"పిచ్చిదానా అలాంటి ప్రమాదాలు తప్పించడానికి నేను వెళుతున్నాను" అన్నాడు కూర్చుంటూ.

"మీరు తప్పిస్తారా ఎలా? అంది ఆశ్చర్యపోతూ.

" నీకు గుర్తుందా పోయిన సంవత్సరం మా లెక్చరర్ గోవిందరావు కొడుకు మహేష్ ఇలా యాక్సిడెంట్ లో చనిపోయాడు, వాడి బాధ చూడలేకపోయాము. వాడే కాదు కాలేజీలో చాలామంది పిల్లలు బార్ల వెంట పబ్బుల వెంట పడుతున్నారు... ప్రమాదాలు జరుగుతున్నాయి వాటిని ఎలా అరికట్టాలి అని మేమందరం ఆలోచించి ఒక టీమ్ గా తయారయ్యి రంగంలోకి దిగాము."

"టెక్నాలజీ అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో దేనినైనా సాధించగలమని అనిపించింది. మన అబ్బాయి అమెరికాలో నానో సైంటిస్ట్ గా చేస్తున్నాడు కదా! వాడి హెల్ప్ తో ఒక వెబ్సైటు క్రియేట్ చేసాము ఎవరైతే ఆయా ప్రదేశాలకు వెళ్తున్నారో వాళ్లకి ఒక రేడియం స్టిక్కర్ వాళ్ళకి తెలియకుండా అక్కడ ఉన్న సెక్యూరిటీ గార్డు అతికిస్తే చాలు, వాళ్ళు అదుపుతప్పి తాగగానే మాకు అందరికీ మెసేజ్ వస్తుంది.

మేమందరం అలర్ట్ అవుతాం అక్కడికి దగ్గర్లో ఉన్న మాలో ఒకరు వాళ్ల కారు డ్రైవర్ గా అవతారం ఎత్తి వాళ్ళని ఇంటికి సురక్షితంగా చేరుస్తాము."అన్నాడు.

"వాళ్ళు ఒప్పుకోకపోతే" అంది సుగుణ.

దానికి వాళ్లు "తాగిన మైకంలో ఉంటారు కనుక ఆ క్లబ్ వాళ్ళే సురక్షితంగా ఇంటికి చేర్చాలని మమ్మల్ని ఏర్పాటు చేశారు" అని చెప్తాము.

"మీరు చెప్పింది బాగానే ఉంది కానీ ఎన్నాళ్ళు వాళ్లకి బాడీగార్డ్ గా ఉంటారు, వాళ్ళల్లో మార్పు రావాలి గాని" అంది సుగుణ ఉద్వేగంగా.

"నువ్వు చెప్పింది నిజమే. అందుకే సెక్యూరిటీగా వెళ్ళిన మేము వాళ్ళ పేరెంట్స్ తో మాట్లాడి వాళ్ళ పిల్లల్ని కౌన్సెలింగ్ కి పంపిస్తున్నాం. చాలా మటుకు వింటున్నారు ఏ తల్లి ,తండ్రి కడుపుకోతని కోరుకోరు కదా!

సాహితి సామ్రాట్ కథలు

# యజ్ఞం

ఎక్కడో ఒకరిద్దరూ వినకపోతే వాళ్ళ కర్మ అని వదిలేస్తున్నాం" అన్నాడు దీర్ఘంగా శ్వాస తీసుకుని మంచినీళ్లు తాగి వెళ్లడానికి లేచాడు.

"ఇందులో నాకు సహాయం చేస్తున్న పోలీసులు, లెక్చరర్స్, స్టూడెంట్స్ చాలామంది ఉన్నారు... ఇది ఒక యజ్ఞం లాగా సాగుతుంది. ఈ పనిని మేమందరం ఇష్టంతో చేస్తున్నాము యువతలో ఎప్పటికైనా మార్పు రాకపోతుందా అని ఎదురు చూస్తున్నాం" అన్నాడు హరీష్.

నిజమే ఎన్నో కుటుంబాలు ఇటువంటి బాధకి గురి అవుతున్నాయి చూస్తూనే ఉన్నాను కూడా కొందరి ఇళ్లల్లో పిల్లలైతే "వాళ్ళు అమ్మడం మానేస్తే మేము తాగడం మానేస్తాము" అంటూ డైరెక్ట్ గానే తల్లిదండ్రులకు చెప్తున్నారు. 'దేశం పురోభివృద్ధి సాధించింది అంటారు గాని సాధించింది ఏమిటి ఇలా పిల్లలు వ్యసనాలకు బానిసలై చనిపోతుంటే తల్లిదండ్రుల బాధ వర్ణనాతీతం. ఈ సమాజాన్ని మార్చడం ఎవరి వల్ల అవుతుంది. ఎప్పటికీ మారుతుందిఈ సమాజం. ఏదైనా కానీ

భర్త ఇటువంటి ఒక మంచి మహా యజ్ఞం తలపెట్టినందుకు సంతోషంగా "వెళ్లి రండి" అన్నది 'డాక్టర్ మాటలు గుర్తుతెచ్చుకుంటూ'సుగుణ.

శుభం

మార్చి నెల సంచికతో సుమతి మీ ఆశిస్సులతో దిగ్విజయంగా మొదటి సంవత్సరం పూర్తి చేసుకుని రెండో సంవత్సరం లోకి అడుగిడబోతోంది. సుమతికి మీ అభినందనలు తెలియచెయ్యండి, ఫోటోతో సహా ప్రచురిస్తాం

అభినందనలు పంపాల్సిన చిరునామా

sumathi.salahaalu@gmail.com

దసరా కథల పోటిలో గెలుపొందిన కథలు

# చీకటి విజయం



శింగరాజు శ్రీనివాసరావు

ముప్పై సంవత్సరాల ఎదురుచూపు. ఆరడుగుల అందం అందరినీ రెచ్చగొడుతున్నా అదుపు తప్పనీయక పగ్గాలు గట్టిగా పట్టుకుని వస్తున్నాడు యశోధరుడు. అమ్మా, నాన్న లేని లోకంలో మేనమామే కన్నతండ్రిగా మారి అతని జీవితానికి వెలుగును ఇచ్చాడు.
మేనమామ సూర్యం అంత ఆస్తిపరుడేమీ కాదు. కాకపోయినా అక్క కొడుకు బాధ్యతను నెత్తిన వేసుకుని యశోధరుడిని ప్రయోజకుణ్ణి చేశాడు. మేనమామ ఋణం తీర్చుకోవాలని, అంగనలంతా అర్రులు చాస్తున్నా ప్రవరాఖ్యుడిగా నిలబడ్డాడు, మరదలు మందాకిని కోసం. పెంచినందుకు ప్రతిఫలం అనుకుంటాడేమోనని సూర్యం కూడ తన కూతురిని చేసుకోరా అని అడగలేదు. కృతజ్ఞతో, మేనమామ మీద ప్రేమో గానీ యశోధరుడు, మందాకినే తనకు కాబోయే భార్యగా ఫిక్సయి పోయాడు.

దసరా కథల పోటీలో గెలుపొందిన కథలు

# చీకటి విజయం

అలాగని మరదలితో ప్రేమాయణం జరపలేదు. మౌనంగా ఆరాధించేవాడు అంతే. తంతే గారెల బుట్టలో పడినట్లు, ఇంజనీరింగు చివరి సంవత్సరంలో ఉండగానే టాటా కంపెనీ వాళ్ళ క్యాంపస్ రిక్రూట్ మెంట్ లో సెలెక్టయ్యాడు. ఇంకేముంది చదువు పూర్తవగానే ఉద్యోగంలో చేరి తనే మామ దగ్గర తన ప్రపోజల్ పెట్టాలనుకున్నాడు. యశోధరుడు అనుకున్నట్లుగా ఆ రోజు రానే వచ్చింది. ఎలాగైనా ఈ రోజు తన మనసులో మాట అటు మామయ్యకు, ఇటు మందాకినికీ చెప్పేద్దామనుకుని నిర్ణయించుకుని ఆఫీసు నుంచి ఇంటికి వచ్చిన యశోధరుడికి మేనమామ అరుపులు వీధిలోకి వినిపించాయి. ఏమయుంటుందోనని భయంభయంగా తలుపులు తీసి లోపలికి వచ్చాడు.

"నా బొందిలో ప్రాణముండగా ఈ పెళ్ళికి నేను ఒప్పుకోను" అరుస్తున్నాడు సూర్యం.

"ఒప్పుకోకపోవడానికి ఒక్క కారణం చెప్పు నాన్నా చాలు. మాధవకు ఏం తక్కువ. బ్యాంకులో ఆఫీసరుగా చేస్తున్నాడు. ఒక్కడే కొడుకు. ఏ బాదరబందీ లేదు. చాలా స్మార్టుగా ఉంటాడు. పైసా కట్నం వద్దన్నాడు. పెళ్ళికి అనవసరంగా ఖర్చు పెట్టడం ఇష్టంలేకనే కదా రిజిస్టరు ఆఫీసులో పెళ్ళి చేసుకుందామన్నాడు" చెబుతున్నది మందాకిని.

"అంతేనా..తాళి మాత్రం ఎందుకు. అదొక బరువు అనలేదా"

"అదే..ఆ వెటకారమే వద్దు. అంతేలే.. తేరగా వచ్చాడు కదా చేసుకుంటానని. అలాగే ఉంటుంది మీకు"

"నేనేం వాడు వచ్చి నిన్ను చేసుకోవాలను కోలేదు. బంగారమంటి నా అల్లుడికి ఇచ్చి కట్టబెడితే, నా కళ్ళముందే ఉంటారనుకున్నాను. ఈలోపే నీకు శని పెద్దమ్మ నెత్తికెక్కి ఆ నభోగాయిని పట్టుకొచ్చావు"

"నేనా..బావనా..ఏం మాట్లాడుతున్నావు నాన్నా. నేను, బావ కలిసి పెరిగాం. చిన్నప్పటి నుంచి బావను నేను స్నేహితుడిగానే చూశాను కానీ, వేరే ఆలోచనతో చూడలేదు. అయినా ఆ బుద్ధావతారంతో నాకు పెళ్ళేమిటి. నా చలాకీ తనానికి, ఆ ముద్దపప్పు సూటవడు. అయినా మేనరికం చేసుకోవడం నాకు ఇష్టం లేదు"

"కానీ నాకు ఇష్టం. వాడు బడుద్ధాయి కాదే బుద్ధిమంతుడు. మేనమామ పేరు చెడగొట్టకుండా బుద్ధిగా చదువుకుని ప్రయోజకుడయ్యాడు. నీలా ఎవరినో వెంటేసుకుని రాలేదు"

"నాన్నా..ఈ కాండక్టు సర్టిఫికేట్ల కోసం కాదు ఈ మీటింగు. నేను, మాధవ పెళ్ళి చేసుకోబోతున్నాం అని మీకు ఇన్ఫర్మేషను ఇవ్వడం కోసమే. మీరు అంగీకరిస్తే సాక్షి సంతకాలకు రండి. లేకుంటే మాధవ స్నేహితులే పెడతారు.

"ఎంతకు తెగించావే" అని ఆవేశంతో మందాకిని మీదకు చెయ్యెత్తాడు సూర్యం.

"మామయ్యా..ఆగు. ఏమిటా తొందర. మందాకిని ఏంచేసిందని"

"ఒరేయ్..వచ్చావా. చూడరా అది ఎంత పని చేసిందో" బోరుమన్నాడు సూర్యం.

"అది తప్పేం చేసింది మామయ్యా. భయపడకుండా తన మనసులో భావాన్ని చెప్పింది. దానికి మందాకినిని అభినందించాలి కానీ ఇలా చేస్తారా. వద్దు మామయ్యా. అత్తయ్య చూడు మీకు ఎదురు చెప్పలేక ఎలా బిక్కముఖం వేసుకుందో. అయినా మందాకిని ఏం తప్పు చేసింది. తనకు నచ్చినవాడితో పెళ్ళి చేయమంది. మీరంతా సంతోషించాలి కానీ, ఇలా దాన్ని బాధపెడతారా. ఇదిగో ఇంకొక్క మాట దాన్ని అనకండి. మేనరికం అంటే నాకు ఇష్టం లేదు. అది చెప్పింది. నేను చెప్పలేకపోయాను. అంతే. దాని ఇష్టప్రకారమే మాధవతో వివాహం

దసరా కథల పోటీలో గెలుపొందిన కథలు

# చీకటి విజయం

చేద్దాం"

"అదికాదురా" ఏదో చెప్పబోయాడు సూర్యం.

"మామయ్యా..ఈసారికి నా మాట వినండి" అని సూర్యాన్ని చల్లబరిచి మందాకినికి, మాధవతో పెళ్ళి చేయించాడు యశోధరుడు.

★★★★★★

"ఇది వందనా..నా మూగప్రేమ వ్యవహారం" చెప్పాడు యశోధరుడు శోభనపు గదిలో తన ప్రక్కన కూర్చున వందనతో.

"అమ్మో..ఆరడుగుల అందమే కాదు. అంతుచిక్కని ప్రేమ కథ కూడ ఉందన్నమాట మీకు. అంతేనా..కాలేజీలో ఇంకా ఎవరితోనైనా.."

"ఏడ్చినట్టే ఉంది. మా మరదలు నాకేం పేరు పెట్టిందో తెలుసా.. బుద్ధావతారాన్నట. అవును వందనా..బుద్ధావతారం అంటే ఏమిటి? అదేమన్నా బిరుదా?"

"హూ..మందాకిని చెప్పింది కరెక్టే. ఇదంటే కూడ తెలియదంటే మీరు నిజంగా బుద్ధావతారమే. ఎంతయినా చిన్నప్పటి నుంచి మీతోపాటు పెరిగింది కదా. కరెక్టుగా గెస్ చేసింది"

"ఏయ్..నిన్ను. అసలు ఆ మాటకు అర్థం చెప్పమంటే.. నన్నిలా.."

అని అలిగి పక్కకు తిరిగాడు యశోధరుడు.

"సారీ..సారీ..బుద్ధావతారం అంటే..గౌతమ బుద్ధుని విగ్రహంలా ఎటుచూడకుండా బుద్ధిగా తన పని తను చేసుకుపోయేవాడు అని. కానీ నిజమేమిటో చెప్పనా"

"ఏమిటది"

"అది..అది.. వట్టి చవట అని" అని కిలకిల నవ్వుతూ మంచందిగి దూరంగా వెళ్ళింది వందన.

"నిన్ను.." అంటూ ఆమెను పట్టుకోబోయాడు యశోధర.

ఆమె అతనికి చిక్కకుండా 'బుద్ధావతారం..నా బంగారు బుద్ధావతారం' అంటూ మంచం చుట్టూ పరుగులు పెట్టసాగింది. ఆమెను పట్టుకోవాలని ప్రయత్నించి చేతకాక మంచం మీద కూలబడ్డాడు యశోధరుడు.

"సారీ డూడ్..అలిసిపోయారా. సారీ..సారీ" అంటూ తన పమిట కొంగుతో అతని చెమట తుడవసాగింది వందన.

ఆమె జడలో నుంచి వచ్చే మల్లెల వాసన, మెత్తని ఆమె చేతి స్పర్శ, చాలా కొత్తగా అనిపించాయి అతనికి. తన ముఖానికి చేరువగా ఉన్న ఆమె ముఖం అతనికి చంద్రబింబంలా అనిపించింది.

ఆమెను కళ్ళార్పకుండా చూడసాగాడు. ఆలిచిప్పల వంటి కళ్ళు కాటుకతో జతచేరి మరీ అందంగా కనిపిస్తున్నాయి. కొనదేలిన ముక్కు, దానికింద పలుచని పెదవులు ఇంద్రధనువు ఆకారంలో వంగి ముద్దొస్తున్నాయి. అతని ముఖానికి ఆమె ఊపిరులు వెచ్చగా తగులుతున్నాయి. అప్రయత్నంగా అతని చేతులు ఆమె నడుమును చుట్టాయి.

ఆమె విడిపించుకోవాలనే ప్రయత్నం చెయ్యలేదు. అతని మెడమీద పట్టిన చెమటను తన కొంగుతో తుడుస్తున్నది. ఆమె మృదుస్పర్శ కొత్తగా, ఎంతో హాయిగా అనిపించింది యశోధరుడికి.

"వందనా.." తమకంగా అన్నాడు ఆమెను ఇంకొంచెం దగ్గరికి లాక్కుంటూ.

"ఒక్క నిముషం..పరిగెత్తి అలిసినట్లున్నారు. ఏ.సి. కొంచెం పెంచి వస్తాను" అని అతడిని విడిపించుకుని వెళ్ళింది వందన. ఏదో హాయి తనను విడిచి వెళ్ళినట్లు అనిపించింది అతనికి.

ఏ.సి ని ఇరవైకి తగ్గించి వచ్చి మంచంమీద అతనికి కొంచెం దూరంలో కూర్చుంది వందన.

"వందనా..నేను చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన అనాథను. మేనమామ పంచలో

దసరా కథల పోటీలో గెలుపొందిన కథలు

# చీకటి విజయం

చేరిన నాకు చదువు తప్ప మరో లోకాన్ని చూడాలనిపించలేదు. దానికి కారణం..నాకు వేరే ఆధారం లేదు కనుక. స్నేహితులంతా నన్ను ఎగతాళి చేస్తున్నా అవేమీ పట్టనట్టుగా ఉండేవాణ్ణి. ఏమాత్రం మనసు అదుపు తప్పినా చదువు అటకెక్కుతుందేమోననే భయం నన్ను పప్పుసుద్దలా మార్చింది. మందాకినిని పెళ్ళి చేసుకుని మామయ్య ఋణం తీర్చుకోవాలనుకున్నాను. దానికి మందాకిని ఒప్పుకోలేదు. మామయ్య నన్ను అల్లుడులా కాదు వందనా, కొడుకులా పెంచాడు. అందుకే ఈ వయసులో ఆయనకు అండగా ఉండాలనుకుంటున్నాను. నీకేమైనా అభ్యంతరమా" వందన చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు.

"దానికి నన్ను అడగాలా.. కన్నతండ్రి తరువాత తండ్రి అంతటి వాడు మేనమామ అంటే, ఆయన మీకే కాదు నాకు కూడ వరసకు తండ్రిలాంటి వాడే కదా. ఆయన విషయంలో మీరు ఏ నిర్ణయం తీసుకున్నా ఓకే. అయినా ఇప్పుడు టైమెంత.. మీరు చేస్తున్న హితబోధలేమిటి మహాశయా. నాకు నిద్ర వస్తుంది బాబూ.. నేను పడుకుంటాను" అంటూ పక్కమీదకు వొరిగబోయింది వందన.

"అప్పుడే నీకు నిద్రవస్తుందేం. అదీ చూద్దాం. నన్ను బుద్ధావతారం అన్నావుగా. ఇక చూసుకో నా ప్రతాపం. ఈ చీకటి సమరంలో విజయం నీదో, నాదో తేలిపోవాలి" అంటూ వాలుతున్న వందనను కౌగిలిలో పొదువుకున్నాడు యశోధర.

"ట్రై చెయ్యమ్మా" అంటూ కిసుక్కున నవ్వి కళ్ళు మూసుకుంది వందన.

★★★★★★★★★★★



## ఈ శీర్షిక మీదే
## కొంటె ప్రశ్న - చిలిపి జవాబు

ఈ క్రింది కొంటె ప్రశ్నకు తుంటరి జవాబులు రాసి పంపండి
ఉత్తమ జవాబుకు రూ116/- బహుమతిగా ఇవ్వాబడును

**ఆడవాళ్ళ వంటకన్నా మగవాళ్ళ వంట రుచిగా ఉంటుంది ఎందుకు ?**

(అందుకే నలభీమ పాకం అన్నారు కాని ద్రౌపది సుబద్ర పాకం అనలేదు )

జవాబులు ఫిబ్రవరి 25 లోపు చేరాలి
sumathi.potilu@gmail.com

మేలుకొలుపు

# మతం ఇప్పుడు ఓ రెడీమేడ్ భావజాలం

## నమ్మకాలు- నిజాలు

దేశం మొత్తం ఇప్పుడు రామ నామ స్మరణతో ఉగిపోతోంది . అయోధ్య రామాలయం లోకి రాముడు నడిచొస్తున్నాడు అనే భావనలో మునిగి తేలుతోంది. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి రాముడి అక్షంతలు పంచబడుతున్నాయి , ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించమని ఆదేశాలు అందుతున్నాయి .అందుకు తగ్గట్లే హిందూ మతానికి చెందిన ప్రతి ఒక్కరు ఆ దారిలో నడుస్తున్నారు .తప్పులేదు ,కాని వీటివల్ల ఇతర మతస్తుల లో అబద్రతా భావనలు ఎక్కువవుతున్నాయి అనేది మర్చిపోతున్నాము . తార్కికంగా ఆలోచిస్తే దేవుడు ఎప్పుడు ఆర్భాటాలు చెయ్యమని చెప్పలేదు,జెండాలు ఎగరేయ్యమని చెప్పలేదు.జెండాల వెనక ఉన్న ఎజెండాలతోనే ప్రమాదం . ఆ ఎజెండాలను గుర్తించ లేక పోవటం ప్రజల అమాయకత్వం

తర్కం ఎక్కడ ఆగిపోతుందో అక్కడ మతం మొదలవు తుంది. తర్కాన్ని ఏది నాశనం చేయగలదో అదే మతంలా అవతరించగల శక్తిని సంతరించుకుంటుంది. మతాన్ని అవలం బించే వారిలో తర్కజ్ఞానం కించిత్తయినా వుంటే ఉరేసుకు చస్తాన న్నాడట వెనకటికొకడు. వారి మంత్రాలకూ, చేతివాటం కని కట్టులకూ చింతకాయలూ, శెనగపప్పులూ రాలేట్టయితే, మానవుడి పరిణామం ఇప్పటికీ జానెడు గుడ్డ అడ్డం పెట్టుకునే దగ్గరే ఆగి ఉండేది.

ప్రత్యక్షం, ప్రమాణం, అనుమానం పద్ధతిలో మొదలై ముందుకు సాగేది తర్కం. ప్రాచ్య పాశ్చాత్య మేధావులంతా తర్కాన్నే ఆశ్రయించారు. మన దగ్గరున్న అంగీకృత్య ఖండనం పాశ్చాత్య డయాలెక్టికల్ కి దగ్గరి సంబంధం కలిగి ఉంటుందనటంలో సందేహం లేదు. ఎందుకటే అప్పటి ప్రపంచ మేధావులు తర్కాన్నే ఆశ్రయిం చారు తప్ప మతాన్ని కాదు. గ్రీకు 'జీనో' మొదలు పెట్టిన తర్కం సోక్రటీస్ నుండి, ప్లేటో నుండి ముందుకు సాగి హెగెల్తో జడలు విప్పి, వాద ప్రతివాద, సమన్వయ వాదాది త్రిక తర్కం (గతి తార్కికం)గా అవతరించింది.

ప్రపంచానికి భాష్యం చెప్పిన తత్వవేత్తలు మతం గుప్పిటిలో దాదాపు ఇరుక్కుపోలేదు. ప్రాచీన ఋషులెవరూ ఏ మతానికీ బందీ కాలేదు. కానీ జన సామాన్యం తత్వ శాస్త్రాన్నే కాదు తత్వ వేత్తలనీ వదిలిపెట్టింది. సోక్రటీసుకు విషమిచ్చి చంపేసింది. అరేబియన్ తత్వవేత్త ఇబన్ రుష్ట్ పుస్తకాలనూ తగులబెట్టింది, డార్విన్ పుస్తకాలను తగులబెట్టింది. మనదేశంలో లోకాయత, భౌతికవాద దర్శనాలు నామరూపాలు కోల్పోయాయి. మొదటి నుండీ మతం తర్కాన్ని నాశనం చేయడం వలననే వృద్ధి చెందింది. తర్కాన్ని నాశనం చేయకుండా మతం మనలేదు.

. తార్కిక జ్ఞానంగల మనుషులను మతాలు తప్పుదారి పట్టిస్తాయన్న విషయం మధ్య యుగాల చరిత్రను చూస్తే అర్థమౌతుంది. తత్వ శాస్త్రం, మతం కలిసిపోవడమూ, మత కోణంలో తత్వ శాస్త్రాన్ని వివరించడ మూ, తత్వాన్ని మత భావనల అభివృద్ధికి గురిచేయడమూ పరమ పాండిత్యంగా ఆవిర్భవించి పాండిత్యవాదానికి తెరలేపింది. మౌఢ్యానికి వ్యతిరేకమనిపిం చిన బౌద్ధం తాంత్రిక కౌగిలింతల్లో తేలియాడింది. యోగ మార్గం కన్నా జ్ఞానమార్గం గొప్పదన్న గీత "యజ్ఞం వలన మోక్షం వస్తుందని చెప్పక తప్పింది కాదు.

మతం, ప్రతివాదాన్ని నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తుంది. ఏ మతమైనా తన మార్గమే గొప్పది

మేలుకొలుపు

# నమ్మకాలు- నిజాలు

అంటుంది. తాను చెప్పిన దైవమే అసలైన దైవం అంటుంది. తను చూపించిన మార్గమే దేవుని చేరు ఏకైక మార్గమనీ అంటుంది. తన ప్రవక్తనే చివరి ప్రవక్త అంటుంది. దేవుడు జడ్జిమెంటు ఇచ్చే రోజు ఒకటుంటుందని నమ్ముతుంది. ఇవన్నీ స్టేట్మెంట్లు అనుకుంటే, వాటికి వ్యతిరేకంగా ఎవరు ప్రతివాదాన్ని వినిపించినా, వెంటనే నాశనం చేయడమే మతం ఉనికికి చరమ మార్గం. పలానా పుస్తకంలో ఈ విధంగా రాశేశాడు దేవుడని చెబుతుంది మతం. దేవుడెందుకు రాశాడో, దేనితో రాశాడో, మనకు తెలియదు గానీ, అది అడిగే హక్కు మనకు ఉండకూడదంటుంది మతం. ఆ విధంగా రాయబడి చెప్పబడీ ఉన్నందున ఆ విధంగానే చెయ్యాలి. వ్యతిరేకంగా చేస్తే దేవుడి పేరు చెప్పి మతానుయాయులే మనుషులను నాశనం చేయ పూనుకుంటారు.

మతమంటే మొత్తానికి తప్పొప్పుల పట్టిక తప్ప ఇంకేమీ కాకుండా పోతుంది. ఈ పలానాది ఇలా చేయాలి, అలా చేయకూడదు అని సూత్ర మాలనొకటి తయారు చేసి పెడు తుంది. ఈ మూల సూత్రాలు కరడుగట్టిన తరువాత, మొదటికి ఎసరు బెట్టినట్టు, ఆ కాలానికి చెందిన విజ్ఞాన శాస్త్రాన్నీ తత్వశాస్త్రాన్నీ భ్రష్టు పట్టిస్తుంటుంది మతం. ఖగోళ శాస్త్రంలో గ్రీకులు బాబిలోనియన్లు సాధించిన విజయాలకంటే ఉత్కృష్టమైన విజయాలను మూటగట్టుకున్న భారతదేశం, ఆ తరువాతి కాలంలో అందులోకి మత భావనలను చొప్పించి ఆస్ట్రానమీని ఆస్ట్రాలజీగా మార్చి పడేసింది. గ్రీకులు పైథాగొరియన్లు అభివృద్ధి చేసిన ఒక అంకగణితం చివరికి అంకెల జోస్యంగా పరిణమించింది. భౌతిక శాస్త్రాలకు భాషగా ఉండవలసిన గణితం చివరికి కాకి లెక్కలకూ పిచ్చి గణనలకూ ఆలవాలమై పతనం చెందింది. గణితానికి మిస్టిసిజంను జతచేసే జాడ్యం క్రీ.పూ ఆరవ శతాబ్దానికి చెందిన పైథాగొరియన్ల నుండి మొదలైందని సరిపుచ్చుకున్నా, పాశ్చాత్య దేశాల్లో మధ్య యుగాల్లోనే పరిణతి చెందింది. చివరికి దాని ప్రభావం వలన విజ్ఞాన శాస్త్రం వృద్ధి చెందిన ఈ కాలంలో కూడా అదే పాత చింతకాయ పచ్చడిలాంటి మతం మాటలను వినడం, భూమి బల్లపరుపుగా ఉందని నమ్మడమే అవుతుంది.

ఈ మధ్య ఇంకో వాదన మొదలైంది. ఆ వాదన మత ప్రారంభకులను మహానుభావులుగా ఊహించే వాదన. ఆ మత ప్రారంభకులు ఏదైతే రాశారో, ఏదైతే చెప్పారో అది అన్నింటికంటే సర్వోత్తమం, సర్వోత్కృష్టం అంటారు వీరు. మత ప్రారంభకులు ప్రాణం పోయినా పొరపాటున కూడా తప్పు రాయరు, తప్పు చెప్పరు అనే ఒక ఫాల్లసీ వీరిని నడిపిస్తూ ఉంటుంది. తర్కంతో సాగే విజ్ఞాన శాస్త్రం దీనికి పూర్తి భిన్నంగా వాదిస్తుంది. పూర్వులు చెప్పిన దానిని సవరించుకుంటూ, అభివృద్ధి చెందుతూ సత్యం వైపుకు సాగేది విజ్ఞాన శాస్త్రమైతే, పూర్వులు చెప్పిందే పరమ సత్యమని, ఇక అనుమానానికీ, తర్కానికి ఏ మాత్రం చోటివ్వకుండా మతం సాగుతుంటుంది. ఈ వాదన ప్రకారం మతానికి సంబంధించిన ఆ పలానా పుస్తకంలో చెప్పినదంతా అత్యద్భుతమే.. పరమ సత్యమే కానీ ఆ మతాన్ని అనుసరించే వారు దానిని సరిగా అవగాహన చేసుకోలేకపోవటం వలనో, లేదా తప్పుగా అర్థం చేసుకోవటం వలననో మాత్రమే ఇన్ని మత సంబంధ మారణ హోమాలు జరిగాయనో వాదిస్తుంది.

కాలం మారే కొలదీ మానవుని ఆలోచన పరిపక్వం కావలసిన అవసరం ఉంటుంది పరిణామ రీత్యా. కానీ దానిని పరిపక్వం కానీయకుండా పురాతన నమూనాలోనే ఉంచేయగలది మతం మాత్రమే. ఆదర్శ సమాజాలూ, స్వేచ్ఛా సమాజాలు ఉద్భవించా లంటే మతమన్నదే మొదటి అడ్డంకి. మానవ సమాజ పరిణా మానికి అది గుదిబండ.

మేలుకొలుపు

# నమ్మకాలు- నిజాలు

మతం ఉండగా మానవుడు కొత్తగా ఆలోచించే అవకాశం ఎక్కడిది?. ఏది కొత్తగా ఆలోచించవలెన న్నా అదే మత భావనలను ఆలంబన చేసుకుని వీరు సాధించే పరిణామం ఏమిటి?. భారతదేశంలోని పురాతన కాలపు ఋషు లూ, గ్రీకు లాటిన్లలోని తత్వ వేత్తలే ఈనాటి ఆధునికులకంటే నయం. ఋగ్వేద ఋషులు పునర్జన్మల కోసం, మరణానంతర దివ్య జీవనం కోసం కక్కుర్తి పడలేదు సరికదా, ఇటువంటి భావజాలంతో భవిష్యతరాలకు ఇబ్బందులు సృష్టించలేదు, పైగా భౌతిక సుఖలాలసతను దివ్య జీవనమనుకున్నారు. తమకు తెలి యని ప్రపంచాన్ని పలు విధాలుగా తెలుసుకోవడానికి తమ వంతు ప్రయత్నాలు చేశారు. ఇప్పటి ఆధునికులు ఈ పూర్వీకు లు కనుక్కున్న ఆ మాత్రం విషయాల్ని దివ్య పుస్తకాలుగా చదువు కుని తలలు బొప్పికట్టించుకుంటున్నారు. పొరపాటునో, గ్రహ పాటునో ఆ పురాతనులు తాము కనుక్కున్న విషయాలను ఏదో రూపంలో దాచి ఉంచి పెట్టడమే ఆ తరువాత కాలంలో మతం మనకు చుట్టుకోవడానికి కారణం. వారు దాచి పెట్టి ఉంచడ మేమోగానీ ఆధునికులకు మా తాతల మూతులు నేతులు నాకాయని చెప్పుకుంటూ తమ మత గొప్పదనమంతా పూర్వీకుల గొప్పదనమే అనే పటాటోప భావాలతో సంచరిస్తూంటారు. ఆ విధంగా మతం మనిషికి నతడి భావజాలానికీ సంఘర్షణ లేని ఒక రెడీమేడ్ వాతావరణాన్ని సృష్టిస్తుంది. అంతా రెడీమేడ్ వస్తువులు వచ్చేసాయని మనం ఇపుడు వాపోతుంటాం గానీ, మతమంటేనే రెడీ మేడ్ ఆలోచనలుగల భావజాలం. అందుకే అది తర్కాన్ని చిదిమేస్తుంది. అసత్యం నుంచి సత్యానికీ, చీకటి నుండి వెలుగుకూ, మృత్యువు నుండి అమరత్వానికీ పరిణామం చెందాలనే అద్భుత పరిణామాత్మక స్లోగన్ని ఇచ్చిన బృహదా రణ్యకోపనిషత్తు మతం కోరలలో చిక్కి చివరికి దేవుడి పూజా గదిలో కుంకుమా పసుపుల మధ్యన పూజలు అందుకుంటుంది. ఈ దేశంలోగానీ మరేదేశంలోగానీ యుగయుగాలుగా మత భావనలకూ రాజ్యాధికారాలకూ, రాజకీయాలకూ విడదీయరాని సంబంధ బాంధవ్యాలు ఉండటం కనిపిస్తుంది. మానవుని ఆలోచనల పరిణామానికి మతం దానిని అంటి పెట్టుకుని ఉన్న రాజకీయాలూ రెండూ ప్రతిబంధకాలే.

ప్రతీ వస్తువునూ వ్యాపారం చేయగలిగిన కాపిటలిజం కాలంలో మతం కొత్త వ్యాపారంగా ప్రజల ముందుకొచ్చింది. దైవ చింతన, మనసు ధ్యానం ఇపుడు లాభదాయక వ్యాపారాలు. దోపిడీ వర్గాలకు అందివచ్చిన నూతన మార్గాలు. కాలానుగుణంగా మతం తన దోపిడీ రూపాన్ని మార్చుకుంటూ మనిషిని తన సహజ పరిణామానికి దూరంగా ఉంచుతూనే ఉంది. మతం మానవుని పరిణామ దశను ముందుకు సాగనీయకుండా చేసే అబ్నార్మల్ జెనెటికల్ మ్యుటేషన్ దీనికి విరుగుడు తార్కిక చింతననే.

★★★

కరెంట అఫైర్స్

# "భారతరత్న
## పి .వి .నరసింహా రావు "





కొండేటి వీణ

పి.వి. నరసింహారావుకు ఫిబ్రవరి 9, 2024 న కేంద్రప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించింది. పివి.నరసింహారావు భారతదేశానికి తొమ్మిదవ ప్రధానమంత్రిగా 1991 నుంచి 1996 వరకు పనిచేశారు. ఈ పదవిని అధిష్టించిన మొదటి దక్షిణ భారత వ్యక్తి పి.వి. కావడం విశేషం. సంక్షోభంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థలో విప్లవాత్మకమైన సంస్కరణలకు బీజంవేసి ప్రగతి బాట పట్టించిన ఘనతను పివి సొంతం చేసుకున్నారు. పాములపర్తి వెంకట నరసింహారావు 1921జూన్ 28న జన్మించి 2004డిసెంబర్ 23న మరణించారు. న్యాయవాదిగా, బహుభాషావేత్తగా, రచయితగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సిఎంగా, కేంద్ర మంత్రిగా, ప్రధానిగా పివి దేశానికి విశేష సేవలందించారు.

తెలంగాణ లోని వరంగల్ జిల్లా, నర్సంపేట మండలం లక్నేపల్లి గ్రామంలో 1921 జూన్ 28 న రుక్మాబాయి, సీతారామరావు దంపతులకు పీవీ జన్మించాడు. వరంగల్లు జిల్లాలోనే ప్రాథమిక విద్య మొదలుపెట్టాడు. తరువాత పూర్వపు కరీంనగర్ జిల్లా, భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన పాములపర్తి రంగారావు, రుక్మిణమ్మలు అతనిని దత్తత తీసుకోవడంతో అప్పటినుండి పాములపర్తి వేంకట నరసింహారావు అయ్యాడు. 1938 లోనే హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు పార్టీలో చేరి నిజాము ప్రభుత్వ నిషేధాన్ని ధిక్కరిస్తూ వందేమాతరం గేయాన్ని పాడాడు. దీంతో తాను చదువుకుంటున్న ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి అతనును బహిష్కరించారు. దాంతో ఓ మిత్రుడి సాయంతో నాగపూర్ విశ్వవిద్యాలయంలో చేరి నాగపూరులో ఆ మిత్రుడి ఇంట్లోనే ఉంటూ 1940 నుండి 1944 వరకు ఎల్.ఎల్.బి చదివాడు. స్వామి రామానంద తీర్థ, బూర్గుల రామకృష్ణారావు ల అనుయాయిగా స్వాతంత్ర్యోద్యమంలోను, హైదరాబాదు విముక్తి పోరాటంలోను పాల్గొన్నాడు. బూర్గుల శిష్యుడిగా కాంగ్రెసు పార్టీలో చేరి అప్పటి యువ కాంగ్రెసు నాయకులు మర్రి చెన్నారెడ్డి, శంకరరావు చవాన్, వీరేంద్ర పాటిల్ లతో కలిసి పనిచేసాడు. 1951లో అఖిల భారత కాంగ్రెసు కమిటీలో సభ్యుడిగా స్థానం పొందాడు. నరసింహారావు తన రాజకీయ జీవితాన్ని జర్నలిస్టుగా ప్రారంభించి, కాకతీయ పత్రిక నడిపి అందులో జయ అనే మారుపేరుతో 1950 ప్రాంతాలలో వ్రాసేవాడు. బహుభాషలు నేర్చి ప్రయోగించాడు.

మొదటిసారిగా లోక్‌సభకు హనుమకొండ స్థానం నుండి ఎన్నికయ్యాడు. రెండోసారి మళ్ళీ

కరెంట్ అఫైర్స్

# పి .వి .నరసింహా రావు "



హనుమకొండ నుండే లోక్‌సభకు ఎన్నికయ్యాడు. మూడోసారి ఎనిమిదో లోక్‌సభకు మహారాష్ట్ర లోని రాంటెక్ నుండి ఎన్నికయ్యాడు. మళ్ళీ రాంటెక్ నుండే తొమ్మిదో లోక్‌సభకు ఎన్నికయ్యాడు. నంద్యాల లోక్‌సభ నియోజకవర్గానికి 1991లో జరిగిన ఉప ఎన్నికలో ఎన్నికై పదో లోక్‌సభలో అడుగుపెట్టాడు. 1980– 1989 మధ్య కాలంలో కేంద్రంలో హోంశాఖ, విదేశవ్యవహారాల శాఖ, మానవ వనరుల అభివృద్ధి శాఖ లను వివిధ సమయాల్లో నిర్వహించాడు. 1983 అలీన దేశాల శిఖరాగ్ర సమావేశంలో స్పానిష్లో మాట్లాడి క్యూబా అధ్యక్షుడు ఫిడెల్ కాస్ట్రోను అబ్బురపరచాడు.

ఆయనకి ప్రధానమంత్రి పదవి అనుకోకుండా వరించింది. 1991 సార్వత్రిక ఎన్నికలలో పోటీ చెయ్యకుండా, దాదాపుగా రాజకీయ సన్యాసం తీసుకున్నాడు. ఆ సమయంలో రాజీవ్ గాంధీ హత్య కారణంగా కాంగ్రెసు పార్టీకి నాయకుడు లేకుండా పోయాడు. ఆ సమయంలో తనకంటూ ప్రత్యేక గ్రూపు లేని పీవీ అందరికీ ఆమోదయోగ్యుడుగా కనపడ్డాడు. వానప్రస్థం నుండి తిరిగివచ్చి ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించాడు. ఆంధ్ర ప్రదేశ్ లోని నంద్యాల లోక్‌సభ నియోజకవర్గం నుండి గంగుల ప్రతాపరెడ్డిచే రాజీనామా చేయించి, అక్కడి ఉప ఎన్నికలో గెలిచి, పీవీ లోక్‌సభలో అడుగుపెట్టాడు. సాటి తెలుగువాడు ప్రధాని అవుతున్నాడని నంద్యాల పార్లమెంట్ సీటుకు జరిగిన ఉప ఎన్నికలలో ఎన్.టి.రామారావు అతనుపై తెలుగు దేశం అభ్యర్థిని పోటీలో పెట్టలేదు. అయితే ప్రభుత్వానికి, కాంగ్రెసు పార్టీకి అది చాలా క్లిష్టసమయం. ప్రభుత్వానికి సంపూర్ణ మెజారిటీ లేని పరిస్థితి. సహజ సిద్ధంగా ఉన్న తెలివితేటలు, కేంద్రంలో వివిధ మంత్రిత్వ శాఖల్లో అతనుకు ఉన్న అపార అనుభవం అతనుకు ఈ క్లిష్టసమయంలో తోడ్పడ్డాయి. ఐదు సంవత్సరాల పరిపాలనా కాలాన్ని పూర్తి చేసుకున్న ప్రధానమంత్రుల్లో నెహ్రూ, గాంధీ కుటుంబంబాల బయటి మొదటి వ్యక్తి, పీవీయే. మైనారిటీ ప్రభుత్వానికి నేతృత్వం వహిస్తూ కూడా, ఇది సాధించడం అతను రాజనీతికి, చాకచక్యానికి నిదర్శనం. అందుకే అతనున్ని అపర చాణక్యుడు అని అన్నారు. అందుకు అతను అనుసరించిన కొన్ని విధానాలు వివాదాస్పదం అయ్యాయి కూడా.

### పీవీ విజయాలు:

పీవీ ప్రధానమంత్రిగా ఉన్న కాలంలో భారత రాజకీయ, ఆర్థిక, సామాజిక వ్యవస్థలలో ఎన్నో గొప్ప మలుపులు, పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఎన్నో అవినీతి ఆరోపణలు ప్రభుత్వాన్నీ, పీవీని చుట్టుముట్టాయి. దివాలా తీసే స్థాయికి చేరుకున్న ఆర్థికవ్యవస్థకు పునరుజ్జీవం కల్పించేందుకు, సంస్కరణలకు బీజం వేసాడు. తన ఆర్థికమంత్రి, మన్మోహన్ సింగ్కు స్వేచ్ఛనిచ్చి, సంస్కరణలకు ఊతమిచ్చాడు. ఆ సంస్కరణల పర్యవసానమే, ఆ తరువాతి కాలంలో భారత ఆర్థిక వ్యవస్థ సాధించిన అద్భుతమైన అభివృద్ధి. అందుకే పీవీని ఆర్థిక సంస్కరణల పితామహుడిగా పేర్కొంటారు.

పంజాబు తీవ్రవాదాన్ని విజయవంతంగా అణచివేసిన ఘనత పీవీ ప్రభుత్వానిదే

కాశ్మీరు తీవ్రవాదులు ప్రముఖులను అపహరించినపుడు వారి డిమాండ్లకు లొంగకుండా ప్రముఖులను

# పి .వి .నరసింహా రావు "

విడిపించిన ఘనత కూడా పీవీదే

ఇజ్రాయిల్తో దౌత్య సంబంధాలు, తీవ్రవాదానికి పాకిస్తాను ఇస్తున్న ప్రోత్సాహాన్ని బయటపెట్టి ప్రపంచదేశాల్లో చర్చకు పెట్టడం, ఆగ్నేయాసియా దేశాలతో సంబంధాలు పెంచుకోవడం, చైనా, ఇరానులతో సంబంధాలు పెంచుకోవడం వంటివి విదేశీ సంబంధాల్లో పీవీ ప్రభుత్వం సాధించిన అనేక విజయాల్లో కొన్ని.

1998లో వాజపేయి ప్రభుత్వం జరిపిన అణుపరీక్షల కార్యక్రమాన్ని మొదలుపెట్టింది పీవీ ప్రభుత్వమే. అతను కాలంలోనే బాంబు తయారయింది. ఈ విషయాన్ని స్వయంగా వాజపేయే ప్రకటించాడు

రాజకీయాల్లో తీరికలేకుండా ఉన్నా, పీవీ తన ఇతర వ్యాసంగాలను వదిలిపెట్టలేదు. తనకు ప్రియమైన సాహిత్య కృషి, కంప్యూటరును ఉపయోగించడం వంటి పనులు చేస్తూనే ఉండేవాడు. కంప్యూటరును ఉపయోగించడంలో పీవీ ముందంజలో ఉండేవాడు. ఆయన చేసిన సాహిత్య కృషికి గుర్తింపుగా సాహిత్య అకాడమీ పురస్కారాన్ని కూడా అందుకున్నాడు. ఆయన రచనల్లో ప్రఖ్యాతి చెందినది ఇన్సైడర్ అనే అతను ఆత్మకథ. లోపలిమనిషిగా ఇది తెలుగులోకి అనువాదమయింది. నరసింహారావు బహుభాషాకోవిదుడు. ఇంగ్లీషు, హిందీయే కాక అనేక దక్షిణాది భాషలు, మొత్తం 17 భాషలు వచ్చు. కోబాల్, బేసిక్, యునిక్స్ ప్రోగ్రామింగ్ వంటి కంప్యూటర్ భాషలలో కూడా ప్రవేశం ఉంది

పి వి రచనలు ::

సహస్రఫణ్: విశ్వనాథ సత్యనారాయణ వ్రాసిన వేయిపడగలు కు హిందీ అనువాదం చేశారు. ఈ పుస్తకానికై పీవీకి కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి వచ్చింది.

అబల జీవితం: పన్ లక్షత్ కోన్ ఘతో అనే మరాఠీ పుస్తకానికి తెలుగు అనువాదం.

ఇన్సైడర్: ఆయన రచించిన ఆత్మకథాత్మక నవల. దీనిలోని ఘట్టాలకు పీవీ ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోయేంతవరకూ అతను జీవితఘట్టాలకు చాలా చాలా పోలిక ఉంది. నవలలోని కథానాయక పాత్ర ఆనంద్ పీవీ నరసింహారావేనని విమర్శకులు భావించారు. ఇందులో జాతీయస్థాయి నాయకుల పాత్రలు నిజపాత్రలు పెట్టి, రాష్ట్రనాయకుల పాత్రలకు పేర్లు మార్చారు. ఈ బృహన్నవల వివిధ భాషల్లోకి అనువాదమయింది. తెలుగులోకి లోపలి మనిషిగా అనువాదం అయింది.

ప్రముఖ రచయిత్రి "జయ ప్రభ" కవిత్వాన్ని ఆంగ్లంలోకి అనువదించాడు.

తెలంగాణా సాయుధ పోరాట నేపథ్యంలో "గొల్ల రామవ్వ" కథ విజయ కలంపేరుతో కాకతీయ పత్రికలో 1949లో ప్రచురితమైంది. 1995లో "విస్మృత కథ" సంకలనంలో ప్రచురించబడేప్పుడు కథారచయిత శ్రీపతి చొరవ, పరిశోధనలతో ఇది పి.వి.నరసింహారావు రచనగా నిర్ధారణ అయింది.

ఇవేగాక మరెన్నో వ్యాసాలు కలం పేరుతో వ్రాసాడు. కాంగ్రెసువాది పేరుతో 1989 లో మెయిన్స్ట్రీం పత్రికలో వ్రాసిన ఒక వ్యాసంలో రాజీవ్ గాంధీ పాలనను విమర్శించాడు. 1995 లో ఆ విషయం ఫ్రంట్లైన్ పత్రిక ద్వారా వెలుగులోకి వచ్చింది

★★★★

# మనకు తెలియని తెలుగు

తెలుగు గురించి కొన్ని వాస్తవాలు తెలుసుకుందాము. ప్రస్తుతం మనం మాట్లాడుచున్న, వ్రాస్తున్న తెలుగు మాటలు అసలు తెలుగివి కావు.

ప్రారంభోత్సవం తొలికొను వేడుక
శుభాకాంక్షలు మేలు తలుపులు మేలు ఆడటలు
కృతజ్ఞతలు మప్పిదాలు
గుడ్ మార్నింగ్ మేలుపొద్దు
గుడ్ ఈవెనింగ్ మేలు మాపటేల
గుడ్ నైట్ మేలు చీకటేల
స్వాగతం మేలు రాకడ
ఉదయం పగటేల,
మధ్యాహ్నం ఉచ్చిపొద్దు, నడేల
రాత్రి చీకటేల
రోజు పొద్దు

విశ్వం,జగం, లోకం ఎగము, మూలము
కాన్వెంట్ మొదలిడు బడి
ప్రైమరీస్కూల్ తొలిబడి ప్రాథమికపాఠశాల
సెకండరీస్కూలు మలిబడి
హైస్కూలు మిడిబడి
కాలేజి, కళాశాల పాటి చదువుల నెలవు
యూనివర్సిటీ పెనుచదువుల నెలవు,విశ్వవిద్యాలయం
పాఠము (లెసన్) చదువెన
నిఘంటువు నుడిపట్టు
సాహిత్యం నున్నుడి
కావ్యం నెన్నుడి

చేటగొట్టడం'– చక్కటి తెలుగు నానుడి. 'చేటగొట్టడం' అంటే?

చేటగొట్టడం అనేది పదహారణాల తెలుగు జాతీయం. ఇప్పుడంటే బఫేల సిస్టం పల్లెలక్కూడా పాకిపోయింది. ఒకానొక కాలంలో ఒక ఇంట పెళ్లి అంటే ఆ పల్లె మొత్తానికి పెళ్ళి కిందే లెక్కగా ఉండేది. ఒక కులంలో వివాహం జరిగితే ఆ కులానికి చెందిన ఊరివాళ్లందరూ.. బంధుత్వాలతో సంబంధం లేకుండా పెళ్ళి జరిగిన మూడ్రోజులూ భోజనాలకు హాజరయే ఆచారమూ కద్దు. పెళ్ళి విందులు కూడా సీదా సాదాగా ఉండేవి కాదు. నవగాయ పిండీవంటలతో నాలుగు రకాల కూరలు, పప్పులు, రసాలు, పాయసాలతో చివర్న అరటిపండో, తీపి తాంబూలమో, ఇట్లా సాగేది ఆతిథ్యం. పెళ్లికి వచ్చి విందు ఆరగించమని ఆహ్వానించే విధానంలో కూడా ఒక విచిత్రమైన పద్దతి కనిపించేది. 'ఈ మూడు రోజులూ మీ ఇంట్లో వంట పెట్టుకోకండి!'అని బొట్టు పెట్టి ఆడవాళ్లను పిలవడం మా చిన్నతనంలో గుర్తు, అందరికీ సరిపడా వంటకాలు అయితే తయారయేవి కాని.. ఇప్పట్లా టెంటు హౌస్.. వంటసామాగ్రి వ్యాపారాలు బలపడని ఆ కాలంలో అతిథులందరికీ ఏర్పాట్లు ఎట్లా సాగేవి? అన్నది కూడా మరో ఆసక్తి కలిగించే విశేషమే! ఒక పుల్లయ్యగారి ఇంటిలో పెళ్ళి అనగానే ఊరిలో ఆయా వర్గాలకు చెందిన అన్ని తరగతులవాళ్లూ తమకు అందుబాటులో ఉన్న వనరులతో ఆదుకొనేవాళ్లు. అందరి ఇళ్ల నుంచి గిన్నెలు, పాత్రలూ పెళ్లికి తరలివెళ్లిపోయేవి. పెళ్లి జరిగినన్నాళ్లూ ఊళ్లో పండిన కాయగూరలు, పాలూ పెరుగు సాధ్యమైనంత వరకు పెళ్లింటి వైపుకే నడిచేవి. కాయగూరలు, తరగడం, గాడిపొయ్యిలు ఏర్పాటు చేసుకుని వాటి మీద భారీ ఎత్తున వంటకాలు సాగించడం వంటి పనులన్నింటికి అమ్మలక్కలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిందే ఈ చేటగొట్టుడు పదం ఈ పెళ్ళి విందుల సందర్భంగా పుట్టుకొచ్చిందే! రుచికరమైన వంటకాలను పదే పదే అడిగి మరీ వడ్డించుకు తినే నిర్మొహమాటం అప్పట్లో ఎక్కువగానే ఉండేది. ఆఖరి నిముషంలో 'లేవు.. నిండుకున్నాయ'ని చెప్పి ఇబ్బంది పడే కన్నా ఇదిగో ఇంకో బంతికి మాత్రమే సరిపోతాయి వంటకాలు అని అనుమానమొచ్చినప్పుడు విడివిడిగా 'లేవు.. లేవు' అని చెప్పడం కన్నా బంతి మధ్యలో నడుస్తూ ఖాళీ చేటను దబ దబా కొడుతూ ' గుత్తొంకాయ కూర అయిపోయిందహో' అనో.. పాయసం అయిపోయిందనో బిగ్గరగా అరచిచెప్పే వాళ్లు. భోక్తలూ ఆ సందేశం అందుకుని అందుకు తగ్గట్లుగానే భోజనం ముగించుకుని లేచేవారు.'చేట కొట్టడం' అంటే 'అయిపోయింది. ఇహ అడగవద్దు' అని టముకేసినట్లు చెప్పడం. అదే అర్థంలో తతిమ్మా విషయాలల్లో కూడా 'చేట కొట్టడం' అనే పదం వాడేవాళ్లు పత్రికలలో 1960 – 70 లదాకా!

ఫోటో గ్రఫి

# సహజ కాంతితో ఛాయాచిత్రీకరణ

## పార్ట్ –1

మూడో కన్ను



**తమ్మ శ్రీనివాస రెడ్డి**

సహజకాంతి సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు మనకు లభించే కాంతి ద్వారా ఛాయాచిత్రీకరణ చేయడమే అవుట్డోర్ ఫోటోగ్రఫిగా చెప్పవచ్చు. గడచిన మూడున్నర దశాబ్దాల కాలంలో నేను అత్యధికంగా ప్రకృతికాంతితోనే ప్రయాణించాను. అటు ఆర్ట్ ఫోటోగ్రఫి గాని ఇటు వ్యాపార ఫోటోగ్రఫికి సహజకాంతిని జోడించి అత్యున్నతమైన నాణ్యమైన చిత్రాలు తీయగలిగాను. సహజకాంతి అంటే ఎండకాదు. లేత కిరణాలు, గోల్డెన్లైట్గా చెప్పుకునే కాంతిని నేను అత్యధికంగా ఇష్టపడతాను. ఫోటోగ్రఫీ యొక్క ప్రారంభ రోజుల నుండి, చాలా ఎక్కువ భాగం అవుట్డోర్లో చేసేవారు, ఎందుకంటే తొలి ఎమల్షన్లు "నెమ్మదిగా" ఉండేవి, కాంతికి చాలా సున్నితంగా ఉంటాయి కాబట్టి ఫోటోగ్రాఫర్ ఎక్కువ కాంతితో పని చేయాల్సి ఉండేది. అయినప్పటికీ, కెమెరాలు పెద్దవిగా, స్థూలంగా, భారీగా మరియు ఎల్లప్పుడూ కెమెరా స్టాండ్ వంటి గట్టి మద్దతుతో ఉండేవి.

1888లో జార్జ్ ఈస్ట్మన్ కొడాక్ను పరిచయం చేసినప్పుడు, కెమెరాకు షట్టర్లు లేవు, కేవలం లెన్స్ క్యాప్ తొలగించబడింది మరియు పాకెట్ వాచ్లో ఎక్స్పోజర్ సమయం ముగిసింది, కెమెరాకు షట్టర్ ఉంది మరియు చేతితో పట్టుకునేలా ఉంది, కానీ ఇంకా చాలా అవసరం. కాంతి యొక్క "సూర్యుడిని మీ భుజంపై ఉంచుకోవడం" గురించి మీరు అనేకుల సలహాను విని ఉండవచ్చు, ఇది మీ విషయాన్ని తీవ్రమైన ప్రత్యక్ష సూర్యకాంతితో నింపుతుంది. ఈ రోజుల్లో మేము కాంతిని కనీసం కోరదగినదిగా భావిస్తాము, కానీ దీనికి సాధారణంగా తక్కువ ఎక్స్పోజర్ అవసరం, ఇది చాలా వేగవంతమైన చర్యను అనుమతిస్తుంది– తక్కువ ISOల వద్ద కూడా షట్టర్ వేగాన్ని కంట్రోల్ చేసి అత్యద్భుతమైన చిత్రాలుతీయవచ్చు.

ఆరుబయట ఫోటో తీయడం అనేది ఫోటోగ్రాఫర్కు అపరిమిత నేపథ్యాలను అందిస్తుంది. ఇది మీకు అపరిమిత కానీ కొంతవరకు

# ఫోటో గ్రఫి

## మూడో కన్ను

ఫోటోగ్రఫీ అనేది ఒక కళ,
కెమెరాచేతిలో ఉన్నప్రతి ఒక్కరు
ఫోటోగ్రాఫర్ కాలేరు.అంతర్జాతీయ
ఖ్యాతి గడించిన ప్రముఖ
ఫోటోగ్రాఫర్
తమ్మ శ్రీనివాస రెడ్డి గారు
సుమతి పాఠకులకు ప్రతి నెల
ఫోటోగ్రఫి లో మెలకువలు
నేర్పనున్నారు.

తక్కువ నియంత్రించదగిన లైటింగ్ను కూడా అందిస్తుంది. మీరు కాంతిని సరిగ్గా తరలించలేరు కాబట్టి మీకు కావలసిన కాంతిని పొందడానికి మీరు భౌతికంగా కదలాలి. అవుట్డోర్ పోర్ట్రెయిట్లు సవాలుగా ఉంటాయి. చాలా విస్తృతమైన సాధారణ సూచన ఏమిటంటే, మీ సబ్జెక్ట్ను ప్రత్యక్ష సూర్యుడి నుండి బయటకు తీసుకురావడం, బదులుగా ఓపెన్ షేడ్ని ఉపయోగించడం లేదా షాడోలను పూరించడానికి చేతితో పట్టుకునే రిఫ్లెక్టర్లను ఉపయోగించడం, లేదా ఫిల్-ఫ్లాష్, లేదా మేఘావృతమైన లేదా ఆన్లో షూటింగ్ చేయడం. చాలా మంది సూర్యోదయం మరియు సూర్యాస్తమయం దగ్గర "గోల్డెన్ అవర్స్" సమయంలో షూటింగ్ చేయాలని సిఫార్సు చేయడానికి చాలా మంచి కారణం ఉంది; కాంతి మృదువుగా, వెచ్చగా మరియు గొప్ప మోడలింగ్ కోసం తక్కువగా ఉంటుంది. ఏదైనా ఫోటోగ్రాఫర్ చేయవలసిన మొదటి విషయం కాంతిని చూడటం నేర్చుకోవడం. కాంతిని స్వయంగా చూడండి, దానిని విశ్లేషించండి, అది ఎక్కడ నుండి వస్తోంది, ఎక్కడికి వెళుతోంది, నీడ మరియు కాంట్రాస్ట్ యొక్క నాణ్యత ఏమిటి అనే అంశంపై దృష్టిపెట్టాలి. అవుటోడోర్ ఫోటోగ్రఫీ అంటే మీకు అర్థమయ్యే క్షణాలను క్యాప్చర్ చేయడం. ఆరుబయట ఛాయాచిత్రాలను తీయడం యొక్క ఆకర్షణ మీ చుట్టూ ఉన్న స్పష్టమైన రంగులు, వాతావరణం, వెలుతురు మరియు మీరు తీస్తున్న విషయం వంటి అనేక విషయాలపై ఆధారపడి ఉంటుంది. మీరు క్యాప్చర్ చేసే ప్రతి ఫోటో మరియు క్షణం కొంత సమయాన్ని



దొంగిలించినట్లే ఉంటుంది, ఎందుకంటే ఆ క్షణం ఇమేజ్లో లాక్ చేయబడి ఉంటుంది. మీరు దానిని వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు, మీరు దానిని తీసుకున్నారని లేదా అది తీసుకున్నప్పుడు మీరు ఉన్న ఖచ్చితమైన క్షణం లేదా పరిస్థితిని గుర్తుంచుకోవచ్చు. దీన్ని చేయగలగడం అవుట్డోర్ ఫోటోగ్రఫీకి గొప్ప ఆకర్షణగా ఉంటుంది, ఎందుకంటే సహజ వాతావరణం మీ చిత్రాలకు గొప్ప నేపథ్యాన్ని అందిస్తుంది.

మీ ఫోటోలు క్లిక్ చేయడం ముందు కొన్ని ముఖ్యమైన అంశాలు గుర్తుంచుకోవాలి :

సబ్జెక్ట్ని సరిగ్గా ఫ్రేమ్ చేయండి : మీ సబ్జెక్ట్ని సరిగ్గా ఫ్రేమ్ చేయడం గుర్తుంచుకోండి. మీరు ఒక వ్యక్తి యొక్క చిత్రాన్ని తీస్తున్నట్లయితే, వారి తలలో సగభాగాన్ని కత్తిరించవద్దు లేదా మీరు పూర్తి శరీరాన్ని చిత్రీకరిస్తున్నట్లయితే, వారి పాదాలను కత్తిరించకూడదని గుర్తుంచుకోండి! మీరు షాట్లో మొత్తం వ్యక్తిని సరిపోల్చలేరని మీరు కనుగొంటే, మొత్తం వ్యక్తి మీ ఫోటోగ్రాఫ్కి చక్కగా సరిపోయే వరకు మీరు మీ కెమెరాను

# మూడో కన్ను

వెనక్కి మార్పుకు మారండి. ఛాయాచిత్రాలు తీస్తున్నప్పుడు స్థలం కోసం ఎల్లప్పుడూ తనిఖీ చేయండి. ఇవి చెట్లు లేదా స్తంభాలు ఒకరి తలపై నుండి బయటకు వచ్చినట్లు కనిపించడం లేదా సమీపంలోని చెత్త డబ్బాలు లేదా చెత్త వంటివి కావచ్చు.

ఫోటో తీస్తున్న వాటిపై దృష్టి కేంద్రీకరించండి : ఫోకస్ అనేది మరొక ప్రధాన అంశం. మీరు దానిని తీయడానికి ముందు మీ విషయంపై దృష్టి పెట్టండి. మీరు ఛాయాచిత్రాన్ని తీయడానికి బటన్ను నొక్కినప్పుడు కొన్ని కెమెరాలు ఫోకస్ బటన్ను కలిగి ఉంటాయి, దాన్ని పూర్తిగా క్రిందికి నెట్టడానికి ముందు మీ సబ్జెక్ట్పై దృష్టి కేంద్రీకరించడానికి దాన్ని సగం వరకు పట్టుకోండి. మీరు ఒక వ్యక్తిపై దృష్టి పెడుతున్నట్లయితే, మీరు చిత్రాన్ని వారి కళ్లపై దృష్టి పెట్టడం మంచిది.

* మీ కెమెరాను స్థిరంగా ఉంచండి : ఫోటో తీస్తున్నప్పుడు ఎల్లప్పుడూ స్థిరంగా ఉండండి. మీ చేతులను వీలైనంత స్థిరంగా ఉంచుకోవడానికి కీలకం ఏమిటంటే, ఊగిసలాట లేదా కుదుపులకు గురికాకుండా ఉండటం. మీకు స్థిరమైన షాట్ను ఉంచడం కష్టంగా అనిపిస్తే, మీ కెమెరా కోసం మోనోపాడ్ లేదా ట్రైపాడ్ని కొనుగోలు చేయడానికి ప్రయత్నించండి, ఇది కెమెరా వణుకును ఆపడానికి సహాయపడుతుంది. అలాగే షట్టర్ బటన్ ను నొక్కినప్పుడు ఎల్లప్పుడూసున్నితంగా ఉండండి మరియు షాట్ తీసిన తర్వాత కొన్ని సెకన పాటు కదలకండి



కాబట్టి మీరు అస్పష్టమైన ఇమేజ్ని పొందలేరు. కొన్ని సార్లు స్లోషట్టర్ ఉపయోగించే సమయాన్ని మనం అందరం అనుసరించాలి.


RAWలో షూట్ చేయండి, ఎల్లప్పుడూ : RAW అనేది ఎక్స్పోజర్ సమయంలో మీ డేటా యొక్క మొత్తం సేకరణ. మీరు JPG ఫార్మాట్లో షూట్ చేసినప్పుడు, మీరు క్యాచ్ చేయడానికి ప్రతిపాదించిన చిత్రం యొక్క షెల్ చిత్రణను పిక్చర్ ప్రాసెసర్కు చేయాల్సిన అవసరం మినహా మిగతావన్నీ తీసివేయబడతాయి. మీరు JPG ఫార్మాట్ ఫోటోకి చేసే ప్రతి మార్పు కోసం, మీరు మరింత డేటాను కోల్పోతారు. కానీ RAWతో, మీరు JPG ఫైల్ని సృష్టించే ముందు వాగ్వివాదాలు చేయడానికి అపారమైన పరిధిని కలిగి ఉంటారు.

ఫోటోగ్రఫీ కోసం బహిరంగ సహజ కాంతిని ఉపయోగించాలి : మరొక మంచి చిట్కా ఏమిటంటే, సాధ్యమైతే, మీ ఫోటోగ్రాఫ్లను తీయడానికి ఎల్లప్పుడూ సహజ కాంతిని ఉపయోగించండి. కాంతి సహజంగా ఉంటుంది మరియు కెమెరాలో ఫిల్టర్ చేసినప్పుడు చిత్రాలను మృదువుగా మరియు చాలా వాస్తవికంగా కనిపించేలా చేస్తుంది కాబట్టి అవుట్డోర్ చిత్రాలు ఎల్లప్పుడూ ఉత్తమమైనవి. అయితే మీరు ఇంటి లోపల కనిపిస్తే, పెద్ద ఓపెన్ కిటికీల దగ్గర లేదా చాలా మంచి లైటింగ్ ఉన్న పెద్ద గదులలో చిత్రాలు తీయడానికి ప్రయత్నించండి.

(ఇంకా ఉంది )

వ్యక్తిత్వ
వికాసం

# యువత తెలుసుకో
# నిన్ను నువ్వు మలుచుకో



## కలలు కనండి

తమ కలలను ఎవ్వరైతే గట్టిగా నమ్ముతారో వారిదే ఈ ప్రపంచం –రూజ్వెల్ట్

ఈ ప్రపంచానికి కలలు కనేవారి అవసరం ఎంతుందో, క్రియాశీలుర అవసరం ఎంతుందో, అంతకంటే ఎక్కువ తమ కలలను నెరవేర్చుకునే వారి అవసరం వుంది. కలలు ఆకాశంలో నక్షత్రాల్లాంటివి. వాటిని మనం తాకలేం, కాని వాటిని ఆధారం చేసుకుని ప్రయాణం చేస్తూ నీ లక్ష్యాన్ని చేరుకోవచ్చు.

నిజమైన జీవితాన్ని జీవించగల, ఆస్వాదించగల ధైర్యం ఎవ్వరికైతే వుందో వారే కలలు కనగలరు. ప్రపంచ విజేతలందరూ గొప్ప స్వాప్నికులే. కలలు కనటం అంటే నిన్ను నీవు మేల్కొల్పటమే. చాలామంది వారి కలలను నమ్మరు, గౌరవించరు. అంటే వారిలో వున్న అంతర్గత శక్తిని వారు విస్మరిస్తున్నారు. మనిషి తనకున్న శక్తి యుక్తులతో అన్ని రంగాలలో రాణిస్తున్నాడు. కాని, తనను తాను తెలుసుకోలేకపోతున్నాడు.

# వ్యక్తిత్వ వికాసం

ప్రపంచానికి నువ్వెవరో తెలియాలంటే నీలోని సృజనాత్మకతను మేలుకొలుపు, ఉన్నతంగా ఆలోచించు, పెద్ద పెద్ద కలలు కను, వాటిని నెరవేర్చుకో. భవిష్యత్తును ఊహించగల సామర్థ్యం గొప్ప ఆలోచనలతో అంకురార్పణ జరుగుతుంది. అప్పుడే నీవు నాయకుడవు కాగలవు.

నీవు జీవించావంటే నీకొక గుర్తింపు ఉండాలి. నీవు వున్నా లేకున్నా పరిసరాలు నిన్ను మరువకూడదు. నీవు ఒక ప్రత్యేకమైన వ్యక్తిగా పరిగణింపబడాలంటే, నేడే నీ కలలను సాకారం చేసుకోవడానికి సమాయుత్తంకా.

ప్రతిరోజు ఒక కలగా, నీ అందమైన కోరికలను, కలలను సాకారం చేసుకునే దిశగా నీ దినచర్యలు మొదలుపెట్టు. నీ చుట్టూవున్న చాలామంది నీ కలలను చూసి నవ్వుతారు. వారి స్వీయ అనుభవాలలోనుంచి వాటిని కొట్టిపారేస్తారు. నిన్ను నిరుత్సాహ పరచటానికి ప్రయత్నిస్తారు. వారి అనుభవాలు నీవి కావు. వారి కష్టాలను, నష్టాలను నీకు అన్వయించుకోనవసరం లేదు. చాలామంది తాము గీసుకున్న చట్రంలోనే ఇమిడిపోవాలనుకునే పిరికివారు. ఆ చట్రం తమకు భద్రత కల్పిస్తుందని భ్రమిస్తారు. కాని నీ కలలను నిజం చేసుకోవాలంటే ఆ ఇనుప చట్రాలు, స్వార్థపు సంకెళ్ళను తెంచుకుని నూతనంగా ఆలోచించటం మొదలుపెట్టు.

ప్రపంచానికి నువ్వెవరో తెలియాలంటే నీలోని సృజనాత్మకతను మేలుకొలుపు, ఉన్నతంగా ఆలోచించు, పెద్ద పెద్ద కలలు కను, వాటిని నెరవేర్చుకో. భవిష్యత్తును ఊహించగల సామర్థ్యం గొప్ప ఆలోచనలతో అంకురార్పణ జరుగుతుంది. అప్పుడే నీవు నాయకుడవు కాగలవు.
పెద్ద కలలను కనటానికి మొదటగా అడ్డొచ్చేది భయం. అసలు కలలుకనే ధైర్యమే ఉంటే, మరి కొంచెం ధైర్యం కూడగట్టుకుని, ఏకంగా పెద్ద కలలు కనవచ్చు. మీకు బలమైన కలవుంటే ప్రపంచంలోని అన్ని శక్తులు కూడగట్టుకొని ఆ కల నిజం చేసుకునేలా చేస్తాయి.

ఈనాటి విజేతలందరు సామాన్య కుటుంబాల నుంచి వచ్చినవారే. అయితే వీరందరికి పెద్ద కలలు కనే ధైర్యం ఉంది. ఆ కలలను వెంటాడే ఓపిక, పట్టుదల ఉన్నాయి. ఆ కలలు ఓ రోజున తప్పక నిజమవుతాయి అనే విశ్వాసం ఉంది.

కల అంటే నా ఉద్దేశ్యంలో ఓ నిర్దిష్టమైన గమ్యం. నేటి విజేతలందరు నిన్న కలలుకని, అదే దిశలో పయనించి గమ్యాన్ని చేరుకున్నవారే. విజేతలు కళ్ళు తెరిచి కలలు గంటారు. అంటే పగటి కలలకు, నెరవేర్చుకోవాల్సిన కలలు ఎంతో తేడా వుంది. ఒక ప్రొఫెసర్ సినిమా స్టార్ని అవ్వాలను కోవటం పగటి కల. ఎందుకంటే అతని ముఖ్యావతారానికి, కలలకు ఏమాత్రం సంబంధం లేదు. అలాకాకుండా వైస్ ఛాన్సలర్ కావాలను కోవడం నెరవేర్చుకోవాల్సిన కల అవుతుంది.

పాదాలు భూమి మీద, ఆశలు ఆకాశంలో విహరిస్తుంటే మీరు తప్పక విజేతలవుతారు. వయస్సుతో నిమిత్తం లేకుండా గొప్ప కలలు కనడం వాటిని సాకారం చేసుకోవడానికే భగవంతుడు మనకి సహజ సంపదల నిచ్చాడు. వాటిని మనం ఎలా ఉపయోగించుకుంటామనే దానిమీదే మన భవిష్యత్తు ఆధారపడి వుంటుంది. ఆదిశంకరాచార్యుడు చెప్పినట్లు, మన ప్రపంచ పరిధి, మన మనస్సులోనే వుంటుంది. మన మనస్సే మన కలలను నియంత్రిస్తుంది. ఒకసారి మన కలలను, కోరికలను నియంత్రించుకున్న పరిధిలో నుంచి బయటకు తెస్తే, ఎన్నో కొత్త అవకాశాలు. జీవితం ఒక అద్భుత ప్రయాణంగా, నిత్య నూతనంగా మారిపోతుంది

★★★

భేతాళ భారతం

# ఊడలమర్రి ఉపన్యాసాలు

## దెయ్యాల పొలిటికల్ లీగ్ (DPL)



విక్రమార్కుడు కాళ్ళీడ్చుకుంటూ,ఉడలమర్రి చేరుకునే సరికి , స్మశానంలో ఉన్న దెయ్యాలన్ని అక్కడ పోగయ్యి ఉన్నాయి . ఉడలమర్రి చుట్టూ పెద్ద పెద్ద బానర్లు కట్టి ఉన్నాయి .వాటి మీద రాసిన అక్షరాలు చూసి ఆశ్చర్య పోయాడు.దెయ్యాల పొలిటికల్ లీగ్అని పెద్ద పెద్ద అక్షరాలలో వ్రాసి వుంది అక్కడ.

చెట్టు కింద అరుగు మీద తిష్ట వేసుకుని కూర్చున్నాయి ఓ రెండు ముసలి దెయ్యాలు .వాళ్ళ పక్కనే భేతాళుడు,జినీ,శాకిని ,డాకిని వంటి దెయ్యాల్లోని పెద్ద తలకాయలు అనబడే వాళ్ళు కుర్చుని ఉన్నారు .వాళ్ళ ముందు దెయ్యాలు ,భూతాలు , పిశాచాలు , కొరివి దెయ్యాలు ..ఇలా అన్ని వర్గాలకు చెందినా దెయ్యాలు అక్కడే కుర్చుని ఉన్నాయి .

విక్రమార్కుడిని చూడాగానే భేతాళుడు చెయ్యి ఉపాడు పైకి రమ్మంటూ ,
విక్రమార్కుడు చిన్నగా వాళ్ళ మధ్యలో నుండి నడుచుకుంటూ వెళ్లి ,భేతాళుడి పక్కనే ఖాళీగా ఉన్న మదో అరుగు పై కూలబడ్డాడు .

“ఏమిటి భేతాళ ?, ఏమిటి విశేషం ...”అన్నట్టు చూసాడుభేతాళుడి వైపు

“కాసేపు ఆగు నికే తెలుస్తుంది ..”అన్నట్టు కళ్ళతో సైగ చేసాడు భేతాళుడు
ఇంతలో ఓ ముసలి దెయ్యం పైకి లేచి నిలబడి ,

“ నా ప్రియమైన దెయ్యాలు, భుతాల్లారా ,మనం ఇక్మడ ఎందుకు సమావేశం అయ్యామో మీ అందరకీ తెలుసు. రాబోవు ఎన్నికల్లో భేతాళుడు, జినీ తో పాటు శాకిని, డాకినీలు కూడా నిలబడతున్నాయి. కాబట్టి ఈ సారి ఎన్నికలో గట్టి పోటి ఉండ బోతోంది .ఇప్పటికే కొన్ని పార్టీల వాళ్ళు పాత వాళ్లకు ఉద్యాసన చెప్పి కొత్తవారిని తీసుకుంటూ వుంటే, పాత వాళ్ళు వేరొక పార్టీ గడప తొక్కుతున్నారు .ఇది ఏ ఒక్కపార్టీకి సంబంధించింది కాదు. అన్ని పార్టీల పరిస్థితి ఇలాగే వుంది. పోయే వాళ్లు ఎంత మంది ,వుండే వాళ్లు ఎండ మంది అని అర్థం కాక అంతా గందర గోళంగా తయారయింది.
అందుకనే ఈ గాడవంతా ఎందుకని ఈ ‘ డి పి ఎల్ అంటే

భేతాళ భారతం

# ఊడలమర్రి ఉపన్యాసాలు

"దెయ్యాల పోలిటికల్ లీగ్ ' ఏర్పాటు చేశా.

" 'డి.పి.ఎల్'. ?'అనుకుంటూ అక్కుడున్న అందరూ తమలో తాము గొనుక్కోవటం మొదలుపెట్టారు .

ఇందాకటి ముసలి దెయ్యమే మళ్లీ కొనసాగిస్తూ,

"మాములుగా క్రికెట్ లీగ్ లో ఆటగాళ్ళను వేలం పాటలో ఆయా జట్లు కొనుక్కుంటాయి . అదే విధంగా ఇప్పుడు మన పొలిటికల్ లీగ్ కుడా కొనసాగుతుంది .

ముసలి దెయ్యం మాటలు పూర్తి కాక ముందే "అంటే మమ్మల్ని వేలం లో పాడుకుణి డబ్బులిస్తారా ?ఇదేదో బాగుంది? ఇన్నాళు ఉబ్బు లిచ్చి టిక్కెట్లు కొనుక్కున్నాం .ఇక ఆ బాధ తప్పిపోయినట్టే .." అంటూ అరిచింది మరో దెయ్యం గుంపులో నుంచి

"ఆగండాగండి. అన్నీ మీరే ఉహించుకుంటే ఎలా?. పక్క నున్న మరో ముసలి దెయ్యం వారించింది.

"ఇంతకీ మీరు చెప్పేది ఏదో అర్ధమయ్యేట్టు చెప్పరాదు. లీగ్ అంటారు మళ్ళీ అలాకాదంటారు. క్రికెట్ లీగు లో జరిగేది అదే కదా ?"

"వస్తున్నా, అక్కడికే వస్తున్నా మీరు చెప్పేది క్రికెట్ లీగు గురించి. కాని ఇది పోలికల్ లీగ్ కదా, తేడా ఉంటుంది మరి "

–అదేంటో చెప్పి ఏడువు నాసా



పెట్ట కుండా, అసలే అందరు ఆయోమయంలో వున్నారు" పక్క నుంచి గదిమాడు భేతాళుడు ముసలి దెయ్యాన్ని

'వచ్చే ఎన్నికల్లో మీరు ఎంత ఖర్చు పెడుతారో, ఎక్కడ నుంచి పోటి చేయ్యలనుకుంటున్నారో ఒక్కొక్కరు లేచి చెప్పండి , దానిణి బట్టి ఇక్కడున్న పార్టీల నాయకులు వాళ్ళ పార్టీలోకి మిమ్మలి తీసుకుంటారు. "అని అసలు విషయం బయట పెట్టుడు

ఆ మాటల తో అక్కడున్న దెయ్యాలు, భూతాలు, పిశాచాలు అన్ని మౌనంగా వుండి పోయాయి

'మరి ఇంత బాహాటంగా సీట్లు వేలం వెయ్యటం ఏమిటి భేతాళ ?" ఉండ బట్ట లేక అడిగాడు విక్రమార్కుడు

" విక్రమార్కా నువ్వు అవునన్నా కాదన్నా ఇప్పుడు ఎలక్షన్ లు అంటేనే డబ్బు తో పని . మనం ఎన్ని మంచి పనులు చేసినా ఎన్నికల రోజు వాళ్ళ చేతుల్లో పెట్టె పచ్చ నోట్లే వాళ్ళ చేత ఓట్లు వేయిస్తాయి ..." అంటూ ఆగాడు

" అవునవును బాగా చెప్పాడు బ్రదర్ " అంటూ భేతలుది వంక మెచ్చుకోలుగా చూసాడు జిని

"“అవుననుకో, మరీ ఇంతలా బహిరంగంగా వేలం వెయ్యాలా, మాంసం తింటున్నాము అని మేడలో ఎముకలు వెసుకోంకదా " విక్రమార్కుడు ఏదో ఎదో చెప్పబోయాడు.

"ఎందుకు వేసుకోము , మేము

# ఊడలమర్రి ఉపన్యాసాలు

ఎముకలు మెడలో వేసుకుంటాం“ అని తమ మెడలోని ఎముకల దండలు చూపించాయి శాకిని డాకిని దెయ్యాలు

అనవసరంగా దెయ్యాలతో పెట్టుకున్నాను అనుకుంటూ తల పట్టుకున్నాడు విక్రమార్కుడు

రాజా ప్రతి ఎన్నికలో జరిగే తంతే ఇది , కాకపోతే ఈసారి కేంద్రీకృతం చేసాము అంతే “ అంటూ చెప్పబోయాడు జిని

“అవును రాజా, ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరూ అసావాహులే ,కాని అందుకు తగ్గ అంగబలం ,అర్ధ బలం వుండాలి కదా ? ఎంత ఖర్చు పెట్ట గలువు అంటే సమాధానం చెప్పక పోగా, బయట కెళ్ళి నన్ను పార్టీ ఫండు కింద అంత అడిగారు ,ఇంత అడిగారని మా పరువు తీస్తున్నారు “ వివరించాడు భేతాళుడు .

“అందుకనే ఈసారి ఇలా ఏర్పాటు చేసారు .. ఎవరి ఆర్ధిక స్తోమతకు తగ్గట్టు ఆయా పార్టీలో చేరి వాళ్లకు నచ్చిన చోట నుంచి నిలబడతారు మాకు సగం శ్రమ తప్పిందనుకో , ఎంతైనా అన్న పాలిటిక్స్ లో సీనియర్ కదా ‘జానీ మాట కలిపాడు.

“ అవును విక్రమార్కా లేకపోతే రోజుకు ఒకడు పార్టీని విడిచి పెట్టి అవాకులు. చెవాకులు మాట్లాడటం దానికి మళ్ళీ కౌంటర్ ఇవ్వటానికి నానా తిప్పలు పడటం అవసరమా?” భేతాళుడు తమ ఇబ్బందుల్ని ఎకరవు పెట్టాడు.

“అసలీ గోల లేకుండా, ప్రతి నియోజక వర్గంలో ఎక్కువ ఖర్చు పెట్టే వాడికే పట్టం కడితే నియోజక వర్గం అన్నా బాగుపడుతుంది కదా ?విక్రమార్కుడు తనకు వచ్చిన ఆలోచనను వాళ్ళ ముందు వుంచాడు

“మరి ఎన్నికలు. “తన అనుమానం బయుట పెట్టాడు జిని

“ఇంకా ఎన్నికలెందుకు.. ఎన్నికల అవసరమే వుండదు ” విక్రమార్కుడు బదులిచ్చాడు

‘ఎన్నికలు లేక పోతే ఎలా రాజా ? అప్పుడుఅసలు , ముఖ్య మంత్రులు మంత్రులు ఎవరౌతారు ‘భేతాళుడు తన కొచ్చిన అనుమానాన్ని విక్రమార్కుడి ముందు ఉంచాడు

‘రాష్ట్రం మొత్తం మీద ఎవరు ఎక్కువ ఖర్చుపెడితే వాడే ముఖ్య మంత్రి, ఆ తరువాతి వాళ్ళు మంత్రులు “


“నువ్వు చెప్పేది బాగానే వుంది కానీ, మరి ఎన్నికలు లేకపోతే ప్రజాస్వామ్యం ఎలా అవుతుంది, ధన స్వామ్యం అవుతుంది కాని “
.
‘ఇప్పుడు మాత్రం ఎక్కడ చచ్చింది ప్రజాస్వామ్యం అది ఏనాడో చచ్చి సమాధుల్లో హాయిగా నిద్రపోతోంది . ఇప్పుడున్న దంతా ధన స్వామ్యమే , దానికే ప్రజాస్వామ్యం అని ముసుగేసి అందరం ఇలా నాటకాలాడుతున్నాము “ అంటూ నిష్కర్షగా చెప్పాడు విక్రమార్కుడు . విక్రమార్కుడి మాటలకు ఏమి జవాబు చెప్పాలో అర్ధం కాక దెయ్యాలన్ని చెట్టు కొకటి పుట్టకొకటి గా ఎగిరి పోయాయి .
నిజం మాట్లాడితే అంతే మరి మనుషులైనా , దెయ్యాలైనా పారిపోవాల్సిందే .

★★★

మన
కథా
నాయకులు

# మహా కవుల మానస పుత్రులు

# గిరీశం




గిరీశం కన్యాశుల్కం నాటకంలో గురజాడ అప్పారావు సృష్టించిన కాల్పనిక పాత్ర. కన్యాశుల్కం నాటకానికి ఉన్న తొలి, మలి కూర్పులు రెంటిలోనూ గిరీశం ప్రధాన పాత్ర. కన్యాశుల్కం నాటకంలో అతనిది ప్రధాన పాత్రే అయినా నాయక పాత్ర కాదు.

కన్యాశుల్కంలో విజయనగరంలో అప్పులు, చేసిన తప్పులు చుట్టుముట్టడంతో శిష్యుడు వెంకటేశానికి చదువుచెప్పే మిషతో అతని ఊరైన కృష్ణరాయపుర అగ్రహారానికి వెళ్తాడు. అక్కడ బాల్యవివాహం వల్ల మీదపడ్డ వైధవ్యంతో కాలం గడుపుతున్న వెంకటేశం అక్క బుచ్చమ్మను ప్రేమలోకి దింపి పెళ్ళాడదామని, తద్వారా రకరకాలుగా డబ్బు, ఆస్తి కలిసివస్తుందని ఆలోచిస్తాడు. బుచ్చమ్మ చెల్లెలికి ముసలివాడితో పెళ్ళిచేయబోగా, దాన్ని తప్పించేందుకు అని వంక పెట్టి బుచ్చమ్మను తీసుకుపోతాడు. విజయనగరంలో సంస్కర్త, న్యాయవాది అయిన సౌజన్యారావు పంతులు వద్ద వినయం నటించి నమ్మిస్తాడు. ఇతను మొదట్లో ఉంచుకున్న మధురవాణి బండారం బయటపెట్టడంతో కథ అడ్డం తిరుగుతుంది.

గిరీశం వేశ్యాసాంగత్యం, మోసాలు, అబద్ధాలు, ఆడంబరాలు మరిగిన పాత్ర. అవసరానికి ఏదోక చక్రం అడ్డువేసి రోజులు గడుపుకుంటూ, వీలుంటే కొండకు వెంట్రుక వేద్దామని చూస్తూంటాడు. ఈ పాత్ర లక్ష్యం, దాని సిద్ధి, అసలు స్వభావంలోని కీలకం వంటి విషయాల మీద విమర్శకుల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. గిరీశం పాత్రలోని కీలకం "బ్రతుకుతెరువు" అనీ, అది హానికరమైన పాత్ర కాదని కొందరు భావిస్తే, ఆ స్థితి లేక కించిత్తు అధికారం ఉన్నా దాన్ని విపరీతంగా దుర్వినియోగం చేసే పాత్రేనని మరికొందరి అభిప్రాయం. గిరీశం పాత్ర మీద ప్రేక్షకులకు అసహ్యం కలగకపోవడం వల్లనే నాటకం రక్తికట్టిందని ఒకరు అంటే, ఆ పాత్ర ప్రేక్షకులను ఆకర్షించడం వల్ల నాటకం సాంఘిక ప్రయోజనం దెబ్బతిందని మరికొందరు విశ్లేషించారు.

కన్యాశుల్కం నాటకంలో తొలిసారిగా విజయనగరంలోని బొంకుల దిబ్బ వద్ద గిరీశం



ప్రవేశిస్తాడు. వేశ్య అయిన మధురవాణిని ఉంచుకుని, పూటకూళ్ళమ్మతోనూ నేస్తం కట్టి, సంబంధం కలిగివుండి రోజులు నడుపుతూ ఉంటాడు. ఊరి నిండా ఆడంబరాలకు చేసిన అప్పులు గొంతుమీదికి వచ్చాయి. పూటకూళ్ళమ్మ కూరలకు ఇచ్చిన డబ్బు డాన్సింగర్లు మీద ఖర్చుచేశాడు. వీటన్నిటివల్లా సమస్యలు ఎదురు కావడంతో ఏదోక మిషతో విజయనగరం నుంచి తప్పుకోవాలని ప్రయత్నించాడు. ఈ క్రమంలో అవసరార్థం జనం నుంచి తప్పుకోవడానికి మధురవాణి మంచం కింద దాక్కుని తాను తినవలసిన చీపురు దెబ్బలు ఒడుపుగా రామప్పంతులుకు తగిలేలా చేస్తాడు. చదువు చెప్తానని మభ్యపెట్టి వెంట తిప్పుకుంటున్న శిష్యుడు వెంకటేశం సాయంతో అతనికి సెలవుల్లో చదువు చెప్పే మిషతో వెంకటేశం ఊరైన కృష్ణరాయపుర అగ్రహారానికి జారుకుంటాడు.

## మహా కవుల మానస పుత్రులు

సెలవుల్లో వెంకటేశానికి పాఠాలు చెప్పడం మాని, అతని అక్క బుచ్చమ్మకు ప్రేమ పాఠాలు చెప్పడం ఆరంభిస్తాడు. బాల్య వివాహం చేసుకుని, చిన్ననాటే భర్త చనిపోయిన బుచ్చమ్మ గిరీశం మాటల్లో "యంగ్ బ్యూటిఫుల్ విడో". బుచ్చమ్మను పెళ్ళిచేసుకుంటే కీర్తి సుఖం కూడా దక్కుతాయన్నది గిరీశం ఉద్దేశం. విడో రీ మారియేజి అసోసియేషన్ వాళ్ళు తృణమో పణమో ఇస్తారు, దానికి తోడు బుచ్చమ్మకీ కొంత ఆస్తి ఉంది. అతనికి అన్న వరసయ్యే లుబ్ధావధాన్లనీ వల్లో వేసుకుంటే అతనీ ఆస్తికి వారసుడూ కావచ్చని గాలిలో మేడలు కడతాడు. వీటిన్నిటితో హాయిగా కాలక్షేపం చేయవచ్చు అనుకుంటాడు. బుచ్చమ్మ తల్లి వెంకమ్మ నూతిలో దూకినప్పుడు గిరీశం తన లవ్ ఇంట్రెస్టు కోసం వెనుకనే దూకేసి కాపాడతాడు. అమాయకురాలైన బుచ్చమ్మని ప్రేమలోకి దింపడానికి తమకు పెళ్ళైనట్టు, తాను పెద్ద ఉద్యోగం చేసి బంగళాలో కాపురం పెట్టినట్టు, పిల్లలు పుడితే ఆడించినట్టు, వెంకటేశాన్ని తమవద్దే చదివించినట్టు లేనిపోని కబుర్లు చెప్తాడు. ఎన్ని కబుర్లు చెప్పినా బుచ్చెమ్మ బోల్తాపడదు. బుచ్చెమ్మ చెల్లెలు సుబ్బిని ఓ ముసలివాడికిచ్చి పెళ్ళిచేస్తున్న సమయంలో ఆ పెళ్ళికి అందరూ తరలివెళ్తుండగా, అలాంటి బాల్యవివాహాన్ని తప్పించడానికి తామిద్దరం లేచిపోవడం ఒక్కటే మార్గమని నమ్మించి బండిదారి తప్పించి బుచ్చెమ్మను తీసుకుపోతాడు.

విజయనగరంలో సంస్కర్త, న్యాయవాది అయిన సౌజన్యారావు పంతులను ఆశ్రయిస్తాడు. అతనిని దారికి తెచ్చుకుని, ఉత్తముడినని నమ్మించేందుకు సౌజన్యారావులానే తాను కూడా వేశ్యా వ్యవస్థకి వ్యతిరేకిననీ, యాంటీ నాచ్ ని అని చెప్పుకుంటాడు. మధురవాణి వేరే సమస్యను పరిష్కరించేందుకు సౌజన్యారావు వద్దకు వచ్చినప్పుడు తన గురించి బయటపెట్టవద్దని గిరీశం బ్రతిమాలుకుంటే ఒప్పుకుంటుంది. కానీ, సందర్భవశాత్తూ గిరీశం చర్చ రావడంతో సౌజన్యారావు బలవంతంతో మధురవాణికి గిరీశం చరిత్రను చెప్పక తప్పదు. దానితో బుచ్చెమ్మలాంటి అమాయకురాలిని ఇతనికి ఇచ్చి పెళ్ళి చేసే ప్రసక్తి లేదంటాడు సౌజన్యారావు. చదువుకునేందుకు ఆర్థికంగా సాయం చేస్తాననీ, చదువు పూర్తిచేయమనీ తెలుస్తాడు. బుచ్చెమ్మ పూనాలోని విడో రీమారియేజి సొసైటీకి పంపే ఏర్పాటు కూడా చేస్తాడు. దీనితో గిరీశం "డామిట్! కథ అడ్డంగా తిరిగింద"నుకుంటూ నిష్క్రమిస్తాడు



చిన్నా చితకా నేరాలు, మీద పడి తన్నడాలు, అప్పులు ఎగ్గొట్టడాలు, స్త్రీలతో విచ్చలవిడి శంగార సంబంధాల యావ, వివాహితలైన యువతులకు లవ్ లెటర్లు రాయడాలు, ఆధునికత ముసుగులో, ఒక నేరపూరిత, దగుల్బాజీ మనస్తత్వం గల వ్యక్తి. మాటలు చెప్పి మభ్యపెట్టేందుకు సరిపడా తప్ప ఉద్యోగం చేయగలిగేంత చదువు చదివినవాడు కాడు. కానీ హైదరాబాద్ నవాబు నెలకు వెయ్యి హాళీ సిక్కాలిస్తామని హమేషా తమతో ఉండమని పిలిచారని చెప్పుకు తిరుగుతూంటాడు. దొంగ పెద్దమనుషులకు ప్రతీకగా ఈ పాత్రను గురజాడ సృష్టించాడని ద్వానా శాస్త్రి విశ్లేషించాడు. ఒక సిద్ధాంతం, లక్ష్యం లేకుండా స్వప్రయోజనం కోసం ఇతరులు కష్టపడినా పట్టించుకోని పద్ధతి ఇతనిది.

పూట గడవని పక్కా ఫకీరు

మన
కథా
నాయకులు


# మహా కవుల మానస పుత్రులు

గిరీశం. ఈ పూటకు ఎక్కడ బిచాణా వెయ్యాలన్నదే ఎప్పుడూ అతని తక్షణ సమస్య. ఈ సమస్యను పరిష్కరించుకోవడానికి అతనికి ఉన్న శక్తులు: వాగ్ధాటి, చురుకైన బుద్ధి. అబద్ధాలూ, మోసాలు – ఆత్మరక్షణకు సాధనంగా వాడుకున్నాడు. వీలు, అవకాశం జీవితాదర్శాలు. ఆత్మరక్షణ కోసం, పూట గడుపుకోవడం కోసం వెంకటేశంతో వచ్చి బుచ్చమ్మను తీసుకుపోవడానికి ప్రయత్నిస్తాడు. ఉన్న ఆస్తి వెంట్రుకలే, ఎప్పటికప్పుడు కొండకు ఆ ఉన్న వెంకట్రుకే వేసే తత్వం అలవరుచుకున్నాడు. క్షణాల్లో అవసరాన్ని బట్టి అభిప్రాయాలు మార్చుకుంటాడు. మాటల్లోనూ, అభిప్రాయాల్లోనూ ఏముంది పని జరగాలన్నదే ఉద్దేశం. గిరీశంలోని ప్రత్యేకత తరగని ఉత్సాహం. కథ అడ్డం తిరిగినా మరో కాంపేనుకు అవకాశం వెతుక్కోవడమే తప్ప నిరుత్సాహపడడం, నీరసించడం తెలియని విద్యలు. ఎలాంటి గడ్డు పరిస్థితులు ఎదురైనా తొణకడం బెణకడం అతని వల్ల కాని పనులు. అతని కోణంలో ఇదంతా ఒక ఆట. ఆటలో జయాపజయాలు దైవాధీనాలన్నట్టే ఎదురయ్యే ఫలితాలనూ గిరీశం తీసుకుంటాడు.

కొండుభొట్టీయం నాటకంలో గురజాడ మళ్ళీ గిరీశాన్ని ప్రవేశపెట్టినా, ఆ పాత్రకి అసలు అతనే కన్యాశుల్కంలో సృష్టించిన పాత్రకీ సంబంధం లేదు. కొండుభొట్టీయంలోని గిరీశంలో అతని సహజ లక్షణమైన ఉత్సాహం కనిపించదు. జీవితాన్ని తేలిగ్గా తీసుకోవడం, దేన్నీ లోతుగా పట్టించుకుని మనసుకెక్కించుకోకపోవడం వంటి కన్యాశుల్కం గిరీశం లక్షణాలు ఇతనిలో కనిపించవు. కాబట్టి కేవలం అనుకరణ పాత్రగా విమర్శకులు కొట్టిపారేశారు. ఐతే, అక్కడా ఇక్కడా లెక్చర్లు దంచానని గిరీశం పాత్ర కన్యాశుల్కంలో అన్న మాటను పట్టుకుని గిరీశం లెక్చర్లు రాసిన ముళ్ళపూడి వెంకటరమణ మాత్రం మౌలికమైన గిరీశం స్వభావాన్ని పట్టుకున్నాడు.

గిరీశం పాత్ర, దాని సంభాషణలు, నాటకాల్లో గిరీశం పాత్ర రూపురేఖలు కన్యాశుల్కం నాటకం పరిధిని దాటి తెలుగు జన జీవితం మీద ప్రభావం చూపుతూనే ఉన్నాయి. గురజాడ రాసిన కొండుభొట్టీయం నాటకంలోనూ, ముళ్ళపూడి వెంకటరమణ రాసిన గిరీశం లెక్చర్లులోనూ, బాపు–రమణల సినిమా రాంబంటులోనూ గిరీశం పాత్ర మళ్ళీ వస్తుంది. “డామిట్! కథ అడ్డంగా తిరిగింది”, “నాతో మాట్లాడ్డవేఁ ఒక ఎడ్యుకేషన్” వంటి అతని సంభాషణలు తెలుగు నుడికారంలో భాగమయ్యాయి. వెయ్యికి పైగా నాటక ప్రదర్శనల్లోనూ, దూరదర్శన్ సీరియల్లోనూ గిరీశంగా నటించిన జె. వి. రమణమూర్తి మరో గిరీశంగా పేరు తెచ్చుకున్నాడు. 1955 నాటి కన్యాశుల్కం సినిమాలో ఎన్.టి.రామారావు, 2005 నాటి మాటీవీ సీరియల్లోనూ, మరికొన్ని రంగస్థల ప్రదర్శనల్లో గొల్లపూడి మారుతీరావు వంటివారు గిరీశంగా నటించారు. అలనాడు గోవిందరాజు సుబ్బారావు నుంచి ఇటీవల ఉత్తేజ్ దాకా పలువురు గిరీశం పాత్ర ధరించారు.

★★★



టెక్నాలజీ

# భారత దేశం నుండి అధునాతన ChatBot – AI తెలుగు

## పి. దేవకాంత్

యువతలో చాలా మంది నిజాయితీ గల ప్రేమను కోరుకుంటున్నారు. ఈరోజుల్లో అత్యంత విశ్వాసం గల ప్రేమ ఎంతమందికి లభిస్తుంది.. దీని కోసమే చాలా మంది ఒంటరిగా ఉండే మగాళ్లు AI రోబోలను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుత కాలంలో AI రోబోలు ఒంటరిగా ఉండే యువతకు 'సన్నిహిత వ్యక్తులు'గా మారిపోతున్నాయి. లక్షలాది మంది ఒంటరి మగాళ్లు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌పై ఆధారపడుతున్నట్లు పలు నివేదికలు వెల్లడిస్తున్నాయి.

ఇప్పటివరకు తెలియని వ్యక్తులతో సంబంధం కోరుకునే వారికి లేదా ప్రేమ కోరుకునే వారికి అనేక డేటింగ్ యాప్స్ ఉన్నాయి. వీటిపై ఎంతగా ఆధారపడినప్పటికీ చాలా మందికి సరైన పార్ట్నర్ దొరకడం లేదు. అయితే ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్(AI)రాకతో పరిస్థితి మొత్తం ఒక్కసారిగా మారిపోయింది. ప్రస్తుతం AI చాట్ బాట్‌లను నియంత్రించే అనేక యాప్స్ అందుబాటులో ఉన్నాయి. ఇందులో మీరు మీ ఆలోచనలను షేర్ చేసుకోవచ్చు. మీరు కోరుకున్నదంతా ఇక్కడ లభిస్తుంది. ఎందుకంటే AIని మీరు భార్యలా, ప్రియురాలిలా, ప్రేమికుడిలా ప్రవర్తించమని ఆదేశించొచ్చు. ఇక్కడ ఆశ్చర్యకరమైన విశేషం ఏంటంటే.. ఇప్పటికే కోటి మందికిపైగా ఈ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకున్నట్లు కొన్ని నివేదికల్లో స్పష్టం చేయబడింది.


రెప్లికా AI అనే యాప్‌లో 2 లక్షల 50 వేల మంది యూజర్లు ఉన్నారట. ఈ యాప్‌కు ప్రో వర్షన్ కూడా ఉంది. ఇక్కడ మీరు AI చాట్‌బాట్‌తో మీ మనసులోని మాటలను చెప్పొచ్చు. వీడియో కాల్స్, వాయిస్ కాల్స్ చేసుకోవచ్చు. మీరు సన్నిహిత సెల్ఫీలు కూడా తీసుకోవచ్చు. ఈ యాప్ ద్వారా నిజమైన పార్ట్నర్‌ని పొందకుండా సింగిల్‌గా ఉండే యువత ఒంటరితనాన్ని పోగొట్టుకునేందుకు ఈ యాప్‌లతో కనెక్ట్ అవ్వడం వల్ల ఎంతో సౌకర్యంగా ఉంటుంది. Krutrim AI అనేది భారతదేశంలో తయారు చేయబడిన ఒక కృత్రిమ మేధస్సు చాట్‌బాట్, ఇది పెద్ద భాషా నమూనాలు మరియు డేటా సెట్‌లను ఉపయోగించి వివిధ భారతీయ భాషలలో అవుట్‌పుట్‌లను అర్థం చేసుకోవడానికి మరియు రూపొందించడానికి రూపొందించబడింది. పెద్ద భాషా నమూనాలు మరియు విభిన్న శిక్షణా డేటా సెట్‌లను ఉపయోగించి పలు భాషల్లో ఖచ్చితమైన మరియు అనుకూలమైన చాట్‌బాట్‌ను అభివృద్ధి చేస్తుంది, మూస పద్ధతులను సవాలు చేస్తుంది ,మరింత సమగ్ర AI అనుభవాన్ని సృష్టిస్తుంది. ఇది వాయిస్-ఎనేబుల్ మరియు మిశ్రమ భాషా సామర్థ్యాలను కలిగి ఉంది, భారతదేశం యొక్క విభిన్న సంస్కృతి మరియు చరిత్రను అందిస్తుంది. వివిధ భారతీయ భాషలలో అవుట్‌పుట్‌లను అర్థం చేసుకోవడం మరియు రూపొందించడం, మూస పద్ధతులను సవాలు చేయడం మరియు మరింత సమగ్రమైన AI అనుభవాన్ని సృష్టించడం వంటి సామర్థ్యాన్ని కలిగి ఉంది.

ఐ ఐ టి పాట్నా రూపొందించిన సేవక్ – ఒక తెలివైన భారతీయ భాషా చాట్‌బాట్.ఇంగ్లీషుతో పాటు భారతీయ భాషలను (హిందీ, బెంగాలీ, తమిళం మరియు తెలుగు) వ్రాత మరియు మాట్లాడే భారతీయ భాషలను అర్థం చేసుకోగలిగే సేవక్ అనే చాట్‌బాట్‌ను అభివృద్ధి చేయడం ఈ ప్రాజెక్ట్ లక్ష్యం. ఆంగ్లంలో హిందీ (హింగ్లీష్), ఆంగ్లంలో బెంగాలీ (బెంగాలీ), ఇంగ్లీషులో తమిళం (తంగ్లీష్), మరియు ఇంగ్లీషులో తెలుగు (తెంగ్లీష్) . ఉత్పత్తి ఓపెన్ సోర్స్, ప్లగ్ చేయదగిన, చాట్‌బాట్ ఇంజిన్‌గా ఉంటుంది. ఫేస్‌బుక్ మెసెంజర్, ఆండ్రాయిడ్ యాప్ ద్వారా సేవక్ సేవ అందించబడుతుంది.

★★★




# నవ్వండి ప్లీజ్






**నవ్వటం ఒక యోగం ,**


**నవ్వలేక పోవటం ఒక రోగం , తరువాత మీ ఇష్టం**

శ్రీనివాస్ కార్టూన్లు













జీవన చిత్రాలు

# జీవన చిత్రాలు

## వీళ్ళు బిచ్చగాళ్ళు కాదు మనసున్న మారాజులు

ఈ రోజుల్లో డబ్బంటే ఎవరికి చేదు చెప్పండి. డబ్బు కోసం కొందరు ఎంత నీచానికైనా దిగజారిపోతున్నారు. నేరాలు, ఘోరాలు కూడా చేస్తున్నారు. అన్యాయం, అక్రమాలు చేసైనా సరే.. డబ్బు సంపాదించడమే కొందరు ధ్యేయంగా పెట్టుకున్నారు. మన దగ్గర ఎంత డబ్బు ఉంటే సమాజంలో మనకు అంత గౌరవం, హోదా అని భావించే వాళ్లు మన మధ్యలో చాలామందే ఉన్నారు. దాదాపుగా అందరికీ డబ్బు మీద ఆశ ఉంటుంది. ఇక కొంతమంది సంపాదించింది అస్సలు ఖర్చు పెట్టరు. ఇతరులకు పైసా కూడా ఇవ్వరు. పరమ పిసినారిగా వ్యవహరిస్తుంటారు . కానీ, నాణెనికి రెండో వైపు ఉన్నట్లుగానే.. మనుషుల్లోనూ కొందరు మంచోళ్లు కూడా ఉంటారు. వారికి సంపాదన కన్నా నలుగురికి సాయం చేయడంలో, ఆకలితో ఉన్న వారి కడుపు నింపడంలోనే ఎక్కువ తృప్తిని పొందుతారు. ఇప్పుడు మనం చెప్పుకోబోయే వారు ఈ కోవలోకే వస్తారు.

అయోధ్యలోని భవ్యమైన రామమందిర నిర్మాణం పూర్తికాగా రామభక్తులు తమకు తోచినంత మేర ఆలయానికి విరాళంగా ఇస్తున్నారు. తాజాగా, యాచకులు విరాళం సమర్పించి రాముడిపై తమ అచంచల



భక్తిని చాటుకున్నారు. కాశీలో జీవనం సాగిస్తున్న బిచ్చగాళ్లు అయోధ్య రామాలయానికి రూ.4.5 లక్షలు విరాళంగా ఇచ్చారు. సాధారణంగా ఇతరుల ముందు చేయిచాచి అర్థించే వీరు ఆలయానికి తమవంతుగా కొంత మొత్తాన్ని అందజేశారు. కాశీకి చెందిన యాచకుల సంఘం రామాలయానికి రూ.4.5 లక్షలు విరాళంగా సమర్పించింది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సమర్పణ్ నిధి ప్రచారంలో 300 మందికి పైగా యాచకులు పాల్గొన్నారు. వారణాసిలో భిక్షాటన చేస్తున్న కొందరు.. 2020 నవంబరులో ఆర్ఎస్ఎస్ కార్యాలయానికి చేరుకుని ఈ ప్రచారంలో తమను కూడా భాగస్వాములను చేయాలని కోరారు. వారి కోరికను మన్నించి, ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. దీంతో ఉత్తర్ ప్రదేశ్‌లోని 27 జిల్లాలకు చెందిన యాచకులు రామ మందిర నిర్మాణం కోసం విరాళాలు అందించారు. కాశీ పరిధిలో ఉంటున్న 300 మందికి పైగా యాచకులు రామాలయానికి విరాళాలు అందించారు. అలాగే, 4వేల మందికిపైగా చెప్పులు కుట్టేవారు, రజకులు, స్వీపర్లు కూడా తమ కష్టార్జితంలోని కొంత భాగాన్ని రామాలయం కోసం విరాళంగా సమర్పించారు.

బిచ్చగాళ్లు కదా అని చిన్న చూపు చూడకండి . సంపదలో వాలు పేదవాళ్ళు కావచ్చు కాని , దాతృత్వం లో మాత్రం కాదు .దేశం లోని అనేక ఆలయాలకు వీళ్ళు లక్షలకు లక్షలు దానం చేస్తున్నారు .

గుడి ముందు కూర్చొని భిక్షాటన చేసే ఓ 73 ఏళ్ల యాచకుడు ఆలయ నిర్మాణం కోసం రూ.8

## జీవన చిత్రాలు



లక్షలు విరాళంగా ఇచ్చాడు. విజయవాడకు చెందిన యాదిరెడ్డి సాయిబాబా ఆలయ నిర్మాణం కోసం గత ఏడేళ్లలో రూ.8 లక్షలు విరాళంగా ఇచ్చి మంచి మనసు చాటుకున్నాడు. దాదాపు 40 ఏళ్లపాటు రిక్షావాలాగా జీవితాన్ని గడిపిన యాదిరెడ్డి.. మోకాళ్ల నొప్పి కారణంగా తప్పనిసరి పరిస్థితుల్లో యాచకుడిగా మారారు. తొలుత సాయిబాబా గుడి నిర్మాణం కోసం లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చారు. తర్వాత ఆయన ఆరోగ్యం క్షీణించడం మొదలైంది. దీంతో తనకు డబ్బు అవసరం లేదనిపించి ఆలయానికి మరింత మొత్తంలో విరాళాలు ఇవ్వడం ప్రారంభించాడు.

భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగించే ఓ వృద్ధురాలు.. ఆలయానికి రూ.లక్ష విరాళంగా ఇచ్చి తన గొప్ప మనసును చాటుకుంది. ఈ ఘటన ఒడిశాలోని కొంధమాల్ జిల్లా కేంద్రం పుల్బాణీలో చోటుచేసుకుంది. తులా బెహర (70) అనే యాచకురాలు పట్టణంలోని జగన్నాథ ఆలయానికి తాను పొదుపు చేసుకున్న రూ.లక్ష విరాళంగా అందజేసి ఔదార్యాన్ని ప్రదర్శించారు.

కటక్ చవులియాగంజ్‌కు చెందిన తులా బెహర.. కార్మికుడిగా పనిచేసే ప్రఫుల్ల బెహరాను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అనంతరం భార్యాభర్తలు పుల్బాణీకి వలస వచ్చారు. రెండు దశాబ్దాల కిందట ప్రఫుల్ల కన్నుమూయడంతో సంతానం లేని తులా అప్పటి నుంచి ఒంటరిగా జీవిస్తున్నారు. యాచనతో వచ్చిన సొమ్ములో కొంత ఖర్చుపెట్టుకొని మిగితాది పోస్టాఫీసులో పొదుపు చేసేవారు ఆలయ పునరుద్ధరణ పనుల కోసం బ్యాంకులో తాను ఏళ్లుగా దాచుకున్న మొత్తాన్ని మందిరం కమిటీ ప్రతినిధులకు శుక్రవారం విరాళంగా ఇచ్చారు.

తమిళనాడు తూత్తుకుడికి చెందిన పూల్‌పాండియన్ (72) బిచ్చగాడు. 12ఏళ్లుగా భిక్షమెత్తుకుని జీవిస్తున్నాడు. బిచ్చగాడు అయినా మంచి మనసున్న వ్యక్తి. తాను భిక్షాటన చేయగా వచ్చిన సొమ్ము పదిమందికి ఉపయోగపడాలనే మంచి మనసుతో.. ఆ డబ్బును సీఎం సహాయనిధికి అందిస్తున్నాడు. అలా ఇప్పటి వరకూ ఏకంగా రూ.55.60 లక్షలను వివిధ సందర్భాల్లో పలు జిల్లాల కలెక్టర్లకు అందజేశాడు. భిక్షాటన ద్వారా తనకు వచ్చే డబ్బును ప్రజల కోసమే ఉపయోగిస్తున్నానని పూల్ పాండియన్ తెలిపాడు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, కుర్చీలు, టేబుళ్లు కొనుగోలు చేసి ఇస్తున్నట్లు వివరించాడు. అలా, ఇప్పటివరకు రూ.55.60 లక్షలు విరాళంగా అందజేసినట్లు చెప్పాడు.

★★★

SUMATHI TV Channel
సుమతి

దసరా కథల పోటీలో గెలుపొందిన కథలు

# వెన్నెలకి ఆవల....

## కథ



**బి హెచ్ గౌరీ శంకర్**

"వ్యాపార వర్గాల్లో ఇదో సాధారణమైన వార్త‌_ _ _ కానీ_ _ _ అంత అవసరమేమొచ్చింది నవీన్ కి_ _ _" డాక్టర్ రంగనాథం నాతో అన్నాడు.

"కనుక్కుంటాను కానీ_ _ _ వాడి పరిస్థితి ఏమిటి_ _ _" అన్నాను నేను గాబరాగా రంగనాథంతో_ _ _ "ఇబ్బంది ఏమీ లేదు.. అతను చాలా కాలిక్యులేటెడ్. ఆత్మహత్యాయత్నం లో కూడా_ _ _" అన్నాడు నవ్వుతూ_ _ _ డాక్టర్స్ కి ఇవన్నీ సహజమే_ _ _

నేను వాడి ప్రక్కన కుర్చీలో కూర్చున్నాను.. నిశ్శబ్దంగా_ _ _ డాక్టర్ ఇచ్చిన మందుల ప్రభావంతో మెల్లగా కళ్ళు తెరిచాడు.. అతని ముఖంలో గూడు కట్టుకున్న విషాదం యొక్క నీడ_ _ _

దసరా కథల పోటీలో గెలుపొందిన కథలు

# వెన్నెలకి ఆవల....

"త్రాగండి అన్నయ్యగారు…"అంది నిర్మల కప్పుతో కాఫీ అందిస్తూ…

మెల్లగా వేడివేడి కాఫీ త్రాగుతూ.. చల్లని ఏ.సి. గది వాతావరణంలో కాస్త రిలాక్సయ్యాను.. వార్త నిర్మల ఫోన్లో చెప్పగానే… బెంగళూరు నుంచి విశాఖ పరిగెత్తుకు వచ్చాను..

"అసలేమీ జరిగిందమ్మా" అన్నాను నిర్మల వైపు చూసి. ఆమె ముఖంలో నిర్లిప్తత… విషాదం. ఎప్పుడూ నవ్విస్తూ సరదాగా, ఏభై ఏళ్ల వయసులో కూడా… నలభై ఏళ్ల దానిలా తిరిగే నిర్మల… ఓ విషాద మూర్తిలా…

"ఏమి చెప్పనన్నయ్య… వ్యాపారంలో నష్టం.. అప్పులు.. మీకు తెలియనిదేముంది…" అంది దుఃఖిస్తూ.. వస్తున్న కన్నీటిని చీర చెంగుతో తుడుచుకుంటూ…

నిర్మల… నిజమైన భార్య… ఆమె నా మిత్రుడిని పాడిస్తుంది.. నవ్విస్తుంది.. ఒంటరితనాన్ని పోగొడుతుంది. వర్షపు చినుకుల శబ్దాన్ని కలిసి వినిపిస్తుంది.. అన్నింటికన్నా ముఖ్యంగా అతనికి బ్రతకడం నేర్పింది… ఆమెను అలా ఎలా చూడటం… నా మిత్రుడు మెల్లగా… కళ్ళను పూర్తిగా తెరిచాడు. తన భార్య వంక చూశాడు.. నా వైపు చూసాడు.. అతడి ముఖంలో నెర్వెస్ నెస్.. ఏదో చెప్పాలనుకున్నాడు.. "వద్దులే తర్వాత మాట్లాడదాం.." అన్నాను నేను.. మెల్లగా… ఆమె కాఫీ కప్పులో పోసి, ప్రక్కన కూర్చుని నెమ్మదిగా త్రాగించింది. అతని ముఖంలో ఇప్పుడు కాస్త ప్రశాంతత… ఏం తిన్నాం, ఏం చూసాం అన్నది ముఖ్యం కాదు.. మనసు విప్పి ఏం చెప్పుకున్నాం అనేది ముఖ్యం.. భార్యాభర్తలిద్దరూ "మా..ట్లా..డు..కున్నారు" నిశ్శబ్దంగా మనసుతో..

★★

రాత్రి ఎనిమిది గంటల సమయం… ఆసుపత్రి గది… నిర్మలను ఇంటికి పంపించాను.. రేవతి.. నా భార్యకి ఫోన్ చేశాను. రమ్మన్నాను. తను వస్తే నిర్మలకి తోడుగా ఉంటుంది. నేను వెళ్లి ఫ్రెషయి రావచ్చు.

నాకు… నా మిత్రుడు గోపాలానికి నాలుగు దశాబ్దాలకు పైగా స్నేహముంది. ఒకరినొకరు అన్నదమ్ములు లాగానే ఉంటాం. తిండికి లేని దశ నుంచి శ్రమించి పారిశ్రామిక వేత్తలుగా ఎదిగాం. నాకు ఒక కొడుకు, కూతురు. పెళ్లిళ్లు అయిపోయాయి. అమెరికాలో సెటిల్ అయిపోయారు. నాకు 'అల్యూమినియం' ప్రాసెసింగ్ యూనిట్స్ హైదరాబాదు, చిత్తూరు, బెంగళూరులో ఉన్నాయి. కన్స్ట్రక్షన్స్ రంగంలో మా బాబు అమ్మాయి ఉన్నారు వారు జేఎన్టీయూలో ఎం.టెక్ చేశారు. అలాగని జీవితమంతా సంతోషం అనుకునేరు.
నా కష్టాలు నాకున్నాయి. నా మిత్రుడు గోపాలానికి ఆస్తులున్నాయి. కాకపోతే అతనికి ఇద్దరు కొడుకులున్నారు. ఆస్తి వారికి పంచేసి, ఇల్లు, కారు, బ్రతకడానికి కావలసిన ఆస్తి ఉంచుకున్నాడు. వారు ఆస్తులను పెంచే క్రమంలో తండ్రికున్న కెమికల్ ఫ్యాక్టరీ యూనిట్స్ ను స్నేహితుల మాటలు నమ్మి, విస్తరించాలనుకొని నష్టాల పాలయ్యారు. అప్పులు పెంచేశారు. ఆస్తులు కరిగించేశారు. ఫ్యాక్టరీల పైన చేసిన అప్పులు, తీసుకున్న లోన్లు ఇప్పుడు గోపాలానికి మిగిల్చి కుటుంబాలతో జారిపోయారు.. పాపం గోపాలం..

కథంటే కావలసిన చోట ఆనందాన్ని అతికించవచ్చు. వద్దంటే విషాదాన్ని తీసేయవచ్చు. జీవితం అలా కాదు కదా. కానీ.. దుఃఖాలను దాటి.. మౌనంగా ఏడున్నర పదుల వయసులో నవ్వుతూ ఛాట్ బండి నడుపుకునే దంపతులు నాకు తెలుసు. వారే.. సుబ్బయ్య దంపతులు. వైజాగ్ రామకృష్ణ బీచ్ లో రోజు సాయంత్రం ఆరు నుంచి రాత్రి పది వరకు మాత్రమే ఉంటారు. పగటిపూట తన

దసరా కథల పోటీలో గెలుపొందిన కథలు

# వెన్నెలకి ఆవల....

రెండు గదులు ఇంటి ముందు డైరీ పాల ప్యాకెట్స్, పేపర్స్ అమ్ముతారు. మూడు వందల అరవై అయిదు రోజులు వారి ముఖంలో నవ్వు, సంతృప్తి ఇప్పటికీ నాకశ్చర్యమే_ _ _ పేదరికం ప్రశాంతతనిస్తుందా_ _ _? వారి గురించి మా గోపాలానికి చెప్పాలి_ _ _ కాదు.. చాలామంది గోపాలాలకు తెలియాలి..

డోర్ బెల్ రింగయింది_ _ _ నర్స్.. వచ్చి.. పల్స్, టెంపరేచర్ వగైరాలు చూసి వెళ్ళింది. మళ్లీ నా ఆలోచనలు నా దగ్గరకు వచ్చాయి.

కిటికీలో నుంచి సముద్రం.. నల్లగా.. "అప్పుడప్పుడు సముద్రం శిఖరాల మీద నిలబడుతుంది. రోజుల తరబడి తీరపు గవ్వలని సైతం కదిలించదు" యండమూరి వారి అనువాదం గుర్తుకు వచ్చింది..

"ఊ...ఊ..." వెనకనుంచి మా వాడి మూలుగు.. కుర్చీ వెనుకకు జరిపి.. వాడి మంచానికి దగ్గరగా వేశాను.. వాడు నా చేతిని తన చేతిలోకి తీసుకొని_ _ _ 'నా కొడుకులు నాకన్యాయం చేశారు రా.. నాకు చావు తప్పా.. నీవు గుర్తుకు రాలేదు.. క్షమించు' అన్నాడు.. అతడి కంటి నిండా నీరు..

"ఏడవకు_ _ _ జీవితానికి కామాలే కానీ పులిస్టాపులుండవు. మరణమే చివరిది.. నువ్వు దానిని కాస్త ముందు పేజీల్లోకి తెద్దామనుకున్నావు. కానీ.. ఓడిపోయావు. ఒక్కటి గమనించు పిల్లలు మన స్థిరాస్తి కాదు. వారి జీవనం కోసమే జీవిస్తున్న ప్రాణులు వారు. మీతోనే జీవిస్తున్నా, వారు మీ సొంతం కాదు. ఇది నేను చెప్పిన మాటలు కాదు. ఖలీల్ జిబ్రాన్ తన ప్రాఫిట్ లో చెప్పినవి. ఇవి నాకు వర్తిస్తాయి. ఊరడిల్లు.. ఎక్కడి నుంచి ఇక్కడ వరకు వచ్చాము గుర్తుకు తెచ్చుకో.. నేనున్నాగా.. సర్దుకుందాం సరేనా_ _ _ హ్యాపీగా ఉండు.. నీ వ్యవహారాలు తేల్చిన తర్వాతనే నేను తిరిగి వెళ్తాను.. డోంట్ వర్రీ.." అన్నాను. భరోసాగా.. కానీ.. నిజంగా నేను చేయగలనని కాదు.. ఓ స్నేహితునిగా అతనికో మానసిక భరోసా అవసరమయ్యే సమయమిది.. స్నేహమంటే దుఃఖ సమయంలో ఆనందాన్ని ఇవ్వడం ఆనంద క్షణాలను సమంగా పంచుకోవటం_ _ _

సమయం రాత్రి 9 గంటల సమయంలో రేవతి, నిర్మల కలిసి వచ్చారు. ఆడవారు అయస్కాంతం లాంటివారు.. ఎక్కడున్నా చటుక్కున కలుసుకుంటారు.. నాకు నవ్వు వచ్చింది.. "ఎందుకు నవ్వుతున్నారు.. ఇది నవ్వే సమయమా.. సందర్భమా.." అని రేవతి డొక్కలో ఎవరూ చూడకుండా పొడిచి_ _ _ గోపాలం చూసాడని నాకు, రేవతికి కూడా తెలుసు. ఇటువంటి సమయంలో రోగి చుట్టూ ఉన్న వాతావరణాన్ని సాధ్యమయినంటగా తేలిక పరచాలి. నిర్మలాతనిప్రక్కన కూర్చొని చపాతిని ముక్కలుగా చేసి, కూరలో ముంచి తినిపిస్తున్నది. కానీ.. "ఒకరి కోసం మరొకరు జన్మించి జతగానే జీవించి, జీవితపు పుట్టల్ని మృత్యువు చించేస్తున్నా చివర వరకు జతగా అధ్యయనం చేయడం వివాహం. సాహో ఖలీల్ జేబ్రాన్.. వారిని అలా చూస్తుంటే నాకు గుర్తుకు వచ్చింది.

రాత్రి తొమ్మిదిన్నర సమయంలో డాక్టర్ రౌండ్స్ కు వచ్చారు. ఓ రెండు రోజుల్లో డిస్చార్జ్ చేసేద్దాం.. అన్నాడు. 'థాంక్యూ డాక్టర్' అన్నాను.. "ఎందుకు_ _ _ బిల్లు తగ్గినందుకా_ _ _" అన్నాడు డాక్టర్.. మేమిద్దరం.. రాత్రుళ్ళు.. తరచుగా.. విశాఖలో ఉంటే కలుస్తుంటాం.. జతగా "ఊగుతుంటాం"_ _ _ "బాకీ మీరు వదలరుగా" అన్నాను నర్మ గర్భంగా.. నవ్వుతూ " మీరు మారలేదు. గుడ్ నైట్" అనేసి వెళ్ళిపోయాడు..

నేను గోపాలం మంచం దగ్గరకు వచ్చి.. "డాక్టర్ మాటలు విన్నావుగా.." అన్నాను.. "నువ్వు డాక్టర్ తో అన్న మాటలు కూడా" అన్నాడు సన్నగా నవ్వుతూ.. "మీరు రాగానే ఆయనకు నవ్వు కూడా వచ్చిందన్నయ్య" అంది నిర్మల.. "కాదమ్మా.. నీ నిశ్శబ్ద

దసరా కథల పోటీలో గెలుపొందిన కథలు

# వెన్నెలకి ఆవల....

ఓదార్పు వలన" అన్నాను. రేవతి "ఏంటో ఈయన వ్యాపారం లాగే మాటలు కూడా అర్థం కావు" అంది వెటకారం నటిస్తూ.. అందరం సన్నగా నవ్వుకొని... ఇద్దరు తెచ్చిన ఆహార పదార్థాలను తినేసాం.. "ఒక్క మాట గోపాలం.. మనం ఇంటికి వెళ్లిన తర్వాత ఒక్కసారి కోటేశ్వరరావు గారిని కలుద్దాం.. ఓ.కే.నా.." "కోటేశ్వరరావు ఇంకా ఉన్నారా... ఆయన ఆత్మహత్య చేసుకున్నారని. ఐ.పీ. పెట్టేసారని విన్నాను.. విశాఖలోనే ఆయన ఉన్నారా.." అన్నాడు ఆశ్చర్యంగా... "సంతోషంగా ఉన్నారు.. చూపిస్తాను.. సరేనా..." అన్నాను..

★★ ★★

★★ ★★

రెండు రోజుల తరువాత గోపాలం ఆసుపత్రి నుంచి డిశ్చార్జె 0ఇంటికి వచ్చేసాడు. ఈ లోగా నేను పోలీసులు, లాయర్లు, బ్యాంకులు, అప్పుల వాళ్ళతో మాట్లాడి ఉంచాను. ఒక నెల రోజులలోపు అన్ని సెటిల్ చేస్తానని చెప్పాను. గోపాలం కాకపోతే నేను బాధ్యత వహిస్తానని వారికి చెప్పాను. నా ఆర్థిక స్థితి వారందరికీ తెలుసు కనుక ఒప్పుకున్నారు. బేసిగ్గా 'మనిషి' అంతో ఇంతో మానవత్వం, జాలి, దయ, సానుభూతి వంటి వాటితో కలిసి ఉంటాడు. కాకపోతే వాదనలతో ముందుకు వెళితే 'ఈగో' తిరగబడుతుంది. మానవ సంబంధాలు ఈ పాయింట్ దగ్గర దెబ్బతింటున్నాయి.

నాలుగు రోజులు అనంతరం... పరిస్థితులు మెల్లగా సర్దుకోసాగాయి. గోపాలం పిల్లలు కూడా ఫోన్లో మాట్లాడేరు. ముందు అతను కోపగించుకున్నాడు. కానీ.. నేను సర్ది చెప్పిన తర్వాత "దయచేసి మీరు మరి మా ఇద్దరి జీవితాల్లోకి రాకండి. మీరు నేర్పిన పాఠం గొప్పది" అని సరిపెట్టాడు. నిర్మల నిర్లప్తంగా ఉండిపోయింది.

"మనం ఒకసారి కోటేశ్వరరావు గారిని కలుద్దామా" అన్నాడు. ఓ రోజు గోపాలం.. "సరే.. సాయంత్రం ఆరుకు వస్తాను. వెళదాం" అన్నాను..

కారు రామకృష్ణ బీచ్ దిశగా నడుపుతున్నాను. గోపాలం ఏదో ఆలోచనలో ఉన్నాడు.. మెల్లగా రామకృష్ణ మఠం ఆలయం ఎదురుగా... సముద్రం ను చూస్తూ ఆపాను...

వాతావరణం మబ్బుపట్టి ఉంది. వీకెండ్ కాదు.. జనం పల్చగా ఉన్నారు. కారులో నుంచి ఇద్దరం దిగాము.. గట్టుమీద యువతి యువకులు జంటలు జంటలుగా 'దగ్గరగా' కూర్చుని.. ఈ ప్రపంచం మొత్తం 'మనిద్దరమే' అన్నంతగా ఉన్నారు.. నాకు నవ్వొచ్చింది.. బహుశా వారికి పెళ్లి కాలేదనుకుంటా. ఇంకా ప్రేమికులే.. "ఏంటి ఇక్కడ కారాపావు. అసలు ఈ దారిలో కోటేశ్వరరావు గారి మేడ లేదుగా.." గోపాలరావు అనుమానం. "ఆయన పది అయితే గాని ఫ్రీ కారని తెలిసింది. ఈలోగా... ఇక్కడ సుబ్బయ్య అనే ముసలాయన ఛాట్ బండి పెట్టారు. పదిహేను రూపాయలే.. దా.. తిందాం" అన్నాను..

ఇద్దరం... సుబ్బయ్య ఛాట్ బండి దగ్గరకు వెళ్ళాం.. అక్కడ చాంతాడంత క్యూ ఉంది.. ముసలి, ముతక, పిల్లలు అందరూ ఉన్నారు. కానీ.. సుబ్బయ్య మంచాయిన.. పెద్దవారికి వేగంగా ఇస్తున్నాడు. అతని భార్య కూడా ఏ మాత్రం విసుగు, చిరాకు లేకుండా ఆడవారికి, పిల్లలకు అందిస్తున్నారు.. వారి వయసు ఏడున్నర పదులు పైనే ఉంటుంది. అయినా వంగని విల్లులా 'స్టిఫ్' గా ఉన్నారు. కాలం నేర్పిన పాఠాలు.. జీవితం చెప్పిన జ్ఞాపకాలు కారకాలై ఉండవచ్చు... వారిని నిటారుగా ఉంచాయి... గోపాలం.. రెండు చాట్ లు అడిగాడు. 30 రూపాయలు ఇచ్చాడు. సుబ్బయ్య ముఖంలో నవ్వు... అతన్ని ఆకర్షించింది.. కొద్దిసేపు ఆలోచనలో పడేసింది.. "తీసుకున్నావా.." అన్నాను గోపాలం దగ్గరకు వెళ్లి...

"ఏం బాబు గారు బాగున్నారా"

దసరా కథల పోటీలో గెలుపొందిన కథలు

# వెన్నెలకి ఆవల....

అన్నాడు సుబ్బయ్య "అయ్యో.. నేను మీ కన్నా అన్నింటా చిన్నవాడిని.. నన్ను బాబు గారిని పిలవద్దు" అన్నాను సుబ్బయ్యతో___ "మీరు కస్టమర్.. దేవునితో సమానం అలానే పిలుస్తాను" అన్నాడు సుబ్బయ్య___ నవ్వుతూ___0

"చాట్ బండి వాడితో గౌరవ మర్యాదల చర్చ అవసరమా___ మనం డబ్బులిస్తాం.. అతడు సరుకిస్తాడు అంతే.." గోపాల ముఖంలో అసహనం___

నేను నవ్వి ఊరుకున్నాను___ ఒకసారి సుబ్బయ్య కథ తెలుసుకుందాం అనుకున్నాను. వెళ్లి అడిగాను.. వాడిది నీ వంటి కథే___ అంటే పిల్లలు వదిలించుకున్నారు". పూర్వాశ్రమంలో సుబ్బయ్య కూడా బాగా డబ్బున్న వాడేనట. కానీ.. పిల్లలను నమ్మి వారి పేరున ఆస్తి రాసి, వారిచే ఇంటి నుంచి గెంటి వేయబడ్డారు ఆ ముసలి దంపతులు. ఒకసారి ఆయనే నాకు చెప్పాడు" పిల్లల్ని ప్రేమించే ప్రయత్నం తప్పు కాదు. వారు తిరిగి ప్రేమను ఇవ్వాలన్న నిబంధనే మహా పాపమని" ఇది కూడా ఆయన ఎక్కడో చదివినదేనట. అవమానం, ఆకలి, వేదన, నిస్సహాయత, దుఃఖం – ఇవన్నీ సోపానాలు దిగితే కిందకు వెళతాం. ఎక్కితే పైకి వెళతాం. సుబ్బయ్య ఎక్కిన మనిషి.

"ఏంటి చాట్ బండి నడుపుకుం టూనా మీదికి ఎక్కిన మనిషి" గోపాలం గొంతులో చిన్న చూపు.

"నీకో విషయం చెప్పనా.. సమస్యల్ని చిరునవ్వుతో సాధించిన వాడే తన లక్ష్యాన్ని చేరుకుంటాడు. సుబ్బయ్య కథలో నీతి అదే.. ఈ మధ్య శాస్త్రజ్ఞులు చంద్రుని వెన్నెల ఆవల విపరీతమైన ఎండ ఉంటుందట. కానీ.. మనకు 'శశి' చల్లదనమే కావాలి..

చాట్ పూర్తయింది.. కప్పులు పారేశాం.. గట్ల మీద కూర్చున్న జంటలు మెల్లగా చీకటి ప్రదేశాలలో సర్దుకుంటున్నారు. "పది సమయం తొమ్మిది కావస్తున్నది.. వెళదాం.. మరో నాలుగయిదు రోజులలో ఇవన్నీ సర్దుకుంటాయి. భయం వదిలి... పూర్వపు జీవితం కావాలనుకోకు. క్రొత్త జీవితం ప్రారంభించు.. సుబ్బయ్యల" అన్నాను నవ్వుతూ... అతడు నవ్వాడు. ఇద్దరం కారెక్కాము. నేను స్టార్ట్ చేసాను.

" నేను కూడా బెంగుళూరు వెళ్ళాలి.. రేవతి కూడా తొందర పెడుతున్నది.. మరో రెండు రోజులు ఉండగలను.. అంతే" అన్నాను.

"పోనీ ఈ రెండు రోజులు మా ఇంట్లోనే ఉండవచ్చు కదా నీవు, రేవతి" గోపాలం అర్థింపు.

"మా బావమరిది ఇక్కడ ఉన్నాడని నీకు తెలుసుగా.. రేపు అంతా నీతోనే ఉంటాను సరా "అన్నాను వాడిని ఊరడిస్తూ..

వాడింటి దగ్గర వాడు దిగాడు___ లోపలికెళుతున్న వాడు ఆగి...

"అవును కోటేశ్వరరావు గారి దగ్గరకు వెళదామన్నావు. నాకు ఆయనను చూడాలని ఉంది.. పోనీ రేపు వెళదామా___" అన్నాడు.

"ఎందుకు రేపు ___. చూపించాను కదా" అన్నాను సీరియస్ గా

"ఎవరిని.. ఆ చాట్ బండి సుబ్బయ్య నా"

"అతని అసలు పేరు కోటేశ్వరరావు. ఇండస్ట్రియలిస్టు" నేను కారును ముందుకురికించాను.

సమాప్తం

మిస్టరీ

# శనివర్వాడ కోట



చారిత్రక ప్రాంతాలు, భవనాలు, కోటలు అలనాటి అద్భుతాలకు ప్రతీకగా నిలుస్తాయి. ఘనమైన చరిత్ర గల మన ఇండియాలో ఇలాంటి ప్రాంతాలు ఎన్నో ఉన్నాయి. పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. వీటిలో మహారాష్ట్రలోని పుణెలో ఉన్న శనివర్వాడ కోట కూడా ఒకటి. కానీ, ఈ కోటలో అడుగుపెట్టాలంటే గుండె ధైర్యం ఉండాలి. ఎందుకంటే.. పగలంతా ఎంతో అందంగా కనిపించే ఈ కోట సూర్యస్తమయం తర్వాత శ్మశనాన్ని తలపిస్తుంది. పౌర్ణమి వచ్చిందంటే చాలు.. ఆ కోట పరిసరాల్లో నిశబ్ద వాతావరణం నెలకొంటుంది. అక్కడికి వచ్చే పర్యాటకులను కోట పరిసరాల్లోకి వెళ్లవద్దని స్థానికులు హెచ్చరిస్తారు. నిండు వెన్నెల్లో అక్కడ ఏవేవో అరుపులు, ఆకారాలు తమకు కనిపిస్తుంటాయని.. అటుగా వెళ్తే అవి తమను వెంటాడుతుంటాయని స్థానికులు చెబుతుంటారు.

# మిస్టరీ

అలాగే, సాయంత్రం 5 దాటిన తర్వాత కూడా అక్కడ ఎవరూ ఉండకూడదు. అక్కడి సెక్యూరిటీ సిబ్బంది కూడా సాయంత్రం వేళల్లో ఆ పరిసరాల్లో ఉండవద్దని హెచ్చరిస్తారు.

ఆ కోటలో ఏ జరిగిందో తెలుసుకోవాలంటే.. ముందుగా ఆ కోట చరిత్ర గురించి తెలుసుకోవాలి. ఈ కోటను బాజీరావు పేష్వా నిర్మించారు. అయితే, బ్రిటీషు వారి దాడి వల్ల కోటలో రాతి నిర్మాణాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. బాజీరావు మరణం తర్వాత అతని కుమారుడు బాలాజీ బాజీరావు (నానా సాహెబ్) మరాఠా సామ్రాజ్యాన్ని పాలనను చేజిక్కించుకున్నాడు. నానా సాహెబ్‌కు మాధవ్ రావు, విశ్వాస్ రావు, నారాయణ్ రావు అనే ముగ్గురు కుమారులు ఉన్నారు. నానా సాహెబ్ యుద్ధంలో వీరమరణం తర్వాత మాధవ్ రావు ఆ బాధ్యతలు తీసుకున్నారు. మరో భయానక యుద్ధంలో అతని రెండో సోదరుడు విశ్వాస్ రావు కూడా చనిపోయారు. తమ్ముడి మరణాన్ని జీర్ణించుకోలేక మాధవ్ రావు ఆత్మహత్య చేసుకున్నాడు.

అది 1773.. తండ్రి, అన్నల మరణం తర్వాత మూడో కుమారుడైన నారాయణ రావు సామ్రాజ్య బాధ్యతలు స్వీకరించాల్సి వచ్చింది. అయితే, అతడికి 16 ఏళ్లే కావడం వల్ల అతడి పినతండ్రి రఘునాథ్ రావు సలహాలు సూచనలతో సామ్రాజ్యాన్ని నడిపేవాడు. రఘునాథ రావు, అతడి భార్య ఆనంది బాయ్.. కుటిల బుద్ధితో మెల్లగా సామ్రాజ్యం మీద పట్టు సాధించారు. నారాయణ రావును గృహ నిర్బంధం చేశారు.

నారాయణ రావు పాలన సమయంలో రఘునాథ రావు కుట్ర వల్ల గార్దీ అనే గిరిజన జాతి ప్రజలతో విభేదాలు తలెత్తాయి. దీంతో రఘునాథ రావు భార్య ఆనంది బాయ్ ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భావించింది. ఈ సందర్భంగా గార్దీ జాతి పెద్దకు ఓ లేఖ రాయాలని భర్తకు తెలిపింది. నారాయణ రావుపై కక్ష తీర్చుకొనే సమయం వచ్చిందని, కోటలోకి వస్తే.. అతడిని మీకు పట్టిస్తానంటూ రఘునాథ రావు లేఖ రాసి గిరిజనులకు పంపాడు.

రాఘునాథ రావు లేఖ మేరకు గిరిజనులు రహస్యంగా కోటలోకి ప్రవేశించారు. నారాయణ రావు గదిలోకి ప్రవేశించి హత్య చేశారు. అనంతరం అతడిని శరీరాన్ని ముక్కలుగా నరికి కోటను దాటించారు. అనంతరం సమీపంలోని నదిలో పడేశారు. అప్పటి నుంచి పౌర్ణమి రోజుల్లో నారాయణ రావు ఆత్మ ప్రతీకారం తీర్చుకోడానికి ఆ కోటలోనే తిరుగుతుందని చెబుతుంటారు. ఆ కోటలో ఎవరున్నా.. వారిని తన శత్రువుగానే భావిస్తూ ఆత్మ ప్రాణాలు తీసేదని స్థానికులు చెబుతున్నారు. అంతేగాక, నారాయణ రావు మరణం తర్వాత కోట సమీపంలో ఏర్పడిన మంటల్లో పలువురు చనిపోయారని పౌర్ణమి రోజుల్లో వారి ఆత్మలు కోట చుట్టూ తిరగుతుంటాయని చెబుతుంటారు. అయితే, అక్కడ నిజంగా ఆత్మలు ఉన్నాయా? అందులోకి వెళ్లిన వ్యక్తులు ఎలా చనిపోయారనేది మాత్రం ఇప్పటికీ అంతు చిక్కలేదు

★★★.

క్రైం
సీరియల్

# డెత్ మెసేజ్



క్రైం
సీరియల్



కొండగుంట వెంకటేష్.

"రండి"అని ఆహ్వానించాడు ప్రసాదరావు కుసుమ తండ్రి. అవినాష్ బలహీనంగా "అమ్మ మీతో ఒక విషయం చెప్పమని అంది. అందుకే వచ్చాను"అన్నాడు.

"ముందు కూర్చోండి. తరువాత మాట్లాడుకుందాం" అన్నాడు ప్రసాద్ రావు. అవినాష్ కూర్చున్నాడు. చుట్టు చూశాడు. అతని ఉద్దేశం ప్రసాద్ రావు గ్రహించాడు. "అమ్మాయి మేడమీద ఉంది. పిలుస్తాను ఉండండి" అని పైకి వెళ్ళాడు. "అమ్మ ఎలా ఉన్నారు? అడిగింది రాజీ ప్రసాద్ రావు భార్య. "బాగానే ఉంది. కాని గదిలోంచి బయటకు రావటం లేదు."

క్రైం సీరియల్

# డెత్ మెసేజ్

## జరిగిన కథ

పోలీసు డిపార్ట్మెంటు లో పనిచేసిన సుయోధనరావు ను ఎవరో అనుసరిస్తూ ఉంటారు .అవినాష్, కుసమలు ఒకరిని ఒకరు ఇష్టపడతారు. సుయోధనరావును వెంటాడుతున్న వ్యక్తే అవినాష్ ని కుడా అనుసరిస్తూ ఉంటాడు. సుయోధన రావ్, ఒక కుటుంబాని అన్యాయం చెయ్యటంతో అ కుటుంబం లోని వాళ్లు ఆత్మహత్య చేసుకుంటారు . అ కుటుంబం లోని వారసుడు అతని మీద పగబడతాడు.కుసుమకు అతడు ఫోన్ చేసి బెదిరిస్తుంటాడు.సాగర్ భార్య ప్రమీల ఫోన్ చేస్తే సుయోధన రావు అక్కడికి వెళతాడు. అక్కడ సాగర్ చచ్చిపడి ఉంటాడు .ఫ్యామిలీ డాక్టర్ ప్రకాష్ కి ప్రమీలకి సంబంధం ఉండనే అనుమానం తో ప్రకాష్ తో గొడవ పడతాడు సాగర్. కోపం లో ప్రకాష్ సాగర్ని చంపేస్తాడు . ప్రకాష్ కోసం సుయోధన రావు వెళితే అతను కనిపించుడు. చివరకు అతను చచ్చి శవమై తేలతాడు .కాని చనిపోయింది ప్రకాష్ కాదు సాగర్ అని తెలుసుకుంటాడు సుయోధన రావు .సుయోధన రావుకు బెదిరింపు లేఖ వస్తుంది.రవి తన తండ్రిని చంపినా సుయోధన రావును చంపాలని నిర్ణయించుకుంటాడు .సుయోధనరావు జాగింగ్ చేసే టప్పుడు రవి అతన్ని కాల్చి చంపుతాడు. పోలీసులు దర్యాప్తు మొదలు పెడతారు డెత్ మెసెంజర్ తనను కుసుమను మాత్రం ఫోన్లో హెచ్చరించాడు..

ఇక చదవండి

"ఎలా రాగలదు. ఆమె పరిస్థితిలో నేను ఉంటే అదే చేసేదాన్ని. అంత మంచి మనిషిని చంపటానికి ఆ హంతకుడికి

చేతులేలా వచ్చాయో. పోలీసులు ఏం చెప్పారు."

"దర్యాప్తు చేస్తున్నారు. ఇంకా ఏం తెలియలేదు"

అప్పుడే మేడమీద నుంచి కుసుమ ప్రసాద్ రావు వచ్చారు.

"ఎంతసేపయింది వచ్చి" అడిగింది కుసుమ.

"ఇప్పుడే వచ్చాను"అని ప్రసాద్ రావు వైపు తిరిగి అన్నాడు.

"అనుకున్న ముహూర్తానికి పెళ్ళి చేద్దామని అమ్మ అంటున్నది. మీకు అభ్యంతరం లేదుకదా" అన్నాడు అవినాష్

"కాఫీ తాగి వెళ్ళు" అంది రాజి.

"ఇప్పుడు కాదు. మరోసారి వచ్చినప్పుడు తాగుతాను" అని బయటకు నడిచాడు. అతని వెనుక కుసుమ వెళ్ళింది.

"నాన్నగారిని ఎవరు చంపారో తెలిసిందా"మెల్లగా అడిగింది కుసుమ.

"ఇంకా లేదు. ఇప్పుడే ఇన్స్ పెక్టర్ తో మాట్లాడాను. పరిశోధనిస్తున్నామని త్వరలోనే నేరస్థుడిని కనుక్కుంటామని చెప్పాడు"

"జరిగింది తలుచుకుంటే నాకు ఇంకా షాక్ గా ఉంది."

"అంతా మెరుపు వేగంతో జరిగిపోయింది. నాన్నగారు కొంచం జాగ్రత్తపడిఉంటే బాగుండేది. మనం కూడా కొంచం నిర్లక్ష్యంగా ప్రవర్తించాం. పర్యావసానం ఈ మూల్యం చెల్లించుకోవలసివచ్చింది."

"బాధపడకు. హంతుకుడు ఎన్ని రోజులు తప్పించుకుంటాడు. ఈ రోజు కాకపోయిన రేపయిన పట్టుబడతాడు"అంది అనునయంగా కుసుమ. తన చేతిని అతని చేతి మీద వేసింది.

"నాన్న మాత్రం తిరిగిరాడుగా "

క్రైం
సీరియల్

# డెత్ మెసేజ్

అన్నాడు. అతని గొంతు దుఖంతో పూడుకుపోయింది. కుసుమ ఏం మాట్లాడలేదు. విచారంగా మొహం పెట్టింది.

పది నిమిషాలు తరువాత అవినాష్ బయలుదేరాడు. పైకి మాములుగా ఉన్నాడు అతను. లోపల మాత్రం రగిలిపోతున్నాడు. హంతకుడి గురించి ఒక్క చిన్న క్లూ కూడా దొరకలేదు. దీన్ని పోలీసుల అసమర్ధత అనలా లేక హంతకుడు తెలివైనవాడని అనుకోవాలా. హత్య జరిగి పదిరోజులు అయింది. కాని ఇంకా నేరస్థుడి గురించి వివరాలు తెలియలేదు. కనీసం అనుమానితుల గురించి కూడా తెలియలేదు. ఈ విషయం ప్రతాప్ స్వయంగా అవినాష్ కు చెప్పాడు.

తట్టుకోలేకపోతున్నాడు అవినాష్ అసహనంతో రగిలిపోతున్నాడు.

ముందు కుసమను హెచ్చరించాడు డెత్ మెసెంజర్. తరువాత అతనికి కాల్ చేసి బెదిరించాడు. ఆ విధంగా నాలుగు సార్లు చేశాడు. తరువాత కొన్నిరోజులు కాల్ చెయ్యలేదు. బహుశా మనస్సు మార్చుకున్నాడని అనుకున్నాడు అవినాష్. అంతేకాదు వాటిని ప్రాంక్ కాల్స్ అని కూడా కొట్టిపారేశాడు. దాంతో రిలాక్స్ అయ్యాడు. అందుకే సంతోషంతో స్టేట్స్ కు వెళ్ళాడు. కాని తెలివిగా డెత్ మెసెంజర్ తన పంధా మార్చుకున్నాడు.

అవినాష్ కుసుమను విడిచిపెట్టి సుయోధనరావుని టార్గెట్ చేశాడు.

ఒకే ఒక్క డెత్ మెసెజ్ పంపించాడు. దాన్ని పూర్తిగా డెత్ మెసెజ్ అనలేం. కాని దాదాపు అలాంటిదే. అవినాష్ లాగే సుయోదనరావు కూడా దాన్ని సీరియస్ గా తీసుకోలేదు. అదే ఆయన చేసిన పెద్ద తప్పు. పర్యావసానం హత్య చెయ్యబడ్డాడు. అది హంతకుడు పాయింట్ బ్లాంక్ రేంజిలో కాల్చి చంపాడు. ఈ దారుణం జరిగి పదిరోజులు అయింది. కాని ఒక్క అడుగు కూడా కేసు ముందుకు కదలలేదు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్టుగా ఉంది. ఇది కూడా అవినాష్ కు కోపం తెప్పిస్తుంది. అంతకంటే అతను మాత్రం ఏం చేస్తాడు.

తలంతా భారంగా ఉంది. కాఫీ తాగుదామని లేచింది భారతి. ఇంట్లో ఎవరు లేరు. పనివాళ్ళు ఆ రోజు సెలవు తీసుకున్నారు. కాఫీ కలిపి స్టౌవు మీద పెట్టింది. కాఫీ ఒక గ్లాసులో పోసుకుని హాలులోకి వచ్చింది. ఎదురుగా గోడకు సుయోధనరావు ఫోటో ఉంది. దానికి దండ వేసిఉంది. వెళ్ళి ఫోటో ఎదురుగా నిల్చుంది. ఆమె కళ్ళు వెంటనే తడిఅయ్యాయి. బాధ దృంం కలిసికట్టుగా ఆమెను కుదిపేశాయి. ఏడుస్తూ సోఫాలో కూర్చుంది. భర్త లేడని ఆమెకు ఇంకా నమ్మకం కుదరటం లేదు. అంతా కలలో జరిగిపోయినట్టుగా ఉంది. ఆ రోజు ఉదయం మాములుగా లేచాడు సుయోధనరావు. మొహం కడుక్కున్నాడు. జాగింగ్ డ్రస్సు వేసుకున్నాడు. బూట్లు వేసుకుని భార్యను పిలిచాడు. ఆమె అంతకుముందే లేచింది. వేడి కాఫీ తెచ్చి ఇచ్చింది. అది తాగుతూ భార్య వైపు

నవ్వుతూ చూశాడు.

“కాఫీ బాగుందోయ్ “అన్నాడు.

“రోజు బాగాలేదా”అంది చిరుకోపంతో.

“ఈ రోజు బాగుంది అంటే రోజులాగే బాగుందని అర్ధం.”

“ఈ రోజు కొంచం తొందరగా రండి”అంది.

“ఎందుకు?

“ఎనిమిది గంటలకు పంతులుగారి దగ్గరకు వెళ్ళాలి కదా.”

“ఓ మరిచిపోయాను. అలాగే వస్తాను” అని బయలుదేరాడు.

చేతులు ఊపి ఆయనను సాగనంపింది. కాని అదే చివరి సాగనంపు అని ఆ క్షణంలో ఆమెకు తెలియదు. తెలిసి ఉంటే పంపించేది కాదు.

క్రైం
సీరియల్

# డెత్ మెసేజ్

ఆ తరువాత స్నానం చేసి రెడీ అయింది. భర్త కోసం ఎదురుచూస్తూ కూర్చుంది. ఎనిమిది గంటలైన భర్తరాలేదు. ఆయన నెంబర్ కు కాల్ చేసింది. రింగ్ పోతుంది కాని రెస్పాన్స్ లేదు. వెంటనే అవినాష్ ను లేపి విషయం చెప్పింది. అతను కూడా కాల్ చేశాడు. అయిన లాభం లేకుండ పోయింది. ఇద్దరు కొంచం కంగారుపడ్డారు. కాని ఇంత దారుణం జరుగుతుందని మాత్రం అనుకోలేదు.

దాదాపు తొమ్మిది గంటలవరకు కాచుకున్నారు. తల్లి కొడుకు ఆయన కోసం ఎదురుచూస్తూ కూర్చున్నారు. ఆయన రాలేదు కాని ఫోన్ కాల్ వచ్చింది. చేసింది పోలీస్ ఇన్స్ పెక్టర్. ఆయన చెప్పింది విని భారతి కర్రాయిలా బిగుసుకుపోయింది. ఆమె బుర్రపనిచెయ్యటం మానేసింది. కాళ్ళ కింద నేలకదులుతున్న అనుభూతి కలిగింది. ఆమె చేతులు కాళ్ళు వణికాయి. చేతిలోంచి ఫోన్ జారి కింద పడింది. నిలబడలేకపోయింది. నిస్సత్తువగా సోఫాలో కూలబడింది.

"ఏం జరిగింది అమ్మా" కంగారుగా అడిగాడు అవినాష్ కాల్ ఇంకా ఆన్ లోనే ఉంది. చప్పన తీసి పెట్టుకున్నాడు.

"ఎవరో మీ వారిని పాయింట్ బ్లాంక్ రేంజిలో కాల్చి చంపారు. ఆయన జేబులో పర్స్ కనిపించింది. అందులో ఆయన ఆధార్ కార్డ్. ఓటర్ ఐడి విజిటింగ్ కార్డ్స్ ఉన్నాయి. కార్డ్ మీద ఉన్న నెంబర్ చూసి కాల్ చేస్తున్నాను. మీరు వెంటనే స్పాట్ కు రండి. మీకోసం కాచుకుని ఉంటాను "అన్నాడు ఇన్స్ పెక్టర్.

ఫోన్ ఆఫ్ చేసి తల్లి వైపు చూశాడు అవినాష్. ఆవిడ ఈ లోకంలో లేదు. కళ్ళు తెరుచుకునే ఉన్నాయి. కాని వాటిలో జీవం లేదు. శూన్యంలోకి చూస్తున్నాయి. ఈ పరిస్థితిలో తల్లిని ఇబ్బంది పెట్టటం అతనికి ఇష్టంలేదు. అందుకే ఒంటరిగా కారులో బయలుదేరాడు.

అరగంటలో స్పాట్ కు చేరుకున్నాడు. అప్పటికే అంబులెన్స్ వచ్చేసింది. ప్రభుత్వ డాక్టర్ శవం దగ్గర నిలబడిఉన్నాడు. ఇన్స్ పెక్టర్ తో ఏదో చెప్పుతున్నాడు. ప్రతాప్ అవినాష్ ను చూసి ఎవరు అన్నాడు. తన పేరు చెప్పాడు అవినాష్, అతను సయోధనరావు కొడుకు అని ప్రతాప్ గ్రహించాడు. అతన్ని శవం దగ్గరకు తీసుకువెళ్ళాడు. నేలమీద అచేతనంగా పడున్నాడు సుయోధనరావు. అతని గుండెల దగ్గర పెద్ద గాయం కనిపించింది. ఇంకా సన్నగారక్తం ప్రవిస్తోంది. షర్ట్ పూర్తిగా రక్తంతో తడిసిపోయింది.

కళ్ళు మాత్రం విశాలంగా విచ్చుకుని ఉన్నాయి.

ఒక్కసారిగా కదిలిపోయాడు అవినాష్ నవనాడులు కృంగిపోయినట్టుగా అనుభూతి చెందాడు. తండ్రిని ఆ పరిస్థితిలో చూసి తట్టుకోలేకపోయాడు. కొంచంసేపయిన తరువాత ఫార్మాలిటిస్ ముగిశాయి. తరువాత అవినాష్ ఇంటికి వచ్చేశాడు. అప్పటికే తల్లి దయనీయంగా కూర్చుని ఉంది. ఆమెను చూసి పూర్తిగా కదలిపోయాడు అతను. ఇద్దరు ఒకరిని ఒకరు పట్టుకుని చాల సేపు ఏడ్చారు. తరువాత ప్రతాప్ వాళ్ళకు కాల్ చేశాడు. ఇద్దరు మర్చురికి వెళ్ళారు.

నిశ్చలంగా పడున్న భర్త శవాన్ని చూసింది భారతి. ఆశ్చర్యంగా ఆమెకు ఏడుపు రాలేదు. కనీసం కన్నీళ్ళు కూడా రాలేదు. బొమ్మాలా చూస్తూ ఉండిపోయింది.

ఆమె షాక్ లో ఉందని అవినాష్ కు అర్ధమైంది. తరువాత ఇద్దరు ఇంటికి వచ్చేశారు.

"అమ్మ అని అవినాష్ గొంతు వినిపించింది.

ఆలోచననుంచి తేరుకుని చూసింది.

క్రైం సీరియల్

# డెత్ మెసేజ్

"అమ్మ కుసుమ తండ్రితో అంతా చెప్పాను. వాళ్ళు సరే అన్నారు"అన్నాడు.

భారతి నిర్లిప్తంగా చూసింది.

తల్లి మాట్లాడే స్థితిలో లేదని అతనికి అర్ధమైంది. మౌనంగా పైకి వెళ్ళాడు. బట్టలు మార్చుకుని మంచం మీద కూర్చున్నాడు. అప్పుడే అతని సెల్ రింగ్ అయింది. డిస్ ప్లే మీద నెంబర్ కనిపించింది. అది అన్ నోన్ నెంబర్. అయిన క్యాజువల్ గా ఆన్ చేసి హల్లో అన్నాడు.

"నేనే బొంగురుగా వినిపించింది."

ఒక్కసారిగా నిటారు అయ్యాడు అవినాష్ ఫోన్ పట్టుకున్న చేతులు గట్టిగా బిగుసుకున్నాయి.

"ఎవరు నువ్వు? అడిగాడు.

"గుర్తుపట్టలేదా. మీ నాన్నగారిని చంపిన వ్యక్తిని"అన్నాడు.

"యూ బాస్టర్డ్"అని ఇంకా ఏదో అనబోయాడు. ఈ లోగా అతను అన్నాడు.

"అప్పుడే కోపగించుకోకు. ఇంకా అనుభవించవలసిన కష్టాలు బాధలు చాల ఉన్నాయి."

"ఎవరు నువ్వు? మా మీద ఎందుకు పగ పెంచుకున్నావు. మేము నీకు చేసిన ద్రోహం ఏమిటి?

"అది చెప్పను. ఆ రహస్యం మీకు ఈ జన్మలో తెలియదు. ఎందుకు చంపానో తెలియక ఎవరు చంపారో తెలియక నువ్వు నీ తల్లి అల్లాడిపోవాలి. అది నేను చూడాలి. అప్పుడే నాకు శాంతిగా ఉంటుంది. ఒకప్పుడు నువ్వు ఉన్న పరిస్థితిలో నేను ఉన్నాను. నిన్ను ఓదార్చటానికి కనీసం నీకు తల్లి ఉంది. కాని నాకు అప్పుడు ఎవరు లేరు. మా నాన్నపోయినప్పుడు నేను ఒంటరివాడిని. చుట్టాలు బందువులు ఎవరు లేరు. ఒంటరిగా బిక్కుబిక్కు మంటు ఏడుస్తూ కూర్చున్నాను.

పగలు ఫర్వాలేదు. రాత్రివేళ ఒంటరితనంతో విలవిలలాడిపోయాను. ప్రతి క్షణం అమ్మ నాన్న గుర్తుకువచ్చేవారు. తట్టుకోలేకపోయాను. గంటలతరబడి ఏడ్చాను. అప్పుడు నన్ను ఓదార్చేవాళ్ళు ఎవరు లేరు. అందరు తమ కన్నవాళ్ళతో సంతోషంగా ఉంటున్నారు. నేను మాత్రం ఎవరు లేని అనాధగా మిగిలిపోయాను. నా పరిస్థితికి మీ నాన్న అమ్మ కారణం. మీ నాన్న అహంకారం కారణం. మీ నాన్న ఉద్యోగం కారణం. దాని వల్ల వచ్చిన అధికారం హోదా కారణం. అమ్మ ఎవరికైన అమ్మ. మా అమ్మ అవమానంతో బాధపడుతుంటే మీ అమ్మ కనీసం ఓదార్చలేదు. కనీసం సాటి స్త్రీగా ప్రవర్తించలేదు. పైగా ఎగతాళి చేసింది. అప్పుడు మా అమ్మ పడిన బాధ ఆవేదన నేను ఎప్పుడు మరిచిపోలేను. ఇది ఇంతటితో ఆగిపోదు. ఇంకా కొనసాగుతుంది. నా తరువాత గురి మీ అమ్మ. నేను పట్టుబడతానని నాకు భయంలేదు. చట్టం నాకు ఊరిశిక్ష వెయ్యవచ్చు. అయిన బాధలేదు. ఎప్పుడో నేను మానసికంగా శారీరకంగా చచ్చిపోయాను. ఇప్పుడు జీవచ్ఛంలా బతుకుతున్నాను. నా లక్ష్యం ధ్యేయం ఒక్కటే. పట్టుబడేలోగా నా పగ తీర్చుకోవాలి. నా వాళ్ళ చావుకు కారకులు నీ తండ్రి నీ తల్లి. వాళ్ళు బతకటానికి వీలులేదు. మీ నాన్నను చంపేశాను. మీ తల్లి మిగిలిఉంది. అవిడను కూడా చంపేస్తాను. కాని ఎప్పుడు చంపుతానో చెప్పను. అదే సస్పెన్స్. కాని కౌంట్ డౌన్ ఈ క్షణం నుంచి మొదలుఅవుతుంది బై "అని లైన్ కట్ చేశాడు డెత్ మెసెంజర్.

"ఈ రోజు ఒక గంట ఓటి చెయ్యండి. కొంచం పని ఉంది" అన్నాడు ఫైనాన్స్ డైరక్టర్. "అలాగే ఉంటాను. ఎంతసేపు ఉండమంటారు? అడిగింది ప్రభ.

"గంట గంటన్నర అయితే సరిపోతుంది" అన్నాడు డైరక్టర్.

"అలాగే" అంది ప్రభ.

డైరక్టర్ తన చాంబర్స్ లోకి వెళ్ళిపోయాడు. పైలు తీసుకుని తను లోపలికి వెళ్ళింది ప్రభ.

క్రైం సీరియల్

# డెత్ మెసేజ్

ఆమె చెయ్యవలసిన పని అతను వివరంగా చెప్పాడు. ఆమె పుస్తకంలో నోట్ చేసుకుంది. తరువాత తన టేబుల్ ముందు కూర్చుంది. కంప్యూటర్ ఆన్ చేసింది.

పది నిమిషాలు పనిచేసింది. కాని పూర్తిగా పని మీద దృష్టిలగ్నం చెయ్యలేకపోయింది. మాటి మాటికి రవి గుర్తుకువస్తున్నాడు. అతనితో ఉన్న అమ్మాయి గుర్తుకువస్తోంది. వాళ్ళిద్దరి మధ్య ఏం సంబంధం ఉందో తెలియదు. ప్రేమికులులా కనిపించటం లేదు. అలాగని స్నేహితులనుకోలేం. స్నేహితులైతే వాదించుకునేవాళ్ళు కారు. ఆమె కోపంతో వెళ్ళిపోయేది కాదు. కనుక ఖచ్చితంగా ప్రేమికులై ఉండాలి. ఇద్దరి మధ్య ఏదో అభిప్రాయభేధాలు వచ్చి ఉంటాయి. దానిమీద వాదించుకున్నట్టు ఉన్నారు. అతను ఏదో చెప్పాడు. నచ్చచెప్పటానికి ప్రయత్నించాడు. కాని ఆమె వినిపించుకోలేదు. దాంతో వెళ్ళిపోయింది.

ఈ ఆలోచన ప్రభకు తృప్తి నిచ్చింది. అది కొన్ని క్షణాలు మాత్రమే. తరువాత యధాప్రకారం ఆలోచనలో పడిపోయింది. ఎటు తేల్చుకోలేకపోతుంది. మనస్సంతా డోలాయమానంగా ఉంది. దీనికి ఒక్కటే పరిష్కారం. రవిని కలుసుకోవాలి. ముఖాముఖి అడగాలి. అప్పుడే అసలు విషయం తెలుస్తుంది. ఆమె మనస్సుకు నెమ్మది కలుగుతుంది.

తృప్తిగా నిటుర్చి పనిలో పడిపోయింది. గంటలో అంతా పూర్తిచేసింది. ప్రింట్ అవుట్స్ కూడా తీసింది. అవన్ని ఫైనాన్షియల్ స్టేట్ మెంట్స్ కంపెని ఆడిటర్ కు పంపించాలి. వాటిని ఫైల్లో పెట్టి డైరక్టర్ చాంబర్ లోకి వెళ్ళింది. "అయిపోయింది సార్. ఇదిగో ఫైలు"అని ఇచ్చింది.

"గుడ్ ధ్యాంక్స్ మేడం. రేపు కావాలనుకుంటే ఒక గంట ఆలస్యంగా రండి. ఏం ఫర్వాలేదు"అన్నాడు డైరక్టర్. ఆయనకు ధ్యాంక్స్ చెప్పి గదిలోంచి బయటకు వచ్చింది. అంతా సర్ది లిఫ్ట్ లో కిందికి దిగింది. పార్కింగ్ స్పేస్ ఖాళీగా ఉంది. ఆమె స్కూటి మాత్రమే ఉంది. కూర్చుని స్టార్ట్ చేసింది.

ఆమె ఇల్లు రవి ఇల్లు ఒకే వైపు ఉన్నాయి. ఎలాగు ఆలస్యం అయింది. ఇంటికి వెళ్ళి వంటచేసుకునే ఓపికలేదు. ఒకసారి రవిని కలిసి అనుమానం తీర్చుకోవాలి. తరువాత ఏదో హోటల్ లో భోజనం చెయ్యాలి.

స్కూటిని రవి ఇంటి ముందు ఆపింది. లోపలికి వెళ్ళింది. ఇంటికి తాళం వేసి ఉంది. ఇంకా రవి రాలేదు. ఏం చెయ్యాలా అని ఆలోచించింది. కలుసుకోకుండ ఇంటికి వెళ్ళాలనిపించలేదు. అందుకే అతనికి కాల్ చేసింది.

"హల్లో ప్రభగారు చెప్పండి. ఎక్కడనుంచి కాల్ చేస్తున్నారు"అడిగాడు నవ్వుతూ.
"మీ ఇంటి దగ్గరనుంచి" అంది తను నవ్వుతూ.

"మైగాడ్ అంటే మా ఇంటి దగ్గర ఉన్నారా. ఐ యామ్ వెరీ సారీ. నేను ఇంకా ఆఫీసులో ఉన్నాను. ఒక అరగంట కాచుకోగలరా, వచ్చేస్తాను" అన్నాడు.

"కాని"అని ఆగిపోయింది.

"మీ ఉద్దేశం అర్ధమైంది. తలుపు పైన తాళం చెవి ఉంది. మీరు లోపల కూర్చోండి. నేను వచ్చేస్తాను. తరువాత ఇద్దరం కలిసి సన్ రైజ్ కాఫీ తాగుదాం."

"అలాగే" అంది ప్రభ.

తరువాత అతను లైన్ కట్ చేశాడు. ప్రభ కూడా సెల్ లోపలపెట్టుకుంది. తలుపుపైన తడిమింది. తాళం చెవి దొరికింది. తాళం తీసి లోపలికి వెళ్ళింది. లోపల చీకటిగా ఉంది. లైటు వేసింది. సోఫాలో కూర్చోబోతూ బెడ్ రూం వైపు క్యాజువల్ గా చూసింది. ఒక బెడ్ రూం

క్రైం సీరియల్

# డెత్ మెసేజ్

ఎప్పుడు తెరిచేఉంటుంది. రెండో బెడ్ రూం రవి ఉపయోగించటం లేదు. అందులో ఇంటి యజమాని సామానులు ఉన్నాయని చెప్పాడు రవి. అందుకే అది ఎప్పుడు తాళం వేసి ఉంటుందని అన్నాడు. కాని ఈ రోజు మాత్రం దానికి తాళం వేసి లేదు. దగ్గరగా వేసి ఉంది.

అందులో ఏం ఉన్నాయో తెలుసుకోవాలనుకుంది. అది క్యూరియాసిటీ కాదు. ఏం తోచక వచ్చిన ఆలోచన అది. బ్యాగ్ సోఫాలో పెట్టి గదిలోకి వెళ్ళింది. అందులో పెద్దగా సామానులు లేవు. ఒక డబుల్ కాట్ మంచం ఒక చెక్క బీరువా ఉన్నాయి. అవి పెద్దగా విలువైన వస్తువులు కావు. వాటికోసం గదికి తాళం వెయ్య వలసిన అవసరం లేదు. ఇంకా లోపలికి వెళ్ళింది ప్రభ. అప్పుడే ఆమె చూపులు గోడమీద పడింది.

అక్కడ మొత్తం మూడు ఫోటోలు ఉన్నాయి. వాటిని జిగురుతో గోడకు అంటించారు. వాటిలో ఒక ఫోటో మీద ఇంటుమార్క్ వేసి ఉంది. అది ఎర్రరంగు పెన్సిల్ తో. ఆ ఫోటో సుయోధనరావుది.

“పని పూర్తయింది సార్. నేను బయలుదేరుతాను” అన్నాడు రవి. ప్రాజెక్ట్ మేనేజర్ నవ్వి”వెళ్ళండి. రేపు సెలవు కదా. హాయిగా రెస్ట్ తీసుకోండి. కావాలనుకుంటే మరునాడు కూడా సెలవు తీసుకోండి. ఏం ఫర్వాలేదు”అన్నాడు.

రవి కూడా నవ్వి “అవసరంలేదు సార్. ఒకరోజు సెలవు చాలు. వస్తాను” అని గదిలోంచి బయటకు నడిచాడు. అంతవరకు మాములుగా ఉన్నాడు అతను. అంతే తరువాత పరుగులాంటి నడకతో కిందికి వెళ్ళాడు. బైక్ స్టార్ట్ చేసి ఇంటికేసి పోనిచ్చాడు. ప్రభను తలుచు కంటే చాల ఉత్సాహంగా ఉంది అతనికి. ఈ అవకాశం కోసమే ఎదురుచూస్తున్నాడు. ఇప్పుడు వచ్చింది.

(ఇంకా ఉంది )

మార్చి నెల సంచికతో సుమతి మీ ఆశిస్సులతో దిగ్విజయంగా మొదటి సంవత్సరం పూర్తి చేసుకుని రెండో సంవత్సరం లోకి అడుగిడబోతోంది. సుమతికి మీ అభినందనలు తెలియచెయ్యండి, ఫోటోతో సహా ప్రచురిస్తాం

అభినందనలు పంపాల్సిన చిరునామా

sumathi.salahaalu@gmail.com

మధుర గీతాలు

# ఆ పాత మధురాలు..



దీకొండ చంద్రకళ

చిత్రం:ప్రేమ

సంగీతం : ఇళయరాజా

సాహిత్యం: వేటూరి

పాడిన వాళ్ళు: చిత్ర ,బాలు

దర్శకత్వం :సురేష్ కృష్ణ

## ఈనాడే ఏదో అయ్యింది .....

ఒక్కో పాట వింటుంటే మనకు ఒక్కో సందర్భం,ఓ సన్నివేశం,ఓ సంఘటన,ఆ పాటతో ముడిపడిన జ్ఞాపకాలు మనకు గుర్తొస్తుంటాయి. పాటలెన్ని ఉన్నా,ఆహ్లాదకరమైన, నిత్యనూతనమైన ఆనందానుభూతులను అందించే ప్రేమ పాటల ప్రత్యేకతే వేరు!అందులో... సినిమా కథల్లో సింహ భాగం ప్రేమకు సంబంధించినవే కావటం మూలాన ప్రేమ పాటలు తప్పనిసరి! అలాంటి వేలకొలది ప్రేమ పాటల్లో విశిష్టమైన సంగీత సాహిత్యాలను,శ్రావ్య గాత్ర మాధుర్యాలను అలదుకొన్న పాట,ఇళయరాజా గారు సంగీతం సమకూర్చిన ఈ ప్రేమ సినిమాలో పాట గురించి ప్రేమికుల రోజు రాబోతున్న సందర్భంగా ముచ్చటించుకుందాం.

# మధుర గీతాలు

# ఆ పాత మధురాలు

2000 సంవత్సరంలో విడుదలైన చిత్రమిది.నాలుగున్నర నిముషాల సేపు చిత్ర మరియు బాలు గారి మాధుర్య గాత్రాలలో ప్రేమపూరితంగా సాగిన ఈ యుగళగీతం ఎన్నిసార్లు విన్నా, ఇంకాసేపు వింటే బాగుండు అన్పిస్తూనే ఉంటుంది.

ప్రేమలో పడగానే మునుపెరుగని భావాలు మనసుని ముప్పిరిగొనడం దాదాపు ప్రతివారికీ అనుభవమే! లోకమంతా కొత్తగా... గాల్లో తేలిపోతున్నట్టుగా... తెలియకుండానే పెదవులపై నవ్వు చిగురిస్తూ...ఇలా చాలానే జరుగుతుంటాయి. దాన్నే పల్లవిలో ఇలా కూర్చారు కవి...

**ఈనాడే ఏదో అయ్యింది**
**ఏనాడూ నాలో జరగంది**
**ఈ అనుభవం మరలా రానిది**
**ఆనందరాగం మ్రోగింది**
**అందాల లోకం రమ్మంది అంటూ.**

మొదటి చరణంలో...
నింగీ,నేలా ఏకం కాగా
ఈ క్షణమిలాగే ఆగింది
కాలమిలా ఆగిపోనీ
అనిపించే క్షణాలు ఎన్నో
...ప్రేమికులకు!నింగీ,నేలకులా దూరాలు,అంతరాలెన్ని ఉన్నా,ఏకమయ్యే హృదయాలు వారివి.

ఒకటే మాటన్నదీ
ఒకటై పొమ్మన్నదీ
ఇరువురిదీ ఒకేమాట,
ఒకే బాటగా సాగే
ఏకాంశ!

మనసే ఇమ్మన్నది
అది నా సొమ్మన్నదీ
అన్నిటికంటే విలువైన సంపదైన మనసును తన ప్రేమికునికి లేదా ప్రేమికురాలికి అందించకుండా ఉండేదెవరు?!




పరువాలు మీటి
న-న-న-న-న
సెలయేటి తోటి
న-న-న-న-న
పాడాలి నేడు
కావాలి తోడు
న-న-న-న-న-న-న-న
అంటూ పాటూరి (వేటూరి)గారి మీటి–తోటి,నేడు–తోడు ప్రాసపదాలు ఇళయరాజా గారి న-న-న సంగీత బాణీకి దీటుగా ఎలా పయనించాయో గమనించండి.

ఇక రెండవ చరణంలో
సూర్యుని మాపి, చంద్రుని ఆపి
వెన్నెల రోజంత కాచింది
పగలే వెన్నెల–జగమే ఊయల కదా ప్రేమికులకు.
పగలూ రేయన్నదీ అసలే లేదన్నది
కలలే వద్దన్నదీ–నిజమే కమ్మన్నదీ
పగలెప్పుడు రాత్రిగా మారిందో
గమనించే తీరిక ఉంటేగా వారికి!
తీయని కలలు నిజమవ్వాలని
కోరుకొని ప్రేమికులుంటారా?!

ఎదలోని ఆశ
ఎదగాలి బాసై
కలవాలి నీవు
కరగాలి నేను
ఆశలుంటే చాలదు. ఆటంకాలకు ఎదురీదాలి.చేసిన బాసలు నిలుపుకోవాలి ప్రేమికులు. అప్పుడే ఇరువురు ఒకటిగా మనగలరు,ఒక్కటై కౌగిలిలో

మధుర గీతాలు

# ఆ పాత మధురాలు

కరగగలరు అని సందేశమిస్తూ ముగుస్తుంది పాట.

అదే ప్రేమ భావాన్ని మన జాతీయభాషలో వెలిబుచ్చారో వినండి.మజ్రూ సుల్తాన్ పురి సాహిత్యంఆనంద్ శ్రీవాత్సవ,మిళింద్ శ్రీవాత్సవ సంగీతంభాషేదైనా ప్రేమికుల భాష ఒకటే కదా!

F. ఓ.ఓ ఓ.. ఓ.ఓ ఓ ఓ... ఓ.ఓ ఓ.. ఓ.ఓ ఓ ఓ....
M. ఈ నాడే ఎదో అయ్యింది... ఏ నాడూ.. నాలో జరగంది...
ఈ.. అనుభవం.. మరలా... రానిదీ...ఈ ఈ ఈ..
ఆనంద రాగం మోగిందీ........ అందాల లోకం రమ్మంది...
F. ఈ నాడే ఎదో అయ్యింది... ఏ నాడూ.. నాలో జరగంది...

BGM

M. నింగీ నేలా... ఏకం కాగా... ఈ క్షణం ఇలాగె ఆ..గింది...
నింగీ నేలా... ఏకం కాగా... ఈ క్షణం ఇలాగె ఆ..గింది...
F. ఒకటే మాటన్నదీ.... ఇ.ఇ.ఇ ఈ ... ఒకటై పొమ్మన్నదీ....
మనసే ఇమ్మన్నదీ.... అది నా సొమ్మన్నది....
M. పరువాలు మీటే F. నన నననన
M. సెలయేటితోటే F. నన నననన
M. పాడాలి నేడు F. నన నననన
M. కావాలి తోడు
F. నననన నననన నననన నననన
నననన ఈ నాడే... ఎదో అయ్యింది...
M - ఏ నాడూ.. నాలో జరగంది...

साथिया तूने क्या किया ?
बेलिया ये तूने क्या किया ?
मैंने किया तेरा इन्तज़ार
इतना करो न मुझे प्यार

साथिया तूने क्या कहा ?
बेलिया ये तूने क्या कहा ?
यूँ ना कभी करना इन्तज़ार
मैंने किया है तुमसे प्यार

इतनी मोहब्बत सह ना सकूँगा
सच मानो ज़िंदा रह ना सकूँगा
तुझको सम्भालूं ये मेरा ज़िम्मा
मैं हूँ तो क्या ग़म जान-ए-तमन्ना
अब जीना मरना मेरा जानम तेरे हाथ है
मैंने कहा ना सनम अब तू मेरे साथ है
तो फिर सम्भाल ये मैं चला
जाना कहाँ आ दिल में आ
साथिया तूने क्या किया ?

ఓ
మంచి
పుస్తకం

చదవాల్సిన పుస్తకం

# ఏడవకు బిడ్డా






పద్మావతి రాంభక్త

ఆ మధ్య నేను చదివిన పుస్తకం ఎ.యం.అయోధ్యారెడ్డిగారు తెలుగులోకి అనువదించిన ఏడవకు బిడ్డా అనే నవల. అసలు నవల పేరు "వీప్ నాట్ చైల్డ్" , రచయిత గుగి వా థియాంగో. ఈయన కెన్యాలో జన్మించారు. కెన్యా, ఉగాండా, బ్రిటన్లలో చదువుకున్నారు. నవలారచయితగా, నాటక రచయితగా, విద్యావేత్తగా, సామాజిక కర్యకర్తగా మొదలైన అనేక రూపాలలో ఆయన సుప్రసిద్ధులు.






కెన్యా రాజధాని నైరోబి విశ్వవిద్యాలయంలో ఇంగ్లీష్ అధ్యాపకుడిగా పని చేస్తున్నపుడు, ఆయన గ్రామీణ ప్రజా నాటకరంగాన్ని అభివృద్ధి చేసినందుకు ప్రభుత్వం ఆగ్రహించింది. దాని పర్యవసానంగా ఆయన ఖైదులో రెండు సంవత్సరాలు గడిపారు. ఇక స్వదేశంలో జీవితం కష్టతరమై అమెరికాలో ప్వాస జీవితం గడపసాగారు.

ప్రస్తుతం ఆయన యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియా అర్వైన్ లో ఇంగ్లీష్, తులనాత్మక సాహిత్యాల శాఖలో ప్రొఫెసర్ గా ఉన్నారు. అంతకు మునుపు ఆయన యేల్, మరియు న్యూ యార్క్ యూనివర్శిటీలో అధ్యాపకులుగా ఉన్నారు. ఆయన కథానిక

సుమారు వంద భాషలలోకి అనువదించబడింది. ప్రతిష్టాత్మక నొబెల్ ప్రైజ్ కు, బుకర్ ప్రైజ్ కు ఆయన పేరు సూచించబడింది. ఇంగ్లీష్ సాహిత్యంలో ఆయన సాధించిన పీ.హెచ్. డి తో పాటు ఎన్నో దేశాల విశ్వవిద్యాలయాలు ఆయనకు గౌరవ డాక్టరేట్ లు ఇచ్చాయి. ఆయన నలుగురు పిల్లలు కూడా రచయితలు.

ఆఫ్రికన్ దేశమైన కెన్యాలో గికుయు జాతి వారు వలస పాలనలో పడ్డ కష్టాల కథే ఈ నవల. దుర్భర పేదరికంలో చదువు గురించి ఆలోచించలేని పరిస్థితిలో కనీసం కుటుంబంలో ఒకరైనా చదువుకుంటే తమ పరిస్థితి మెరుగుపడుతుందని యోకబి అనే స్త్రీ తన కొడుకైన జొరొగొను బడికి పంపాలనుకుంటుంది.

ఆ పసివాడు మధ్యాహ్నం భోజనం తేలేనని తల్లి చెప్పినా పరవాలేదంటూ చదువు గురించి కలలు కంటుంటాడు. నుగొతో పెద్ద భార్య జెరీ. వారికి కొడుకులు ముగ్గురు. వారి పేర్లు బోరో, కోరి, కామౌ. రెండవ భార్య యోకబి. వారి మొదటి సంతానం వాంగీ యుద్ధంలో చనిపోతాడు. ఆ తరువాత వాడే జొరొగొ. నుగొతో ఇద్దరు భార్యలు కలిసిమెలిసి ప్రేమగా ఉంటారు.

బోరో కూడా యుద్ధంలో పాల్గొని వచ్చాడు. అతడు తాగినపుడు మేమంతా యుద్ధంలో ఎవరి కోసం పాల్గొన్నాం? ఒక తెల్లవాడి బారి నుండి రక్షించడానికి మరొక తెల్లవాడికి మద్దతుగా పోరాడాం. ఎన్నెన్నో త్యాగాలు చేసాం అని కోపంగా అరుస్తూ నల్లజాతీయుల తెలివితక్కువతనాన్ని ఎత్తి చూపుతాడు. తల్లి ఇచ్చిన బడి దుస్తులతో ఆనందంగా స్కూల్ కి వెళ్ళిన జొరొగొని అక్కడ చదివే పిల్లలు ఎగతాళి చేస్తారు. కానీ అక్కడ విహోకి అనే ధనవంతుల పిల్ల అతడితో స్నేహం చేస్తుంది.


జొరొగోని అల్లరి చేసే పిల్లలను తరిమి కొడుతుంది. విహోకి తండ్రి కూడా నల్ల జాతీయుడే కానీ కాస్త ధనవంతుడు. పేద ధనవంతుల మధ్య తారతమ్యాలు తెలియడం వల్ల జొరొగొ విహోకితో కాస్త దూరంగా మెలుగుతాడు. తెల్లవాళ్ళు వచ్చి తమ భూములన్నిటినీ ఆక్రమించి తమ

## ఓ మంచి పుస్తకం

చేతే ఊడిగం చేయించడం లాంటి విషయాలన్నీ అన్నల ద్వారా మరియు తండ్రి ద్వారా జొరొకి అర్ధమవుతాయి. ఇంట్లో అందరూ పనీ చేస్తూ తనని మాత్రం చదివిస్తున్నారని జొరొకి తెలుసు. తను బాగా చదువుకుంటే తన వాళ్ళ పరిస్థితి మెరుగుపడచ్చు అని కూడా అతడు తెలుసుకుంటాడు. అందుకే అతడు కష్టపడి చదువుకుంటూ ఉంటాడు.

నవలలోని కథ ఇలా సాగుతుంది. తెల్లవాళ్ళ సామ్రాజ్యంలో నల్లవారిపై చూపే వివక్ష చాలా బాధాకరంగా ఉంటుంది. ఆ బానిసత్వంలో మగ్గిపోతున్న గికుయు జాతివారు మంచి రోజుల కోసం నిరీక్షిస్తుంటారు. వలస పాలనలో దుర్మార్గనికి బలై, తమ వారే దళారీలుగా మారి తెల్లవారితో పాటు పెత్తనం చేస్తుంటే తన చుట్టూ ఉన్న సమాజం, కుటుంబంతో పాటు గ్రామం ఎలా ధ్వంసమయ్యాయో తెలుసుకున్న ఒక పిల్లవాడు ఇంగ్లీష్ విద్య ద్వారా పొందిన ఆధునిక చైతన్యంతో తనవారైన నల్లవారి కష్టాలను పరికించి తెలుసుకున్న కథనం ఇది.

ఒకవైపు వలస పాలనను కూలదోయడానికి సాయుధపోరాటమే సరైనది అని అతడి అన్న ఆలోచన. కానీ అది




సరైనది అవునో కాదో తేల్చుకోలేని అనిశ్చితిలో నలుగుతాడు యువకుడైన జొరొ. ఈ కన్నీటి కథ చదివితే చుట్టూ ఉన్న ప్రపంచం తెలుస్తుంది. తెలుసుకోవలసిన బాధ్యత కూడా మనకు ఉంది.

***

మార్చి నెల సంచికతో సుమతి మీ ఆశిస్సులతో దిగ్విజయంగా మొదటి సంవత్సరం పూర్తి చేసుకుని రెండో సంవత్సరం లోకి అడుగిడబోతోంది. సుమతికి మీ అభినందనలు తెలియచెయ్యండి, ఫోటోతో సహా ప్రచురిస్తాం

అభినందనలు పంపాల్సిన చిరునామా

sumathi.salahaalu@gmail.com

చూడాల్సిన సినిమా

ఆణిముత్యాలు

# నేరు

## మళయాళ చిత్రం



ఈదర శ్రీవిద్య



మలయాళంలో మోహన్ లాల్, డైరెక్టర్ జీతూ జోసెఫ్‌లది సక్సెస్ ఫుల్ కాంబినేషన్. వీరిద్దరి కలయికలో వచ్చిన దృశ్యం, దృశ్యం -2 చిత్రాలు బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్స్‌గా నిలిచాయి. ఈ సక్సెస్‌ఫుల్ కాంబినేషన్‌లో వచ్చిన మలయాళం చిత్రం నేరు

కథ :

సారా (అనాశ్వర రంజన్) ఓ అంధురాలు. పన్నెండేళ్ల వయసులోనే కంటిచూపుకోల్పోతుంది. తండ్రి ద్వారా బొమ్మలు తయారు చేయడం నేర్చుకుంటుంది. చేతుల ద్వారా మనిషి ముఖ రూపురేఖలను అంచనా వేసి సరిగ్గా వారి బొమ్మను తయారు చేయగలిగే ప్రతిభ సారాకు ఉంటుంది. ఓ రోజు సారా తల్లిదండ్రులు బ్యాంకుకు వెళతారు.

ఇంట్లో ఒంటరిగా ఉన్న సారాను మైఖేల్ (శంకర్) అనే యువకుడు రేప్ చేస్తాడు. సారా తయారు చేసిన బొమ్మ ద్వారా మైఖేల్ పోలీసులకు దొరికిపోతాడు. మైఖేల్ తండ్రి పెద్ద బిజినెస్‌మెన్ కావడంతో కొడుకును రేప్ కేసు నుంచి బయటపడేసేందుకు సుప్రీంకోర్టు లాయర్ రాజశేఖర్‌ను (సిద్ధిఖీ) రంగంలోకి దింపుతాడు. రాజశేఖర్‌కు భయపడి సారా తరపున వాదించడానికి లాయర్లు ఎవరూ ముందుకు రారు. రాజశేఖర్ కారణంగా ఐదేళ్లు బార్ కౌన్సిల్ నుంచి సస్పెండ్ అయిన విజయ్ మోహన్ (మోహన్ లాల్) సారా తరపున కోర్టులో వాదించడానికి సిద్ధమవుతాడు.

మైఖేల్ నిర్దోషి అని ప్రూవ్ చేయడానికి రాజశేఖర్ పలు అబద్ధపు సాక్ష్యాలు సృష్టిస్తాడు. రాజశేఖర్ పన్నాగాన్ని విజయ్ మోహన్ ఎలా తిప్పికొట్టి ,అతను చెప్పినవన్నీ అబద్ధాలు అని కోర్టులో ప్రూవ్ చేస్తాడు .

మోహన్‌లాల్, జీతు జోసేఫ్ కాంబినేషన్‌లో వచ్చిన సినిమాలన్నీ న్యాయం కోసం బలవంతుడితో సామాన్యుడు సాగించే పోరాటం చుట్టూ నడుస్తుంటాయి. నేరు కూడా

## చూడాల్సిన సినిమా

# ఆణిముత్యాలు

ఆ కోవకు చెందినసినిమానే. గత సినిమాలకు భిన్నంగా కొత్త బ్యాక్‌డ్రాప్‌లో జీతూ జోసెఫ్ సినిమాను తెరకెక్కించాడు.

దృశ్యం తరహాలో ట్విస్ట్‌లు, టర్న్‌లు ఊహించి సినిమా చూస్తే మాత్రం డిజపాయింట్ అవుతారు. రాజశేఖర్ వేసిన ప్లాన్స్‌ను విజయ్ మోహన్ తన తెలివితేటలతో చిత్తు చేసే సీన్స్‌ను డైరెక్టర్ సింపుల్‌గా రాసుకున్నాడు.
మెయిన్ ట్విస్ట్ చిరంజీవి ముఠామేస్త్రి సినిమాను గుర్తుకుతెస్తుంది.
కథ నడిచే తీరు ఆర్ట్ సినిమాను తలపిస్తుంది

కంప్లీట్ కోర్టు రూమ్ డ్రామాగా నేరు మూవీ సాగుతుంది. ఓ నిస్సహాయురాలైన అంధురాలికి జరిగిన అన్యాయంపై పోరాడే ఓ లాయర్ కథతో ఎంగేజింగ్ డ్రామాగా నేరు మూవీని తెరకెక్కించాడు జీతూ జోసెఫ్.

అబద్దాలతో కేసు గెలవాలని ప్రయత్నించే లాయర్ ఓ వైపు... నిజం కోసం పోరాడే లాయర్ మరోవైపు...ఒకరిపై మరొకరు వేసే ఎత్తులు పై ఎత్తులతో నేరు మూవీ థ్రిల్లింగ్‌ను పంచుతుంది. కోర్టుల్లో సామాన్యుడికి న్యాయం అందుతుందా? న్యాయ వ్యవస్థను డబ్బు, అధికారం ఎలా ప్రభావితం చేస్తున్నాయనే సందేశాన్ని అంతర్లీనంగా నేరు మూవీలో చూపించాడు డైరెక్టర్ జీతూ జోసెఫ్.

కోర్ట్ రూమ్ డ్రామా కాన్సెప్ట్‌తో గతంలో పవన్ కళ్యాణ్, అజిత్ వంటి స్టార్ హీరోలు సినిమాలు చేశారు. కానీ వాటికి భిన్నంగా రియలిసిక్‌గా నేరు సినిమా సాగుతుంది. , ఫైట్లు, పాటలు, కామెడీ ట్రాక్ వంటి కమర్షియల్ హంగులు లేకుండా నిజంగానే కోర్టు వాదనలకు కళ్ల ముందు చూస్తున్న అనుభూతిని కలిగించేలా నేరు సినమాను తెరకెక్కించాడు డైరెక్టర్ జీతూ జోసెఫ్

మోహన్ లాల్ తో పాటు ప్రతి పాత్రకు సమ ప్రాధాన్యత ఇస్తూ సినిమాను తెరకెక్కించాడు డైరెక్టర్ జీతూ జోసెఫ్. మోహన్ లాల్ క్యారెక్టర్ కథ ప్రారంభమైన అర్ధగంట తర్వాతే ఎంట్రీ ఇస్తుంది. విజయ్ మోహన్ పాత్రలో మోహన్ లాల్ చెలరేగిపోయాడు. కోర్టులో అతడు చెప్పే డైలాగ్స్ క్లాప్స్ కొట్టేలా ఉంటాయి. అపోజిషన్ లాయర్‌ను ఓడించడానికి అతడు వేసే ఎత్తుల నుంచే మోహన్‌లాల్‌లోని హీరోయిజాన్ని డిఫరెంట్‌గా పండించాడు డైరెక్టర్.




మోహన్ లాల్ తో సమానంగా సిద్ధిఖీ పాత్ర సాగుతుంది. డబ్బు కోసం దోషిని కాపాడేందుకు ప్రయత్నించే కన్నింగ్ లాయర్‌గా డైలాగ్స్‌తోనే చక్కటి విలనిజాన్ని పడించాడు. ప్రియమణి గెస్ట్ రోల్ మాదిరిగానే అనిపిస్తుంది. ఆమె పాత్రకు పెద్దగా ఇంపార్టెన్స్ లేదు. సారాగా అనస్వర రాజన్, ఆమె తల్లిదండ్రులుగా జగదీష్, శ్రీధన్య యాక్టింగ్ బాగుంది.

★★★

కబుర్లు

# క్రాస్ రోడ్స్ కబుర్లు

జి .అనుదీప్

**కృష్ణరాయబారం–చింతామణి**



అడ్డ రోడ్డు దగ్గర ఆదివారాల్లో రేడియోలో వచ్చేనాటకాలు వినటానికి, చుట్టు పక్కల ఊళ్ళలోని జనం గుంపులు గుంపులుగా పోగవ్వటం మొదలెట్టారు. నాటకాలుం వినటానికి ఇంత మంది, ఉత్సాహం చూపిస్తుంటే, ఇక అవే నాటకాలను కళ్ళ ముందు ప్రదర్శిస్తే ఎలావుంటుంది అని చుట్టు పక్కల ఊళ్ళలోని పెద్ద తలకాయలు ఆలోచించ సాగాయి, ఆలోచించటమే తరువాయి. అడ్డరోడ్డు సెంటర్లో నాటకాలు ప్రదర్శించటానికి చక చకా ఏర్పాట్లు జరిగిపోయాయి. ఆ రోజుల్లో నాటాకాలు ప్రదర్శించటానికి, ఈ రోజుల్లోలా ప్రత్యేకంగా ఉడిటోరియంలు వుండేవి కావు, ఉళ్లోని పెద్ద కాపుల పోలాల్లో నాటాకాలు ప్రదర్శించేవారు. ఖాళీ పొలాల్లో చుట్టు తడికలు కట్టి, కర్రలు, చెక్కలతో పెద్ది స్టేజి వేసి నాటకాలు ఆడేవాళ్ళు.

కబుర్లు


# కృష్ణరాయబారం-చింతామణి

నాటకాలు రాత్రి తొమ్మిది గంటలకు మొదలు పెడితే, తెల్లవారు ఝామున ఏ ఐదింటికో ముగిసేవి .సుదీర్ఘంగా ఏడు,ఎనిమిది గంటలు జరిగే ఈ నాటకాలు చూడటానికి , భోజనాలు వండుకుని మరీ కుటుంబాలకు కుటుంబాలు పెద్ద ఎత్తున బళ్ళు కట్టుకుని వచ్చి చూసే వాళ్ళు. పిల్లపీచు అక్కడే నిద్రపోతే పెద్దవాళ్ళు మాత్రం నిద్ర కాచుకుని మరి నాటకాలు చూసే వాళ్ళు

ఆ రోజుల్లో సాంఘిక నాటకాలు కన్నా. పౌరాణిక నాటకాలనే ఎక్కువ ఆదరణ వుండేది. పాదుకా పట్టాభిషేకం శ్రీకృష్ణ రాయభారం, రామాంజనేయ యద్ధం శ్రీకుష్ణ తులాభారం వంటివి ఎక్కువగా ప్రదర్శించేవాళ్ళు. ప్రతి నాటకం లో ఇద్దరు, ముగ్గురు నటులు, నటీమణులు వుండేవాళ్ళు.

'శ్రీకృష్ణ రాయబారం' లో ముఖ్యంగా మూడు పాత్రలే వుండేవి, శ్రీకృష్ణుడు ,దుర్యోధనుడు , అర్జునుడు. ఈ పాత్రలను పోషించటానికి ముగ్గురు, నలుగురు నటులుండే వాళ్ళు. ఉదాహారణకృష్ణ పాత్రను రాత్రి తొమ్మిది నుండి అర్ధరాత్రి) వరకు ఒక నటుడు నటిస్తే. రెండవ అతను అర్ధరాత్రి పన్నెండు గంటల నుండి తెల్ల వారు ఝామున మూడుదాకా, మూడవ అతను అక్కడి నుండి ఉదయం ఆరుగంటల దాకా కొన సాగించే వాడు. అందుకనే, వాళ్ళను ఒకటో కృష్ణుడు, రెండో కృష్ణుడు, ముడోకృష్ణుడు అని పిలిచే వాళ్ళు నాటకాల ప్రోస్టర్ల మీదకూడా వాళ్ళ పేర్లు అలాగే ముద్రించేవాళ్ళు.

మహాభారతంలోని



కృష్ణరాయబార ఘట్టం చాలా రసవత్తరమైన ఘట్టం, ముఖ్యంగా తెలుగువారికి. రాయబార పద్యాలు తెలుగువారి జీవితాల్లో భాగమై పోయాయి. అవి నోటికి రాకపోయినా వినని వారు ఎవరూ ఉండరు. 'పాండవోద్యోగ విజయాలు'గా తిరుపతివెంకట కవులు నాటకీకరించినపుడు అద్దిన సొబగుల గురించి చెప్పాలంటే పెద్ద గ్రంథం అవుతుంది. 'శ్రీ కృష్ణ రాయబారం'. తిరుపతి వెంకట కవులు రచించిన "పాండవోద్యోగం' అనే కావ్యానికి అనుకరణ. పాండవోద్యోగం లోని పద్యాలను, శ్రీకృష్ణ రాయబారం నాటకం లో యధాతథంగా వాడే వాళ్ళు.

సంస్కృత ఇతిహాసం అయిన మహాభారతం యొక్క కథ ఆధారంగా రూపొందించబడింది . పాండవులు మరియు కౌరవుల మధ్య యుద్ధాన్ని నివారించడానికి కృష్ణుడు ఒక దూతగా వ్యవహరిస్తాడు . కృష్ణుడు తన రాజభవనంలో నిద్రపోతున్నప్పుడు ద్వారక సన్నివేశంతో నాటకం ప్రారంభమవుతుంది . రాబోయే యుద్ధంలో అతని సహాయం కోరేందుకు దుర్యోధనుడు మరియు అర్జునుడు వస్తారు. కృష్ణుడు తనను తాను ఒక వైపు మరియు అతని మొత్తం సైన్యాన్ని మరొక వైపు ఉంచాడు మరియు అర్జునుడిని ముందుగా ఎన్నుకోమని అడుగుతాడు. తాను యుద్ధంలో పాల్గొననని వాగ్దానం చేస్తాడు. అర్జునుడు తన సారథిగా యుద్ధంలో కృష్ణుని ఉనికిని కోరుతూ ప్రతిస్పందిస్తాడు. దుర్యోధనుడు సంతోషంగా కృష్ణుడి సైన్యాన్ని తన వైపుకు తెచ్చుకుంటాడు

## కబుర్లు

# కృష్ణరాయబారం–చింతామణి

ముఖ్యంగా శ్రీ కృష్ణ పాత్రధరించిన ఈలపాట రఘురామయ్య గారి కంఠం నుండి ఈ పద్యాలు జాలు వారుతుంటే, అద్భుతమైన ఆయన గాన మాధుర్యాన్ని ఆస్వాదించటానికి రెండు చెవులు సరిపోయేవి కావు,

సి ఎస్ ఆర్ ఆంజనేయులు , బందా కనకలింగేశ్వర రావు, ఏ.వి. సుబ్బారావు వంటి వాళ్ళు కూడా కృష్ణ పాత్రకు ప్రాణం పోశారు. ఇక అర్జున పాత్రలో పులిపాటి వెంకటేశ్వర్లు, పులిపాక వెంకటప్పయ్య, కలప్రు వెంకటేశ్వర్లు; దుర్యోధనుడుగా మాధవపెద్ది వెంకట్రామయ్య, వేమూరి గగ్గయ్య, ధూళిపాళ, ఆచంట వెంకటరత్నం నాయుడు; ధర్మరాజుగా పి.సూరిబాబు, అద్దంకి శ్రీరామమూర్తి, కందుకూరి చిరంజీవరావు; భీముడుగా వేమవరపు శ్రీధర రావు వంటివారు పేరుగాంచారు.

శ్రీకృష్ణ రాయబారం 1960లో చంద్రికా పిక్చర్స్ పతాకంపై వై.వి. రామానుజం తెలుగు సినిమాగా తీశారు. ఇందులో కళ్యాణం రఘురామయ్య , పువ్వుల సూరి బాబు , గుమ్మడి , మరియు తాడేపల్లి లక్ష్మీకాంత రావు నటించారు . పి.సూరిబాబు ఈ చిత్రానికి సంగీతం అందించడంతో పాటు కొన్ని పద్యాలను అందించారు.

శ్రీకృష్ణ రాయబారం సినిమాలో (1960) శ్రీకృష్ణ పాత్రధారి



పద్మశ్రీ ఈలపాట రఘురామయ్య గారు పాడిన పద్యాలుశ్రీ తిరుపతి వెంకటకవులు రచియించిన "పాండవోద్యోగము లోనివి అన్న విషయం తెలిసినదే. ఈ పద్యాలు ఎన్నోమార్లు ఘంటసాల గారి గళంలో ఏదో ఒక రూపంలో వింటూనేవుంటాము. కానీ" రఘురామయ్య గారి గళంలో చాలా అరుదుగా వినబడుతూ ఉంటాయి.

రఘురామయ్యగారు పాడిన 21 పద్యాలు అద్భుతమైన ఆయన గాన మాధుర్యాన్నికలిగి ఉంటాయి

జెండా పై కపిరాజు, చెల్లియో చెల్లకో, అలుగుటయే ఎరుంగని మహామహితాత్ముడజాత శత్రువ అలిగిననాడు.... మొదలైన కృష్ణరాయబారం పద్యాలతో తెలుగువారి గుండాలను ఊయలలలూపిన వారు తిరుప వేంకటకవులు. ఇక వీరిలో ఒకరైన చెళ్లపిళ్ళ వేంకటశాస్త్రిగారు కవిసమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారికి, పరిశోధక పరమేశ్వరులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారికి స్వయానా గురువులు కూడా, శతావధాని మహాపండితుడు, విఖ్యాత కథకులు అయిన శ్రీ వేలూరి శివరామశాస్త్రి గారు కూడా ఈ తిరుపతి వేంకటకవుల శిష్యులే. ఇక ఈ తిరుపతి వెంకట కవులు చేసిన అవధానాలు, ఆశువుగా చెప్పిన వందలకొలది. పద్యాలు తెలుగునాట ఎక్కడో ఒకచోట ఇప్పటికీ వినబడుతూనే ఉంటాయి. ఒకసారి గద్వాల్ సంస్థానంలో అవధానం చేశారు



ఈ మహాకవులు. ఆ సందర్భంలో గద్వాల్ రాజావారు వారితో..
"స్త్రీలకు రతికేళిక ఉపకరించే అందాలన్నీ ముందువైపే ఉండగా, ఎంతో సొగసైన జడమాత్రం వెనుక వైపు ఎందుకు ఉందంటారు" అని ప్రశ్నించారు. దానికి సమాధానంగా తిరుపతి వేంకట కవులు చెప్పిన పద్యములేమిటో చూద్దాం..

1. వాటిలో కొన్ని పద్యాలు మీకోసం


చెల్లియొ చెల్లకో తమకుఁ జేసిన
యెగ్గులు సైచి రందఱుం దొల్లి,
గతించె, నేడు నను దూతగఁ బంపిరి
సంధి సేయ; నీ పిల్లలు పాపలుం
బ్రజలు పెంపువహింపగఁ బొందుఁ
జేసెదో!యెల్లి రణంబుఁ గూర్చెదవొ!
యేర్పడఁ జెప్పుము కౌరవేశ్వరా

2. జండాపై కపిరాజు ముందు
సీతవాజిస్రేనియున్ కూంచి నే

దండంబున్ గోనితోలు స్యందనము
మీదన్ నారి సారించుచున్
గాండీవంబు ధరించి ఫల్గునుడు
నీ మూకన్ చెందుచున్నప్పుడు
ఒకండును ని మోర ఆలకింపదు
కురుక్షానాద సంధింపగన్

3. అలుగుటయే యెరుంగని
మహామహితాత్ముడు
అజాతశత్రుడేఅలిగిననాడు
సాగరముల్లన్ని ఏకముగాకపోవు
కర్ణులు పది వేవురైనను నొత్తురు
సత్తురు రాజరాజా నాపలుకులు
విశ్వసింపుము విపన్నుల
లోకులగావు మెల్లరన్

(ఇంకా ఉంది )





యూత్
సీరియల్

# పరుగులు తీసే నీ వయసునకు ..!

## సీరియల్



యలమర్తి అనూరాధ

తర్వాత " డోనా పౌలా" బీచ్ కి ప్రయాణం కట్టారు. రోడ్డుకు రెండు వైపులా పొడవైన వృక్షాలు అందాన్నే కాక చల్లని గాలిని కూడా అందిస్తుంటే అందరికీ ఎంతో హాయిగా అనిపించింది.ఈ బీచ్ లో జూదం ఆడే బల్లలాగా ఉండి నాలుగు వైపులలో ఒక వైపు క్రిందకు మెట్లున్నాయి. ఆ మెట్లు అన్నీ దిగి నీళ్ళలో కాళ్ళు తడుపుకుంటూ ఉంటే ఆ నిముషాన ధృతి కయితే చిన్న పిల్ల అయిపోయినట్లు అనిపించింది. అక్కడే ఉన్న పార్క్ లోని పువ్వులను కొన్ని విడదీసి ఆ నీటిలో వేసింది. అందులో కొన్ని పువ్వులు ముందుకీ , కొన్ని వెనుక వైపుకు నీళ్లలో వెళుతుంటే కొంత మంది జీవితాలు కూడా ఇంతేగా అనిపిస్తే తన ఆలోచనలకు తానే మనసులోనే నవ్వుకుంది .

యూత్ సీరియల్

# పరుగులు తీసే నీ పయనానికి

## జరిగిన కథ

ధృతి ఇంజనీరింగ్ కాలేజిలో చేరుతుంది. కాలేజిలో రాగ్గింగ్ గురుంచి ఆందోళన చెందుతుంది .కాలేజిలో తన మొదటి రోజు అనుభవాలాను తన తల్లి, అన్నలతో పంచుకుంటుంది ధృతి. కాలేజిలో ధృతి కి ప్రవాహ పరిచయం అవుతుంది.పక్కింటి ప్రభాకర్ కూతురు సరసు కనిపించకుండా పోతుంది. ధృతి వెతకటానికి బయలుదేరుతుంది .సరసు ఒక ఆటో డ్రైవర్ తొ వెళ్లిందని తెలిసి ప్రభాకర్ దంపతులు బాధపడతారు . తిరిగి వచ్చిన సరసును ఆమె బావ బర్త్ కిచ్చి పెల్లిచేస్తారు . ధృతి కి సామ్రాట్ , కృపాల్ , బాంధవ్ స్నేహితులవుతారు .ధృతి , సామ్రాట్ సి .ఆర్ లు గా ఎన్నుకోబడతారు . వారి ఆరుగురి స్నేహం మరింత బలపడుతుంది . కాలేజిలో ఫెస్ట్ జరుగుతుంది . హీరో రాకేశ్ ను గెస్ట్ గా పిలుస్తారు .అందారు ఫెస్టులోఆది పాడి ఆనందంగా గడుపుతారు . పని మనిషి గంగ లంకెబిందలు కోసం ఒ స్వామిజిని ఆశ్రయిస్తుంది . ప్రవాహ , అనన్య పబ్బుకు వెళతారు . ఆ అలవాటు మనుకోమని సలహా ఇస్తుంది ధృతి.ధృతి చిన్నాన్న కూతురు హర్షిత ప్రేమ వివాహం చేసుకుంటుంది .కాని కట్నంకోసం వేధించటం తో ఇంటికి తిరిగి వచ్చేస్తుంది . ధృతి కృపాల్ కి మరింత దగారవుతుంది .కాలేజిలో అందరు కలసి బొంబాయి టూర్ కి బలుదేరతారు అక్కడ చూడాల్సిన ప్రదేశాలన్నీ చూసి , షాపింగ్ చేసి చాల అందంగా గడుపుతారు

ప్రక్కనున్న మరో పార్కుల్లోకి వెళ్ళగానే ఇద్దరి బొమ్మలు అందరినీ ఎంతో ఆకర్షించాయి. అవి ఒకరు చూపిస్తున్నట్లుగా మరొకరు చూస్తున్నట్లుగా చెక్కారు. అక్కడే పార్కులోకి అహ్వానిస్తున్నట్లు అర్ధ చంద్రాకారంలో ఓ లత ప్రాకి ఉంది. పైకి మెట్లు ఎక్కి వెళితే ఒక మండపం. దాని ముందు విశాలమైన వరండా. పూలమొక్కలతో ఎంతో రమణీయంగా ఉంది. అక్కడి నుంచీ ప్రవహిస్తున్న నీటిని చూస్తుంటే మరెంతో ముచ్చట వేసింది. పాల నురుగుకంటే తెల్లనైన అలలు గుహలలో ఉన్న కొండలలోకి చొచ్చుకుపోతున్నాయి. నేను ముందు నేను ముందు అని పరుగు పందాలు వేసుకున్నట్లే పరుగెడుతున్నాయి కెరటాలు ..

ఇంతలో 'పదండి, పదండి' అని గాయత్రి అనటంతో అందరూ ఆ బీచ్ కి వీడ్కోలు పలికారు. ఇక ఆ పయనం" మిరామార్" బీచ్ కే. ఇక్కడ చేరేటప్పటికి సాయం సమయం అయింది. ఈ బీచ్ లో సూర్యాయాస్తమయం చూడాలనే చాలా మంది వస్తారని గాయత్రి చెప్పి ఉండటంతో అందరూ ఆశక్తిగా దానినే గమనిస్తున్నారు. అక్కడ నుంచీ చేప ఆకారం కనిపిస్తుంటే అటు కదిలారు. చేప నోరే ద్వారము. ఇలా వెళ్లి అలా వెనుకనుంచే బయటకు వచ్చెయ్యచ్చు. ఎంతో సహజంగా నిజంగా ఓ పెద్ద చేప అక్కడ ఉందేమో అనిపిస్తోంది. దీని వెనకనే ఓ రాకెట్. ఏ నిముషానయినా ఎగిరి పోతాను అన్నట్లు.

దానికి అటు వైపు ఇటు వైపు మెట్లు ఉన్నాయి. అవి ఎక్కితే చుట్టూ ఉన్న రెస్టారెంట్లు కనిపిస్తున్నాయి . ఆ సాయం సంధ్యలో సరుగుడు చెట్లు వీచే గాలి స్పర్శను అనుభవిస్తూ అలా అందరూ నడవటం ఏదో అద్భుతాన్ని తిలకిస్తున్నట్లే ఉంది. సూర్య భగవానుడు నేను వెళ్ళి పోతున్నానని చెబుతున్నట్లుగా ఆకాశమంతా ఎర్రని రంగుని పులిమాడు .ఆ ఎరుపును మరింత ఆకర్షణీయంగా ఉండటానికన్నట్లు తనూ పూసుకున్నాడు. దూరాన ఉన్న కొండ మీద లైటు మినుకు మినుకు మంటూ నక్షత్రాలతో పోటీ పడుతోంది. నీలి నీరు, బంగారు

యూత్ సీరియల్

# పరుగులు తీసే నీ వయసునకు ..!

ఇసుక తమ ప్రసిద్ధిని తెలుపుతున్నట్లు మరీ మరీ మెరిసిపోతున్నాయి. ఈ బీచ్ కిదే గొప్పతనం.అక్కడే ఉన్న ఒక విగ్రహం ధృతీ కి ఎంతో నచ్చింది.

ఇద్దరు భారతీయ పుత్రులు తమ స్వహస్తాలతో భారతీయ జెండాను పట్టుకుని నుంచోవడం. దాని చుట్టూ నీళ్ళు, మళ్లీ దాని చుట్టూ మొక్కలు, వాటిని పాడు చెయ్యకుండా కంచె. వీటి చుట్టూ కూర్చోవటానికి దిమ్మెలు. మొత్తానికి ఆ ప్రదేశం అందరికీ ఎంతో నచ్చింది.

ఆరోజు గదికి రాగానే స్నానం చేసి అమ్మకు ఫోను చేసింది. "హలో!". అన్న మధురిమ గొంతు వినగానే ప్రాణం లేచి వచ్చినట్లయింది ధృతికి.



'అమ్మా! అంతా ఎలా ఉన్నారు?

"అందరం బాగున్నాం ధృతీ ! నీ ట్రిప్ ఎలా ఉంది అనే మాట్లాడుకుంటున్నాం. నీ దగ్గర నుంచి ఫోను ఎప్పుడు వస్తుందా ఎప్పుడు ఆ కబుర్లు అన్నీ చెబుతావా అని ఎదురు చూడటం తోనే సరిపోతోందనుకో మాకు.

"స్నేహితులతో కదమ్మా సరదాగా బాగానే ఉంది. కానీ మీరంతా కూడా ఉంటే ఇంకా బాగుండేది అని మరీ మరీ అనిపిస్తోంది. మీకు దూరంగా ఉండటం కూడా కష్టంగానే ఉంది"

"భలే దానివే. మేమంతా ఎందుకు పానకంలో పుడకల్లా. రోమన్ లో ఉన్నప్పుడు రోమన్ లా ఉండాలని అదేదో సామెత ఉందిగా. అలా ఎక్కడ ఎవరితో ఉంటే వాళ్ళతో సంతోషంగా గడపాలన్నది నా సిద్ధాంతం"

"పోమ్మా ! నువ్వలా ఉండగలవేమో. నేను మాత్రం ఉండలేను. నాకు మాత్రం అందరూ ఉండాలనే అనిపిస్తుంది"

'సరేలే .నాన్న ఏం చేస్తున్నారు? "

"అందరూ ఇక్కడే ఉన్నారు. స్పీకర్ ఆన్ చేసాను. అంతా వింటున్నారు కూడా"

"ఓ ! భలే మంచి పని. అందరికే హాయ్ రా!

అన్నారు అంతా ఒకే సారి.

"నిన్న నువ్వు ఫోను చెయ్య లేదు. అందరం దిగులుగా కూర్చున్నాం. తెలుసా?' అన్నాడు ధర్మ తేజ

"ఓ ! అవునా ! నిన్న అలిసిపోయాను. ఏ మాత్రం ఓపిక లేదు. అందుకే ఈ రోజు వెంటనే చేసేసా. మీ అందరితో మాట్లాడాకే నిద్రపోవాలని"

"బీచ్ ల లో వాళ్ళు బ్రతికారా ? నీ ధాటికి ఎగిరిపోయారా?"వరుణ్ ప్రశ్నకు

"ఫో! చిన్నన్నయ్యా ! నువ్వు మరీనూ!"

"ఫర్లేదులే చెప్పు. నిన్నేం అనం లే" పెద్దన్నయ్య వెనుకనుంచి

"అమ్మా! చూడవే ! అన్నయ్యలు ఏడిపిస్తున్నారు...." గుణిసింది ధృతి

"అబ్బా! ఊరుకోండిరా!" సన్నగా విసుక్కుంది మధురిమ.

"నోట్లో వేలు పెడితే కొరక లేదు. అలాగే లేవే "

"అత్తయ్యా ! నానమ్మా ! నేను లేకపోతే మీకు బోర్ కొడుతోందా?"

"అవునే ధృతి, నువ్వు లేక ఇల్లంతా చిన్న బోయింది.సందడే లేదు. రోజూ అత్తయ్య కూడా అదే మాట.

యూత్ సీరియల్

# పరుగులు తీసే నీ వయసునకు

“వీళ్ళంతా ఇలా అంటున్నారు కానీ రోజులు లెక్కపెడుతున్నారు నువ్వు ఎప్పుడు వస్తావా అని “

“వచ్చేస్తా. నీ ఆరోగ్యం జాగ్రత్త నానమ్మా!”

“అలాగే “

“అత్తయ్యా! నీ కబుర్లు ఏమిటి ?”

“నువ్వు ఉంటేనే ఏ కబుర్లు అయినా. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంటోంది. అందరూ మాటలు రాని వాళ్ళలా అసలు మాట్లాడుకోవటం లేదు అంటే నమ్ము”

“అత్తయ్యా! నువ్వు కూడా అబద్ధాలు చెబుతున్నావా నన్ను వెక్కిరించటానికి”

“లేదు బంగారం. నిజం చెబుతున్నాను. నువ్వు వెళ్ళిన దగ్గర నుంచీ నిశ్శబ్దం విలయతాండవం చేస్తోంది అంటే నమ్మాల్సిందే”

“దాన్ని బద్దలు కొట్టటానికి వచ్చేస్తాలే. బెంగపెట్టుకోకు. ఇలా చెబుతున్నావే కానీ మీ అందరి మీద నాకు చాలా చాలా బెంగగా ఉంది”

“సరే! చక్కగా నిద్రపో.లేదంటే వాళ్ళు బయటకు వెళ్ళాలని నీ నిద్ర చెడ గొట్టేస్తారు “ అంది చిన్న వదిన.

“అవును వదినా. ప్రొద్దున్నే లేపేస్తున్నారు “

“మరి అన్నీ మీకు చూపించాలిగా ‘’

.

“ఇక ఉండమా ధృతీ “

“అలాగే అమ్మా ! “

“నువ్వు ఎక్కువ సేపు మాట్లాడక పోయినా ఫరవాలేదు. ఒక్క సారి మాత్రం హలో చెప్పు. నిన్నటిలా ఎగ్గొట్టకు. వెంటనే పెట్టెసెయ్. సరేనా?”

“అలాగే అమ్మా! ప్రతి రోజూ చేస్తూనే ఉన్నాగా. అలాగే చేస్తా. అందరికీ గుడ్ నైట్ అని పెట్టాలని లేకున్నా ఫోను పెట్టేసింది ధృతి.

★ ★ ★

మరునాడు మంగేశ్వరుని గుడికి తీసుకు వెళ్ళారు. ఏ దేవతైనా కొండల మీదే దర్శనం అన్నట్లు మెట్లు ఎక్కారు. అక్కడ పచ్చటి నీటితో ఉన్న కొలను లో భక్తులంతా స్నానాలు చేస్తున్నారు. వీళ్ళంతా మెట్లు దిగి కాసిని నీళ్ళు జల్లుకొని లోపలికి వెళ్ళారు. ద్వార పాలకునిగా విష్ణుని విగ్రహం .లోపలికి వెళ్ళగానే గోడలోకి ఉన్నట్లుగా ఉన్న విఘ్నేశ్వరుని బుల్లి విగ్రహం.అటు వైపు ఇటువైపు అమ్మవారి విగ్రహాలు. ద్వారానికి ఎదురుగా మంగేశ్వరుని విగ్రహం ని దర్శించుకుని మనస్ఫూర్తిగా నమస్కరించుకుని బయటకు వచ్చారందరూ. మంగేశ్వరుని శరీరంలో సగభాగం మాత్రమే ప్రతిష్ఠించారు. దారిలో వస్తుంటే ఒక రావి చెట్టు దానికి కాపలాగా ఉన్న రెండు మృగరాజులను చేస్తే దృతికి ఆశ్చర్యం, నవ్వు కూడా వచ్చాయి.





అక్కడి నుంచీ “శాంత దుర్గా విజయతే” గుడికి తీసుకెళ్లారు.అక్కడ కూడా దర్శనం చేసుకొని కొంచెం దూరంలో జరుగుతున్న యజ్ఞయాగాలను, దానిని చేస్తున్న మహాపురుషులకు కూడా నమస్కరించుకుని బయటపడ్డారు. ఈ ఆలయంలో తులసి కోట ప్రత్యేకంగా కనిపించింది. తులసి మాత కుంకుమ, పూలతో భారత స్త్రీ లా నిండుగా విరాజిల్లుతోంది. అయిదు నిముషాలు కూర్చుని మళ్ళీ అంతా బస్సు ఎక్కేసారు. ఎండలో తిరగటం,మళ్ళీ బస్సు లో ప్రయాణిస్తుంటే వచ్చే చల్లని గాలిలో సేద దీరటం నిత్యకృత్యమై పోయింది. కాస్త నిద్ర పడుతోందో లేదో బస్సు

యూత్ సీరియల్

# పరుగులు తీసే నీ వయసునకు

ఠక్కున ఆగింది ఓ చర్చి ముందు. విశాలమైన ప్రాంగణంలో ఆ చర్చ్ ఉంది. ఎంతో ప్రశాంతంగా ఉందా ప్రదేశం. లోపలికి వెళ్ళగానే నిలువెత్తు క్రీస్తు విగ్రహం ఎదురైంది. దీనికి పై భాగంలో పదునైదు వందల ఏబది సంవత్సరంలో చనిపోయిన ఆయన శరీరాన్ని ఇప్పటికీ సంరక్షిస్తున్నారు. ముఖం మాత్రమే కనిపిస్తోంది. ఇక్కడంతా బంగారు మయంగా ఉంది. మేరీమాతను కూడా చూసుకుని కొంచెం దూరంలో ఉన్న బ్రహ్మాండమైన పార్కులోకి అడుగుపెట్టారు.ఎర్రటి జినియా పూలు, పసుపు పచ్చటి బంతి పూలతో ఆ ప్రదేశం ఎంతో ఆకర్షణీ యంగా ఉంది. దాని ప్రక్కనే ఉన్న ఆర్కిలాజికల్ మ్యూజియమ్ కూడా చూసుకుని వాస్కోడిగామా స్టేషను కి చేరిపోయారు.

బస్సులో అంత్యాక్షరీలు, పాటలు, డాన్సులు, అరుపులుతో గోల చేసినా అక్కడకు వచ్చేటప్పటికి నిశ్శబ్దం పాటించారు. అక్కడ నుంచి హార్బర్ కి తీసుకువెళ్ళారు. అక్కడ పెద్ద పెద్ద స్టీమర్లు ఉన్నాయి.పెట్రోలియం సరఫరాకి వాటిని ఉపయోగిస్తారు. ఆ 'సీ ట్రేడ్' లోపలికి వెళ్ళి అంతా చూసి వచ్చారు. దీని పై భాగంలో ఉన్న 'ప్రియదర్శిని' వాతావరణ సూచనలు తెలియపరుస్తుందని తెలుసుకున్నారు. అక్కడ నుంచీ అంతా స్టేషన్ కి చేరుకున్నారు. మరువాడు తెల్లవారేటప్పటికి హుబ్లీ లో ఉన్నారు. అక్కడ ట్రైన్ ఎక్కి హైద్రాబాదులో వచ్చి వాలారు అందరూ.

"ధృతీ! కూర్చునే నిద్ర పోతున్నావా ? " అని నానమ్మ కుదపటంతో ఒక్క సారి ఈ లోకంలోకి వచ్చింది ధృతి. అలా అప్పుడు వెళ్ళిన టూర్ నంతా ఒక్కసారి గుర్తు తెచ్చుకొని " అవును నానమ్మా ! గతం రైలు ఎక్కి ఇప్పుడే వాస్తవం లోకి మనంట్లోకి దిగాను" అంది నవ్వుతూ .

★ ★ ★

ధృతికి సంబంధాలు చూడటం ప్రారంభించాడు ధర్మతేజ. అన్ని విషయాలు సరిగ్గా చూసుకున్నాకే అబ్బాయిని ఒప్పుకోవాలని మధురిమ, కుటుంబసభ్యులు ఏకగ్రీవంగా నిశ్చయించుకున్నారు. ఎందుకంటే రోజులు అసలు బాగా లేవు. అందరూ మేక వన్నె పులులే .అందులో ఒక వజ్రాన్ని, ఓ మట్టిలో మాణిక్యాన్ని తమ బంగారు బొమ్మ కి చూడాలి. ఇది అందరి తల్లితండ్రుల ఆలోచనే. కానీ తొందర పాటు తనంతో చేసిన చిన్న చిన్న తప్పులే భవిష్యత్తులో మెడకు పాముల్లా పాశాలై పీడిస్తాయి. అది అనుభవంలోకి వచ్చింది కూడా. అందుకే ధృతి విషయంలో ముందు జాగర్త తప్పని సరి అని నిశ్చయించుకున్నారు.. ఎవరి ప్రయత్నం వాళ్ళు చేయసాగారు . మధురిమ ముందుగానే ధృతిని ఎవరినైనా ప్రేమిస్తున్నావా ఉంటే ముందే చెప్పెయ్ అన్నా.. నోరు విప్పలేదు.

"లేదు" అని తల అడ్డంగా ఊపింది. మనసులో మాత్రం కృపాల్ మెదిలాడు. ఆ వెంటనే జరగబోయే సంఘటనలు కళ్ళ ముందు సినిమా లాగా ఒకదాని తర్వాత ఒకటి ప్రత్యక్షమయ్యాయి.

ఎక్కడా ఉమ్మడి కుటుంబాలు కానరాని సమయంలో తమదొక ఆదర్శ కుటుంబంగా అందరూ చెప్పుకుంటున్నారు. తనో కులం తక్కువ అబ్బాయిని చేసుకుంటే అదో చర్చనియాంశం అవుతుంది. ఇన్నాళ్లూ ఏదో అనుకున్నాం. ఇప్పుడు వీళ్లు కూడా అందరిలో కలిసిపోయారు అని ప్రతి ఒక్కరూ అమ్మా నాన్నలను దెప్పుతారు . చిన్నతనం నుంచీ తనను అరచేతుల్లో పువ్వల్లే పెంచిన వారికి ఈ అవమానాలు, పరువు నష్టాలు కానుకగా తను ఇవ్వగలదా? నెవ్వర్. అన్నయ్యలు ప్రేమించలేక లేక అమ్మాయిలు కరువయ్యా అమ్మ, నాన్నా చెప్పిన సంబంధాలనే అంగీకరించారు. వాళ్ళ కంటే తను ఏమీ గొప్పకాదు.

మరి కృపాల్ అంటే నీకు ఇష్టం కదా మనసు అడగనే అడిగింది. ఇష్టమే కానీ అమ్మా నాన్నలను కష్టపెట్టేంత ఇష్టం కాదు. వాళ్ళు ఇష్టంగా చేస్తే తప్పకుండా చేసుకుంటాను.

యూత్ సీరియల్

# పరుగులు తీసే నీ వయసునకు ..!

వాళ్ళకు చెబితే కదా తెలిసేది
"వద్దు. మద్దు. చిన్న అనుమానం వస్తేనే వాళ్ళు ఎంతో బాధ పడి పోయారు. అదే తను భరించ లేకపోయింది.తన ఇష్టాన్ని కాదనలేక వాళ్ళు అవమానాలు పాలవ్వటానికి కూడా సిద్దపడతారు తను చెబితే.. వాళ్ళు అంత చెయ్యగలిగినప్పుడు తను ఎంత చెయ్యాలి ?
కులాలు ఇప్పుడు ఎవరు పట్టించుకుంటున్నారు ? మనసు మళ్ళీ ప్రశ్నించింది.
అవును అలా అంటున్నారు కానీ వాటి వల్ల సమస్యలు లేకుండా ఉన్నట్లు ఏ కుటుంబమూ నిరూపించలేదు.
పెద్దలు కుదిర్చిన సంబంధాలలో మాత్రం సమస్యలు ఉండవనా నీ ఉద్దేశం అంది అంతరాత్మ.
ప్రేమ పెళ్ళిళ్ళలో సమస్యలు కోరి తెచ్చుకున్నవి అవుతాయి అంది ఠక్కున.
నీ కిష్టమైతే నాకు మాత్రం అభ్యంతరం ఉంటుందా ఏంటి? ఎదురుగా ఉన్న అంతరంగం లోపలి వెళ్ళిపోయింది.
బాగా తమకు తెలిసి ఉన్నవాడినే ధృతికి చేయాలని అందరి అభిప్రాయం అవటంతో ముందుగా బంధువులను, చుట్టు ప్రక్కల వారిని పరిశీలించాలని అనుకున్నారు.
ఇక అబ్బాయిల వేట మొదలయ్యింది.ఎప్పటి నుంచో ఆ దృష్టితో మధురిమ ఎందరినో పరీక్షిస్తున్నా ఇప్పుడు పరిశోధనలా తయారయింది పరిస్థితి.
ధర్మతేజ తన తోటి స్కూల్ టీచర్లకు కూడా ఓ మాట వేసి ఉంచాడు. మంచి అబ్బాయి ఉంటే తనకు చెప్పమని .
ఎక్కడెక్కడో అంతా వెతికాక కావల్సిన వాడు ప్రక్కనే ఉంటాడు. అదేదో ముందే తెలిస్తే బాగుంటుంది కదా అని అందరూ అనుకుంటారు. కానీ అది జరగని పని కదా? అందరూ ఈ పాట్లు పడాల్సిందే, అందులో ధర్మతేజ, మధురిమ కూడా చేరారు. అంతే!

★ ★ ★

రాత్రి పది గంటల సమయంలో స్నేహితులంతా వీడియో కాన్ఫరెన్స్ లో కలుద్దామనుకోవటంతో పనులన్నీ ముగించుకుంది ధృతి . అప్పటి కోసం సాయంత్రం ఆరు గంటల నుంచే ఎదురు చూపు ప్రారంభించింది. కనీసం నెల కొకసారైనా ఇలా కలిసి ఓ రెండు గంటలు మాట్లాడుకోవాలన్నది వారందరి ఒప్పందం. ఆ రోజు ఈ రోజు అయ్యింది ఈ నెలలో.
ముందుగా బాంధవ్ వచ్చాడు.
"ఎలా ఉన్నావ్ ? అన్న ధృతి ప్రశ్నకు " బాగున్నా! "అన్నాడు. మరి అనన్య...
" తను కూడా . నేను బాంబే కి యం.బి.ఏ చదవటానికి వచ్చినప్పుడే నా ప్రాణ స్నేహితుడు 'అజీజ్' కి అప్ప చెప్పాను తనని . నేను వచ్చేంతవరకూ జాగ్రత్తగా చూసుకోమని. మనకి స్నేహితులకన్నా నమ్మకమైన వారు ఎవరుంటారు ?.
' ఓ !సి.ఆర్. ఎలా ఉన్నావ్ ? అన్నారు ఇద్దరూ ఒకేసారి. "ఏదో.. ఇలా ఉన్నాను"
"ఏమిటిరా ? అంత నిరాశక్తత?
"బాంధవ్ ప్రశ్నకు
"తాతయ్య వాళ్ళు నాకు తొందరగా పెళ్ళి చేసెయ్యాలని చూస్తున్నారురా . సంబంధాల వాళ్ళేమో సొంత ఇల్లు లేదా అపార్ట్మెంట్ లేకపోతే ఇవ్వమని వెనక్కి వెళ్ళిపోతున్నారు.కొంటాం అన్నా ఒప్పుకోవటం లేదు. ఉంటేనే పెళ్ళి అని ఖచ్చితంగా చెప్పేస్తున్నారు.అపార్ట్ మెంట్ కొనటం ఎంత సేపు? మంచిగా స్థలం కొని ' డూప్లెక్స్ ' కట్టుకోవాలని నాకుంది"
"అవును సి ఆర్ ఇప్పుడు అమ్మాయిలు అన్నీ ఉన్నవాళ్ళకి ప్రాముఖ్యత ఇస్తున్నారు" అంది ధృతి.
ఈ లోపు కృపాల్, ప్రవాహ, మాధురి కూడా చేరారు హాయ్!అంటూ.
'ఇంతకీ జోక్ ఏమిటంటే పెళ్ళికూతురు వాళ్ళ కసలు ఏమీ ఉండటం లేదు . కట్నం లేకుండా చేసుకుంటామన్నా కూడా ఈ ఇంటికి లింకు పెడుతున్నారు"
"అవునా! అంది ధృతి.
"హాయ్ ఫ్రెండ్స్ ! ఎలా ఉన్నారు ? అన్న ప్రవాహ ప్రశ్నకు "ఓ.కే " "ఓ.కే " అన్నారంతా.
కృపాల్ "ఏం తిన్నారురా ఈ

# పరుగులు తీసే నీ వయసునకు

రోజు?" అని అడగటంతో అందరూ ఘొల్లుమన్నారు.
ధృతి అతన్ని ఊరిస్తూ 'గులాబ్ జామ్" అని చెప్పింది .
అవునా అన్నట్లు దిగులుగా ముఖం పెట్టాడు.
" మరి ఎందుకురా అడగటం? అన్నాడు. సి. ఆర్.
"తినకపోయినా విని ఆనందిద్దామని" అన్న కృపాల్ మాటలకు మళ్ళీ అందరూ ఒక్క సారి నవ్వేసారు.
"మేం కూడా చెప్పమా?' మళ్ళీ అన్నారు ఒకేసారి.
"వద్దు. వద్దు. ఇప్పుడు నన్ను ఏడిపించటానికి నా కిష్టమైనవన్నీ పనిగట్టుకుని చెబుతారు ధృతిలాగ. నాకు బుద్ధి వచ్చింది . రుజువు చెయ్యమనటానికి కూడా లేదు. అంతా ఖాళీ చేసేసిన సమయమిది" అని కృపాల్ అనటంతో
"ప్చ్ ! పాపం ! " అన్నట్లు ముఖం పెట్టారు అంతా .
మళ్లీ అక్కడ నవ్వులు నక్షత్రాలలా నేలన విరిసాయి.
''మధూ..నీ సంగతి ఏమిటి ?''
"తాగుడుకు చిల్లి గవ్వ కూడా ఇవ్వనని మా నాన్నకు చెప్పేసాను. ఏదైనా తినటానికయితే నేనే దగ్గరుండి తినిపిస్తాను. ఇంకేదైనా కావాలంటే కొని పెడతాను అదీ మద్యం తప్ప అని చెప్పా "
"మరి ఆయన విన్నారా ? "
"ఆఁ! అమ్మని కొట్టడానికి వీల్లేదని కండీషన్ కూడా పెట్టేసా . అలా చేస్తే మేమిద్దరం నిన్ను వదిలేసి వెళ్ళి పోతాం అని బెదిరించా.
దెబ్బకు దారిలోకి వచ్చారు. ఇప్పుడు ఇల్లు కొంత ప్రశాంతంగా ఉంది ".
"ఫరవాలేదే !" అంటూ మాధురి కోసం చప్పట్లు కొట్టారు అంతా.
"థాంక్యూ! థాంక్యూ!! అని సలామ్ చేసింది.
మళ్ళీ నవ్వుల పువ్వులు రాలాయి సెల్ లో .
"మరి నీ సంగతి" అన్నారు ప్రవాహ వంక చూస్తూ.
"అంతా రొటీన్, ఏమీ మార్పులేదు"
"మంచిగ పెళ్ళి చేసుకోవే. అప్పుడైనా బాగుంటుందేమో" అంది ధృతి.
"ఏం బాగు?ఈ పంజరం లోంచి ఆ పంజరం లోకి వెళ్ళి పడతాను. డబ్బు తప్ప అక్కడ నాకు ఇంకేమీ కనిపించదు. మమతన్నది వట్టి పిచ్చి అని నేను అంతు లేని కథ సినిమా లోలా పాడు కోవల్సిన పరిస్థితి వస్తుంది.
"నీ సంగతి ఏమిటి ? "ప్రవాహ ధృతి ని అడిగింది.
'ఏముంది? అమ్మా వాళ్ళు సంబంధాల వేటలో పడ్డారు. ఒక సంవత్సరం ఆగుదాం అన్నాను. చూడాలి. నచ్చాలి. అదయ్యేటప్పటికి నువ్వన్న సంవత్సరం ఎలాగూ అవుతుంది అన్నారు. ఇక నేనేమి మాట్లాడలేక పోయాను. "
"అంతే ! ఏదో లాగా బాధ్యత తీర్చేసుకుందామని వాళ్ళకి ఉంటుంది"అన్నాడు సి. ఆర్.
తర్వాత కాసేపు వాళ్ళ వాళ్ళ ఉద్యోగాలు గురించి మాట్లాడుకుని ఎప్పుడో తెల్లవారు ఝామున మూడు గంటల కి ముగింపు గీతం పాడారు.
రాత్రంతా ఇలా మాటలు ఎందుకు అని రేపు తల్లి తండ్రులతో అక్షింతలు వేయించుకోవడానికి ఆనందంగా సిద్ధ పడుతూ నిద్రకుపక్రమించారు అందరూ 'గుడ్ నైట్' చెప్పుకొని.
కాదు.. కాదు గుడ్ మార్నింగ్ 'అని సవరించుకున్నారు మళ్ళీ.

---

ఫోన్ మ్రోగుతూ ఉండటంతో పుస్తకం చదువుతున్న స్నేహప్రియ సెల్ ని చేతిలోకి తీసుకుంది .
" మధురిమ.. ఎన్నాళ్ళకి చేసింది తను.. ఎప్పుడూ తను చెయ్యటమే !"అనుకుంటూ
"హలో ! " అంది
"స్నేహా ! ఎలా ఉన్నావే? "
'ఇప్పటి దాకా బాగానే ఉన్నాను. నువ్వు ఫోన్ చేసావుగా. అకాల వర్షం వస్తుంది. నేను బట్టలు తీయటానికి బాల్కనీలోకి పరుగెత్తాలి.
"ఎవరో చస్తారు అన్న దాన్ని నువ్విలా మార్చేసావా?"
"ఆ.. అవునే.. అంతా మనిష్టమేగా" అంది నవ్వుతూ స్నేహ.

యూత్ సీరియల్


# పరుగులు తీసే నీ వయసునకు ..!

'ఇంతకీ మీ అపార్ట్ మెంట్లో వాళ్లు ఏమంటున్నారు? "
"అవా .. కదిపితే కందిరీగ తుట్టేనే బాబూ!'
"అవునాఁ? "
"అవునే! నా ప్రక్కనే ఓ రాముడు.. ఆ ప్రక్కన ఓ రావణమరుదు"
"అబ్బా ! ఇక లంక దాకా వెళ్ళక్కర్లేదన్న మాట యుద్ధానికి"
' అవునే.. న్యాయం కోసం ఇతను. అన్యాయం వైపు అతను '
"అయితే ఓడిపోతాడన్న మాట ఆ రావణుడు "
"అదే జరిగితే నాకు ఇంత భాదెందుకు ? ఎప్పుడూ ఇక్కడ అన్యాయమే గెలుస్తోంది. ఎవరైనా తన మాట వినకపోతే నలుగురు స్నేహితులను వెంట వేసుకొని కర్రలు పుచ్చుకుని వెళ్ళి బెదిరిస్తున్నారు "
"అచ్చు గూండాలలానా?"
" అంత కంటే ఎక్కువగానే. భయపడి చస్తున్నారు మా వాళ్ళంతా "
"నీకు భయం లేదుగా. ఎదురించ వచ్చుగా?"
" నా బొంద. మా ఆయనకి భయమేగా. నన్ను నోరు మెదపనివ్వటంలా. ఇలా బాధపడటం తప్ప నేనేమీ చెయ్య లేక పోతున్నాను "
"అయ్యో! అలాగయితే ఎలానే ?"
అదేనే ! ఇలాంటి చోట ఉండలేక, ఆ అకృత్యాలను భరించలేక నోరు మూసుకుని కూర్చోలేక సతమత మయిపోతున్నాను. నీకు నా సోదంతా చెప్పటం ఎందుకులే అని ఫోను చెయ్యటం లేదు. చేస్తే ఇక ఆగలేను కదా.
"పోనీ లేవే చెప్పుకుంటే సగం బాధ తగ్గుతుంది .ఇంతకీ ఇల్లు ఖాళీ చేయించావా?"
"ఆ చేయించా . క్రొత్త వాళ్ళు కూడా వచ్చేసారు"
వీళ్ళయినా బాగున్నారా?"
" ఆ"
"ఇంకేంటి సంగతులు? "
"మొన్న వినాయక చవితి కి ఏం జరిగిందో తెలుసా?"
"తెలియదే. నువ్వు చెప్పనిదే నాకెలా తెలుస్తుంది ?"
"మా అపార్ట్మెంట్ లో వినాయకచవితి వేడుకలు జరుగుతుంటే ఇక్కడ వదిలేసి సందు మొదల్లో ఉన్న దాంట్లో దూరాడు మా పిచ్చోడు. అక్కడ అన్న దానం కూడా చేసాడు.వేలం పాట కూడా అక్కడే పాడాడు"
"అదేం పిచ్చి, మన దాంట్లో దాన్ని మనం చూసుకోవాలిగా"
"అందుకేగా పిచ్చోడు అన్నాను. ఇలాగే ప్రవర్తిస్తూ ఉంటాడు. వాళ్ళ అమ్మ తన కొడుకు రాముడని చెప్పుకుంటుంది గొప్పగా. మనసులో భలే నవ్వు కుంటుంటాను నేను ఆవిడ మాటలకి "
"అంతే కదా. రావణుడిని పట్టుకుని రాముడంటుంటే .. ఇంకో వింత చెప్పనా ? "
"చెప్పు"
"ఇక్కడ ఇంకో కుక్కల పిచ్చి వాళ్ళున్నారు. భార్యకి కుక్కలంటే ఇష్టమట. ఇక ఇతను ఇష్ట పడాల్సి వచ్చిందని వేరే చెప్పక్కర్లేదుగా బ్రహ్మ నందం చెప్పినట్లు "
"అయితే..?"
"వీధికుక్కకు జబ్బు చేస్తే వెయ్యి రూపాయలు ఖర్చు పెట్టి బాగుచేయించాడు"
"మంచి పనే చేసాడుగా పుణ్యాత్ముడు "
"ఉండు. నేనింకా పూర్తి గా చెప్పలేదు. వినాయకుడికి చందాగా ఎంతిచ్చాడో తెలుసా . నూట పదహార్లు"
" అవునా !"ఆశ్చర్యపోవటం మధురిమ వంతయింది.
' ' ఇలాంటివి ఎన్నో.. ఎన్నెన్నో.. ఇంతకీ ధృతీ, పిల్లలు ఎలా ఉన్నారు?

(సశేషం)

కార్టూన్స్

# నవ్వండి ప్లీజ్ !






నవ్వటం ఒక యోగం ,


నవ్వలేక పోవటం ఒక రోగం , తరువాత మీ ఇష్టం


నాగిశెట్టి














వినాయక చవితి కథల పోటీలో గెలుపొందిన కథలు

# క్లీన్ షేవ్...!!!

హాస్య కథ

సాయి ఆదిత్య వైనతేయ

'రండి బాబూ రండీ... అందమైన ఎలక్ట్రానిక్ రేజర్...

చీప్ అండ్ బెస్ట్... అలసించిన ఆశాభంగం_ _ _రండి బాబూ రండీ'_ _ _

పట్నానికి వచ్చిన చెంగల్రావ్ ఆశ్చర్యపోయాడు. ఎప్పటినుంచో ఎలక్ట్రానిక్ రేజర్ తో షేవింగ్ చేసుకోవాలనే ఉబలాటం అతనిలో చాలా ఉంది.

'రేజర్' లు ఇలా కూడా అమ్ముతారా అనీ. వెంటనే అమ్మేవాణ్ణి కుతూహలంగా పిలిచాడు.

'ఎయ్ బాబూ ఇలారా'.!..

'అర్రె నాపేరు మీకెలా తెలుసూ'!?.. టన్నులకొద్దీ ఆశ్చర్యాన్నీ ప్రదర్శించేస్తూ అడిగాడు ఆ అమ్మే కుర్రాడు.

'కొన్ని ఫేసులని చూసి ఇట్టే చెప్పేస్తా పేరూ'... గొప్పగా అన్నాడు చెంగల్రావ్.

వినాయక చవితి కథల పోటీలో గెలుపొందిన కథలు

# క్లీన్ షేవ్...!!!

మళ్ళీవెంటనే –

'అవునూ... ఈ మధ్య ఇలా కేకలేసీ మరీ 'ఎలక్ట్రానిక్ రేజర్' లు అమ్ముతున్నారా'?..

'పబ్లిసిటీ లేకపోతే ఎలా సార్... 'హర్ ఏక్ మాల్' అని ప్లాస్టిక్ సామాను అమ్మడం లేదా'

'అలా వచ్చావా'?..

'అందులోనూ మా దగ్గర మాంచి క్వాలిటీ మాల్ దొరుకుతుంది'!..

'ఈకాలంలో ఇలాంటి ఎలక్ట్రానిక్ రేజర్ లు బొచ్చుడు దొరుకుతాయి – వంద రూపాయలకి'... వీటి రేట్లు మాకు తెలుసులే అన్నట్లు చెప్పాడు చెంగల్రావ్

'నిజమే!.. నెలకోటి కొనుక్కోవాలి... అంత చీప్ క్వాలిటీ అవీ– కొన్నాక బొచ్చు పీక్కోవాలి'! లైట్ గా తీసిపారేసాడు బాబు

'మరి నీ దగ్గర అంత క్వాలిటీ అని గ్యారంటీ ఏంటీ.. ఓ షాప్ లేదూ... రశీదు లేదు... రేపు ఎక్కడుంటావో తెలీదూ... ఇంత కాస్ట్ మా వల్ల కాదు'.

'ఓ పనిచేయండి. మీ ఫోన్ నెంబర్ ఇవ్వండి... వారానికోసారి ఫ్రీ సర్వీసు చేస్తా!'.

'ఇంకా నయం షేవింగ్ కూడ చేస్తాననలేదు'... కొంటెగా అన్నాడు చెంగల్రావ్.

మీ పంచ్ లు మామూలుగా లేవుగా... జబర్దస్త్ లో ట్రై చేయలేకపోయారా!?'

ఆనందంతో ఉబ్బితబ్బుబ్బు అయ్యాడు

'మరి నీ నెంబర్ ఇవ్వు... అవసరం అయితే నేనే ఫోన్ చేస్తా'!...

అతను ఫోన్ నెంబరు ఇచ్చి...

"మీరు మరీనూ సార్...నాకు అవుట్ గోయింగ్ ఫ్రీ... నేనే చేస్తా... ఎలక్ట్రానిక్ రేజర్ లు ఖరీదుకోసం చూడకండి సార్ – ఇది 'బిగ్ బెన్' వాళ్ళ ఎలక్ట్రానిక్ రేజర్ ".

'ఏంటీ 'ఫారీనే'

'ఆ 'ఫారనీ'యే'...

'బిగ్ బెన్ అంటే వాచీలు కదా ? ఇవీ అమ్ముతారా"!

'అది జమానాలోనిది సార్... వాళ్ళిప్పుడూ – రేజర్లు గీజర్లు , మిక్సీ జార్లూ అన్నీ తయారుచేసేస్తున్నారు'...

'నువ్వు మరీనూ!... అంత పెద్ద కంపెనీ నీలాంటివారి ద్వారా అవన్నీ అమ్ముతుందా...షోరూమూ, ఆన్ లైనూ ఇలాంటివి ఉంటాయి కదా'!!

'సార్!.. అక్కడ రూం రెంట్లూ, కరెంట్ బిల్లులూ, మెయింటైన్ చార్జీలూ ఉంటాయి... అప్పుడు మధ్యతరగతి వాళ్ళు కొనలేరని బిగ్ బెన్ వాళ్ళూ మాకూ అమ్మమని చెప్తూ ఉంటారు"!...

'అయినా ఎక్కువ రేట్ చెప్తున్నావ్! నేను బిగ్ బెన్ వాళ్ళకి చెప్తా మరి నీ గురించీ"!!

'ఊరుకోండి సార్... మీరు కాబట్టి ఈ రేటు. అదేవేరే వాళ్ళకయితే మూడు రెట్లు ఎక్కువ చెప్పేవాణ్ణి'!.

'ఎందుకలా'?.

'మీ ఫేస్ చూస్తే ముచ్చటవుతుంది సార్'!

'అవునా'?..

'ఆ ...ఆ ఫేస్ చూడండి... ఎంత అమాయకత్వం., ఎంత సింప్లిసిటీ... ఎంత హైటెక్ సిటీ???

'మధ్యలో ఈ హైటెక్ సిటీ ఏంటీ...

"అంటే అక్కడ కూడా మా బ్రదర్ అమ్ముతుంటాడు వీటిని"

'సరే... కరక్ట్ రేట్ – చెప్పెంత??

'మీక్కాబట్టి వెయ్యి రూపాయలు.... వేసుకోండి..

'ఇంత చిన్న ఎలక్ట్రానిక్ రేజర్ లు వెయ్యి రూపాయలా వద్దులే"..

కొనాలని ఉన్నా బెట్టు చేసినట్లు ముందడుగు వేసాడు చెంగల్రావ్

వినాయక చవితి కథల పోటీలో గెలుపొందిన కథలు

# క్లీన్ షేవ్…!!!

‘సార్ మీరూ ఓ రేట్ చెప్పండి…

సరే 750 రూ...’

‘కష్టం సారూ! అయినా సరే …ఒక్క నిముషం…సార్!! పక్కవీధిలో ఉంది తెస్తా’..

‘అదేంటీ ఇది ఇవ్వవా’?…

‘ఇది వాడుతూన్న ఎలక్ట్రానిక్ రేజర్ – శాంపిల్. ‘డెమో పీస్’ సార్.

‘ఓకే తొందరగా రా… టైమవుతోంది నీకొసం ఎదురుచూసి... ఎదురుచూసి “గడ్డం పెరిగిపోద్ది”

‘సార్ !…”ఏం కామెడీ సార్… అప్పుడే ‘గడ్డం పెరిగిపోద్ది’ అంటున్నారు. మంచి చమత్కారులే. డబ్బులుఇవ్వండి సార్”

తొందర పెట్టసాగాడు బాబు.

‘రేజర్ తేకుండా పారిపోతే’… అనుమానం చెంగల్రావ్ ఫేసులో.

‘సరే ఇదే ఉంచండి…కొత్తది తెచ్చి ఇది పట్టుకుపోతా.’!..

ఈకాలంలో ఇంకా మంచితనం




ఉంది అని ఆలోచించి ఆ ‘డెమో పీస్’ పట్టుకుని నిలబడ్డాడు చెంగల్రావ్.

‘నా నెంబర్ ఉంది కద. ఇంకా డౌట్ ఎందుకు సార్… సొమ్ము ఇస్తేనే మా ఓనర్ నాకు సరుకు ఇస్తాడు’.

చెంగల్రావ్ డబ్బు లెక్క పెట్టి ఇచ్చేసాడు.

అంత జనంలో చేతిలోంచి పాదరసం జారినట్టు బాబు వెళ్ళిపోయాడు. సాయంత్రం వరకూ అతనికోసం చెంగల్రావ్ వెయిట్ చేస్తూనే ఉన్నాడు, వర్షం రావడంతో డబ్బులకి నీళ్లు వదిలేసుకుని ఇంటికి పోయి మోసం గురించి భార్యకి ఎరక్కపోయి చెప్పి ముక్క చీవాట్లు తిన్నాడు చెంగల్రావ్.

★★★

దాదాపు నెల్లాళ్ళ తర్వాత…

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ దగ్గర మళ్ళీ బాబుని చూసి చెంగల్రావ్ గుర్తుపట్టేశాడు. అతన్ని చూసి బాబు పారిపోలేదు. ఎదురుగా వచ్చాడు. దాంతో అతను మోసగాడు కాదని భావించాడు చెంగల్రావ్

‘ఇదిగో ఆరోజు నువ్వే కదూ నాకు రేజర్ తెస్తానని మోసం చేసావ్’…

‘మోసమా అది నా ఇంటా వంటాలేదు…నేను తెచ్చేసరికి మీరే వెళ్ళిపోయారు’.

‘నేను సాయంత్రం వరకూ ఇక్కడే ఉన్నా’!…

‘జస్ట్ మీరెళ్ళి ఉంటారు. నేను వచ్చా… ఈలోగా పోలీసులు నన్ను పట్టుకెళ్ళి రేజర్ లాక్కున్నారు’!

‘ అర్రె ఎందుకూ’?..

‘ఏం చేస్తాం సార్! నాదీ మీలాగే అమాయకమైన ఫేసు… చవగ్గా అమ్ముతున్నానని…పట్టేసుకున్నారు. ఇంకో రేజర్ ఉంది మరి తెమ్మంటారా’?…

‘ తొందరగా తే’…

‘ కానీ ఇంకో అయిదొందలు ఇవాల్సి ఉంటుంది… అంతకన్నా ఇది మంచి రేజర్’

‘అబ్బా!! మళ్ళీ డబ్బు కొట్టేద్దామనే’…

‘అలా అయితే ఇంకా ఎక్కువ డబ్బులడిగేవాడిని కదా’

‘నిజమే…ఇదిగో అయిదొందలు’!…

‘మీరు నిజంగా చాలా మంచోళ్ళు సార్…ఇదిగో ఒకటో నెంబర్ ప్లాట్ ఫారం మీద మా ఓనర్ వంద

వినాయక చవితి కథల పోటిలో గెలుపొందిన కథలు

# క్లీన్ షేవ్...!!!

రేజర్ల పార్సిల్ పట్టుకుని ఉన్నాడు. అక్కడికి వెళ్ళి తేవాలి. ప్లాట్ ఫారం టికెట్ కొనుక్కుని లోపలికి వెళ్ళి తీసుకొస్తా'!.

అక్కడనుంచి వెళ్ళబోయాడు బాబు.

అతని కాలర్ పట్టుకుని చెంగల్రావ్ –

'అదేంటీ ఈ ఫిటింగ్... నా డబ్బులు నాకిచ్చి వెళ్ళు--- ప్రతీసారీ మోసపోనూ తెలుసా'

'సార్ గోల చేయకండి. ఇవి స్మగుల్డ్ గూడ్స్. అల్లరి చేస్తే చిల్లరగాళ్ళని పోలీసులు బొక్కలో వేస్తారు... ఇదిగో ఇక్కడే ఉంది కదా కౌంటర్. ప్లాట్ ఫారం టికెట్ కొని లోపలికి వెళ్ళి సరిగ్గా 10 నిముషాల్లో మీ ముందు రేజర్ తో ఉంటాను. మీరెక్కడికీ వెళ్ళకండి'!..

'ఒక్క నిముషం... మీ బాస్ ఎలా ఉంటాడు...ఎక్కడ ఉంటాడు'.

'ఎర్రగా పొడుగ్గా... హీరోలా ఉంటాడు. పొడుగు షార్వానీ వేసుకుని వెయిటింగ్ హాల్ దగ్గర నా కోసం వెయిట్ చేస్తూ ఉంటాడు.

' పేరూ'

''విచిత్రకుమార్'

ఇదేం పేరు??.

'న్యూమరాలజీ సార్...అలా పేరు మార్చుకున్నాడో లేదో ఇలా కలిసొచ్చింది.'..

'సరే నేనూ వస్తా!.. ప్లాట్ ఫారం టికెట్ కొనుక్కుని'.

'ఓకేసార్ ! కానీ జనం బాగా ఉన్నారు.. మీరు ఆ క్యూలో ఉండండి నేను ఈ క్యూలో ఉంటాను... ఎవరు ముందు కౌంటర్ దగ్గరికి వెళ్తే వాళ్ళు రెండు ప్లాట్ ఫారం టిక్కట్లు కొందాం... అన్నట్టు మీరు చాలా లక్కీ అండీ'

'ఏం ఏందుకూ'...

'మా బాస్ దగ్గర ఎన్నో మోడల్స్ ఉన్నాయి... మీరు ఎంచక్కా మాంచి మోడల్స్ ఎంచుకోవచ్చు. అదే మొన్న అయితే ఆ ఒక్కటే రేజర్ మీదగ్గర ఉంచుకోవాల్సి వచ్చేది. రేపట్నుంచి క్లీన్ షేవ్ మిలా మిలా మెరిసిపోతారు'..

అద్దంలోతన నున్నటి బుగ్గల్ని చూసుకున్నట్టు ఫీలయ్యిపోయి ఆడపిల్లలా మురిసిపోయాడు చెంగల్రావ్.

'సార్' అన్న పిలుపుతో ఈ లోకంలోకి వచ్చేసాడు.

పక్క పక్క లైన్లలో నిలబడ్డారిద్దరూ ప్లాట్ ఫారం టిక్కెట్ల కోసం.

లైన్లో నిల్చున్న చెంగల్రావు ని ఎవరో వెనుకనుంచి తోసారు... దాంతో అతను ముందర నిల్చున్న వ్యక్తి మీద పడ్డాడు. అతను చిరాగ్గా చెంగల్రావు ని చూసి –

"నీ 'గడ్డం' గుచ్చుకుంటోంది ఇక్కడా – ఎందుకలా పడతావ్..."! అని భుజాన్ని బరబరా గోక్కున్నాడు.

తన భార్య కూడా అప్పుడప్పుడు ఇలా చిరుగడ్డాన్ని చిరాకు పడ్డం గుర్తుకొచ్చి సిగ్గుతో మెలితిరిగిపోయి---రెండు ప్లాట్ ఫారం టికెట్లు కొని బాబు కోసం చూసాడు.

--- --- ---

ఎక్కడా కనబడి చావడే?!... గాభరాతో చుట్టూ చూసాడు.

సాయంత్రం ...రాత్రి కూడా అయింది... బాబు రాలేదు.

"పాపం పోలీసులు మళ్ళీ అతన్ని తీసుకుపోయి ఉంటార"ని ఉసూరుమంటూ తన ఊరు వెళ్ళడానికి బస్టాండ్ వైపు చెంగల్రావు నడక సాగించాడు.

★★★

అమాయకత్వం – ఎప్పుడూ మోసం, చుట్టూ తిరుగుతూ ఉంటుంది.

మనలో చాలా మంది – చెంగల్రావులా మనమధ్యే తిరుగుతూ ఉంటారు

సమాప్తం

వినాయక చవితి కథల పోటీలో గెలుపొందిన కథలు

# " తూనా బొడ్డు!

కథ

పాణ్యం దత్త శర్మ

ఈ సంవత్సరం సంక్రాంతి బరిలో రెండు సినిమాలు నిలువబోతున్నాయని తెలిసి చలన చిత్రాలకు మహారాజ పోషకులైన ప్రేక్షకులు గంగవెర్రులెత్తిపోసాగారు. వారిని పరిశ్రమలోని వారు ప్రేక్షక దేవుళ్లని ప్రేక్షక మహాశయులని ములగచెట్టు ఎక్కిస్తుంటారు. కొందరు హీరోలు, దర్శకులు ఆంగ్లభాషా ప్రావీణ్యం శృతిమించి, లైవ్ షోలలో, ఇంటర్వ్యూలలో వారిని "ఒక ఆడియన్'కు కావలసినవన్నీ...." అని గొప్పగా చెబుతుంటారు. 'ఆడియన్స్' అనే పదం నిత్య బహువచనమనీ, దానికి ఏకవచనం లేదనీ వారికి తెలియదు. వారికి చెప్పాలంటే చెప్పేవారికి తెలియాలి కద!

'గుంటూరు గురవయ్య' 'నరుకు సింహా నరుకు!' అన్న రెండు సినిమాలు సరిగ్గా సంక్రాంతికి రెండు రోజుల ముందు రిలీజయ్యాయి. ఇక చూడండి భావి భారత కాంతి రేఖలయిన యువ కిశోరాల వీరంగం! సోషల్ మీడియా నిండా వాటి గురించే

వినాయక చవితి కథల పోటీలో గెలుపొందిన కథలు

# తూనా బొడ్డు!

.

'గుంటూరు గురవయ్య' హీరో అంజన్ కుమార్‌కు అరవై ఐదేండ్లుంటాయి. ఎంత మేకప్ చేసినా శరీరం ఊరుకోదు కదా! ఆయన నలభై ఏండ్ల నుండి హీరోనే. మోకాళ్ల నొప్పులు, కడుపు నొప్పిని అభినయిస్తూ చిత్ర విచిత్రంగా ఆయన చేస్తున్న డాన్సులు(?) అనితరసాధ్యం! 'గురవయ్య' లో కూడ ఆ భంగిమల్లో అణుమాత్రం మార్పు లేదు.

థియేటర్ బయట, సినిమా ముగిసిన తర్వాత వీరాభిమాని ఒకడు మైకు ముందు గొంతుచించుకున్నాడు "సూపర్ హిట్! హండ్రెడ్ క్రోర్స్!" ఇంకొక అమ్మాయి ఇలా చెప్పింది.

"సూసే కొద్దీ సూడాలనిపిచ్చిద్దండీ!" దాన్ని మూడుసార్లు లయబద్ధంగా వినిపించసాగారు కళాపోషకులైన టీవీలవాళ్లు." అంజన్న డాయరు కనబడేటట్టు లుంగీ ఎగ్గట్టీ, ఎర్రని గళ్ల షర్టు చేతులు భుజాల వరకు తిక్క తిక్కగా మడిచి, కళ్లకు నల్లద్దాలెట్టుకుని, సాక్సులేకుండా పసుపు పచ్చ బూట్లేసుకొని ఈరోయిన్‌తో ఆడతాంటే..." అన్నదా పిల్ల! ఆరాధనాభావంతో ఆమె కళ్లు అరమోడ్పులయినాయి. మనిషై పుట్టినోడెవడూ అలాంటి గెటప్‌లో ఉండడు. బయట అలా ఉంటే వీధి కుక్కలు వెంటపడి పీకుతాయి!

రెండో షో కూడా కాలేదు! పాన్ ఇండియా మూవీ! రెండొందల కోట్ల క్లబ్బులో చేరింది! అమెరికాలో టిక్కెట్లు దొరకడం లేదు! అంటూ సామాజిక మాధ్యమవీరులు ఊదరకొట్టసాగారు. "అంజన్‌కుమార్ గారితో నటించడం నా అదృష్టం" అని హీరోయిన్ బబితాశంభణ్ణ చెప్పింది.

ఆమె హీరోగారి కూతురి కంటె చిన్నది! ప్రతి సినిమాకూ అలాగే చెబుతుంది. దర్శకుని ప్రతిభను సక్సెస్ మీట్(?)లో పొగిడాడు హీరో!

"డైరెక్టర్ సత్తిపండు టేకుమళ్లలోని 'స్పార్క్' గమనించి ఈ అవకాశాన్నిచ్చాను. నన్ను ఎలా చూపిస్తే ఆడియన్ (?) కు నచ్చుతుందో అతనికి తెలిసినంతగా మరెవరికీ తెలియదు."

సత్తిపండు ఇంకా ఆ సినిమాకు పని చేసినవాళ్లంతా హీరోకు స్టేజిమీదనే పాద నమస్కారాలు చేశారు. భక్తితో కూడిన వినయం! ఆయన చేసిన నూటయాభై పై చిలుకు సినిమాల్లో నిజమైన అద్భుతమైన అతని నటనను ఆవిష్కరించిన సినిమాలు వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. విచిత్రమేమంటే అవి పెద్ద హిట్స్ కాదు. వాటి గురించి ఆయన గాని, ఆయన ఫ్యాన్స్ గాని చెప్పుకోడానికి ఇష్టపడరు.

ఇక "నరుకు సింహా నరుకు" హీరో దాలయ్యకున్న ఫాన్ ఫాలోయింగ్ అంతా యింతా కాదు. ఆయన వేలు చూపించి రమ్మంటే రైలింజను ఆయన దగ్గరకు బుద్ధిగా వస్తుంది. ఆయన శ్వాసలోని వేడితోనే విలన్లను చంపేస్తాడు. ఆయన చెప్పే డైలాగులు ఎవరు రాస్తారోగాని ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెప్పిస్తాయి(ట!). ఈ సినిమాలో ఆయన కాలితో ఒక తాపు తంతే ఇంచుమించు రెండు టన్నులుండే వ్యాను ఫర్లాంగు దూరం దొర్లిపోయింది.

ఇక ఆయన కత్తితో నరుకుతూనే ఉంటాడు. విలన్లందరి దగ్గరి ఆయుధాలుంటాయి. అవేవీ ఆయన్ను టచ్ చేయలేవు. కారణజన్ముడంటారు ఆయనను. ఆయన కొట్టినవారు గాలిలోనే గింగరాలు తిరుగుతూ ఉంటారు. ఎంత సేపటికీ కిందపడరు. ఆయన 'జీన్స్' వేరు, టీ షర్టు వేరు! కందుకూరి సింహం ఆయన!

"సింహా" అన్నది ఆయనకు అచ్చి వచ్చిన పదం. థియేటర్లలో జనాలు ఆయన ఉగ్ర

# తూనా బొడ్డు!

రూపాన్ని చూసి పరవశులవుతారు. సినిమాలో ఆయన పేరు ఏదైనా, వారు 'జై దాలయ్య! జై దాలయ్య!'' అనే పిచ్చి పట్టినట్లు అరుస్తారు. సక్సెస్‌మీట్‌లో దాలయ్య మాట్లాడారు.

''నాలో ఉన్న ఎనర్జీలో మూడవ వంతు మాత్రమే ఈ సినిమాలో చూశారు. పూర్తి ఎనర్జీని చూపిస్తే ''తట్టుకోలేరు!'' అని గర్జించిందా ముసలి సింహం. అభిమానులు పులకించిపోయారు. ''నిజమే కదా!'' అనుకున్నారు పాపం! 'నరుకు' సిన్మా కూడా రెండువందల కోట్లు క్లబ్బులో చేరింది. ''బాక్సాఫీస్'' బొనాంజా కె.డి.బి. స్ట్రయిక్స్ అగైన్!'' అంటూ ప్లకార్డులు పట్టుకొచ్చారు చాలా మంది ఔత్సాహికులు. కె.డి.బి అంటే కందుకూరి దాలయ్య బాబు!

సంక్రాంతికి ఎవరు విన్నర్ అని చర్చోపచర్చలు! ఇద్దరి అభిమానులూ ఒకరి మీద ఒకరు దుమ్మెత్తిపోసుకున్నారు. మూడో వారంలో కళాఖండాలు రెండూ జనంలేక బోసిపోసాగాయి! అయితేనేం? ఓ.టి.టి. అనేది ఒకటుంది కదా! దాని హక్కులు కూడ కోట్లు పోసికొన్నారు. థియేటర్లలో జనాల్ని చావబాదింది చాలక ఇంట్లోకి కూడ తయారయ్యారు.

వీళ్ల సంగతి ఇలా ఉంటే మన ఇతి హాసాలను, కావ్యాలను అత్యంత అసహజంగా తెరకెక్కించడం ఫ్యాషనయింది. విభాస్ అనే ఆయనున్నాడు. ఎటువంటి పాత్రకైనా ఆయన డైలాగ్ డెలవరీ ఒకటేలా ఉంటుంది. ఆయన్ను అభిమానులంతా ''మైడియర్!'' అంటారు. ఆయనను హీరోగా పెట్టి 'పురుషోత్తమ్' అనే పేరుతో రామాయణాన్ని తీస్తూ... ఉన్నారట.. ఒక సినీ క్రిటిక్ ఇలా అన్నాడు.

''ఈ మధ్య ఆ సినిమాలో రావణాసురుని పాత్రను శాంపుల్‌గా వదిలారు. వాడు అచ్చం తాలిబన్ల నాయకుడిలా ఉన్నాడు. ఇక రాముడెలా ఉన్నాడో ఖర్మ! 'లవకుశ' తీసిన సి. పుల్లయ్య, సి.ఎస్. రావు, 'సంపూర్ణ రామాయణము' తీసిన బాపు, 'రామాయణ్' అనే సీరియల్ తీసి చరితార్థుడైన రామానందసాగర్, చచ్చిపోయారు కాబట్టి బతికిపోయారు!''

ఇంకో దర్శకుడు రుణభాస్కర్ అనే ఆయన ''అభిజ్ఞానం'' తీస్తున్నాడట. దాన్ని ట్రయిలర్ వదిలారు దాని ప్రోమో అంటారు. దానిలో శకుంతల పరవాలేదుగాని, దుష్యంతుడు మాత్రం దుర్భరంగా ఉన్నాడు. వాళ్లిద్దరికీ ఒక పాట యూట్యూబ్‌లో 'వైరల్' అయిందట! అసలు వైరల్ కానిదేదైనా ఉందా అని!

సినీ క్రిటిక్ ఇలా అన్నాడు మళ్లీ.

''కమలా కర కామేశ్వరరావుగారు తీసిన 'శకుంతల'లోని యన్.టి.ఆర్. ను బి. సరోజాదేవిని, చిత్తూరు నాగయ్యగారిని చూసిన కళ్లతో వీళ్లను చూస్తూంటే కంపరంగా అనిపించింది. గిద్ గీర్వాణ్, రాగమయి పాడిన పాట, ముత్యంశాస్త్రి సంగీతం చేసిన 'మునివాటికలో' అనే పాట వింటూంటే, వారి మూకాభినయాన్ని చూస్తుంటే అనుభూతి రాహిత్యం కలిగింది. అది రాసిన వాడు ఎవరో సిరిబోణి అట. అది తెలుగా, సంస్కృతమా, రెండూ కాదా తెలియక జుట్టు పీక్కున్నాను గొంతులు కర్ణకఠోరంగా, ఎలుగెత్తి దీనంగా ఏడుస్తున్నట్లుగా ఉందా పాట''

''సినిమాలో గ్రాఫిక్స్ మీద మీ అభిప్రాయం?''

''మదీయబొంద! మన దేశంలో అందమైన చారిత్రాత్మకమైన ప్రదేశాలు షూటింగ్ స్పాట్స్ బోలెడన్ని! అవి వదిలేసి ఈ గ్రాఫిక్స్ పట్టుకున్నారు. కమ్మని శ్రీరామనవమి పానకం తాగినవాడికి కృత్రిమ రసాయనాలు కలిపిన కూల్ డ్రింక్ తాగించినట్లుంది బలవంతంగా!

వినాయక చవితి
కథల పోటీలో
గెలుపొందిన
కథలు

# తూనా బొడ్డు!

ఈలోపు మరో ఉపద్రవం! పోయిన సంవత్సరం వచ్చిన "త్రిపుల్ బి" అనే సినిమాలోని "హోటు ఘాటు' అనే పాటకు 'ప్లాటినం వర్డ్ ' అవార్డు వచ్చిందట దేశమంతటా అదే చర్చ ! త్రిపుల్ 'బి' అంటేభీభత్సం, భయానకం, భీషణం అట! ఒకప్పటి గొప్ప హీరోలకు వారసులైన ఇద్దరు కుర్ర హీరోలు అందులో ఆ పాటకు వీర విహారం చేశారు. పక్కా మాస్ మసాలా పాట అది. వీరంగం తొక్కారు!

దాని దర్శకుడు 'భోజరవళి' ఇలా అన్నాడు "ఇరవై ఐదు కోట్ల మంది భారతీయుల ఉత్తమాభిరుచికి ఇది నిదర్శనం"

సంగీత దర్శకుడు 'గీరపాణి' అన్నాడు. "నా కెరీర్‌లో అత్యుత్తమమైన పాట ఇది!' సిగ్గులేకపోతే సరి!

ఆ పాట రాసిన మహా కవి సర్వనాశ్ అన్నాడు" ఈ పాట రాయడానికి నాకు మూడు నెలలు పట్టింది! "మా నాయినే! అబద్ధం చెప్పినా అతికినట్లుండాలి' అని ఆ సాహితీ స్రష్టకు తెలియదా! ఆ పాటలో ఆయన తొంభై రోజులు కష్టపడి చేసిన అద్భుత పదప్రయోగాలు, ఆపాట నిండా ఉన్న ఉపమాలంకారాలు, పండితులను సైతం తలలూగించాయని "ఆంధ్రవాణి" దిన పత్రిక రాసింది. ముఖ్యంగా "బుర్ర మీసం పెట్టుకొని కర్రు కాల్చి పెట్టినట్టు" "దుమ్ము రేగెటట్టు రొమ్ము మీద బాదినట్టు" అన్న మాటలు, బీటులో ఇమిడి, నిజంగా ఘాటు పుట్టించాయి! జీతేరహో సర్వనాశ్!

ఆ సినిమా ఆస్కార్‌కు కూడా నామినేట్ అయిందనే, హీరోల్లో ఒకరికి ఆస్కార్ రావడానికి ఆస్కారం ఉందనీ మీడియా అంతా కోడై కూసింది. సోషల్ మీడియా అంత సీన్' లేదనీ, దాన్ని ప్రయివేట్ ఎంట్రీగా పంపారనీ, ప్లాటినం వర్డ్ ' అవార్డు కోసం లాబీయింగ్ బాగా చేశారనీ, దాదాపు రెండువందల కోట్లు ఖర్చు పెట్టారనీ, 'అసలు నిజం' బయటపెట్టింది! ఈ దేశాన్ని ఆ భగవంతుడే రక్షించుగాక!

ఒక సామాజిక విశ్లేషకుడు ఒక టి.వి. డిబేట్‌లో ఇలా సెలవిచ్చాడు.

"మొత్తం ఇండియాలో మన తెలుగు రాష్ట్రాల్లో ఎస్ డబ్లూసి ఎక్కువ"

"అంటే ఏమిటి ప్రొఫెసర్ రాగేశ్వర్‌గారు?"

"సెలిబ్రిటీ వర్షిప్ సింగ్రోమ్" ముఖ్యంగా ఇది సినిమా హీరోల పట్ల శృతి మించి ఉంది. సిగ్మండ్ ఫ్రాయిడ్ ప్రకారం ఇదో చిత్త చాంచల్యం! మొత్తం దేశంలోని థియేటర్లలో ముప్పై శాతం మన తెలుగు రాష్ట్రాల్లోనే ఉన్నాయి. రోజుకు నాలుగాటలు. రిలీజయినప్పుడు ఆరు ఆటలు వేసినా చూసేంత జనం, తీరిక మనకున్నాయి. ఎన్ని పనిగంటలు వేస్టు?"

ఏమిటో హాస్య కథ రాద్దామని కూర్చుంటే ఇలా తయారైంది! ఇంతకూ దీనిలో హాస్యం ఉందో లేదో మీరే చెప్పాలి మరి!

సమాప్తం

వినాయక చవితి కథల పోటీలో గెలుపొందిన కథలు

# పారా హుషార్ !!!

కథ

వాడపల్లి పూర్ణ కామేశ్వరి

"ఆ ముక్కోపి మళ్ళీ చెడుగుడాడించడానికి తయారైయ్యాడు. కొత్త గొడవ ఏమి లేవనెత్తుతాడో ఏంటో? వీడు చేసే రభసను తట్టుకునే కంటే ఆ కుగ్రామానికి బదిలీ తీసుకు వెళ్ళిపోవడమే మంచిదేమో!?" మనసులో అనుకుంటూ ఏడవలేక చిరునవ్వుపులుముకుని స్నిగ్ధ.

"రెండేళ్ళనుండీ పడుతున్నదేగా, ఇక ఆట్టే గొణక్క సిద్ధమైపొండి" ఉచిత సలహా పారేసాడు వరహాల్రావు.

"రోజుకో వెరైటీ ప్రతిభతో వచ్చి మనల్ని చెడుగుడాడడమే పనిగా పెట్టుకున్నాడు. అతడు పెట్టే టెన్షనుకి రాత్రినిద్రలోకూడా ఇవే పలవరిస్తున్నానంటున్నారు మావారు. విడాకులిస్తానని బెదిరిస్తున్నారు కూడా" జాలిగా అంది స్నిగ్ధ.

నాకిచ్చిన టార్గెట్టంతా పూర్తి చేసేసినా సరే మరో బ్రాంచికి నేనూ బదిలీ తీసుకు వెళ్ళిపోతా! ఒక్క డిపాజిటు కూడా దొరకని పల్లెటూరైనా సిద్ధమే. వీడితో నేన పడలేను సార్! ఇంక నా వల్ల కాదు! నా సహనం అంచులు దాటేసింది.

వినాయక చవితి కథల పోటీలో గెలుపొందిన కథలు

# పారా హుషార్ !!!

ఆ ముక్కోపిని చూసినప్పుడల్లా గుండెల్లో ఎక్స్ప్రెస్సు రైళ్ళేకాదు ఏకంగా వందేభారతులే పరుగెడుతున్నాయంటే నమ్మండి. అనకూడదు కానీ, తిట్లతో సుప్రభాతం పాడి ముక్కుచీదించే చీఫ్-మేనేజరు కంటే నాకు వీడంటేనే ఎక్కువ భయమనుకోండి" కౌంటరులో లెక్కతేలకపోయినా బెంగపడని రెండో కౌంటరు హరి అన్నాడు.

"రోజుకో కొత్తవిద్యతో మనమీదకొచ్చి దండయాత్ర చేయడానికి ఆ మహానుభావుడికి అసలు ఐడియాలెక్కడ దొరుకుతున్నాయో! మొన్నటికి మొన్న వాళ్ళమ్మగారి పెంఛను గురించి దెబ్బలాడాడు. అక్కడికీ ఎంతో సహనంగా చెప్పాను, మేడమ్ గారి ఆఫీసు నుంచీ కాగితం వస్తేగానీ మేమేమీ చేయలేము మహాప్రభో అని. వింటేనా? ఈ పూటే పేమెంటు చేసి, పాసుబుక్కులో ఎంట్రీ వేస్తేకానీ ఇక్కడ్నుంచి కదిలేది లేదనని భీష్మప్రతిజ్ఞతో భైఠాయించాడు. ఆ తరువాత ఆయన్ని తరలించడం మనతరం కాలేదు. అంతకు ముందు మళయాళం భాష నేర్చుకున్నానంటూ చాటలతో చలగాటం ఆడేసాడు. అదొక్కటేనా, క్రితం వారం, ఆయనగారి పాకశాస్త్ర ప్రావీణ్యం ప్రదర్శించి ఈ ఏడాదిగ్గానూ నాకున్న సిక్కు లీవంతా ఖాళీ చేసేసాడు" ధైర్యం నూరి పోసిన నోటనే చేదు జ్ఞాపకాలను వల్లించాడు వరహాల్రావు.

అంతలోనే మార్తాండుడు సీతాపతి రంగప్రవేశం చేయనే చేసాడు.

"నమస్తే కాసుల్రావు గారూ! నాకు మీ సహాయం కావలి" సవినయంగా అభ్యర్ధించాడు సీతాపతి. ముక్కోపి అని బ్యాంకువారు ముద్దుగా పెట్టుకున్న ఆ హింసవాది అసలు నామధేయం, సీతాపతి. అదృష్టవశాత్తూ ఎవరికీ పతి కాలేదు. ఎవరి తపమూ ఫలించక, సీతాపతి బ్రహ్మచారిగానే ఉండిపోయాడు.

నా పేరులో ఉన్నవి వరహాలండీ కాసులు కాదు అని నోటిదాకా వచ్చి కూడా ఊరుకున్నాడు వరహాల్రావు.

"రావుగారు! మా అమ్మ పింఛనుకు వాళ్ళ ఆఫీసునుండి కాగితాలు పంపారుట. మీరన్న మాట నిజమేసుమండోయ్!" అంతరిక్షంలో కొత్తగ్రహాన్ని కనిపెట్టిన శాస్త్రవేత్తలా గర్వం ప్రదర్శించి పళ్ళికిలిస్తూ నవ్వాడు.

"హమ్మయ్య రక్షించావు కదరా మగడా! నెత్తి, నోరూ కొట్టుకుని చెపితే వినకుండా నన్ను కాల్చుకు తిన్నావు! సింగడు అద్దంకి పోనూపోయాడు రానూ వచ్చాడన్నట్టుంది వీడి వ్యవహారం" మనసులోనే అనుకుంటూ బలవంతపు నవ్వుని మొహానికి పులుముకుని నవ్వాడు శ్రీరామ్.

"గొంతులో వెలక్కాయ పడ్డట్టైనా, ఆ ముక్కోపి ముఖంలో అరుదుగా కనిపించే మందహాసానికి మంత్ర ముగ్ధుడై చిరునవ్వుతో బదులిస్తూ, హౌ కాన్ ఐ హెల్ప్ యూ?" సవినయంగా అన్నాడు హరి.

"మీరు సాఫ్టవేరు సామ్రాటు కదా, నా లాపటాప్ లో కొత్తగా సాఫ్టువేరు ఒకటి ఎనేబిల్ చేయాలి. కాస్త చేసి పెడుదురూ" వినయంగా అర్థించాడు సీతాపతి.

"అదేవిటోనండి, నేను ఏం నేర్చుకున్నా ఇట్టే మాస్టరీ చేసేయడం మీకు తెలియంది కాదు. నిన్ననే, మన బ్యాంకు కిందివాటా, అదే మా పక్కపోర్షనులో ఉంటోందిగా మంగళ!, ఆ అమ్మాయి 'ఏదైనా సరే నాకు ఈరోజు జాతకం చెప్పితీరాలి అని పట్టుపట్టిందనుకోండి. ఉన్న విషయం ఉన్నట్టుగా చెప్పాను. ఆ పెద్ద మనిషి ఈ ఉదయమే ఠపీమన్నాడు. మనం లెక్కలేస్తే తప్పే సమస్యే లేదుగా! తూచా తప్పదంటే నమ్మండి!!" సోత్కర్ష చేసుకున్నాడు సీతాపతి.

బ్యాంకు సిబ్బందికి గుండు జారిపోతున్నాయి.

"నా పుట్టినరోజుకానీ,

వినాయక చవితి కథల పోటీలో గెలుపొందిన కథలు

# పారా హుషార్ !!!

నేను సమయంకానీ, ఊరు వివరాలుకానీ వీడికి పొరపాటున కూడా తెలియనివ్వకూడదు. బ్యాంకు యాజమాన్యమే అడిగినా ఇచ్చేది లేదని తనకుతానే ప్రమాణం చేసుకున్నాడు హరి.

"తన వివరాలు వాడి చెవిన పడితే ఎంత గండమో, యీ ప్రమాణాన్ని నిలబెట్టుకోకపోయినా అంతే. నా మెడకి నేనే ఉచ్చు బిగించుకున్నంత పనవుతుంది" మనసులోనే అనుకున్నాడు.

"ఆన్-లైనులో జ్యోతిష్య శాస్త్రం నేర్చుకున్నాను. మీరు సాఫ్టవేర్ లోడ్ చేశాక, గౌరవ సూచకంగా మొదట మీకే జాతకం చెపుతానుసుమండీ!" మొహమాట పెట్టేసాడు సీతాపతి.

'మీ కృతజ్ఞతాభావాన్ని దొంగలెత్తుకెళ్ళా!' మనసులోనే అనుకుంటూ "నాకిప్పుడు జాతకం అవసరం లేదండీ, మీకు సాఫ్టవేర్ లోడ్ చేసి ఎనేబిల్ చేస్తాను" తప్పించుకునే ప్రయత్నం చేసాడు హరి.

ట్రాఫిక్కు లైట్లలో ఇరుక్కుపోయిన వాహనం తంతైంది హరి పని. ఇరుక్కుపోయాడు. ముందుకెళితే నుయ్యి వెన్నకి వెళితే గొయ్యి అన్నట్టు, సరేనంటే జాతకంతో చంపేస్తాడు, కాదంటే ఇప్పటికప్పుడే మరేదో ప్రదర్శించి ఇరికిస్తాడు అదీ కాదంటే అమ్మ పింఛను అంటూ కరుస్తాడు.

"అసలు వీడి భవంతిలో బ్యాంకు అద్దెకు తీసుకున్న మన యాజమాన్యాన్ననాలి. వీడున్న ఊళ్ళోకే రాకూడదనుకుంటే వీడి ఇంట్లోనే బ్యాంకు పెట్టారు. తప్పుతుందా?" బ్యాంకు యాజమాన్యానంతా తిట్టుకుని శపించినంత పని చేశాడు హరి.

క్లోజింగ్ సమయం కావడంతో అప్పటికి చిట్టాపై శ్రద్ధపెట్టి గండం గట్టెక్కిందనుకుని సరిపెట్టేస్తూ ఊపిరి పీల్చుకున్నాడు.

అందరి కంటే సహనశీలి, ఎలాంటి కష్టమర్నైనా ఇట్టే మేనేజ్ చేయగల సామర్థ్యం ఉన్నదన్న కితాబున్న హరిగారి పరిస్థితిని చూసి నవ్వుకున్నాడు అందరిలోకీ జూనియర్రైన కళ్యాణ్. ఆయన పరిస్థితే ఇదైతే, మరి మనసంగతేంటో అని అనుకునే లోపే.....

"మిస్టర్ కళ్యాణ్, నేను నా శాలరీ అకౌంట్ ఇక్కడ నుంచి క్లోజ్ చేసేద్దామనుకుంటున్నానోయ్. ఆ మేరకు ఇదిగో లెటర్" చిరాగ్గా పేపర్ విసిరాడు సీతాపతి.

"హమ్మయ్య, గొడవొదిలిపోతుంది. ఇంక నేను ట్రాన్స్ఫర్ తీసుకోవక్కర్లేదు. ఒక్క ట్రాన్స్ఫరేమిటి విడాకుల ప్రమాదమూ తప్పుతుంది" అంతలోనే ఆనంద పడింది స్నిగ్ధ.

"మొన్న నేను వచ్చినప్పుడు మీ సిబ్బంది నాతో సరిగ్గా వ్యవహరించకపోగా, వెటకారంగా నవ్వారు!" మరో అభాండం వేస్తూ కొత్త ఆయుధాన్ని ప్రయోగించాడు సీతాపతి. "ఇంక మీ బ్యాంకులో ఖాతా ఉంచుకోవడం అనవసరమనిపించింది, ఆ మేరకు హెడ్-ఆఫీసుకి ఫిర్యాదు చేస్తూ లేఖ కూడా వ్రాశాను ఇదిగో" అంటూ విసిరాడు.

ప్రపంచ బ్యాంకుకు తమ కష్టాలు చెప్పుకుంటూ అప్పు ఇవ్వమని అర్జీ పెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన వివరణంత ఉంది ఆ లేఖలో!!

"మీ కంపెనీ పాలసీ ప్రకారం అందరి శాలరీ అకౌంటు ఇక్కడే మాండేటరీ అనుకుంటాను, చూసుకోండి. ఆపై మీ ఇష్టం" చిరాకు దాచుకుంటూ క్లోజర్ ఫారం ఇచ్చి అన్నాడు కళ్యాణ్.

అక్కడినుండి కాఫీ ఫ్లాస్కుతో తప్పుకుంటున్న పరమశివాన్ని పిలిచాడు సీతాపతి.

"ఏవోయ్ పరమశివం, మీ అమ్మాయి జాతకం తెమ్మని చెప్పానా? ఏదీ తెచ్చావుటోయ్?"

వినాయక చవితి కథల పోటీలో గెలుపొందిన కథలు

# పారా హుషార్ !!!

అడిగాడు.

"తెచ్చాను సర్, ఐనా ఇంకొన్నాళ్ళు నేర్చుకున్నాక చెపుదురుగాని, నాకిప్పుడేం తొందరలేదు సార్, అమ్మాయికి పెళ్ళి మరో మూడేళ్ళ తరువాతే చేస్తాను" అడకత్తెరలో పడ్డ పోక-చెక్కలా నలిగిపోతూ అన్నాడు.

"మరదే! నేను ఆన్-లైన్ కోచింగ్ తీసుకున్నాకా ఎంతమందికి చెప్పాననుకున్నావు? నువ్వనుకున్నప్పుడు పెళ్ళి చేయడానికి ఎలా కుదురుతుంది. ఎప్పుడవుతుందో నేను చెప్పాలికానీ. జ్యోతిష్య ప్రజ్ఞ అని బోర్డుపెట్టి కమర్షియల్గానూ రేపట్నుంచి ప్రాక్టీసు ప్రారంభిస్తాను. ఏదో సేవ చేసినట్టూ అవుతుంది, నాలుగు రాళ్ళూ సంపాదించవచ్చు. ఈ లోపైతే నీకు ఫ్రీగా చెపుదామనీ" సులువుని వివరించాడు సీతాపతి.

"హమ్మయ్య, ఆ యావలో పడితే మనల్ని కాల్చుకు తినడం తగ్గుతుంది" గొణుక్కున్నాడు శ్రీరామ్.

కాదంటే కోపం వస్తుంది, మళ్ళీ అరుస్తాడు, బిక్కుబిక్కు మంటూ కాగితం చేతిలో పెట్టాడు పరమశివం. అలా పరమశివం కూతురి జాతకం చూడడం మొదలెట్టిన సీతాపతి, "ఇంక వారం రోజుల్లో మీ అమ్మాయికి పెద్ద గండముందోయ్. జాగ్రత్త మరి. పరిష్కారాలు అవీ నాకు తెలియవు కానీ, కొంపలు ముంచుకొస్తున్నాయని మాత్రం నాలుగో ఇంట్లో ఉన్న రాహువు, రెండింట శనీ చెపుతున్నాయి" హిరోషిమా బాంబులాంటి వార్తని పేల్చాడు.

"అదేటండయ్యగారు, నిక్షేపంలా ఉన్నపిల్ల. ఇప్పుడేమవుతుందో ఏంటో. ఏదైన ఉపాయముంటే ఆ చేత్తోనే సెబుదురూ?" కంగారుగా అడిగాడు పరమశివం.

"నేను నేర్చుకున్న ఆన్లైన్ జ్యోతిష్య-శాస్త్రంలో పరిహారాల గురించి చెప్పలేదు మరి. గ్రహ-స్థానాల గండాల గురించి మాత్రమే చెప్పారు" తేల్చేసాడు సీతాపతి.

"మరి యాటి వల్ల నాకేటి ప్రయోజనం సారు. మునుపు ఇట్టా ఎవరు సెప్పలేదు అయ్యగోరు. కాస్త కట్టంగా ఉంటే ఈ పరిహారం సేసుకోండి అని సెప్పేవారు. అసలు ఎంతటి కట్టమొస్తుందో కూడా సెప్పేవారు కాదు. ఉపద్రవమని సెపుతూ, పరిష్కారం సెప్పకపోతే ఎట్టా?" వచ్చిపడ్డ కొత్త కష్టానికి ఆక్రోశపడ్డాడు పరమశివం.

"అంటే, నా జ్యోతిష్య ప్రావీణ్యాన్ని శంకిస్తున్నావా? ఎంతో కూలంకషంగా పరిశీలిస్తున్నానో నీకు తెలుసా?" ఆగ్రహం వ్యక్తం చేసాడు సీతాపతి.

అది కాదండయ్యా, "ఏదో నా మానాన నేనుండానా? చెప్పే తీరతాను అని పట్టుపట్టి ఇప్పుడు ఇట్టా సిక్కులు పెడితే ఎట్టాగండీ" విచారంగా తలగోక్కుంటూ అన్నాడు.

ఇక లాభంలేదు, అమ్మాయి జాతకం సంగతటుంచి ఈ ముక్కోపి కోపానికి, నేర్చుకొచ్చి ప్రదర్శిస్తున్న ఇద్దెలకీ ఏదో ఉపాయం చూడాలి మనసులోనే అనుకున్నాడు పరిమశివం.

★★★★★

"రావయ్యా రమేశు, కొత్తంగా సేరిన పిండ్ల-వాండివే కదా? సిన్న పిల్లవాండవు. బిన్న వేల నేర్సేసువు. వేరె ఎస్.ఎమ్ లీవ్ పోడుస్తుడు. నిండా కష్టంగా వుంది అబ్బయో, ఒక్కోసారి రెండు షిఫ్టులు నానుదా సూసూకుంటున్నాను. నువ్వు వచ్చింది నాకు నిండా సంతోషంగా వుండాది" అన్నారు అక్కడి స్టేషన్ ఇంచార్జి కుప్పుసామి.

SUMATHI TV Channel
సుమతి

వినాయక చవితి
కథల పోటీలో
గెలుపొందిన
కథలు

# పారా హుషార్ !!!

"ట్రైనింగ్ సక్కంగా ముడింజుదా, నీకు నిండా మంచి పేరు వచ్చునని సెప్పినారు నా ఫ్రెండు, అదే సామీ, ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ఇన్స్ట్రక్టరు"

"భయపడ మాలాదు. నేనుండానుగా!" బెరుకుగా చూస్తున్న రమేశ్ కి మళ్ళీ ధైర్యం చెప్పాడు కుప్పుసామి.

"సరీ, నీకు డ్యూటీ సెప్పి నేను ఊటీకి పోయిడుస్తాను" సరియా అన్నాడు.

సరేనన్నట్టు తలూపాడు రమేశ్.

"మన స్టేషనులో రెండు బండ్లుదా నిలుచును, నాలుగు బండ్లు వచ్చును. ఎ–కేబిన్ నుండి వచ్చు బండికి మూడు సార్లు గంట కొట్టవాలి. ఆ పక్క బి–కేబిన్ నుండి వచ్చే బండికి రెండు సార్లు కొట్టవాలి. సరిదాన" అంటూ తాను చెప్పింది అర్థమయ్యిందా అన్నట్టు అన్నాడు.

స్టేషన్ బోర్డు వైపుకి, అక్కడున్న రెండు ఫోన్ల వైపుకి, పేనెల్ వైపుకి చూస్తూ నిలబడ్డాడు రమేశ్.

"ఆ తట్టు దూరంగా వుంది సూడు, అంగడి. ఆడ టిఫినూ, టీ దొరుకును. కావాల్నంటే ఆడపోయి తినవచ్చు. డ్యూటీలో వున్న ఎస్. ఎమ్ స్టేషన్ మాత్రం అసలు ఉడువ కూడాదు. ట్రైనింగ్ ల సెప్పిచ్చినారుదానా" ఆప్యాయంగా చెపుతూనే హెచ్చరికగా అన్నాడు స్టేషన్ మేనేజర్ కుప్పుసామి.

"సరి తంబీ, నాకు డ్యూటీ ముడింజదు. నేను పోయేసి వస్తునా," అన్నాడు.

"సరే సార్" వినయంగా బదులిచ్చాడు రమేశ్, ఆయన మాట కొంచం కూడా అర్థంకాకపోయినా, అర్థమైనట్టు నటిస్తూ.

మొదటిరోజు స్టేషనులో డ్యూటీకి చేరిన ఇరవై రెండేళ్ళ రమేశ్ తడుకు స్టేషన్ ప్లాట్ఫారంపై నిలబడి చుట్టూ పరికించి చుస్తూన్నాడు. తేటతెల్లని యూనీఫారము, నేమ్–బాడ్జ ధరించి దర్పంగా నిలబడివున్న అతనికి డ్యూటీలో చేరినందుకు ఆనందంగానే ఉన్నా, చిన్న స్టేషనైన తడుకులో మొదటి పోస్టింగు వచ్చినందుకు భయంగానూ ఉంది.

నిర్మానుష్యమైన ప్రదేశం, దూరంగా విశాలంగా విస్తురించుకుని కనిపిస్తున్న తిరుపతి కొండలు. సుమారు 30 కిలో మీటర్ల దూరంలో తిరుపతి నగరం. మంచు ముసుగు కప్పుకున్న కొండల మధ్య దాకున్నట్టుగా తడుకు స్టేషను. దాని చుట్టూ మావిడి తోటలు, నాలుగు వైపులనుండీ వీస్తున్న చల్లటి గాలులు. సరిగ్గా ఒకటో నంబరు ప్లాటుఫారం నుంచి చూస్తే దూరంగా తిరుమల కొండమీద శంఖుచక్ర పార్కులో పెద్దగా అమర్చిన స్వామివారి నామాలు చిన్నగా కనిపించాయి. డ్యూటీ మొదలెట్టే ముందు, ఆ వెంకన్నబాబుకు అక్కడి నుంచే దణ్ణం పెట్టుకున్నాడు రమేశ్. అక్కడికి ఇంచు మించు మున్నై మీటర్ల దూరం లో ఒక చిన్న గుడిసె. ఆ గుడిసెలో ఒక అవ్వ, ఆమె కూతురేమోననిపించే మధ్య వయస్కురాలు. ఆ పక్కనే నాలుగు గేదలు. ఆ గేదెలను కాసుకుంటున్న ఒక పదహారేళ్ళ అబ్బాయి.

ఒంటికాయ శొంటిపిక్కలా ఉన్నాడు రమేశ్. బిక్కుబిక్కుమంటూ ఉన్న రమేశ్ కి నిర్మానుష్య ప్రాంతంలో మనిషల్ని చూసే సరికే ప్రాణం లేచొచ్చింది. పుష్కరాల్లో అయినవాళ్ళకు దూరమై మరుసటి పుష్కరాల్లో మళ్ళీ కలిసినంత ఆనందం కలిగింది. కాస్త ధైర్యం కూడగట్టుకుని స్టేషన్ రూమ్ లోకి వెళ్లి సీట్ లో కూర్చున్నాడు.

తడుకు స్టేషనులో పనిచేయడానికి వచ్చిన ప్రతీ కొత్త ఉద్యోగికీ తనను తాను పరిచయం చేసుకుని వెళ్ళడం ఆ కుర్రాడికి అలవాటు. కొత్త శాల్తీని చూసి కొద్ది సేపట్లోనే అక్కడికి చేరాడు.

"కొత్తగా వస్తురా సార్. మేము ఈడనే వుంటాము, నా పేరు మురుగరాజు" అన్నాడు.

ఊఁ అన్నట్టు తలూపాడు రమేశ్.

ఇంతలో ఫోన్ మోగింది. ఏ

# పారా హుషార్ !!!

ఫోన్ తీయాలో, ఏ బటన్ నొక్కి మాట్లాడాలో తెలియక తికమక పడ్డాడు రమేశ్.

"ట్రింగ్,ట్రింగ్, ట్రిట్రింగ్ అని వస్తే అది ఏ-కేబిన్ ఫోన్ సార్, అట్టనే ట్రింగ్,ట్రింగ్, ట్రింగ్ ట్రీం....గ్ అని వస్తే అది బి-కేబిన్ ఫోన్. ఎడుతుట్టు (ఎత్తి), ఓకే సెప్పి ఆడకుపోయి గంట కొట్టాల, జనమంతా గంట సత్తం కేటి (గంట శబ్దం విని) వస్తురు" బోధించాడు ఆ కుర్రాడు.

కురుక్షేత్రంలోకి ప్రవేశించిన అర్జునుడికి కృష్ణ పరమాత్ముడు కర్తవ్యం బోధించినట్టనిపించింది రమేశ్ కి.

ప్రత్యక్షంగా చూడడంతో పాఠం చక్కగా బోధపడింది. సరే నన్నట్టు ఫోనెత్తి కేబిన్ తో మాట్లాడి. గంట దగ్గరకి వెళ్ళాడు రమేశ్.

టాంగ్ టాంగ్ ఠాంగ్ మని మూడు సార్లు గట్టిగా గంట కొట్టాడు.

"అయ్యో, అట్టా కొట్ట కూడాదు సార్. రెండు సార్లు దా కొట్టవాల", మళ్ళీ వివరించాడు ఆ కుర్రాడు.

"చిన్నప్పుడు స్కూల్లో విన్నదీ మూడు గంటలే, అప్పుడప్పుడూ గుళ్ళకు వెళ్ళినప్పుడు కొట్టేది మూడుసార్లేగా, ఇక్కడ రెండేసార్లు కొట్టాలేంటి చెప్మా.." బుర్రగోక్కున్నాడు.

"బి-కేబిన్ ఫోనుకుదా మూడు తూర్లు కొట్టవాలే", యీ మాటు మరింత క్లారిటీ ఇచ్చాడు కుర్రాడు.

"గురుకులంలో ద్రోణాచార్యులవారు ధనుర్విద్యలోని అన్ని మెలకువలూ అర్జునుడికి మాత్రమే చెప్పి, తనకు చెప్పలేదని అనుకున్న దుర్యోధనుడికి మల్లే, ట్రైనింగులో ఇంత డీటైల్డుగా చెప్పలేదే" అనుకున్నాడు రమేశ్.

జరిగిన ఘోరాన్ని సవరిస్తూ, రెండు-మూడు రకాలగా ఈల కూతలతో సిగ్నల్స్ పంపాడు ఆ కుర్రాడు. దాంతో విషయమర్ధమయ్యిన ప్రయాణికులందరూ ఇట్టే వచ్చేసారు ఆ బండికి.

"హమ్మయ్య, పెద్ద పొరపాటును తప్పించి కాపాడాడు వీడు, మనసులోనే కృతజ్ఞతలు తెలుపుకుంటూ, వీడికి చాలా విషయాలే తెలుసునని అర్థమైయ్యి, నీ పేరూ??" అతడు ముందుగానే చెప్పిన సంగతి మరచి మళ్ళీ అడిగాడు రమేశ్.

"నాన్ మురుగరాజు సార్. మా నైన నేను పుట్టినప్పుడు తిరుత్తనిల ఉంటిరి. అందుకని, ఆ పేరు పెట్టిరి" అన్నీ సెప్పిన సారూ, మీరు ఇనలే, ఏ మాత్రం మొహమాటపడకుండా అనేసాడు ఆ కుర్రాడు.

"రాజు! మీకు ఇక్కడ ఉండడానికి భయమేయ్యదా?" అడిగాడు రమేశ్.

"భయమా?
ఎదుకు భయం సార్. నిండా మడుసులు కూటం ఉండేకాడ కంటే యీడే మంచిది సార్" ఒక్క ముక్కలో వేదాంతిలా తేల్చేసాడు రాజు.

★★★★★

ఇటుకపొడి కలిపితే వచ్చిన వర్ణంలా ఎర్రని రంగులో మురుగా వాళ్ళమ్మ పెట్టే టీకి బలవంతంగా అలవాటు పడ్డాడు రమేశ. చిన్నప్పుడు పుస్తకాలను అంటించుకోవడానికి మైదాతో ఉడికించిన లైపిండిలా వుండే ఇడ్లీలు మింగుడు పడేవి కాదు. రోజుకో సాహసానికి పూనుకున్నట్టుండేది తడుకు పోస్టింగు. ఆరు నెలలు గడిచిపోయాయి. ఎలాగో అలా గడిపుకుంటుండగా, అక్కడ్నుంచి పారిపోవాలనిపించే సంఘటన ఒకటి జరిగింది.

స్టేషన్ లోకి అడుగు పెడుతున్న రమేశ్ కి ఒక పెద్ద పాము స్వాగతం పలికింది. షుమారు పన్నెండు అడుగుల పామును చూసేసరికి కాళ్ళు చేతులు ఆడలేదు. ఒంట్లో దడపుట్టుకొచ్చింది. ఒక్కసారిగా పరుగు లంకించుకున్నాడు. ఎత్తిన పరుగు ఆపింది గుడిసె దగ్గరకు చేరాకే.

"బండి టైం ఇంకా కాలేదుగా,

వినాయక చవితి కథల పోటీలో గెలుపొందిన కథలు

# పారా హుషార్ !!!

ఇంత బిన్న వస్తురే. టీ ఇస్తును, ఉండుమే సార్" అందే కానీ, మరేమీ పట్టించుకోలేదు మురుగ వాళ్ళమ్మ. ముచ్చెమటలు పోసి గాబరా చూస్తున్న రమేశ్ భయం అతడు చెప్పేదాకా అర్థమవ్వలేదు.

"ఏంది జరిగింది సారు, అప్పడీ వేర్తికొట్రదు (చెమటలు పట్టాయి)" అని అడిగింది.

ప..ప..పాము అని ఎక్కు పెడుతూ అన్నాడు.

"మురుగా, కొంచం సూసి వస్తువా", అంతే ప్రశాంతంగా అంది ఆమె.

ఏమాత్రము హడావిడి పడకుండా నిదానంగా నడుస్తున్న రాజు వెనకాతలే బిక్కచచ్చి పోయి, బిగుసుకుపోయి నడుస్తున్నాడు రమేశ్.

"ఎన్న పాంబు సార్?? నల్ల పాంబా, పుత్తుపాంబా" అని అడిగాడు రాజు.

"ఏం పామో ఏంటో. ఊరు,పేరు, జాతకం అడిగా వస్తాను?? దాన్ని చూస్తూనే వణుకూ, దడ పుట్టుకొచ్చింది" గగుర్పాటుగా అన్నాడు రమేశ్.

"అడడా, ఉండుండి సార్. ఒన్నుం సేయాదు. మీకు నిండా బయం జాస్తి" అన్నాడు.

అదేదో వాళ్ళిద్దరికీ మధ్య రోజూ సంభాషించుకునే అలవాటున్నట్టు గదికి చేరుతూనే ష్..శ్..అంటూ వింత సౌండ్లు చేసి మూలగా వున్న గార్డ్ బాక్సు వెనకాతల దూరున్న ఆ పాముని ఇవతలికి వచ్చేట్టు చేసి, దాని తోక పట్టుకుని పొదల్లోకి ఇట్టే వదిలేసాడు రాజు.

"మళ్ళీ వస్తుందేమో కదా? ఆలా వదిలేసావేంటీ?" ఇంకా భయపడుతూనే అడిగాడు.

"మర్లా రావదు సార్, బయం వేండా" అని అభయంమిచ్చాడు.

"అదేదో ఆ పాముతో ఎగ్రిమెంటు రాసుకున్నట్టు ఈ భరోసా ఏంటిరా?" మనసులో అనుకున్నాడే కానీ పైకి అనలేకపోయాడు.

ఆ రాత్రంతా నిద్ర పట్టలేదు రమేశ్ కి. ఎలాగైనా యీ బెడదనుంచి తప్పించుకోవాలనుకున్నాడు. ఐతే ఉద్యోగంలో చేరి పట్టుమని పది నెలలైనా కాకుండా బదిలీ అడగలేడు. అడిగినా ఇవ్వరు. ఎంతో మంది సీనియర్లు అప్లికేషను పెట్టుకుని వుండడంతో దరఖాస్తు సీనియరిటీ ప్రకారమే వస్తుంది. అందువల్ల వేరే పరిష్కార మార్గం చూడాలనుకున్నాడు. ఈ స్టేషను బాధల నుంచి బయట ఎప్పుడు, ఎలా పడగలనో చక్కటి ఉపాయాలను చెప్పే మేనత్త భర్త పరమశివమే గతి అనుకున్నాడు రమేశ్. తల్లితండ్రులు పోయాక డిగ్రీ చదివించిన అత్తయ్యే తనకున్న పెద్దదిక్కు. రమేశ్ కి ఉన్న ఏకైక సలహాదారు పరమశివమే. ఎప్పుడు ఎలాంటి సమస్యొచ్చినా చమత్కారంగా ఇట్టే పరిష్కారం చెబుతాడు. దొరికిన రెండు రోజుల ఆఫ్ ను ఉపయోగించుకుని వాళ్ళింటికి పయనమైయ్యాడు.

★★★★★★★

బ్యాంకుకొచ్చిన 'పారాహుషార్' దినపత్రిక సబ్-ఎడిటర్ గారితో వాదులాడుతున్నాడు సీతాపతి.

"నేనీమధ్య అచ్చతెలుగులో కథలు వ్రాస్తున్నాను. ఆదరిస్తారని మీ ఆఫీసుకు పంపాను. తెలుగువారు బొత్తిగా తెలుగు మాట్లాడడం మానేస్తున్నందువల్ల, మరో యాభై సంవత్సరాలలో తెలుగు భాష కనుమరుగైపోతుందన్న భయం మెండుగా కనిపిస్తోంది. అంచేత తెలుగు భాషను పరిరక్షించే బాధ్యతతో నేను చేస్తున్న చిరు ప్రయత్నమిది. తెలుగు తన ఉనికిని కోల్పోతున్నందున, ఆ భారాన్ని తమ నెత్తిన వేసుకోగల ధీరులు మన భాషకు కావాలి. అది మనమే ఎందుకు కాకూడదన్న ఆలోచనతో యీ తొలి అడుగు" గర్వంగా అరనవ్వు విసురుతూ అన్నాడు.

"ఐతే, తెలుగు పత్రిక యాజమాన్యం ప్రతినిధిగా మీలో ఆ సామాజిక బాధ్యత లోపించడం విచారకరం" చిరునవ్వు గాభీర్యంగా మారగా సీతాపతి ప్రశ్నకు నోరు వెళ్ళబెట్టాడు

# పారా హుషార్ !!!

ఎడిటరు.

ముంచుకొస్తున్న ప్రమాదాన్ని ఎలా అరికట్టాలో తెలియక అయోమయంలో పడ్డారు సంభాషణను వింటున్న బ్యాంకు సిబ్బంది. ఊళ్ళోనే పేరొందిన సంస్థ ఎడిటరుగారు. తమ ఆఫీసు అకౌంటుతో సహా స్టాఫు జీతాల ఖాతాలన్నీ మన బ్యాంకులోనే ఉన్నాయి. సీతాపతి దెబ్బతో వారు ఆ ఖాతాలన్నీ క్లోజు చేయడం ఖాయం అనుకున్నాడు హరి.

ఉద్వేగంగా మాట్లాడుతున్న సీతాపతిని ఆపే ధైర్యం మాత్రం ఎవ్వరూ చెయ్యలేక శ్రోతలుగానే మిగిలారు. ఇక ఎడిటరు గారిని చూస్తూ, "మొన్న మీ ఆఫీసుకి సండే సంచిక కోసం నేను వ్రాసిన సందేశాత్మక కథను పంపాను. అందులో ఒక్క ముక్క కూడా చదవకుండా, మీరు ఎలా తిరస్కరిస్తారు? అసలు, చదివి ఉంటే తిరస్కరణకు కారణాలు చెప్పాలి" నిలదీసాడు సీతాపతి.

ఎడిటరుని అంగుళమైనా కదలనియ్యకుండా మొండిగా అక్కడ్నుంచి తాను కదలకుండా కడిగేస్తున్నాడు. ఎప్పటికప్పుడు గుర్తింపు సంక్షోభంతో ఏదో ఒకటి చేసి గుర్తింపు పొందాలని తాపత్రయపడే సీతాపతి చేతికి వలలో పడ్డ పిట్టలా చిక్కాడు ఎడిటరు. అవతల పత్రికాఫీసులో ముఖ్యమైన పని హడావిడిలో ఉన్నా ఇతడిని వదుల్చుకునే అవకాశంలేక కుడితిలో పడ్డ ఎలుకలా గిలగిలలాడుతున్నాడు.

మచ్చుక్కి నా తెలుగు ప్రావీణ్యాన్ని చూపిస్తానుండండి అంటూ, "శుష్కపత్ర కషాయ సుశర్కర క్షీర సమ్మిళిత ఉష్ణపానీయము తీసుకుని రాగలవా?? " ప్యూను పరమశివంతో అన్నాడు.

"తెలుగు భాషనుద్ధరించే భారం మీదవేసుకున్న తరువాత తప్పదు కదా. ఆరునూరైనా సరే ఆంగ్ల పదాలు వాడను. వెళ్ళు తీసుకురా?" మాట గాంభీరంతో పాటూ ఈ సారి చిరుగర్వమూ తొణికిసలాడింది సీతాపతి ముఖంలో.

"అదేంటండీ, తెలిస్తేనా తెచ్చేదీ" తెల్లమొహమేస్తూ అడిగాడే గానీ, మూర్చొచ్చినంత పనైంది పరమశివానికి, కానీ ఆరోజు కూతురి జాతకం విషయం గురించి వచ్చినప్పుడు తను చేసుకున్న శపథాన్ని తలచుకున్నాడు.

"ఎడిటరుగారికీ నాకు పట్రా… " ఈ సారి కోపంగా ఆదేశించాడు సీతాపతి.

"మా చెడ్డ చికాకొచ్చేసింది బాబు మీతో. ఏటి తేవాలో తెలీకుండా ఏంతెద్దునేటీ!!" బుర్రగోక్కుంటూ ఆముదంతాగిన మొహం పెట్టి అన్నాడే కానీ బుర్ర మాత్రం వీడి ఆట ఎలా కట్టాలా అని పాదరసంలా పని చేస్తూనే ఉంది.

"పిలుపు గంటను కొట్టిన పదినిముషాలకు కూడా హాజరు కానందున నీ సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తూ ఆదేశాలివ్వమని నేను బ్యాంకు అధికారులను అభ్యర్థిస్తున్నాను" మరో బాణం విసిరాడు సీతాపతి.

ఈ మధ్య గుమాస్తా పదవి పరీక్షలకు హాజరవ్వడానికి తయారవుతూ ఇంగ్లీషు మాట్లాడడం కూడా ప్రాక్టీసు చేస్తున్న వెంకన్నకు ఇది మరింత చిక్కుగా మారింది. అసలే కొత్త భాషైన ఆంగ్లంతో రోజూ కుస్తీపడుతూ సతమతమవుతున్నాడు. ఇప్పుడు, యీ కొత్త రకమైన సంకర భాషేంటోనని తికమక పడ్డాడు.

సరిగ్గా అప్పుడే రంగప్రవేశం చేశాడు రమేశ్.

"మావయ్యా, నన్నా తడుకు గండంనుంచి నువ్వే కాపాడాలి" అంటూ వరాలిచ్చే శివుణ్ణి భక్తుడడిగినట్టు పరమశివాన్ని అడిగాడు.

రాజేశ్ మావయ్యను పలుకరిస్తుండగా, అక్కడ్నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్న ఎడిటరు, మంచి అదును దొరికిందనుకుని జారుకున్నాడు. మావయ్యతో తన తడుకు స్టేషను

# పారా హుషార్ !!!

కష్టాల చిట్టాని విప్పి చెప్పాడు. బుర్ర పాదరసంలా పనిచేసే పరమశివానికి మాంచి ఉపాయం తోచింది. సీతాపతి వైపుకి చూస్తూ, "సార్, మీరు నాకిప్పుడు, అడగడమే తడువుగా వరాలిచ్చే పరమేశ్వరుడిలా కనిపిస్తున్నారు. మీ వరం కోసం వచ్చిన పిల్లవాడు వీడు, నా మేనల్లుడు. మీరు కాదనకూడదు, ఇవి చేతులు కావు...." బతిమాలాడు పరమశివం.

సీతాపతిని ఆమడ దూరం నుంచి చూస్తూనే పారిపోయేవాళ్ళేకానీ, వాళ్ళంతటవారుగా వచ్చి చిక్కేవారు తారసపడరు. ఉప్పొంగుతున్న గర్వాన్ని అణచుకుంటూ, మరో మాంచి గిరాకీ దొరికిందని లోలోపలే ఆనంద పడ్డాడు సీతాపతి.

"ఏవిటోనోయ్, మరీ మొహమాట పెట్టేస్తున్నావు" అంటునే రాజేశ్ ని వివరమడిగాడు సీతాపతి. "సార్. ఆడికి స్టేషను డ్యూటీలు సార్, మీరు ఇక్కడ బ్యాంకుకి వచ్చినట్టే ఆడి స్టేషను వద్దకు వెళ్ళి అక్కడ ప్రశాంతంగా జాతకాలు చెపితే ఎంతో బాగుంటుంది. అక్కడి జనాలు మిమ్మల్ని గౌరవిస్తారు. ఇందులో మరో లాభం కూడా ఉంది. మీరు చక్కటి కథలు రాసుకునే ప్రశాంత వాతావరణం, ఎన్నో మంచి కథలు మీకు దొరుకుతాయి. అంతే కాదు అక్కడి జనాభాకు మీ సేవలు ఎంతో అవసరం, కాదనకండి సార్", అభ్యర్థించాడు పరమశివం.

★★★★★

తడుకు స్టేషనంతా కాపుకాస్తూ రైల్వేవారు నియమించకుండానే భద్రతా బాధ్యతలను స్వీకరించిన సీతాపతి. భయాన్ని వీడి హాయిగా డ్యూటీ చేసుకుంటున్న రమేశ్. తుపాకీ గుండుకి సైతం మనిషన్నవాడు చిక్కని ప్రదేశంలో, కనీసం వీడైనా చిక్కాడని రాజును బలితీసుకునే ప్రయత్నం శాయశక్తులా చేస్తున్న సీతాపతితో, "అడ ఉండుమే సార్. తలరాత ఎవురు సెప్పునొత్తురు. మనమే మన రాత రాసుకుందుమే! సూడు నాంగ(మేము) వర్ష కణకా (ఏళ్ళ తరబడి) యీడ సక్కంగున్నము. బతుకంటే భయమే లేదు, ఏమవుతాదో అను యోసనే లేదు. మా మురుగా మమ్మల్ని సక్కంగ సూత్తుడు. ఆనా, సావు రాకనే బయముతో ఇట్ట సచ్చేది మాకు మాలదు సార్. మీరు రమేశ్ సారుకు బద్రం సొల్లిటు పోంగ. సార్ ను మేము నల్ల సూసూకుంటుము" అన్నాడు రాజు.

బ్రహ్మాండాన్నంతా నోట్లో చూపించిన కృష్ణుడిలా, గేదెలను కాచుకునే కర్రను గిరగిరా తిప్పుతూ, తమ జీవితం తమ చేతుల్లోనే ఉందన్న వేదాంతాన్ని బోధించాడు మురుగరాజు.

కురుక్షేత్ర యుద్ధంలో ఓడిపోయిన దుర్యోధనుడిలా మొహం వేలాడేసాడు సీతాపతి.

రోజులు గిర్రున తిరిగిపోయాయి. ముక్కోపి బెడదలేకుండా ఏడాది ఎలా గడిచిపోయిందో తెలియలేదు బ్యాంకు సిబ్బందికి. బదిలీ అప్లికేషను వాపసు తీసుకుంది ప్రజ్ఞ. ప్రమోషను వచ్చి బాధ్యత పెరిగింది కళ్యాణ్ కి. అందరూ పనుల్లో మునిగి ఉండగా, బ్యాంకులో ప్రత్యక్షమైన సీతాపతి. "అమ్మా కులాసానా?" కుశల ప్రశ్న వేస్తూ, మృదువుగా పలుకరించాడు. మూర్ఛొచ్చినంతపనైంది ప్రజ్ఞకు. నోరు వెళ్ళబెట్టి లేచి నుంచుండిపోయాడు కళ్యాణ్. "ఏం బాబూ మీకు ప్రమోషను వచ్చిందిటకదా చాలా సంతోషం" అన్నాడు సీతాపతి.

"ఇల్లమ్మేస్తున్నాను. మీ బ్యాంకుకి ఇబ్బంది కలగకుండా మీ యాజమాన్యమే కొనుక్కుంటానన్నారు. నేను కిందనున్న చిన్న పోర్షనులో ఉంటాను" అంటున్న ఆయన తీరును చూసి ముక్కున వేలేసుకున్నారు బ్యాంకు సిబ్బంది. రాబోతున్న సీతాపతిని చూసి 'పారాహుషార్' అంటూ సైగ చేసిన పరమశివానికి తన పాచికపారినా జీర్ణించుకోలేక మూర్ఛ వచ్చినంతపనైంది.★★★


మన పురాణాలు

# మహాభారతంలో ఉపాఖ్యానాలు

## అష్టావక్రుడి చరిత్ర



**ఆచార్య ఇరపని మాధవి**



పూర్వం ఏకపాదుడు అనే మహా విద్వాంసుడైన ముని సుజాత అనే ఆమెను వివాహం చేసుకున్నాడు. శిష్యుల చేత నిరంతరం వేదాధ్యయనం, విద్యాభ్యాసం చేయిస్తూ ఉండేవాడు ఏకపాదుడు. సుజాత గర్భవతి అయింది. ఒకరోజు గర్భంలో ఉన్న శిశువు తండ్రితో " నీ శిష్యులు పగలనక, రేయనక ఎడతెరిపి లేకుండా విద్యాభ్యాసం చేయటం చేత వారు మందబుద్ధులవుతున్నారు. నిద్ర లేకపోవడం చేత వేదపాఠాలను తప్పుగా చదువుతున్నారు. ఈ విధంగా తప్పుగా చదివించటం ఎందుకు" అన్నాడు. దానికి ఏకపాదుడు గర్భస్థ శిశువుపై ఆగ్రహించి "నీవు వేదాధ్యయనాన్ని వక్రంగా విమర్శించావు కాబట్టి అష్టావక్రుడివై పుట్టు" అని శపించాడు.

మన
పురాణాలు

# అష్టావక్రుడి చరిత్ర

సుజాత గర్భంలో నిప్పుతో సమానమైన మహానుభావుడు పెరుగుతున్నాడు. ప్రసవ సమయం సమీపించటం గమనించి భర్తతో " భూమ్మీద నిరుపేదలు కూడా పురిటి సమయానికి ముందే నేయి, నూనె, తిండిగింజలు తెచ్చి పెట్టుకుంటారు. మనం ధనం లేని వారం కాబట్టి మనకు అవి సులభంగా దొరికేవి కావు. ఏం చేయగలను, ఎలా ఈ ప్రసవ బాధ నుండి విముక్తి పొందగలను" అని సుజాత అన్నది.

ఏకపాదుడు ధన సంపాదనకై జనకమహారాజు ఆస్థానానికి వెళ్ళాడు. అక్కడ వరుణ కుమారుడైన వందితో వాదించి ఓడిపోయి, నీటిలో ముంచబడి ఉండగా, ఇక్కడ సుజాత ప్రసవించి అష్టావక్రుడిని కన్నది. అదే సమయంలో ఉద్దాలకుడి భార్య శ్వేతకేతుడిని ప్రసవించింది. ఈ విధంగా మేనమామ,మేనల్లుడు ఇద్దరు ఒకే వయసుకలిగినవారై కలిసిమెలసి పెరిగిఉద్దాలకుడి సన్నిధిలో 12 సంవత్సరాలువేద విద్యాభ్యాసం చేసి చదువుల్లో మేటిశూరులు అయ్యారు. అష్టావక్రుడుతనకు ఉద్దాలకుడే తండ్రి అని,శ్వేతకేతుడు సోదరుడు అని భావిస్తూవేరే ఆలోచనలు లేకుండా సుఖంగాబ్రతుకుతున్నాడు.

ఒకరోజు అష్టావక్రుడు ఉద్దాలకుడి తొడపైకి ఎక్కిఆడుకుంటున్నాడు. అది చూసి శ్వేతకేతుడు ఓర్చుకోలేక



అష్టావక్రుడి చేతిని పట్టుకొని ఇవతలికి లాగి" మా నాన్న తొడపై ఎందుకు ఎక్కావు,నీవు మీ నాన్న తొడపై ఎక్కు" అని నిష్ఠూరాలాడాడు అష్టావక్రుడు ఏడుస్తూ.

తల్లి దగ్గరకు వెళ్లి "మా నాన్న ఎవరు, ఎక్కడికి వెళ్లారు చెప్పు" అని అడిగి విషయం తెలుసుకుని మేనమామను ఇష్టంగా వెంటబెట్టుకొని తన తండ్రి దగ్గరకు వెళ్ళాడు.

ఈ విధంగా అష్టావక్రుడు, శ్వేతకేతుడు జనక మహారాజు చేస్తున్న యజ్ఞానికి వెళ్ళారు. కానీ ద్వారపాలకుడు వారిని లోపలికి పోనివ్వక అడ్డుకున్నాడు. అంత వారు " ఈ వాకిలి నుండి మూగవారు, గ్రుడ్డివారు, చెవిటివారు, స్త్రీలు,బ్రాహ్మణులు అనేకమంది లోపలికి సులభంగా వెళుతుండగా బ్రాహ్మణులం, పండితులమైన మమ్మల్ని ఎందుకు అడ్డగిస్తున్నావు" అని ప్రశ్నించారు. దానికి ద్వారపాలకుడు "మహానుభావులు వృద్ధులైన విద్వాంసులు, అనుభవజ్ఞులైన ఋత్వికులు మాత్రమే ఈ యజ్ఞవాటికలోప్రవేశించడానికి అర్హులు,మీరు పసిబిడ్డలు . ఈ యజ్ఞసభలో ప్రవేశించే అర్హత మీకు లేదు" అని చెప్పాడు. దానికి వారిద్దరూ" చాలా సంవత్సరాలు బ్రతికి జుట్టు తెల్లబడితే వృద్ధులవుతారా?,

జ్ఞానం కలవాడైతే బాలుడైనా పెద్దవాడే.

చక్కగా చదువుకొని ఆ చదువు తన నిత్యజీవితంలో ప్రతిఫలించేటట్లు తన ప్రవర్తన తీర్చిదిద్దుకునేవాడు

మన
పురాణాలు

# అష్టావక్రుడి చరిత్ర

వయస్సులో చిన్నవాడే అయినప్పటికీ ప్రజలందరిచేత మన్నించదగినవాడు కాగలడు. మమ్మల్ని వయస్సులో చిన్నవారమని అనుమానించవద్దు. మేము జనక మహారాజుగారి సభలో గర్వంతో విర్రవీగుతున్న వేదవాదులతో సిద్ధాంతరాద్ధాంతాలు చేసి చర్చించటానికి వచ్చాము" అని చెప్పారు .

ద్వారపాలకుడు మహారాజు అనుమతి పొంది ఆ బాలకులైన అష్టావక్రు శ్వేతకేతులను లోపలికి పంపాడు.

జనక మహారాజు అడిగిన చిక్కు ప్రశ్నలు అన్నింటికి సరిపడే సమాధానాల చెప్పి అతడి కొలువుకూటంలో బ్రాహ్మణ సమూహాల మధ్యనున్న వందితో వాదించి అతడిని ఓడించి అంతకముందు అతడితో వాదించి ఓడిపోయిన బ్రాహ్మణులను తన తండ్రితో పాటుగా బంధ విముక్తులను చేశాడు అష్టావక్రుడు. ఎంతో తేజస్సుగల అష్టావక్రుడు సర్వలోకాల చేత పూజించబడిన జనక మహారాజు చేత సన్మానించబడి, పండితుల చేత ప్రశంసించబడి ఏకపాదుడిని వెంటబెట్టుకొని తన ఆశ్రమానికి చేరుకున్నాడు.


ఈ అష్టావక్రుడి కథ నేటి సమాజానికి ఉపయోగపడే ఎన్నో విషయాలు తెలియజేస్తుంది. విద్యార్థులకు తగినంత విశ్రాంతి అవసరం అని తెలుపుతుంది. అర్థం చేసుకోకుండా మొద్దుగా చదివే చదువు తెలివితేటలు పెంచకపోగా విద్యార్థులను మందబుద్ధులుగా తయారు చేస్తుందని తెలుపుతుంది. చదివిన చదువు నిత్య జీవితానికి ఉపయోగపడాలని తెలుపుతుంది. వయసుకి కాక జ్ఞానానికే ప్రాధాన్యతనివ్వాలని తెలుపుతుందీ కథ. గర్భంలో ఉండగానే శిశువుకు జ్ఞానం ఉంటుందని సూచిస్తుందీ కథ.

★★★★

కవిత

# ఒకే జెండా –ఎజండా

ఈదర శ్రీనివాస రెడ్డి



దేశం మొత్తం ఇప్పుడు ఒకే ఎజండాలో
పూనక మొచ్చినట్లు ఊగిపోతున్నారు మనుషులు
ఆకాశం మొత్తం ఒకే రంగు జెండా
ఎగరేస్తూ పిచ్చి పట్టినట్లు అరుస్తున్నాయి గొంతులు

మువ్వన్నెల జెండా సిగ్గుతో ముడుచుకుపోతోంది
కాషాయం తెల్లరంగును చేరిపెస్తోంది
శాంతి కపోతాలు భయపడి ఎగిరిపోతున్నాయి
ఆకుపచ్చ రంగు నెత్తుటి రంగులోకి మారుతుందేమోనని
నవ్వుతూ పలకరించే నిన్నటి మోఖాలలో

అనుమానంపు ఛాయలు కదలాడుతున్నాయి
నిన్నటి దాక కలసి మెలిసి తిరిగిన మనుషులు
భయంతో తలుపు చాటుకు తప్పుకుంటున్నారు
అస్థిత్వాన్ని నిరూపించుకోవటానికి

ఆద్యంతం మందిరాలను మసీదులను
తవ్వి పారేస్తూ ఆధిపత్యపు ఆనవాళ్ళ కోసం
అవస్థలు పడుతూ అత్మీయతకు దురమౌతున్నారు
అవసేషాలకు నానర్థాలను  వెతుకుతూ

ఆది అంతం ఒకే దేవుడే అని అరుస్తుంటే
అశాంతి చిన్నగా దేశం లొ రెక్కవిప్పుతోంది
చేయి దాటాక ముందే మీలుకోక పోతే అస్థికలే
మిగులుతాయి

జ్ఞాపకాలు

# గుర్తుకొస్తున్నాయి ..

1950-75 లో పుట్టిన వాళ్ళు ఒక ప్రత్యేక తరానికి చెందిన వాళ్ళం. చాలా సాధారణ స్థాయి బళ్ళో చదువుకున్నా, దాదాపు ఆ తరం వాళ్ళు అన్ని విషయాలలో నిష్ణాతులుగా కనిపిస్తారు. ఆంగ్ల మాధ్యమంలో చదువుకోకున్నా, ఆ భాష మీద ఉండే పట్టు అమోఘం. ఒక్క ఆంగ్లమే కాదు చదువుకొన్న ప్రతి విషయంలో ఎంతో ప్రతిభ చూపించేవాళ్ళు లెక్కలు, సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రం ఇంకా అనేక విషయాలు ఎంతో శ్రద్ధతో నేర్చుకునేవాళ్ళు.పోటీ చాలా ఎక్కువ ఉన్న ఈ రోజుల్లో అదేమంత గొప్ప విషయంగా కనపడకపోవచ్చు, కానీ ఆనాడు ఉన్న సామాజిక -ఆర్థిక పరిస్థితులకు సాధించింది చాలా ఎక్కువ అనే చెప్పుకోవాలి.
దాదాపు ప్రతీ కుటుంబంలో కనీసం నల్గురు నుండి ఆరుగురు పిల్లలు ఉండేవాళ్ళు. ఇంత పెద్ద కుటుంబం కేవలం తండ్రి సంపాదన పైనే ఆధార పడేది... అంటే అందరికీ కడుపునిండా తిండి దొరకటమే కష్టం అయ్యేది.

పొద్దున్నే చద్దన్నం, మధ్యాహ్నం మామూలు భోజనం ఉండేది. రాత్రికి కూడా అంతే.
పండగ రోజుల్లో మాత్రం కాస్త ప్రత్యేకంగా ఉండేది. బొగ్గుల కుంపటిలోనో, కట్టెల పొయ్యిలోనో వంటలు చేసి, ఇంత మంది పిల్లలను పెంచిన ఆ నాటి తల్లుల ఋణం ఎంత ఇచ్చినా తీర్చుకోలేరు .దాదాపు అందరం దుంపల బడిలోనో ప్రభుత్వ ఉచిత పాఠశాలలోనో చదువుకొన్న వాళ్ళే. చాలా మంది డిగ్రీ చదువులకు వెళ్లేవరకూ చెప్పులు లేకుండా నడిచిన వాళ్ళే. ఆ రోజుల్లో చాలా సాధారణంగా ఉండేది. బడి చదువులు అయిన వెంటనే తల్లి-దండ్రులు తమ బిడ్డలకు ఏదో ఒక ప్రభుత్వ ఉద్యోగం వస్తే చాలు అనుకునేవాళ్ళు.
ఆ రోజులల్లో ప్రభుత్వ డిగ్రీ చేసి PG చేసిన వాళ్ళు తక్కువే.ఆ తరం వాళ్లకి సినిమా, రేడియో తప్ప వేరే వినోదం ఉండేది కాదు. మూడు అణాలు ఇచ్చి తెరకు దగ్గరగా కూర్చొని చూసిన సినిమాలు ఎన్నో. అదీ కాకుండా, రేడియోలో పాత కొత్త పాటలు వినటం ఎంతో ఇష్టంగా ఉండేది. ఘంటసాల వెంకటేశ్వరరావు, పిఠాపురం నాగేశ్వరరావు , మాధవపెద్ది సత్యం, సుశీల, లీల, జిక్కీ గార్లు పాడిన తెలుగు పాటలు అంటే పడి చచ్చేవాళ్ళు . ఇక హిందీ పాటల విషయానికొస్తే, పాటల ట్యూన్ ని బట్టి సంగీత దర్శకులెవరో చెప్పేవాళ్ళు . SD బర్మన్, నౌషాద్, మదన్ మోహన్, శంకర్ జైకిషన్, లక్ష్మీ కాంత్ ప్యారేలాల్,కళ్యాణ్ జీ ఆనంద్ జీ ... ఒకరేమిటి, ఎన్ని పేర్లు చెప్పుకోవాలో తెలియదు. ఈ సంగీత సామ్రాట్టులు అందించిన పాటలు ఈనాటికీ శ్రోతల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి ఉన్నాయి.

ఆ తరం వాళ్ళకు ఉన్న మరో వినోదం పగలు గూటిబిళ్ల గోళీలాట ఏడుపెంకులాట బుచ్చులాట రాత్రికి హరికథలు బుర్ర కథలు నాటకాలు చూడటం ఇదే వినోద కాలక్షేపం. ఈ నాటికీ దాదాపు అందరూ 48-70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న వాళ్ళే అయ్యుంటారు ..అయినా ఉత్సాహం ఏమాత్రం తగ్గక ఇంకా యువకుల్లా కనిపిస్తున్నవాళ్ళే . ఈ వయసులో కూడా చిన్నప్పటి స్నేహితులను పేరు పేరునా గుర్తుంచుకొని పిలుస్తున్న వాళ్ళే .

**వాళ్ళల్లో మీరు ఒకరైఉండి,ఆ తరానికి మీరు చెందిన వాళ్ళైతే , ఇంకేముంది , కాగితం కలం పట్టండి , మీ జ్ఞాపకాలన్నీ పోగేయ్యండి . మీ చిన్ననాటి తమాషా సంఘటనలు , తీయని మధురానుభూతులు , మీ అందమయిన ఫోటోలు మాకు పంపండి ప్రచురిస్తాం . ఉత్తమ జ్ఞాపకాల దొంతరకు బహుమతి కుడా ఉంది సుమా !**

ఫ్యామిలీ సీరియల్

# విధి విన్యాసం

**సీరియల్**



**రాయప్రోలు సుజాతా ప్రసాద్**

మొగ్గ గానే రాలిపోతుండేది. కారణం ఏముంది? స్కూల్ కి ఏ రిక్షా వాడో ఫోన్ చేసేవాడు సార్.ఫలానా జంక్షన్ లో పడిపోయారని. నేను కాదు.. కాదు ఏ మర్యాద అయిన ఆడపిల్ల వెళ్ళకూడదనుకునే ప్లేస్ లకి వెళ్ళాల్సి వచ్చేది. మధ్య రాత్రి ఎవడో తలకు మాసిన వాడు తలుపు కొట్టి ఆ మనిషిని వదిలి వెళ్ళేవాడు. బిజినెస్ పోవడం వలన తాగుతున్నాడని నేను మీతో చెప్పిన మాట అబద్ధం. తాగుబోతు అయిపోవడం వలనే ఉద్యోగం పోయింది, బిజినెస్ పోయింది. పెట్రోలు కని డబ్బులు గుంజుకోవడం, టాంక్ ఫుల్ చేయించుకొని ఇష్టం వచ్చినట్లు యాక్సిడెంట్స్ చేయడం. వాళ్ళ తల్లిదండ్రులు ఏమీ ఆర్థికంగా సపోర్ట్ చేసేవారు కాదు. డాడీ వాళ్ళని అడగడానికి పౌరుషం. బాంకు లో పర్సనల్ లోను తీసుకున్నాను. ఇదొక ఊబి. ఇందులోంచి నన్ను లాగడం ఎవరితరం?

ఫ్యామిలీ సీరియల్

# విధి విన్యాసం

## జరిగిన కథ

రజనీ గురించి శుభవార్త విన్న విజయ తమ పరిచయం జ్ఞాపకం చేసుకుంటుంది.. ఇద్దరు పిల్లల తల్లి విజయకు, టెంత్ చదివే రజనీకి స్నేహం ఏర్పడుతుంది. ఆవయసులో రజని ప్రేమలో పడడం విజయకు నచ్చదు. తను ప్రేమించిన మధు గురించి, తన ఫ్యూచర్ ప్లాన్స్ గురించి చెప్పి విజయను కన్విన్స్ చేస్తుంది రజని. కొన్ని సంవత్సరాల పాటు ఇద్దరిమధ్య కమ్యూనికేషన్ ఉండదు. తరువాత ఒకే మండలంలో టీచర్స్ గా కలుస్తారు. రజనీకి విజయ పిల్లలు శివ, అంజు అంటే చాలా ఇష్టం. రజనీకీ శ్రీ ధన్య, శ్రీ నిధి ఇద్దరు పిల్లలు. ఆమె భర్త మధు పెద్దగా ఎవరితోనూ కలవడు. అతనికి యాక్సిడెంట్ అయి ట్రీట్మెంట్ తీసుకుంటాడు. శివ, విజయల మధ్య బంధాన్ని చూసి తనకూ ఒక బాబు ఉంటే బావుండును అంటుంది విజయతో రజని. విజయ ఇంట్లో ఇంజనీరింగ్ చదువుతున్న మరిది కూతురు రేణు ప్రేమలో పడి అతన్నే చేసుకుంటానంటుంది. విజయ, రఘు నచ్చచెప్పినా వినదు. రజనీ చిన్నపుడే పెళ్ళి చేసుకుని బావుంది కదా అని ఆర్గ్యూ చేస్తుంది. ఆ మాటలు తలుపు అవతల నుంచి విన్న రజనీ బాధపడి తన జీవితం గురించి రేణూ కి ఉత్తరం వ్రాస్తుంది. .ఆ ఉత్తరంలో రజనీ సంసారం మధు వలన ఎంత నరకమైందో తెలుస్తుంది. రజని, తను ఆఖరి పోరాటం చేస్తానని, కొన్నాళ్ళు ఫోన్ కి దొరకనని వ్రాస్తుంది. విజయ చాలా బాధపడుతుంది. ఆ ఉత్తరం రేణులో మార్పు తెస్తుంది. విజయకు మనుమరాలు పుడుతుంది. ఆ సమయంలో మళ్ళీ రజని కాంటాక్ట్ లోకి వస్తుంది. తన పెళ్ళి, మధులో మార్పులు, తన పడ్డ యాతన అన్నీ విజయకు చెప్పడం ప్రారంభిస్తుంది రజని.

**. ఇక చదవండి**

పి.యఫ్ ఎంత లోను వస్తే అంతా వాడేసాను. ఒకటి రెండు సార్లు అన్నయ్య బలవంతంగా కొంత అమౌంట్ అడ్జెస్ట్ చేసాడు. మీరు చెప్పినట్లుగా మా కజిన్ ని తోడు పెట్టి డి.ఎడిక్షన్ సెంటర్ కి పంపించాను. అక్కణ్ణించి గోడలు దూకి వచ్చేసాడు. ఆ ప్రయత్నం అలా వృధా అయింది. వాళ్ళ తల్లిదండ్రులు వస్తే బాగుపడతాడేమోనని వాళ్ళని తెచ్చి కొన్నాళ్లు ఇంట్లో పెట్టుకున్నాను. అతను వీధిలోకి వెళ్ళకుండా ఇంట్లోనే తాగడానికి అన్ని ఏర్పాట్లు చేయమనేది ఆవిడ. ప్రాణం కడగట్టుకు పోయింది మేడమ్!" చెప్తూ చెప్తూ కంటికి నీరు, మాటకి విషాదం అడ్డుపడినట్లు కళ్లు మూసుకుని ఉండిపోయింది.

అనుభవించింది రజని అయినా, వింటున్న నా ప్రాణం కూడా కొట్టుకుపోతోంది. నా కళ్ళు కూడా నీటి కుండలయిపోతున్నాయి. ఎంత వ్యధ! ఎంత నరకం! తన ఎదురుగా బయట పడడం ఇష్టం లేదు. నిశ్శబ్దముగా లేచి వంటింట్లోకి వెళ్ళి మంచి నీళ్ళు తెచ్చాను. కాసిన్ని నీళ్ళు తాగు రజనీ! అన్నాను. కళ్ళు విప్పి చూసి కాదనకుండా తాగింది. కాస్త సర్దుకున్నట్లు అనిపించింది. థాంక్యూ మేడమ్! అంది.

ప్రపంచం ముందు నా సంసారం చక్కబడింది, చక్కబరుచు కున్నాను అని చెప్పడానికి సంతోషంగా, సగర్వంగా నిలబడడానికి ఎన్ని వెర్రి మొర్రి ప్రయత్నాలు చేసాననుకున్నారు? ఎందుకంటే అతన్ని నేను ఎంచు కున్నానుకాబట్టి. ఇట్ వజ్ మై ఛాయిస్. ఈ విషయం చెప్పడానికి చాలా సిగ్గుగా అనిపిస్తోంది. తాగుబోతు వాళ్ళతో తగువు పడి అరెస్టు అయాడు. అక్కడ దర్జాగా నా నంబరిచ్చాడు. పోలీస్ స్టేషన్ కి వెళ్ళడానికి భయంవేసింది. చాలా ఆలోచించి సార్ తో విషయం చెప్పి తోడు రమ్మంటే వచ్చారు.నా అంతట నేను చెప్పేవరకు ఈ సంగతి మీతో చెప్పద్దని ఆయన్ని రిక్వెస్ట్ చేసాను. అందుకే, సార్ మీతో చెప్పి ఉండరు.

నేను ఉలిక్కిపడ్డాను. రెండు విషయాలు జ్ఞాపకం వచ్చాయి. ఆ రోజు రేణుకి రాసిన లెటర్ లో రెండు మూడు సార్లు మీ పెదనాన్న సాయం చేసారు అంటే

ఫ్యామిలీ సీరియల్

# విధి విన్యాసం

ఇదా? సహజంగా ఆయనకి నా దగ్గర దాపరికం ఉండదు. కానీ ఇంకెవరి విషయమో అయినా, అది తెలియడం వలన నాకు బాధ కలుగుతుందని నమ్మినా, ఆయన నోరువిప్పరు. ఇక అలాంటప్పుడు నేనూ అడగను. ఇక రెండోది ఆరోజు పోలీస్ డిపార్టమెంటులో ఉన్న నా స్టూడెంట్ విమల ఆటో లో నా ఫోన్ లో, రజని ఫొటో చూసి "ఈవిడ మా స్టేషన్ కి వచ్చారు. నేను ఈవిడని అక్కడే చూసాను." అని నమ్మకంగా చెప్పిన మాట. అప్పుడు తను చెప్పింది. నిజమేనన్నమాట! నేను తనే పొరపడి ఉంటుందని అనుకున్నాను.

"మేడమ్! రజని పిలుపుకి మళ్ళీ స్పృహ లోకి వచ్చాను. ఏంటి మేడమ్! చికాకుగా, విసుగ్గా ఉందా నేను చెప్తున్నది! చిన్నబుచ్చుకుంది రజని.

"లేదమ్మా! ఇది జీవితం! మా రజనీది. నాకు చికాకు ఎందుకొస్తుంది? ఆరోజు రేణుకు రాసిన లెటర్ లో మీ పెదనాన్నగారు సాయంచేసారన్నావు. అది జ్ఞాపకం వచ్చింది. అంతే! చెప్పు తరువాత?"

"ఇక చెప్పడానికి ఏముంది మేడమ్! అదే సంఘటన కొన్ని నెలల గేప్ లో రిపీట్ అయింది. పోలీసు స్టేషన్ కి వెళ్ళాలంటే మొదటిసారి కలిగిన నా భయాన్ని అలవాటు లోకి మారుస్తున్నాడని అర్ధమయింది. ఆరోజే చెప్పాను"ఇంకోసారి ఇలాంటి పరిస్థితి వస్తే నీ కోసం నేను రాను." అని. మళ్ళీ ఇంకోసారి స్టేషన్ నుంచి ఫోన్ వచ్చింది. ఈసారి బ్రోతల్ హౌస్ లో రైడింగ్ లో పట్టుబడ్డాడు. మొదటిసారి డ్రింక్ చేసి, రెండో సారి పేకాట లో గొడవపడి, మూడోసారి రైడింగ్ లోను. నాకీసారి భయం కాదు. జుగుప్స కలిగింది. "అతనికి భార్య లేదు, చచ్చిపోయింది. స్టేషన్ కి రాదు. అతనితో చెప్పండి." అని ఫోన్ పెట్టేసాను. ఏం జీవితం చెప్పండి! భర్త రూపంలోని పాము ఎప్పుడు ఎలా కాటు వేస్తుందో, విషం కక్కుతుందో తెలియదు. భార్యకి, వేశ్యకి తేడా తెలియదు. తన ఇంటికి, పొరుగింటికి తేడా తెలియదు. అర్ధరాత్రి పూట వయసులో ఉన్న భార్య, అన్నెం పున్నెం ఎరుగని ఇద్దరు పిల్లలు ఉన్నారని చూడకుండా ఏ దౌర్భాగ్యుడి తో ఇంటికి వస్తాడో తెలియదు. ఎప్పుడేం ప్రమాదం ముంచుకొస్తుందో, ఏం జరుగుతుందో తెలియదు. ఇక ఆ పశువుకి రాత్రికి, పగటికి తేడా తెలియక, పచ్చి తాగుబోతు, దొంగ, జూదగాడు, తిరుగుబోతు.. వాడికి బిడ్డలో కేవలం ఆడపిల్లే కనిపిస్తే. నా ఒళ్ళు జలదరించింది. గుండెలు దడదడలాడుతున్నాయి. "వదిలేయ్! రజనీ! వదిలెయ్! ఆ దరిద్రుణ్ణి వదిలించుకోకుండా ఎందుకు భరిస్తున్నావు?" అనుకోకుండా నా నోటి వెంట ఆ మాటలు తుపాకీ లోంచి బులెట్స్ వచ్చినట్టు వచ్చేసాయి. ఎన్నో రైళ్ళు, విమానాలు పక్కనుంచి శబ్దం చేస్తూ వెళ్తుంటే అదిరిపోతున్నట్టు ఒళ్ళంతా కంపిస్తోంది. మేడమ్! రజని ఒక్కసారిగా నా చెయ్యి తీసుకుని వాటిల్లో మొహం దాచుకుంది. నా అర చేతికి తన వెచ్చటి కన్నీటి తడి తెలుస్తోంది. ఆ చేతితోనే తన మొహాన్ని పైకెత్తి రెండో చేత్తో తల నిమిరాను.

"ఇన్నాళ్లు అసలెందుకు భరించావు? ఏం చూసి సహించావు? శారీరిక మానసిక, ఆర్ధిక సౌఖ్యాలు, వాటిల్లో వచ్చే ఇబ్బందులలో తోడు ఉండగలిగితేనే భర్త. అంతేగానీ జలగలా పీడించే వాడు భర్త కాదు. ధర్మేచ, అర్ధేచ, కామేచ, మోక్షేచ నాతి చరామి అంటే నాలుగో దానిలో మన ఇష్టం చెల్లదు. ఎందుకంటే ఎవరి మరణమూ ఎవరి చేతుల్లో ఉండదు కాబట్టి. ధర్మార్ధ కామాల్లో తోడుండని వాడు భర్తే కాదు. గొంగళీ పురుగు నూగు లా నీ శరీరాన్ని మనసునీ, గుచ్చేస్తూ, నీకు బాధని జుగుప్సని మిగిల్చిన వాడిని, వాడితో ఉన్న నీ చేదు జ్ఞాపకాలను స్నానం చేసి నూగు వదల్చుకున్నట్లే వదల్చుకో! దరిద్రాన్ని తల కెత్తుకోవడం మూర్ఖత్వం! రజని కళ్ళు తుడుచుకుంది. "మేడమ్! మీరీ నిర్ణయమే తీసుకోమంటారని ఊహించాను కానీ, నా కథ పూర్తి అవకుండానే అంటారనుకోలేదు. ఒక్క నిమిషం ఉండండి." తను లేచి లోపలికి వెళ్ళింది. మేక వన్నె పులుల్ని కనిపెట్టే జ్ఞానం, ఆడపిల్లలకి భగవంతుడిస్తే

ఫ్యామిలీ సీరియల్

# విధి విన్యాసం

ఎంత బావుండును! ఆ పులులకి ఆడపిల్లలు ఆహారమయ్యే రాక్షసదృశ్యం చూసే దౌర్భాగ్యం ఎవరికీ పట్టదు. రజని వచ్చింది. తన చేతి లోని కవరు నాకిచ్చింది. ఇవేమిటి? ఆశ్చర్యంగా చూసాను. అవి రజనికి ఆ త్రాష్టుడి నుంచి డివోర్స్ మంజూరయిన పేపర్లు. "ఈరోజే తెచ్చుకున్నాను. అందుకే ఈ రోజే మిమ్మల్ని కలియాలనుకున్నాను. మీరు చెప్పినట్లే తలారా స్నానం చేసి చీడ వదిలించుకున్నాను. వెం మీకు నమస్కరించి ఆశీస్సు లందుకున్నది అందుకే! మీ నోటంట శుభం భూయాత్! అని వచ్చింది. అదే నాకు శుభం!! వివాహ వ్యవస్థను గౌరవించాలని, సంస్కృతీ

సాంప్రదాయాలను నిలబెట్టాలనే ప్రయత్నించాను కానీ, నాకింకో దారి మిగలలేదు." "సంప్రదాయాలు గొప్పవే! జీవితాలను ఒక పద్ధతి లో నడిపించడానికి అవసరం కూడా! కానీ ఎవరో రచయిత అన్నట్లు సంప్రదాయాలు జీవితం కంటే గొప్పవి కావు. వివాహ వ్యవస్థను కాపాడాల్సిన బాధ్యత స్త్రీ పురుషులు ఇద్దరికీ సమానంగా ఉంటుంది. ఉండాలి కూడా. శతాబ్దాలుగా ఈ బాధ్యత కేవలం స్త్రీ కే కట్టబెట్టారు. కాలానుగుణంగా దీన్ని ముందు తరాలకు అందించే భారం, భార్యాభర్తలు ఇద్దరూ తీసుకోవాలి. మగవాడు తన ఇష్టానికి ఉంటే,ఉనికికి, ఊపిరికి, బతకడానికి, బతుకుకి అడ్డుపడుతుంటే తప్పనిసరిగా ఆడది సంధించాల్సిన అస్త్రం విడాకులే! దీనికి సందేహం లేదు. అయినా ఒకమాట చెప్పు. విడాకులు ఇవ్వడానికైనా అతగాడు ఒప్పుకున్నాడా? ఇబ్బంది పెట్టాడా?

"మూడవ సారి నేను పోలీసు స్టేషన్ కి వెళ్లలేదు. అప్పటికే చూసుకున్న వేరే ఇంటికి మారిపోయాను. ఫోన్ లో సిమ్ మార్చేసాను. ఏం పాట్లు పడ్డాడో! తన్నులు తిన్నాడో ఏమీ పట్టించుకోలేదు. పది రోజులయినాక వాళ్ళ ఫాదర్ స్కూల్ కి వచ్చి మళ్ళీ నీతి పాఠాలు చెప్పడం ప్రారంభించారు.

నీకు ఇద్దరు కాదు ముగ్గురు పిల్లలనుకో! వాడి తప్పులు నువ్వు కాకపోతే ఎవరు క్షమిస్తారు? వదిలేస్తే వదిలి పోయేదా వివాహబంధం? అంటూ ఏవో చెప్పారు. ఇందులో ఏ ఒక్క మంచి వాక్యమైనా అతనికి చెప్పారా? చెప్పగలరా? నన్నే ఎందుకు టార్గెట్ చేస్తారు? నాకే ఎందుకు నీతులు చెప్తారన్న ఒకలాటి ఫ్రస్టేషన్ లోపలి నుంచి తన్నుకొచ్చి" నేను తొందరలో డివోర్స్ కి అప్లై చేస్తాను" అన్న మాట కుండ బద్దలు కొట్టినట్టు బయటికి వచ్చింది. నాకే ఆశ్చర్యం వేసింది. ఇలాటి నా నా నిర్ణయం ఇతనికి ఎలా చెప్పాను.? డాడీ కి కూడా అప్పటికి ఇంకా చెప్పలేదు. "వాడు నిన్ను వదలలేడమ్మా! మేము మాత్రం నిన్ను కాదనుకోగలమా? డివోర్స్ ఏమిటి? అలాంటి మాటలనకు. భగవంతుడు మెచ్చడు." అన్నారతను. వాళ్ళు డివోర్స్ ఇవ్వనివ్వరని అర్థమయింది. "మాటలలో కాదండి చేతలలో వదలలేక పోవడం చూపించాలి. నేను మారిన ఇళ్ళ ఓనర్స్, పాలవాళ్ళు, పనివాళ్ళు, రిక్షా వాళ్ళు, ఆటో వాళ్ళు పోలీస్ స్టేషన్ లోని స్టాఫ్ అందరూ మీ అబ్బాయి ప్రేమని, అతని వదలలేని తనాన్ని చూసారండీ! కాబట్టి అవసరమయితే వాళ్ళంతా ఎలా మీ అబ్బాయికి నచ్చచెప్పాలో అలా నచ్చచెప్తారు. అదంత బావుండదేమో అనుకుంటున్నాను. మీకు అదే కావాలంటే అలాటి ఏర్పాటే చేద్దాం" ఎంత ఆవేశం వచ్చినా కంట్రోల్ చేసుకుంటూ నేనూ అతనిలాగే మెత్తగా చెప్పాను.

ఇక ఆవేశం, కోపం ఆపుకోవడం అతని వల్ల కాలేదు. "బాగా మీరిపోయావు. మాటలు మా బాగా వాడుతున్నావు. పెద్ద వాడిని మంచి చెప్ప వస్తే ఇంత అవమానించి పంపుతున్నావు. ఇంతకింత అనుభవిస్తావు." అని శాపాలు పెడుతూ వెనక్కి వెళ్ళిపోయాడు. మా మేనత్త వాళ్ళ ఆయన కూడా తాగుబోతే! మామ్మ అదే పది సార్లు చెబుతుంది. అత్త అలా ఉండడం లేదా? అంటుంది కానీ డాడీ, అమ్మ మాత్రం నాకు సపోర్ట్ చేసారు. డాడీ! అన్ని సార్లూ నాతో

ఫ్యామిలీ సీరియల్

# విధి విన్యాసం

బాటు కోర్టు కి వచ్చారు. మొత్తానికి సంవత్సరంన్నర తిరిగాక నాకు అతనితో సంసారనరకం నుండి డివోర్స్ అనే విముక్తి వచ్చింది." ఆపింది రజని.

" అయినా లక్షణమైన భార్య, రత్నాలలాటి పిల్లలు హాయిగా కాపురం చేయడం చేతకాని దౌర్భాగ్యుడు! పిల్లలు ఎంత నలిగి పోయి ఉంటారో కదా! కన్న పిల్లల మీద కూడా మమకారం లేదు మనిషా? పశువా? పశువులకి అసలు పితృ ధర్మం తెలియదు.. మనిషి రూపం లోని పశువు! " ఏవగింపుగా అన్నాను. ఓ బలమైన కెరటం చేత కకావికలు కాబడిన తీరంలాగా, మొహంలో కదలాడిన భావాలకు, ఆ వీచికలకు, రజని మొహం పాలిపోయింది. నేను ఆశ్చర్య పోయాను." రజనీ! ఏమిటిది? ఏ జ్ఞాపకం నిన్నింత కదిపి కుదిపేస్తోంది? ఇంకా ఏదో దాచుకుని దాని కారణంగా నిన్ను నువ్వు హింసించుకోకు. చెప్పు ఏమిటది? నేను రొక్కించి అడిగాను.

తను మాటలు పేర్చుకుంటున్నట్లు ప్రయత్నం తెలుస్తోంది. "ఎలా చెప్పాలి? ఏమని చెప్పాలి? ఆ మనిషికి జన్మ నిచ్చేందుకు ఓ ఆడది కావాలి. అనుభవించడానికి ఆడది కావాలి. కానీ కూతురిగా అవసరం లేదు. ధన్య పుట్టినపుడు కూడా తొలి సంతానమని ఏమాత్రం మురిపం లేదు. ఆడపిల్ల పుట్టింది అని మొహం ముడుచుకున్నాడు. మగపిల్లడిని నేను కనలేకపోయానుట అదో గోల."

"అదేమిటి? చదువుకున్నవాడు కదా? ఆ మాత్రం జ్ఞానం లేదా? కడుపులో ఉన్న బిడ్డ లింగ నిర్ధారణ కి కారణం పురుషుడు కానీ, స్త్రీ కాదని తెలియని మూర్ఖత్వమా? "ఆశ్చర్యంగా అడిగాను."అతని చదువు అతనికి ఏదన్నా ఓ మంచి పనికి కానీ, ఒక సరైన నిర్ణయం తీసుకోడానికి కానీ ఉపయోగపడినట్లు ఎక్కడన్నా దాఖలా ఉందా?. అతనితో పాటు అతని తల్లి అతనికి వంత పాట! కొన్నాళ్ళకి ధన్య ఆట పాటలకి కొంచెం మారాడు. ఆ తరువాత నుంచి ప్రెగ్నెన్సీ కన్ఫర్మ్ కాగానే మధ్య ప్రదేశ్ లో ఒక ఊరికి తీసికెళ్ళి చెక్ చేయించి, పాప అని తెలియగానే అబార్షన్ చేయించే వాడు. అలా మూడు సార్లు అబార్షన్ చేయించాడు. నా ఆత్మ విరుద్ధమైన పనిని చేయించేవాడు. ఒక పాప తో ఆపుదామంటే ఒప్పుకోడు. మగపిల్లడు కావాలని గోల! రెండో సారి బాబు పుడితే వాడు మారిపోతాడు అంటుంది వాళ్ళ అమ్మ. నిధి పుట్టినపుడు టెస్ట్ కి వెళ్ళలేదు. ఎవరు పుట్టినా పెంచుతామంటేనే కంటాను అని చెప్పి కన్నాను. మళ్ళీ పాపే పుట్టింది. ఆ సంగతి తెలియగానే హాస్పిటల్ లో నన్ను వదిలేసి వెళ్ళిపోయాడు. పుట్టిన బిడ్డని గానీ, నన్ను గానీ చూడ రాలేదు. ఆ సమయంలో ఆ మనిషి మీద నాకు కలిగిన విరక్తిని వర్ణించడానికి మాటలు లేవు. కానీ మళ్ళీ వాళ్ళ ఫాదరే ఏం చెప్పారో ఏమో బాలసారె పీటల మీద కూచున్నాడు. పిల్లలు ఇద్దరికీ ఈ పేర్లు నేను ఇష్టంగా ఎంపిక చేసుకున్నవే! పేరుకి అతగాడు బియ్యంలో రాసాడు. అంతే! ధన్య టైమ్ లో లాగే కొంతైనా మారుతాడేమో అనుకున్నాను. కానీ అతనికి నా దగ్గర ఏదన్నా అవసరం ఉంటేనే, పిల్లలతో ప్రేమ నటించేవాడు. అది నాకు చాలా కాలం వరకూ అర్థం కాలేదు. నాకే అర్థం కాలేదంటే ఇక పిల్లలకు ఏం తెలుస్తుంది? ఎందుకు దగరకు తీసుకుంటాడో, ఎందుకు తోసేస్తాడో తెలియదు. ఎప్పుడు ప్రేమగా ఉంటాడో, ఎప్పుడు ఛీత్కరిస్తాడో తెలియక వాళ్ళు ఎంత అయోమయావస్థ లో ఉండేవారో, ఎంత అల్లాడి పోయేవారో తల్లిని నాకు తెలుసు. పెళ్ళయినాక ప్రథమార్థం అటుఇటుగా ఉన్నా ద్వితీయార్థం అంతా నరకమే.. ఏ ఏడాది ఏ చాప్టర్ చూసినా ఆ పైవాడు నా కన్నీళ్ళ తోనే రాసాడు. ఈ వయసుకి ఇంత భయంకరమైన, ఇన్ని జుగుప్సాకరమైన అనుభవాలా? ఇన్నింటికీ ఏమీ తెలీని వయసులో నేను ప్రేమ, పెళ్ళి వైపుకి వెళ్ళడమే కారణం. ఇది తలుచుకున్నపుడల్లా ఐ హేట్ మై సెల్ఫ్! ఐ హేట్ మై సెల్ఫ్! "అంటుంటే మళ్ళీ దుఃఖం తనని ముంచేసింది.

(ఇంకా ఉంది )

వాస్తవ
కథ

# అభిరతి

ఈదరశ్రీనివాస రెడ్డి

నిద్రపోని నగరాలలో అదీ ఒకటి, చిక్కగా వీధుల నిండా పరుచుకున్న చీకట్లను, ఉండీ లేనట్లు ఒంటరిగా వేలాడుతున్న. వీధి దీపాలు ఏమాత్రం భయపెట్ట లేక పోతున్నాయి. పగటి వెలుగులు చూడటానికి ఇష్టపడని నిశాచరులు తిరిగే సమయమది . పబ్లు, బార్లు, స్పాలు ఒకటేమిటి అన్నీ చీకటి గుహలే,వాటిల్లోకి అప్పటికి చేరుకున్నాయి  గబ్బిలాలు. ఇక్కడ వారికి వెలుగు అంటే భయం ,ఎందుకంటే  వాళ్ళు చేసేవన్నీ చీకటి పనులే కాబట్టి.

అటువంటి ఒక చీకటి గుహలో ,మత్తుతో నిండిన మస్తిష్కాలు కొన్ని ఉచ్చం నీచం మరచి ఊరేగుతున్నాయి. వంటి మీద స్పృహ లేకుండా, శరీరాలు తమవి కానట్టు ఎదుటి వాళ్ళకు అప్పగిస్తున్నారు కొందరు , ఆ అవకాశం కోసమే కాచుకుని కూర్చున్నటు వాటితో ఆడుకుంటూ పైశాచిక ఆనందం పొందుతున్నారు మరికొందరు.

వాస్తవ కథ

# అభిరతి

తాగి తాగి ఊగిఊగి అలసిపోయి అక్కడి సోఫాల్లో కూలబడ్డాయి కొన్ని శరీరాలు. వాటిలో ప్రణయ్ ది కూడా ఒకటి. అప్పటికే తాగింది మొత్తం తలకు ఎక్కుటంతో కళ్ళ ముందు ఎవరున్నారో కూడా కనపడటం లేదు .

ఇంకా అలసిపోని శరీరాలు కొన్ని మైకంలో ఉగుతూనే వున్నాయి. వాటిలో ఒక ఆకారం మాత్రం ప్రణయ్ దృష్టిని ఆకర్షించింది. కళ్ళు రెండూ నులుముకుని చూద్దామని ప్రయత్నం చేసాడు ,ఫలితం లేకపోయింది. మత్తు మనిషిని పూర్తిగా కమ్మేసింది. చిన్నగా అతని శరీరం సోఫాలో వాలిపోయింది.

★★★

అర్ధరాత్రి ) దాటి రెండు గంటలు అవుతోంది. బయట నుండి పెద్దగా కారు హారన్ మొగడంతో, మంచి నిద్రలో వున్న కావ్య కు ఒక్కసారిగా మెలుకవ వచ్చింది.

“ఎన్ని సార్లు చెప్పినా ఈ మనిషి మారడు “ అనినోట్లో నోట్లోనే గొణుక్కుంటూ లేచింది మంచ మీద నుండి.

లంకంత ఇల్లు, చిన్నగామెట్లు దిగి హాల్లోకి అడుగుపెట్టింది. ఈ లోపు కాలింగ్ బెల్ మరోసారి మ్రోగింది. కావ్య కు అది రోజూ అలవాటే కాబట్టి ఏమాత్రం కంగారు పడకుండా,నింపాదిగా వెళ్ళి మెయిన్ డోర్ తెరిచింది.

ఎదురుగా మొగుడు అనే ఓ మగాడు గోడకు చారిగల పడివున్నాడు. ఇంకా తాగింది పూర్తిగా దిగలేదేమో గుమ్మాన్ని పట్టుకుని చిన్నగా పైకి లేవాలని ప్రయత్నిస్తున్నాడు

‘ఒకే డార్లింగ్ , రేపుకలుద్దాం, బాయ్. “అంటూ వెనక్కి తిరగకుండా నే చేతులు ఊపుతూ లోపలికి అడుగుపెట్టాడు.

ఇంటి బయట గేటు దగ్గర ఆగివున్న కారులో వున్నఓ ఆడది కావ్య వంక చూస్తూ వెక్కిరింపుగా నవ్వింది.

ఆ నవ్వులో ఎన్నో అర్ధాలు స్ఫురించాయి కావ్యకి, కాని వాటిని వెలికి తీయటానికి ఏ మాత్రం ఉత్సహం చూపించ లేదు కావ్య. ఎందుకంటే రోజుకో ఆడది ఇలా ప్రతి రోజు అర్ధరాత్రి వచ్చి నవ్వి వెళ్ళి పోతుంటే, ఎన్ని నవ్వులని అర్ధం చేసుకుంటుంది.ఏ నవ్వుకు ఏ అర్ధం ముడి పడి వుందో ఎక్కడ వెతుకుతుంది. చిన్నగా ఓ నిట్టూర్పు విడిచి వెను తిరిగి ఇంట్లోకి అడుగు పెట్టింది.

.

అప్పటికే హాల్లో వున్న సోఫామీద అడ్డంగా పడివున్నాడు ప్రణయ్. రోజు జరిగే తతంగమే కావటంతో కావ్యకు కొత్తగా ఏమి అనిపించక పోవటంతో, మళ్ళీ తలుపులు వేసి తన బెడ్రూమ్లో కి వెళ్లి పడుకుంది ఒంటరిగా .

పడుకుంది అన్నమాటే కానీ నిద్ర పట్టలేదు. శరీరం అలసిపోతే మంచి నిద్ర పడుతుంది. కాని కావ్యమనసు అలసి పోయింది. పెళ్ళై పదేళ్ళయ్యింది. పెళ్లైన దగ్గర నుండి ఒంటరిగా నిద్ర పోవటం అలవాటు చేసుకోక తప్పలేదు. అలాంటి ఒంటరి రాత్రులు ఎన్ని గడిచిపోయాయో లెక్కే లేదు .

పెళ్ళైన ఒక నెల మాత్రం , తమ పేర్లకు తగ్గట్టు తమ కాపురం ప్రణయ కావ్యం’లా సాగి పోయింది. కానీ రాను రాను ఆ ప్రణయ కావ్యమే, ప్రళయ గీతంలా మారుతుందని ఊహించలేదు.

మొదట్లో బాధతో రాత్రుళ్ళు ఏడుస్తూనే కూర్చునేది. అలా ఎన్ని రాత్రులు ఏడుస్తూ గడచిపోయాయో తనకే తెలియదు, రాను రాను అలవాటయిపోయింది. ఇప్పుడిప్పుడే కొద్ది కొద్దిగా మనసు నిద్ర పోవటం అలవాటు చేసుకుంటోంది.

బహుశా ఎవరికైనా అంతేనేమో, ఎన్నాళ్ళని బాధతో మనసు మెలికలు తిరుగుతుంది. కొన్నాళ్ళకు అలవాటు పడి మొద్దు

వాస్తవ కథ

# అభిరతి

జారి పోతుంది.

ఆలోచిస్తూనే ఎప్పుడు జారిపోయిందో, నిద్రా దేవి ఒడిలోకి ఒరిగిపోయింది.

ఉదయం పనిపిల్ల వచ్చి కాలింగ్ బెల్ కొట్టే దాకా మెలుకువ రాలేదు.

★★★

"ఏం గురూ రాత్రి ఎవరో కొత్త ఫిగర్ దొరికి నట్టుంది " ఆఫీసులోకి అడుగు పెట్టగానే పలకరించాడు అభినవ్, ప్రణయ్ గ్లాస్ మేట్.

ప్రతిగా ఓ చిరునవ్వు నవ్వి " ఏం నీకెవ్వరూ దొరక లేదా రాత్రి " ప్రశ్నించాడు అభినవ్

"ట్రై చేసాను బ్రదర్, కాని చిలక చిక్కి నట్టే చిక్కి ఎగిరిపోయింది ' నీరసంగా బదులిచ్చాడు అభినవ్

"చిలకలు ఊరికే ఎందుకు చేతికి అందుతాయి? జాగ్రత్తగా వలవేసి పట్టుకోవాలి; అది 64 కళల్లో ఒక కళ " అదేదో ఘన కార్యం చేసినవాడిలా చెప్పుకొచ్చాడు ప్రణయ్.

'నీ అంత అనుభవం నాకెక్కడుంది, ఎంతయినా నువ్వు కళాకారుడివి కదా ? ఆ కళేదో మాక్కూడా నేర్పించచ్చు కదరా ?"

అందరికీ అన్నీ నేర్పిం చేస్తే, రేపు నావలలోకి ఏ చిలక చిక్కకోదు"

"ఈ ఒక్కసారికి నాకోసం, ఆ కిటుకేదో చెప్పి పుణ్యం కట్టుకోరా బాబు"

"సరే సరే అంతగా ప్రాధేయపడుతున్నావు కాబట్టి ఒప్పుకుంటున్నా. అయితే కాస్త ఖర్చవుతుంది"

'ఒకే డన్, ఈ రోజురాత్రి పబ్బులో ఖర్చంతా నాదే "

"పబ్ అంటే గుర్తుకొచ్చింది, నిన్నరాత్రి , ఓ సూపర్ ఫిగర్ కంటపడింది బాసు"

"మరింకే వల వేసెయ్యక పోయావా?"

" ఎక్కడా, అప్పటికే పీకల దాకా తాగున్నానేమో, ఫిగర్ ముఖం కూడా చూడక ముందే అవుటయి పోయాను"

"అయితే ఇంకే, మనకు కావలసిన రెండు చిలకలు ఒకే గూట్లో వున్నాయి. కలిసి వల వేద్దాం "

"నో, ఎవరి వలవాళ్ళదే. ఒకో క్లిలకకు ఒకోవల వేయాలి . లేక పోతే ఎగిరిపోగలవు'"

'ఒకే ఒకే, అలాగే లేరా. ఏదో మాట వరసకి అన్నాను. నీకు, నీ అనుభవానికి ఓ నమస్కారం" అంటూ నవ్వేశాడు అభినవ్

అభినవ్ తో శృతి కలిపాడు ప్రణయ్ తనూ నవ్వుతూ

★★★★

"పెళ్ళై ఆరు నెలలు కూడా కాలేదు అప్పుడే నా మీద మోజు తీరి పోయిందా?" ఏడుస్తూ అడిగింది కావ్య

"ఆ మాట నేను అనలేదే" ప్రణయ్ జవాబు

"మరెందుకు రోజుకో దానితో ఊరేగుతున్నారు?" అరిచినంత పని చేసింది కావ్య

ఒక్క క్షణం మౌనం వహించాడు ప్రణయ్

'మాట్లాడరే. మిమ్మలనే అడుగుతోంది " రెట్టించి అడిగింది కావ్య

""అసలు నీకేం తక్కువ చేసానని, అలా అరుస్తున్నావు. లంకంత ఇల్లు, ఇంటి నిండా పనిమనుషులు. అడుగు తీసి

వాస్తవ కథ

# అభిరతి

అడుగు వెయ్యితానికి కారు, నీ ఇష్టం వచ్చినట్టు ఖర్చు పెట్టుకోవటానికి బ్యాంక్ బ్యాలెన్స్. " చెప్పుకు పోతున్నాడు ప్రణయ

" ఆపండి అంటు పెద్దగా అరిచింది కావ్య "

ఆ అరుపుకి నిశ్చేష్టుడై పోయాడు ప్రణయ్

"నేను అడుగుతున్న దేమిటి ? మీరు చెప్పుతున్న దేమిటి? పెళ్ళాన్ని పక్కన పెట్టుకుని ఇంకో దానితో తిరగటానికి మీకు సిగ్గుగా లేదు?" ప్రణయ్ వంక అసహ్యంగా చూసింది

"మగాడిని నా కెందుకు సిగ్గు, ఎంత మంది మగాళ్ళు. తిరగటం లేదు ?వాళ్ళందరికీ లేని సిగ్గు నాకెందుకు' నిస్సిగ్గుగా జవాబిచ్చాడు

" అంతే కాని మీ అలవాటు మార్చుకోనంటారు? అసహనంతో అడిగింది

"మార్చుకుంటే అది అలవాటెందుకు అవుతుంది..'

★ నా దగ్గర లేనిది ఆ అలాగా మనుషుల దగ్గర ఏముంది.." కోపంతో ఊగిపోతూ చొక్కా పట్టుకుని అడిగింది.

ఊహించని పరిణామం జరగటంతో ఒక్క క్షణం విస్తుపోవడం ప్రణయ వంతైయ్యింది.

అంతలోనే తేరుకుని," ఇంట్లో అన్నం తింటున్నాం కదా అని, బయట టిఫిన్ చెయ్యకుండా వున్నామా? ఇదీ అంతే అంటూ కావ్యను విదిలించి కొట్టాడు.

ఆ విసురుకి పోయి కావ్య సోఫాలో కూలపడింది.

"ఇందాకటినుంచి చూస్తున్నా, ఏదోలే పాపం అనుకుంటే రెచ్చిపోతున్నావు. నీవడిగినవన్నీ కొనిస్తున్నాను , షికార్లకి, సినిమాలకి తిప్పుతున్నాను. నీకేదన్నా అన్యాయం చేస్తే అడుగు. అంతే కాని నా ఇష్టా ఇష్టాల జోలికి మాత్రం రాకు' హెచ్చరించాడు. ప్రణయ్

బరి తెగించిన మనిషితో మాట్లాడితే, ఏం జవాబు వస్తుందో అదే రావటంతో చేసేదేమి లేక ఏడుస్తూ కూర్చుంది కావ్య

'ఇంకొకసారి, ఇలా రాద్దాంతం చేస్తే, ఇన్నాళ్ళు బయట పెట్టిన దుకాణాన్ని ఇంటికే తీసుకు వస్తాను, జగ్రత్త' అంటూ వార్నింగ్ లాంటిది ఇచ్చి విసవిస నడుచుకుంటూ బయటకి వెళ్ళి పోయాడు.

ఆ రోజు నుంచి, మొగుడు వుండి లేని బతుకై పోయింది కావ్యది.

★★★★

ఏమండి అమ్మాయి ఫోన్ చేసింది. "అల్లుడి, ప్రవర్తన బొత్తిగా బాలేదట" కావ్య తల్లి, అల్లుడు గురించి మొగుడికి ఫిర్యాదు చేసింది.

జరిగినదంతా కావ్య ఫోన్ చేసి చెప్పటంతో కావ్య తల్లి గుండెలు అవిసి పోయాయి . ఎంతయినా తనూ ఒక ఆడది కదా

" ఏం బాలేదట? తాపిగా అడిగాడు కావ్య తండ్రి,

ఎలా చెప్పాలో అర్థం కాక, "చెడుతిరుగుళ్ళు తిరుగు తున్నాడట' గొణిగింది సిగ్గుతో కావ్యతల్లి.

" చెడు తిరుగుళ్ళంటే... ' దీర్ఘం తీస్తూ తెలిసినా తెలియనట్టు అడిగాడు

ఆ మాటకు చిర్రెత్తుకొచ్చింది కావ్య తల్లికి, "చెడు తిరుగుళ్లు అంటే మన పెళ్ళైన కొత్తలో మీరు దొమ్మరి గుడిశల్లో దూరితే మా నాన్న వచ్చి బడిత కర్రతో కొట్టుకుంటా వచ్చాడు చూడండి, అవి' గతం

వాస్తవ కథ

# అభిరతి

గుర్తుచేసింది.

'అంత వివరంగా చెప్పాక అర్థం కాకుండా ఎలా వుంటుంది. ఇప్పుడు నన్నేమి చెయ్యమంటావు ముందు అది చెప్పు, పాత కథలన్నీ ఎందుకు" తేలుకుట్టిన దొంగలా అన్నాడు

ఏం చెయ్యాలో చెప్పమంటారేమిటి, వెళ్ళి అల్లుడిని నిలదీయ వచ్చు గా "

"కాని అతను నేనింతే అని మొండికేసి, కావాలంటే మీరేమీ అమ్మాయికి నచ్చచెప్పుకోండి అంటే'

" ఆ మాట అంటే, మీ నాన్న మీకు తగిలించినట్లు మీరు కూడా నాలుగు తగిలించి రండి"

"అంత అవేశం ఎందుకు, అక్కడ వున్నది మన కన్న కూతురు. ఏది జరిగినా దాని జీవితమే పాడయ్యేది'

" అయితే చూస్తూ ఊరుకో మంటారా?'

"నేనా మాట అనలేదు కదా? అది నీకే కాదు నాకూ కూతురే"

" కుర్రాడు కదా ,కాస్త ఓపిక పడితే అన్నీ సర్దుకుంటాయి. కొన్నాళ్ళు ఓపిక పట్టమను'

ఆలోచించిన మీదట అదే ఉత్తమం అనిపించి, అమాటే చెప్పింది కావ్యకి.

★★★★

అనుకున్నట్టుగానే ప్రణయ్, అభినవ్ ఇద్దరూ తమకు నచ్చిన చిలకలకు వలలు వేయటానికి చీకటి పడిన తరువాత పబ్ కి చేరుకున్నారు

" ఎక్కడరా నీ రంగుల చిలక ... ' అడిగాడు ప్రణయ్

" ఇంకా రాలేదనుకుంటా మావా ? "మరి నీ చిలక సంగతేమిటి" ప్రశ్నించాడు అభినవ్

'నాది అదే పరిస్థితి.... "

"సరేలే టైమ్ ఎందుకు వేస్టు చెయ్యటం, ఈ లోపు రెండు పెగ్గులు లాగిద్దాము "అంటూ పబ్ లోని బార్ కంటర్వైపుకదిలాడు అభినవ్

చేసేదేమి లేక, అభినవ్ ని అనుసరించాడు ప్రణయ్

రెండు పెగ్గులు అనుకున్నది, నాలుగైంది, ఆరు, ఎనిమిదయ్యాయి. చిన్నగా ఇద్దరి మెదళ్ళ లోకి మత్తు చిన్నగా ఎక్కుతొంది. అప్పటికే వచ్చి గంట దాటి పోయింది.

"ఏరా నీ కాండిడేట్ ఏమన్నా వచ్చిందా "ముద్దు ముద్దుగా అడిగాడు ప్రణయ

' లేదురా మరి నీ కెండిడేట్ ' ముద్ద ముద్ద గా అడిగాడు అభినవ్

"లేదురా, ఇద్దరూ కూడబలుక్కుని మనకి టోకరా ఇచ్చినట్టున్నారు,పోదాం పద, ఇంక ఎంత సేపని వెయిట్ చేస్తాం.
.
బయల్దేరుదాం అన్నట్టు లేచి నిలబడ్డాడ ప్రణయ

అప్పుడే ఓ జంట పబ్ లోకి ప్రవేశించింది.

ఆ జంట వైపు చూస్తూ అలాగే శిలా విగ్రహంలా నిలబడి పోయాడు ప్రణయ్.

అభినవ్ దృష్టి కూడా ఆజంట మీద పడటంతో, ఒక్కసారిగ అతని మొఖం ఆనందంతో వెలిగిపోయింది. లేచి నిలబడి, 'మావా అదిగోరా నాచిలుక రానే వచ్చింది, ఏం చెయ్యా మంటావో చెప్పు " అంటూ ప్రణయ్ ని తొందరపెట్టాడు.

ప్రణయ్ మాటలు రాని మూగ మొద్దులా సమాధానం ఇవ్వకుండా అలాగే నిలబడిపోయాడు.

వాస్తవ కథ

# అభిరతి

ఈ లోపు ఆ జంట వాళ్ళ ముందుగా నే నడుచుకుంటూ వెళ్ళి అక్కడ ఉన్న ఓ టేబుల్ ముందు కూర్చుంది.

వెళ్తూ వెళ్తూ అ జంటలో ఆడది విసిరిన చూపులు ఇద్దరి గుండెల్లో దిగబడ్డాయి. ప్రణయ్ గుండెలను ఆ చూపులు నిలువునా కోసేస్తే, అభినవ్ ను మాత్రం మరింత రెచ్చగొట్టాయి.

'ఏమయ్యింది మామా, కొంపదీసి నువ్వు కూడా దానికే వలేసావా ఏమిటి " అంటూ, ఆ జంట వంకే కన్నార్పకుండా చూస్తున్న ప్రణయ్ భుజం తట్టాడు.

అది నీ చిలకా కాదు , నాచిలకా కాదు "ప్రణవ్ నోట్లో నుంచి అప్రయత్నంగా వచ్చాయి మాటలు

" లేదు మా వా నేను చూసింది ఈ చిలకనే..."

'నేను దాన్నే చూస్తున్నానురా . "

మరింకేంటి? పద.. పక్క నున్నోడ్ని చూసి భయపడు తున్నావా?"

" ఓరేయ్ అది నాభార్యరా? నీకెలా చెపితే అర్థమౌతుంది"

అదిరి పడ్డాడు అభినవ్ ఆ జవాబుకి

తాగినదంతా దిగిపోయిందేమో,"

మరి పక్కన ఉన్న మగాడు " చిన్నగా నసిగాడు భయంతో అభినవ్

'వాడు మాడ్రైవర్.. "అతికష్టం మీద ప్రణయ గొంతులోనుండి వచ్చింది

"డ్రైవరా? అదేంటి మావా మరి చీపుగా డ్రైవర్తో " రెచ్చగొట్టాడు. అభినవ్

"ఏయ్ నోర్మూయ్యి, నా భార్య అలాంటిది కాదు"కళ్ళముందు జరిగింది నమ్మలేకపోయాడు ప్రణవ్

ఒకోసారి చెపులేకాదు, కళ్ళు కూడామోసం చేస్తాయి మనల్ని

"అలాంటిది కాక పోతే పబ్ కి ఎందుకొచ్చింది, అదీ బరితెగించి ఇంకో మగాడితో ' మండుతున్న ప్రణయ గుండెల్లో మరింత ఆజ్యం పోశాడు అభినవ్

ఏం జవాబు చెప్పాలో అర్థం కాక, అభినవ చెంప చెళ్ళు మనిపించాడు

. " నన్ను కొడతావా , ఆ కొట్టే దేదో నీ భార్యను కొట్టు, రేపటి నుండి ఈ పబ్ గడప తొక్కడు " చెంప నిమురుకుంట అరిచాడు

ఆ దెబ్బకు అహం దెబ్బతిన్న వాడిలా , చర,చరానడుచుకుంటూ వెళ్ళి కావ్య మీద చెయ్యెత్తాడు ప్రణయ్

జరగబోయేది ముందే ఊహించిందో ఏమో? ఒక్క ఉదుటన లేచి ప్రణయ్ చెయ్యి పట్టుకుంది కావ్య

దాంతో మరింత రెచ్చిపోయిన వాడిలా. " ఎంతకు బరితెగించావు, సిగ్గు లేదా నీకు" అంటూ అరిచాడు

"బరితెగింపా? ఇది బరితెగింపు ఎలా అవుతుంది" అమాయకంగా ఏమితెలియనట్లు అగిగ్గింది కావ్య

"కట్టుకున్న మొగుడు కళ్ళెదుటే వుంటే, ఇంకో మగాడితో... ఛీ "అసహ్యించుకున్నాడు.

' ఇంట్లో అన్నం తింటున్నాం కదా అని, బయట టిఫిన్లు చెయ్యకుండా వుంటామా? ఇది అంతే సార్ .ఆకలి ఎవరికైనా ఒకటే. ఆడదానికో ఆకలి, మగాడికో అకలి వుండవు. అందుకే ఆకలేసినప్పుడు మీరు చెప్పినట్లే చేస్తున్నాను.మీరు నేర్పించిందే "

ఆ మాటలకు ఒక్క సారిగా వణికి పోయాడు అభినయ్.

శరీరంమొత్తం నీరసం ఆవహించి,

వాస్తవ కథ

# అభిరతి

నిలబటానికి కూడా శక్తి లేకకావ్య కాళ్ళదగ్గర కూలబడి పోయాడు.

' ఏమాత్రం చలించకుండా అలాగే నిలబడింది కావ్య.

ఏదో చల్లగా తగలటం తో, వంగి కిందకు చూసింది. ప్రణయ్ కళ్ళలో నుంచి రాలిపడుతున్న కన్నీటి బిందువులవి

'ఇంక వదిలేయ్ అమ్మా, ప్రశ్చాత్తాపంతో బాధపడుతున్నాడు' అని వెనుక నుంచి మాటలు వినపడ్డాయి.

వెనక్కి తిరిగి చూసాడు ప్రణయ్.

ఎదురుగా అభినవ్ "లేవరా, ఇప్పుడైనా అర్థమయ్యిందా? మనది అనుకున్న వస్తువు మనది కాకుంటా పోతే ఎంత బాధగా వుంటుందో'

మౌనంగా లేచి నిలబడ్డాడు ప్రణయ్

'నీ సుఖం, నీకోరికలు నువ్వు చూసుకున్నావుగాని, నువ్వే సర్వస్వమని భావించే నీ భార్య ఎంత బాధపడుతుందో ఊహించలేక పోయావు .అడ వాళ్ళు మనల్నే సర్వస్వం అని నమ్ముకుని, మొగుడు, కుంటాడైనా గుడ్డివాడైనా , తమ కోరికల్ని చంపుకుని, మన కోసమే బతుకుతుంటారు. మరి మనం వాళ్ళకేమిస్తున్నాము"

"అవును అయ్యగారు, మనం మన భార్యను ఎంత పవిత్రంగా వుండాలని భావిస్తామో, వాళ్ళు కూడా మనం అంతే పవిత్రంగా వుండాలని భావిస్తారు. ఆడవాళ్ళు మననుంచి కోరుకునేది నగలు, నాణ్యాలు, మిద్దెలు , మేడలు కాదు సార్, స్వచ్ఛమైనప్రేమ. ఆడది గడప దాటితే కట్టుకున్నాడేకాదు, ఆ భగవంతుడు కూడా కనిపెట్ట లేడు సార్ " నిజాన్ని విప్పి చెప్పాడు డ్రైవర్ కాశీ

'కాశీకి ఏం సమాధానం చెప్పాలో అర్థం కాక, కాశీవంకే చూస్తూ స్థాణువులా నిల బడి పోయాడు.

"అమ్మ గారికి మీరంటే ప్రాణం, అమ్మగారు బాధ పడుతుంటే చూస్తూ వుండలేక ఈ నాటకం ఆడాము.. క్షమించండి' వినయంగా చెప్పాడు డ్రైవర్ కాశీ

'నాటకమా?'.. 'అర్థంకానట్టు నోరు వెళ్ళబెట్టాడు ప్రణయ్

"అవునురా నాటకమే? నిన్ను మార్చాలని మేమందరం కలిసి ఆదిన నాటకం

"'థ్యాంక్యూ రా' నాకళ్ళు తెరిపించావు "

" నా దేముంది ,ఈ నాటకానికి కర్త, కర్మ, క్రియా అన్నీ కావ్యే, మీ ఆవిడకు చెప్పు థాంక్స్"

" నాకేముంది అన్నయ్య. అయనంటే నాకు చచ్చేంత ఇష్టం. ఆ ఇష్టమే నన్నీ నాటకం ఆడించింది . మీరందరూ నాకు తోడుగా నిలిచారు. లేకపోతే ఏ నుయ్యో గొయ్యో చూసుకోవాల్సి వచ్చేది'

'అంతమాటనకు కావ్య. నామూర్ఖత్వనికి సరైన గుణపాఠమే చెప్పావు. నన్ను క్షమించు' కావ్య చేతులు పట్టుకున్నాడు ప్రణయ్

'మనలో మనకు క్షమాపణలేమిటండి. 'ప్రణయ్ వంక ఆరాధనగా చూస్తూ అంది కావ్య.

"హమ్మయ్య, నువ్వు అంత తొందరగా మారతావని ఊహించ లేదురా ? ఏదైతేనేం అందరం హ్యాపీ' అంటూ నవ్వేశాడు అభినవ్

అభినవ్ నవ్వుల లో అందరూ పాలుపంచుకున్నారు

సమాప్తం

ఆధ్యాత్మికం



# ధర్మ సందేహాలు

సహస్ర వ్యాస కవి

## ఏది నిజమైన పూజ



పూజ గదిలో మనం గడిపేది 15 నుండి 30 నిమిషాలు.బయట ప్రపంచం లో మనం గడిపేది 23 గంటల 30 నిమిషాలు

దీన్ని మనం పూజ అంటామా? అసలు ఎంత సేపు పూజ చెయ్యాలి ?మనం ఎక్కడ చూస్తున్నాము ఈశ్వరుడిని ,కేవలం పూజ గడిలోనేనా ? బట ప్రపంచం లో భగవంతుడిని చూడలేమా ?

నిద్ర లేవగానే మనకు
i) శ్రీహరి గుర్తుకు రావాలి
ii) భూమికి నమస్కరించాలి
iii) అరచేతిలో లక్ష్మీదేవిని చూడాలి

స్నానం చేస్తుంటే గంగా / యమునా నదులు గుర్తుకు రావాలి.

దేవుడి దీపం వెలిగించేటప్పుడు – జ్యోతి స్వరూపుడైన పరమాత్మ గుర్తుకు రావాలి.

కూరగాయలు / పండ్లు చూసినప్పుడు వరుణ దేవుడు గుర్తుకు రావాలి.

వంట చేస్తుంటే అగ్ని దేవుడు గుర్తుకు రావాలి.

అన్నం తింటుంటే, కడుపులో ఉన్న వైశ్వానరుడు గుర్తుకు రావాలి.

మంచి నీళ్ళు త్రాగేటప్పుడు, జల రూపంలో ఉన్న శివుడు గుర్తుకు రావాలి.

ఊపిరి తీస్తుంటే, గాలిలో వాయు రూపమైన శ్రీకాళహస్తీశ్వరుడు గుర్తుకు రావాలి.

పసి పిల్లలను, అందమైన స్త్రీలను చూసినప్పుడు ఈశ్వర మాయ గుర్తుకు రావాలి.

వృద్ధులను చూసినప్పుడు జీవితం యొక్క పరమార్థం గుర్తుకు రావాలి.

కనిపించే ప్రతీ స్త్రీలో అమ్మవారు గుర్తుకు రావాలి.

విశ్వాన్ని చూసినప్పుడల్లా విశ్వనాథుడు గుర్తుకు రావాలి.

నిద్ర పోయేటప్పుడు, స్వల్ప కాలిక లయం చేసే పరమ శివుడు గుర్తుకు రావాలి.

ఇలా...
అంతటా పరమాత్మ కనిపిస్తున్నప్పుడు మాత్రమే మనం నిజమైన పూజ చేశాము అని చెప్పవచ్చు అంతే కాని ,అవసరం కోసమో ,ప్రపంచం కోసమో ఒక 5 నిమిషాలు ఇంట్లోనో , గుడి లోనో దేవుడిని పూజ చేస్తున్నట్టు నాటకం ఆడితే అది పూజ అయిపోదు.

★★★

పిల్లల కథ

# విజయ తంత్రం కథలు

## దైవం మానుష రూపేణ

అనగనగా ఒక నది గట్టున ఒక ఊరు వుండేది. ఊళ్ళో జనాలంతా ప్రశాంతంగా, కలిసి కట్టుగా ఉండేవారు. ఆ ఊళ్ళో ఒక గుడి వుండేది. రోజు గ్రామ ప్రజలు ఆ ఊళ్ళో పూజలు చేసేవారు. గుడిలో పూజారిని ఆదరించి వారు. అలాంటి పండంటి ఊళ్ళో ఒక సంవత్సరం ఉద్ధృతం గా వర్షాలు పడి, నది పొంగి, వరదలు వచ్చాయి. ఊరంతా నీళ్ళు నిండి పోవడం మొదలయ్యింది. ఊళ్ళో వున్న వారంతా వరదనుంచి తప్పించుకోవటానికి, తమ ఇళ్ళను వదిలేసి పయి ప్రాంతాలకు బయలుద్యారారు.

అందులో ఒక పెద్దమనిషి గుడి వైపు పరిగెత్తి అందులోని పూజారి గారిని కూడా వారితో వచ్చేయమని ప్రాధేయ పడ్డాడు– "వరద నీళ్ళు ఊళ్ళోకి వచ్చేసాయి, ఇంటి గడపల దాకా నీళ్ళున్నాయి, పరిస్థితి ప్రమాదకరంగా వుంది. మేము అందరం ఊరు వదిలి వెళ్లి పోతున్నాము, మీరు కూడా మాతో వచ్చేయండి!"ఆ పూజారి ప్రశాంతంగా, "నా గురించి దిగులు పడకండి, నేను నిత్యం సేవించే నా స్వామే నన్ను కాపాడుతాడు. మీరు వెళ్ళండి." అన్నారు. ఈ మాట విని ఆ పెద్దమనిషి వెళ్ళిపోయాడు.

కొంత సేపటికి నీళ్ళు నడుము దాకా వచ్చేసాయి. పూజరిగారు గుడి గట్టున నుంచొని జపం చేసుకుంటుంటే ఒక గుర్రపు బండిలో పోతున్న వారు కొంత మంది ఆగి, పూజారిగారిని కూడా బండి యెక్క మన్నారు. కానీ పూజారిగారు మట్టుకు, "నన్ను దేవుడే కాపాడతాడు!" అని గుడిలోనే వుండిపోయారు.

ఇంకొంచం సేపటికి నీళ్ళు మెడ దాకా వచ్చేసాయి. పడవలో ప్రయాణం చేస్తున్న కొందరు చూసి వారితో వచ్చేయమని బ్రతిమాలుకున్నారు. "మీరు ఇంకా ఇక్కడే వున్నారా! ఇక్కడ వుండడం చాలా ప్రమాదం, నీళ్ళు చాలా వేగంగా వచ్చేస్తున్నాయి, మీరు మాతో రండి!" అన్నారు.

కాని వారితో కూడా పూజరిగారు, "మీరు వెళ్ళండి, నన్ను దేవుడే కాపాడతాడు" అన్నారు.

చలితో వణుకుతూ ఆ పూజారి ముక్కు దాకా నీళ్ళు వచ్చేసరికి ఇంక ఖంగారు పడ్డాడు. అతి త్వరలో గుడి మొత్తం నీళ్ళు నిండిపోయాయి. పూజరిగారు దేవుడి ధ్యానం చేసుకుంటూనే గుడి గోపురం ఎక్కి కూర్చున్నారు. కొంత సేపటికి దిగులు మొదలయ్యింది. ఎప్పటికీ వాన ఆగటంలేదు, చలి గా వుంది, నీళ్ళ ప్రవాహం ఎక్కడా ఆగేలా కనిపించటంలేదు.

"దేవుడా! నేను నీకు ఏమి తక్కువ చేసాను? రోజు శ్రద్ధగా పూజలు చేసాను. నిన్నే నమ్ముకున్నాను! అయినా నన్ను కాపాడడానికి రావేంటి!" అని దేవుడితో ఫిరియాదు చేసుకోవడం మొదలెట్టాడు.

దేవుడు ప్రత్యక్షం అయ్యాడు. "మూర్ఖుడా! నీకు మనిషిని పంపించాను, బండిని పంపించాను, పడవను పంపించాను! నువ్వే రాకుండా ఇక్కడ తిష్ట వేసావు. నువ్వు నన్ను గుర్తు పట్టకపోతే అది నా తప్పా?" అని మందలించి మాయమయిపోయాడు.

పూజారికి వెంటనే జ్ఞానోదయం అయ్యింది. చేసిన పొరపాటు గ్రహించి, క్షమాపణ కోరాడు. కొంత సేపటికి మరో పడవలో కొంత మంది కనిపించారు. "పూజారి గారు! మీరు ఇంకా ఇకాడే వున్నారని తెలిసింది, మాతో రండి, ఇక్కడ వుండడం మంచిది కాదు!" అన్నారు. పూజారి గారు మరో మాట మాట్లాడకుండా పడవ ఎక్కి ప్రాణాలను కాపాడుకున్నారు.

కాబట్టి పిల్లలు దేవుడు ఎప్పుడు మనతోనే ఉంటాడు , మనకు తెలియకుండా ఇతరుల రూపంలో సహాయం చేస్తుంటాడు .


★★★




**దారి కనిపెట్టటానికి సహాయం చెయ్యండి**




**బొమ్మకు రంగులు వెయ్యండి**



## తేడాలు కనిపెట్టండి



తెలుగు
పదబంధం

# సాహితీ పద సుమతి



| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | ■ | 3 | | 4 | |
| | ■ | | ■ | 5 | | ■ | | ■ |
| 6 | | | | ■ | 7 | 8 | | 9 |
| | ■ | | ■ | 10 | | | ■ | |
| 11 | 12 | ■ | 13 | | ■ | 14 | 15 | ■ |
| ■ | | ■ | 16 | | | | | 17 |
| 18 | ■ | 19 | | | ■ | ■ | 20 | |
| 21 | 22 | ■ | 23 | | 24 | ■ | 25 | |
| 26 | | | ■ | 27 | | | ■ | |

**అడ్డం**

1.అల్పజీవి – నవలా రచయిత (4)
3. అజంతా కలం పేరున్న రచయిత ఇంటి పేరు (4)
5. నీరు నిలువ చేసుకునే పెద్ద కుండ (2)
6. రాక్షసుడు తికమకపడ్డాడు (4)
7. కథక్ నృత్యకారిణి ... లఖియా ...? (4)
10. హనుమంతుడు ఈతని సుతుడు (3)
11. అన్నఅరసం (2)
13. అల్పార్థకం (2)
14. ఎల్లప్పుడు / ఒక నటి (2)
16. విజయనగర సామ్రాజ్య స్థాపక్ రాయలు(లు) కొంచం అటూ–ఇటూ పాపం! (6)
19. ఇనుముతో పని చేసేవాడు అటునుంచి వచ్చాడు (3)
20. దగ్గర / తీరము (2)
21. ఓడ (2)
23. గోధుమ రొట్టె కాలి అటూ ఇటూ అయింది! (3)
25. అటునుంచు చేసినా సౌకుమార్యమే! (2)
26. గుమ్మడి (3)
27. ఎదురుతిరిగిన ఎలుగుబంటి (3)

**నిలువు**


1500 – 1160 మధ్య కాలాన్ని ఎవరి పేరున పిలుస్తారు (5)
ఎస్.వి. రెడ్డి నవల (సినిమా కీ అదే పేరు ) (4)
మేళనము (4)
చలువ మిరియాలు – వ్యంగ్య వ్యాస రచయిత ఇంటి పేరు (3)
8. గ్రామాధికారి / న్యాయాధికారి (4)
9. ఉపవాసం (2)
10. ఒకరకమైన సర్పం (6)
12. ది ఫస్ట్ అండ్ లాస్ట్ ఫ్రీడం ...నవల రచయిత ఇంటి పేరు (2)
13. అజ్ఞానం (4)
15. పాదరసము (4)
17. ఏరు దాటడానికి వాడే సాధనం (4)
18. జంగం చార్లెస్ కలం పేరు (3)
22. సేన అటునుంచి దాడి చేసింది (2)
24. మజ్జిగ (2)

* ఈ పేజీ ప్రింట్ తీసి జవాబులు వ్రాసి పంపండి.
* కరెక్టుగా వ్రాసి పంపిన వారిలో లాటరీ తీసి ఇద్దరికి రూ.116/– నగదు బహుమతి
* పంపవలసిన చివరి తేదీ :25 ఫిబ్రవరి 2024 , సమాధానాలు సుమతి పత్రిక లోని పేజిలో మాత్రమే రాసి పంపాలి




# ఈ నెల మీ అదృష్టం....

కొలుకుల చంద్ర శేఖర్






ఆర్థిక విషయాలు అనుకూలిస్తాయి. ముఖ్యమైన పనులు పూర్తవుతాయి. స్పష్టమైన ఆలోచన విధానంతో కార్యసిద్ధి. కీలక విషయాల్లో కుటుంబసభ్యుల సలహాలు మేలుచేస్తాయి. వివాదాలకు దూరంగా ఉండండి. బుద్ధిబలంతో సమస్యలు అధిగమిస్తారు. వృత్తి ఉద్యోగ వ్యాపారాల్లో అనుకూలతలు పెరుగుతాయి. శుభకార్యాల్లో పాల్గొంటారు. ప్రయాణాలు కలిసివస్తాయి.




వృత్తిఉద్యోగవ్యాపారాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలి. అధికారులతో సంయమనంగా ఉండండి. నూతన ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. అవసరానికి తగిన డబ్బు అందుతుంది. ఖర్చులను మాత్రం నియంత్రించాలి. అనవసర కలహ సూచితం. నిర్ణయాల్లో స్థిరత్వం ఉండకపోవచ్చు. కుటుంబసభ్యులకు సమయాన్ని కేటాయిస్తారు. వివాహ ప్రయత్నాలకు మంచి సమయం.




చక్కటి ప్రణాళికలతో లక్ష్యాన్ని సాధిస్తారు. అనవసర విషయాలకు దూరంగా ఉండండి. కీలక అంశాల్లో నిపుణులను సంప్రదించడం మంచిది. ఆర్థికంగా పురోగతి ఉంటుంది. మీ ఆలోచనే మీ విజయానికి మూలమని గుర్తుంచుకోండి. అయితే మీ చంచల స్వభావమే మిమ్మల్ని ఇబ్బంది పెట్టవచ్చు. నెల మధ్యలో ఒక శుభవార్త ఆనందాన్ని కలిగిస్తుంది. ఆరోగ్యంపై. శ్రద్ధ వహించండి.




చేపట్టిన పనులు పట్టుదలతో పూర్తిచేస్తారు. ముఖ్యమైన విషయాల్లో ఆటంకాలు ఎదురుకాకుండా ముందుచూపుతో వ్యవహరించండి. స్థానచలన సూచనలు. వ్యాపారంలో లాభాలు, ఉద్యోగపరంగా అధికారులతో, పెద్దలతో సంయమనం పాటించాల్సి ఉంటుంది. ఆరోగ్యపరంగానూ, ఆర్థికపరంగానూ బాగుంటుంది. క్రమంగా అనుకూలత ఏర్పడుతుంది. విద్యార్థులకు అనుకూలం.




ఆర్థికంగా మిశ్రమ కాలం. ఖర్చులు పెరగకుండా జాగ్రత్త వహించండి. మీ మీ రంగాల్లో చక్కటి ఫలితాలు. గిట్టనివారితో జాగ్రత్తగా వ్యవహరించండి. మొహమాటం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటారు. ముఖ్య విషయాల్లో సకాలంతో స్పందించడం ద్వారా మేలైన ఫలితాలు పొందుతారు. శారీరక మానసిక ఇబ్బందులు ఏర్పడకుండా శ్రద్ధ వహించండి. .





చక్కటి ప్రణాళికతో లక్ష్యాన్ని చేరుకుంటారు. మీ మీ రంగాల్లో శుభఫలితాలు. కీలక సమస్యను పరిష్కరించుకుంటారు. చిన్న చిన్న ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. బంధుమిత్రులతో ఆనందంగా గడుపుతారు. స్థానచలన సూచనలు. మధ్యమధ్యలో స్వల్పంగా ఆర్థిక ప్రయోజనాలు, ఆధ్యాత్మిక అంశాలకు ప్రాధాన్యతనిస్తారు. ఇతరుల సలహాలు సూచనలు మేలు చేస్తాయి.




# ఈ నెల మీ అదృష్టం....






ప్రోత్సాహకరమైన వాతావరణం ఉంటుంది. బంధుమిత్రుల సహకారంతో అనుకున్న పనులు పూర్తిచేస్తారు. సమాజంలో మంచి పేరు దక్కుతుంది. ఒక శుభవార్త ఆనందాన్నిస్తుంది. మంచి భవిష్యత్తు సాధించడానికి ఇది సరైన సమయం. అయితే ప్రణాళికాబద్ధంగా సాగడం ముఖ్యమని గుర్తుంచుకోండి. ఆరోగ్యం ఫర్వాలేదనిపిస్తుంది. ఖర్చులకు తగిన ఆదాయం ఉంటుంది.




దైవబలంతో మంచి చేకూరుతుంది. గతం కంటే ఎక్కువ అనుకూలతలు ఏర్పడతాయి. చేపట్టిన పనులు లాభదాయక ఫలితాన్నిస్తాయి. కుటుంబ వాతావరణం అనుకూలంగా ఉంటుంది. ఒక ముఖ్యమైన పనిని ఎట్టకేలకు పూర్తిచేయగలుగుతారు. గృహ లాభాలున్నాయి. ప్రయాణాలు ఉపకరిస్తాయి. నూతన వ్యక్తుల పరిచయాలతో ప్రయోజనాలు,




విశేషమైన కార్యసిద్ధి. సమాజంలో మంచి పేరు సంపాదిస్తారు. కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. బంధుగణంతో సంతోషంగా గడుపుతారు. కొన్ని వ్యవహారాల్లో ఆర్థిక లాభం పొందుతారు. ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. ఉద్యోగపరంగా పై అధికారులతో సంయమనంగా ఉండండి. ఖర్చులు పెరుగుతాయి. నెల చివర్లో మేలు జరుగుతుంది. వివాహాది శుభకార్యాల్లో పాల్గొంటారు.




మిశ్రమకాలం. లక్ష్యాలను సాధించేందుకు శ్రమిస్తారు. ముఖ్యమైన విషయాల్లో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలి. అవసరానికి తగిన డబ్బు అందుతుంది. ఖర్చులను మాత్రం నియంత్రించుకోవాలి. ఒక సంఘటన బాధ కలిగిస్తుంది. వృధా ప్రయాణాలు చేయాల్సి రావచ్చు. సంబంధబాంధవ్యాలను పటిష్టం చేసుకోవడం మంచిది. వృత్తి ఉద్యోగవ్యాపారాల్లో సామాన్య ఫలితాలు.




కొంతమేర శుభాలు జరుగుతాయి. చేపట్టిన పనుల్లో ప్రతికూల పరిస్థితులు ఎదురైనా పట్టుదలతో పూర్తిచేస్తారు. అందరి మన్ననలు అందుకుంటారు. కుటుంబ సభ్యుల మాటకు విలువనివ్వడం వలన ఇంట గెలుస్తారు. విద్యార్థులు బాగా శ్రమించాల్సిన కాలం. వృత్తిఉద్యోగవ్యాపారపరంగా అంత అనుకూలమూ కాదు.. అంత వ్యతిరేకమూ ఉండదు. ఆర్థిక – ఆరోగ్య విషయాల్లో జాగ్రత్తలు కొనసాగించండి.




నమీరు అనుకున్న విజయాన్ని సాధించేందుకు పట్టు వదలకండి. పరిస్థితులకు అనుగుణంగా ముందుకు సాగండి.సమాజంలో పేరుప్రతిష్టలు పెరుగుతాయి. ఉద్యోగపరంగా శ్రద్ధ అవసరం. ముఖ్యవిషయాల్లో తొందరపాటు వద్దు. శత్రువులతో, మోసం చేసేవారితో జాగ్రత్తగా ఉండండి. ప్రయాణాల్లో ఏమరుపాటు వద్దు. అనారోగ్య సూచనలు.

# సుమతి

అంతర్జాల సమగ్ర కుటుంబ మాసపత్రిక

## సుమతి ఇప్పుడు ఆన్లైన్లో

**సుమతి** అంతర్జాల కుటుంబ మాసపత్రిక ఇప్పుడు ఆన్లైన్ లో వెలువడుతోంది . మీ మొబైల్ నుండి కాని లేదా మీ కంప్యూటర్ నుండి ఆన్లైన్ లో హాయిగా చదువుకోండి .
www.sumathimasapathrika.com


**సుమతి** మాసపత్రిక అంతర్జాల పత్రిక విడి ప్రతి వెల.


**రూ. 25 /-** రూపాయలు

సంవత్సర చందా కి కేవలం **రూ. 250/-**

ఐదు సంవత్సరాల చందా కేవలం **రూ. 1,200/-**

ఐదు సంవత్సరాలు చందా కట్టిన వారిక
రూ.200 విలువచేసే పుస్తకాలను
ఉచితంగా పంపబడును




చందా కట్టదలచిన వారు కింది
నెంబరుకు గూగుల్ పే లేదా ఫోన్ పే
చెయ్యండి
7 8 9 3 1 1 1 9 8 5
చందా కట్టిన వారికి ప్రతి నెల
flip బుక్ పాస్ వర్డ్ తో
పంపబడును

సుమతి

అంతర్జాల సకుటుంబ మాస పత్రిక

# సుమతి 'సాహితీ సామ్రాట్' పోటి
# ఫిబ్రవరి 2024 ఫలితాలు

## ఈ నెల ఉత్తమ కథలు :

### మొదటి బహుమతి రూ1000 /-

1.నాకు నిద్ర వస్తోంది -శ్రీపతి లలిత
2.దృష్టి -టి .గాయత్రి
(బహుమతి ఇద్దరికీ సమంగా పంచబడును )

### రెండవ బహుమతి రూ500/-

1.ఆత్మస్థైర్యం -డి.పద్మావతి
2. దాహం - కె .వెంకటేష్
(బహుమతి ఇద్దరికీ సమంగా పంచబడును )

### కన్సొలేషన్ బహుమతి పొందిన కథలు :

1. యజ్ఞం -కె .పుష్ప
2. నాలాగా ఎందరో -యు .మధుపత్ర శైలజ
3. అత్యద్భుత దృశ్య కావ్యం -ఎన్.రాఘవేంద్ర రావు
4. చల్లని దీవెన -ఆర్.మహాలక్ష్మి
(బహుమతి లేకపోయినా పోటీకి పరిగణించబడును )

### సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథలు :

1. తీరిన ఋణం వాడపల్లి పూర్ణ కామేశ్వరి
2. స్వర్ణ కంకణం -కె .రాధా హిమబిందు
3. చీర మడతల్లో -కె .హనుమంత రావు
4. మనుష్య ఋణం -బి .కళా గోపాల్

## ఈ నెల ఉత్తమ కవితలు:

### మొదటి బహుమతి రూ500 /-

1. ఏది సత్యం -ఏది నిత్యం -రాగతి రమ
2. ఆలోచించండి -కె .విజయకుమార్

### రెండవ బహుమతి రూ250/-

1.ఉపిరి ఉన్నంత వరకు -జి .రంగ రాజు
2. మిణుగురులు -ఎన్ .లహరి

### కన్సొలేషన్ బహుమతి

1. అక్షరానికి ఆయువు పోయాలి
-ఎస్ .శ్రీనివాసరావు
2. పాడిచెపొద్దు -బి .వెంకటేష్
3. నువ్వో స్వయంకృతాపరాధివి
-బి .కళాగోపాల్

(బహుమతి లేకపోయినా పోటీకి పరిగణించబడును)

### సాధారణ ప్రచురణకు ఎన్నికైనవి :

1.నిశాచరి -ఎన్ .సునీత
2. ఉనికిని కోల్పోతున్న ఉపిరి
-కొత్త ప్రియాంక
3. జ్ఞాపకాల పూదోట
-జి .విజయ కుమార్

సుమతి

అంతర్జాల సకుటుంబ మాస పత్రిక

సుమతి" సాహితి సామ్రాట్ " పోటీలు

# సుమతి సాహితి సామ్రాట్ పోటీలు

జనవరి 2024 నుండి డిసెంబర్ 2024 వరకు
ప్రతి నెల కథలు కవితల పోటి నిర్వహించబడుతుంది .
ఉత్తమ కథకు మొదటి బహుమతి రూ1000/-,
రెండవ బహుమతి రూ500 /-
ఉత్తమ కవితకు మొదటి బహుమతి రూ250/- ,
రెండవ బహుమతి రూ116 /-

ఇవ్వబడుతుంది
ఎక్కువ బహుమతులు పొందిన కథా/కవితా రచయతలకు

## "సుమతి సాహితి సామ్రాట్ "

బిరుదుతో సత్కరించబడతారు
ప్రతి నెల 25 వ తారీఖు లోపల వచ్చిన వాటిని అ నెలలో పోటికి తీసుకోవటం జరుగుతుంది
మీ రచనలను పంపవలసిన చిరునామా
sumathi.potilu@gmail.com





